Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ త్రయోదశి ఉ. 10.35 వరకు, అనంతరం చతుర్దశి; నక్షత్రం: ఆశ్లేష రా.1.13 వరకు, మఖ; అమృతకాలం: ఉ. 11.40 నుండి 1.10 వరకు; వర్జ్యం: మ. 2.40 నుండి 4.10 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు;

సంపుటి: 56 • సంచిక: 318 • బుధవారం 28 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

• వీడిన మబ్బులు.. ముగిసిన కేసు... ముంబైకి పార్థివదేహం



అంతటి శ్రీదేవికి ఇంతటి అవమానమా?

సన్నిహితుల సాయంతో మృతదేహం భారత్‌కు • పద్మశ్రీ అవార్డు గ్రహీతకు ఇంతటి దీనావస్థ? • ఆ మాత్రం వ్యయం భరించని కుటుంబ సభ్యులు • సంతాపాలు తప్ప పట్టించుకోని ప్రభుత్వాలు • సెలెబ్రిటీకే దిక్కులేదు.. సామాన్యుడి సంగతేమిటి?



శ్రీదేవి పార్థివదేహం.. నేడు అంత్యక్రియలు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఇండియన్ లేడీ సూపర్‌స్టార్ శ్రీదేవి హఠాన్మరణాంతర పరిణామాలు ఆమె అభిమానులతో పాటు దేశ ప్రజల్ని కూ డా తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. శ్రీదేవి మరణం నుంచి తేరుకోలేకపోతున్న అభిమానుల్ని అనంతరం జరుగుతున్న పరిణామాలు తీవ్రంగా కలచి వేశాయి. ముఖ్యంగా మరణంపై వెల్లువెత్తిన అనుమానాలు, శ్రీదేవి వ్యక్తిత్వాన్ని హననం చేసే ప్రయత్నాల్ని వీరు జీర్ణించుకోలేక పోతున్నారు. దేశంలో మరే నటికీ సాధ్యం కాని ఉన్నత శిఖరాల్ని శ్రీదేవి అధిరోహించారు. పురుషాధిక్య సినీరంగంలో హీరోల్ని కూడా సవాల్ చేసే స్థాయికి ఆమె ఎదిగారు. లేడీ సూపర్‌స్టార్ గా, లేడీ అమితాబచ్చన్‌గా పేరుపొందారు. శ్రీదేవి పేరుతోనే చిత్రాలు సొమ్ము చేసుకున్నాయి. ఆమె గ్లామర్‌ను, నటనా వైదుష్యాన్ని భాషలు ప్రాంతాలకు అతీతంగా దేశప్రజలంతా ఆస్వాదించారు. అలాంటి శ్రీదేవి ఆకస్మిక మరణం తర్వాత ఆమె ప్రమాదవశాత్తు మృతి చెందిందా.. హృద్రోగానికి గురైందా.. లేక మద్యం సేవించి ఆ మత్తులో బాత్‌టబ్‌లో మునిగిపోయిందా.. అదీకాక ఆమె పేరిట గల వందకోట్ల జీవిత బీమా సొమ్ముకోసం భర్త బోనీ కపూర్ లేదా ఆయన బంధువులు ఆమెను బలవంతంగా మట్టుబెట్టారా.. లేదా ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రోత్సహించారా.. బోనీ మొదటి భార్య బంధువులు ఆమెను అవ మానించడం వల్ల ఆత్మహత్యకు ➪ 3వ పేజీలో...

బోనీకి క్లీన్‌చిట్



11

భారత రైతాంగంలో అసహనం

ఆ రెండు జాతీయ పార్టీలను వదలం.. నిలదీస్తాం!

• యావద్దేశం తెలంగాణ అభివృద్ధిఫలం వైపే చూస్తోంది
• మన పథకాలన్నీ గ్రామీణుల సంక్షేమం కోసమే
• రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మాదే
• బిడ్డ పుట్టినప్పటి నుంచి పెరిగే వరకు పథకాల అమలు
• ఆదిలాబాద్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో: రెండు జాతీయ పార్టీలు గాడిదపళ్లు తోముతున్నాయా..? వారికి రైతుల సమస్యలు కనబడతలేవా..? భారత రైతాంగం సహనం కోల్పోతున్నది.. రైతులకు పంట ధరలు పెంచరు .. పుట్టెడు కష్టాల్లో రైతు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.. నదీ జలాలు వృథాపోతున్నాయి.. వాటిని సద్వినియోగం చేసుకునే బుద్ధి జాతీయ పార్టీలకు లేదు.. వారి అసమర్థత విధానాలను ఇక సహించేది లేదు .. రెండు జాతీయ పార్టీలను పార్లమెంటులో నిలదీస్తాం.. అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గర్జించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పెన్‌గంగ నదిపై నిర్మిస్తున్న చనక కోర్ట బ్యారేజీ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆదిలాబాద్‌లోని డైట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేవిధంగా తమ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను దేశమంతటా ప్రశంసిస్తున్నారని ➪ 3వ పేజీలో...





మంచిర్యాల సింగరేణి కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన అశేష జనవాహిని. ముర్కూర్‌లో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

సింగరేణి కార్మికులకు కరెంట్, నీటి బిల్లుల్లేవ్!

ప్రయివేటీకరణ ఉండదు... డిపెండెంట్ ఉద్యోగాలిస్తాం
సింగరేణి కార్మికుల కోసం 10వేల క్వార్టర్స్ నిర్మిస్తాం
క్వార్టర్ల నిర్మాణానికి రూ.400 కోట్లు ఇస్తాం
ఆరు భూగర్భ గనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన
కొత్త గనుల్లో 4,500 మందికి ఉద్యోగాలు

మంచిర్యాల, ప్రభన్యూస్: సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, సింగరేణిలో ఉద్యోగులందరు ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహించిన సింగరేణీయుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యన బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, అవసరం అనుకుంటే కేంద్రం వాటా సొమ్ములను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేందుకు సిద్దంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కారుణ్య నియామకాల కింద సింగరేణి వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి, ఆర్టీసీ, రాష్ట్ర విద్యుత్ సంస్థలను ➪ 3వ పేజీలో...

మరో 1300 కోట్లు కొల్లగొట్టారు

నీరవ్, చోక్సీల స్కామ్
12,717 కోట్లు పైమాటే
నీరవ్ దివాలా రూటు
అమెరికాలో దరఖాస్తు

6లో



ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరేలా..



• పథకాలకు నిధులూ... విధులూ • వార్షిక బడ్జెట్‌లో కొత్త పథకాలకు ధీటుగా ఉత్పాదకతకు ఊతంగా నిల్చేలా నిధుల ప్రవాహం • పెట్టుబడి సాయమే కీలకం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఖజానాకు భారంగా మారే పథకాలకు బదులుగా ప్రజలకు, రైతాంగానికి నేరుగా ఉపకరించి, ఉత్పాదనా సామర్థ్యం పెంచే ఆర్థిక సాయాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని వినూత్న పథకాలు, అన్ని వర్గాలు, శ్రేణులకు ఇతోధిక సాయంగా నిలుస్తున్న సర్కార్ తాజాగా పథకాల అమలు తీరుపై సమీక్షించుకుంటోంది. రానున్న బడ్జెట్‌లో రైతాంగానికి పెద్ద పీట వేయడంతోపాటు, నిరుద్యోగ యువత సంక్షేమమే లక్ష్యంగా కీలక పథకాల రూపకల్పనకు శ్రీకారం చుడుతోంది. అయితే లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణం, ఈ ఐదేళ్లలో ఇదే చివరి బడ్జెట్ కావడంతో కొత్త పథకాలు, ప్రజల ఆకాంక్షలు లక్ష్యంగా అనేక ప్రజారంజక పథకాలు ఉంటాయని అధికారులు, ప్రజలు భావించారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం తన ఎన్నికల ఎజెండాలో, మ్యానిఫెస్టోలో భారీ సంక్షేమ పథకాలను ప్రకటించింది. ప్రధానంగా రైతు రుణమాఫీ, పించన్ల పెంపు, కొత్త జిల్లాల ఏర్పాటు వంటి కీలక హామీలను దాదాపుగా నెరవేర్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, ఫిట్‌మెంట్‌ల ప్రకటన, ఇతర శాఖల్లో వేతనాల పెంపు వంటి ➪ 10వ పేజీలో...

రూ.1.80 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్?

మార్చి 14 లేదా 15న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం • వేగంగా సాగుతున్న కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు మార్చి 12 నుంచి మొదలవుతున్నందున 14 లేదా 15 తేదీలలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభించి వీలైనంత త్వరగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం అనుకుంటోంది. పద్దులపై చర్చ, ద్రవ్యవినిమయ్య బిల్లు ➪ 10వ పేజీలో...

త్వరలో రైతు కమిషన్!

అన్నదాతను మోసం చేస్తే నిగ్గుదేల్చే వ్యవస్థ
అధికారుల నిర్లక్ష్యం పైనా నిఘా
రైతుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

సరికొత్త సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, అమలుతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రైతు సంక్షేమం పట్ల మరింత నిబద్ధతతో ముందడుగు వేస్తున్నారు. వెనుకబడిన తరగతుల హక్కుల పరిరక్షణకు బీసీ కమిషన్‌ను, దళితుల సామాజిక భద్రతకు ఎస్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసిన విధంగానే జనాభాలో 70శాతానికి పైగా ఉన్న రైతుల హక్కుల పరిరక్షణకు కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రస్తుతం ఏర్పాటైన రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ కార్యాచరణ ప్రారంభమైన వెంటనే రైతు కమిషన్ ఏర్పాటుకు కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఈ కీలక నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. రైతు కార్పొరేషన్ ద్వారా ప్రోత్సాహకాలు, రాయితీలే కాదు, ఇప్పుడున్న పరిస్థితుల్లో అణిచివేయబడుతున్న అన్నదాతల హక్కుల పరిరక్షణ కూడా ఆవశ్యకమని సీఎం గుర్తించారు. ప్రతియేటా దళారుల చేతుల్లో దగా పడుతున్న రైతుకు ఇక ఏ కోణంలో మోసం జరిగినా కమిషన్‌కు ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలను ➪ 10వ పేజీలో...

రైతు సమన్వయ సమితే సూపర్ పవర్! 10

సిద్ధరామయ్యది మనీ ఫస్ట్ సర్కార్

దావణగెరె ఎన్నికల సభలో ప్రధాని మోడీ విమర్శలు – అవినీతి పాలనకు చరమగీతం పాడాలని పిలుపు 8లో





జోథ్‌పూర్‌లో హోలీ వేడుకలు చేసుకుంటున్న విదేశీ వనితలు

రేపే రంగేళి

- 2న ఐచ్ఛిక సెలవు
- ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హోలీ పండగను పురస్కరించుకుని మార్చి 1ని ప్రభుత్వ సెలవుగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరుసటి రోజున (శుక్రవారం) 2వతేదీన ఐచ్ఛిక సెలవుగా పేర్కొంటూ మంగళవారం ఉత్తర్వులిచ్చింది



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో మంత్రి జగదీష్‌రెడ్డి భేటీ

కేసీఆర్ కొత్త పంథా

- వరుస పర్యటనలతో దూకుడు
- నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలకు రెడీ
- ఆదిలాబాద్‌తో శ్రీకారం
- సింగరేణి యాత్ర ఆరంభం
- నేడు రామగుండంలో పర్యటించనున్న సీఎం కేసీఆర్





హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు దూకుడు పెంచారు. గత నాలుగేళ్ల శైలికి భిన్నంగా వరుస పర్యటనలకు, అభివృద్ధి సమీక్షలకు పూనుకుంటున్నారు. రైతు సదస్సులు.. రైతులతో ముఖాముఖిలు.. ప్రాజెక్టుల సందర్శనలు.. అభివృద్ధి కార్యక్రమాల శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు.. నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలతో.. జోరు పెంచారు. సిఎం ఒక్కసారిగా ఖరారు చేసుకున్న షెడ్యూల్‌తో అధికారయంత్రాంగం పరుగులు పెడుతుండగా, పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రైతుసమన్వయసమితి ప్రాంతీయ సదస్సులో పాల్గొన్న సిఎం కెసిఆర్.. సోమవారం కరీంనగర్ సదస్సులో పాల్గొన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా లోని చనాకా-కొరాటా బ్యారేజీ పనులను పరిశీలించి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు రామగుండం ఎత్తిపోతల పనులకు కూడా శంఖుస్థాపన చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై కూడా సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి రాష్ట్రమంత్రి జోగురామన్న ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఇటీవల కెసిఆర్ నిర్వహించిన పలు సర్వేలలో మంత్రి జోగురామన్నకు ప్రజల నుండి మంచి రేటింగ్ లభించింది. సంఖ్యాపరంగానూ రాష్ట్రంలోని నియోజకవర్గాలు ఆదిలాబాద్ నుండి ప్రారంభమవుతుండగా, సిఎం అక్కడి నుండే నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలకు శ్రీకారం చుట్టారు. ఇదే సందర్భంలో సిఎం సింగరేణి యాత్రకు కూడా పూనుకోవడం.. కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వరాలమూట విప్పడంతో హర్షం వ్యక్తమవుతోంది.

నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలతో ప్రగతివేగం..

ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా కార్యక్రమాలకు ముఖ్యమంత్రి కెసిఆర్ శ్రీకారం చుట్టగా, ఎమ్మెల్యేలలో.. అధికారపార్టీ ప్రజాప్రతినిధుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రే ఎమ్మెల్యే, నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సమక్షంలో.. అధికారులతో సమీక్ష నిర్వహిస్తే పనులన్నీ చక్క బడతాయని, పెండింగ్‌కు మోక్షం కలిగి తాము ఇంతకాలం ఎవరికి చెప్పుకోవాలో తెలియక నలిగిపోయిన సమస్యలకు పరిష్కారం

దొరుకుతుందని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఆదిలాబాద్‌తో మొదలైన కార్యక్రమం.. ఇతర నియోజకవర్గాల్లోనూ కొనసాగించాలని సిఎం భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా కరీంనగర్ జిల్లా ధర్మపురి నియోజకవర్గం, పూర్వ ఆదిలాబాద్‌లోని ముథోల్ నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలకు షెడ్యూల్ ఖరారు చేశారు. మార్చి 5,6తేదీలలో ఈ సమీక్షలు జరగనున్నాయి. జిల్లాలకు వెళ్ళినపుడు.. ఏ నియోజకవర్గ సమీక్ష ఆ నియోజకవర్గంలో చేస్తే అనేక సమస్యలు పరిష్కారమవుతాయని, ఇందులో నిధులతో సంబంధం లేని సమస్యలు కూడా అనేకం ఉంటాయని ఎమ్మెల్యేలు చెబుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలకు సిఎం శ్రీకారం చుడితే.. ఇక రాజకీయంగా తమకు తిరుగుండదని, పెండింగ్ సమస్యలన్నీ ఈ ఏడాదిలో సులువుగా పరిష్కారం అవుతాయని పలువురు ఎమ్మెల్యేలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పూర్వ కరీంనగర్, పూర్వ ఆదిలాబాద్ జిల్లాలను చుట్టేస్తున్న సిఎం.. తర్వాత పాలమూరు, ఖమ్మం జిల్లాల్లోనూ పర్యటించే అవకాశం ఉంది.

సిఎం సింగరేణియాత్ర ఆరంభం

సిఎం సింగరేణి యాత్ర మంగళవారం ప్రారంభమైంది. సింగరేణిలోనే అతిపెద్ద ఏరియాగా ఉన్న శ్రీరాంపూర్‌లో యాత్రకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కెసిఆర్.. ఆరు నూతన గనులకు ప్రారంభోత్సవం చేయడంతో పాటు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. సింగరేణి ఎన్నికల సందర్భంగా సిఎం కెసిఆర్ కార్మికులకు అనేక హామీలివ్వగా.. పలు హామీలకు సంబంధించి ఇప్పటికే యాజమాన్యం ఉత్తర్వులు విడుదల చేసింది. కీలకమైన కారుణ్య నియామకాలపై ఇప్పటివరకు స్పష్టత లేకపోగా, ప్రతి నెలా వందల్లో కార్మికులు పదవీవిరమణ చేస్తున్నారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు టెర్మినల్ బెనిఫిట్స్ కూడా సకాలంలో అందడం లేదు. మారుపేర్లపై కూడా సిఎం ఇచ్చిన హామీ ఇంకా అమలుకు నోచుకోలేదు. ఎన్నికలు, గుర్తింపుసంఘంగా టిబిజికెఎస్ విజయం సాధించిన సందర్భంగా ఇచ్చిన హామీలు.. ఇప్పటిదాకా జారీచేసిన ఉత్తర్వులపై ప్రగతిభవన్‌లో సింగరేణి చైర్మన్, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఎంపి కవితతో కలిసి సమీక్షించిన సిఎం కెసిఆర్.. మంగళవారం కార్మికుల సమక్షంలోనే వరాలు ప్రకటించారు. ప్రధానంగా సింగరేణి ప్రైవేటీకరణ జరగదని తేల్చేశారు. కేంద్రం బొగ్గుబ్లాక్‌లు విక్రయిస్తున్నా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమన్నారు. ప్రాణంపోయినా సరే సింగరేణిని ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. 50వేల కార్మికకుటుంబాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వారసత్వ ఉద్యోగాలపై ప్రకటన ఉంటుందని భావించగా, కారుణ్యనియామకాల ద్వారా ప్రతి ఒక్కరికీ ఉద్యోగం లభిస్తుందన్నారు. మార్చి మొదటివారం నుండి మెడికల్ బోర్డు పనిచేస్తుందని, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలలోపు వడ్డీలేని రుణం ఇస్తామని ప్రకటించారు. కాలనీలలో పర్యటిస్తా.. ఆస్పత్రులు సందర్శిస్తానని చెప్పిన సిఎం 28 ఉదయం సింగరేణిలో కీలకంగా ఉన్న రామగుండం డివిజన్‌లలోని కాలనీలలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి కోల్‌బెల్ట్ పర్యటన కార్మికులలో ఉత్కంఠను, ఆనందాన్ని కలిగిస్తోంది.

తుపాకులగూడెం బ్యారేజీతో...

యేడాది పొడవునా ..నీటి పంపింగ్

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : గోదావరి నదిపై చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం, తుపాకుల గూడెం బ్యారేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని వచ్చే యేడాది జూన్ నాటికి పూర్తయితాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. బ్యారేజీ నిర్మాణాలు పూర్తయితే యేడాది పొడవునా.. గోదావరి నీటిని పంపింగ్ చేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. మంగళవారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడుతూ నాడు భారీ నీటిపారుదలశాఖ మంత్రిగా దేవాదుల రూపకల్పన చేసి మొదటి దశ పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మొదటి, రెండవ దశ పనులుపూర్తయి మూడవ దశ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సవరించిన అంచనాల ప్రకారం దేవాదుల ఎత్తిపోతల పథకానికి రూ.13,400 కోట్లు ఖర్చు అవుతోందని అంచనా వేశామని, ఇందులో ఇప్పటికే రూ. 9.400 కోట్లు ఖర్చుచేయడం జరిగిందన్నారు. జూన్ 2019 నాటికి మొదటి, రెండ, మూడవ దశ పనులు పూర్తి చేయాలని సంకల్పించామన్నారు. గోదావరి నది నుంచి 365 రోజులు నీటిని లిఫ్ట్ చేసే విధంగా తుపాకుల గూడెం వద్ద రూ.2,100 కోట్లతో బ్యారేజీ నిర్మాణాలు జరుగుతున్నాయని, దీన్ని 2019 వరకు పూర్తిచేయాలని ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. మొదటి దశలో రెండు మోటర్లు, రెండవ దశలో రెండు మోటర్లు, మూడవ దశలో ఆరు మోటర్లను ఉపయోగించి మొత్తం పది పంపులతో దాదాపు 270 రోజులు గోదావరి నుంచి నీటిని లిఫ్ట్ చేసి 60 టీఎంసీలను వ్యవసాయానికి ఉపయోగించుకునే వీలుందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని మల్కాపూర్ రిజర్వాయర్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ వరకు నేరుగా 90 రోజుల పాటు 10.7 టీఎంసీలను నింపే విధంగా లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మల్కాపూర్ రిజర్వాయర్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, అశ్వరావుపల్లి రిజర్వాయర్‌కు నీటిని తీసుకోవచ్చని కడియం వెల్లడించారు. ఎత్తైన ప్రదేశంలో మల్కాపూర్



రిజర్వాయర్ కడుతుండటం వలన ఉమ్మడి వరంగల్ జిల్లాకు తాగు, సాగునీరు సమస్య శాశ్వతంగా తీరుతుందన్నారు. వరంగల్‌లో పెద్ద రిజర్వాయర్‌లు లేవని దేవాదులలో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతానికే రిజర్వాయర్ కావాలనే అడిగినప్పుడు మల్కాపూర్ రిజర్వాయర్‌కు ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేయించారన్నారు. మల్కాపూర్ రిజర్వాయర్ పూర్తయితే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కరువు, వలసలు ఉండవని శ్రీహరి స్పష్టం చేశారు.

దేశంలోనే అద్భుత సీఎం

- ఏ రాష్ట్రంలోలేని రీతిలో పథకాలు
- ప్రజాదరణ మాకే: మహమూద్ అలీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ దిశగా వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. రాష్ట్రరైతాంగం, వ్యవసాయ రంగం అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలతో అనతికాలంలోనే యావత్ దేశం దృష్టిని ఆకర్శిస్తూ తెలంగాణను ఒక ఆదర్శ రాష్ట్రంగా తీర్చి దిద్దుతున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో తెలంగాణ రాష్ట్రసమితి పాలన మొదలైనప్పటినుంచి సీఎం కేసీఆర్ వ్యవసా యాభివృద్ధి, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి కోసమే ప్రత్యేకంగా అనేక వరాలు ప్రకటించారని గుర్తు చేశారు. మొట్టమొదటగా రైతు రుణమాఫీకి రూ.16,400 కోట్లను కేటాయించారని చెప్పారు. ప్రతీ రైతుకు పంటసాయంగా ఎకరాకు రూ.8 వేలు ప్రకటించి దేశంలోనే ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని, ఇందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.12వేల కోట్లను కేటాయించనున్నారని ప్రకటించారు. రెవెన్యూ అధికారుల కష్టాన్ని గుర్తించిన ముఖ్య మంత్రి వారికి ఒక నెల వేతనాన్ని కానుకగా ఇస్తున్నారని ప్రకటించారు. ప్రతీ రైతుకు వ్యక్తిగత బీమా కింద రూ.5లక్షల బీమా పాలసీని ఇవ్వనున్నారని స్పష్టం చేశారు.



షిల్లాంగ్ : మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటువేసిన అనంతరం పోలింగ్ కేంద్రం వద్ద వేలిపై సిరా చుక్కను చూపుతున్న మహిళలు.

ఘనంగా అష్టోత్తర శతఘటాభిషేకం



యాదగిరికొండ, ప్రభ న్యూస్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం శ్రీ స్వామి వారికి అర్చకులు ఘనంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. రాత్రి శృంగార డోలోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. దీంతో 10 రోజులు జరుగుతున్న బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. 108 వెండి కలషాలను అలంకరించి కంకణధారణ చేసి అందులో సుగంధ ద్రవ్యాలతో కూడిన పంచామృతాలను నింపి కలషాలపై నారీకేళాలను పేర్చి ఆచార్యులు 108 సార్లు పూజించారు. పూజించిన జపజలం, పంచామృతులతో మూలవర్యులకు, కవచమూర్తులకు అభిషేకం గావించారు. అనంతరం పూర్ణాహూతి గావించారు. యాజ్ఞికులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు నల్లందీగల్ నర్సింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యులు, అర్చకబృందం ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించగా, ఉత్సవ పెద్దలుగా ఆలయ ఈవో ఎన్ గీత, చైర్మన్ బి నర్సింహ మూర్తి, ఆలయ అధికార ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై గర్జించిన కేసీఆర్

ప్రధానిపై తీవ్రస్వరం...దేశవ్యాప్త రైతు ఉద్యమం పేరుతో హెచ్చరిక

- బీజేపీ, కాంగ్రెస్ ఓపెన్ టాక్
- నాలుగేళ్ళయినా తేలని గోదావరి,కృష్ణాల వాటా
- 14 ఏళ్ళుగా సాగుతున్న బ్రిజేష్ ట్రిబ్యునల్ విచారణ
- ట్రిబ్యునల్, రైతు సమస్యలపై కేసీఆర్ ప్రసంగానికి ప్రశంసలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కేంద్రంపై కత్తిదూశారు. ప్రధాని నరేంద్రమోడీపై.. విపక్షాలు, మిత్రపక్షాలు కూడా నేరుగా పదునైన విమర్శలు చేసేందుకు మొహమాటపడుతుండగా, దేశంలోని రెండు కీలక సమస్యలకు సులువైన పరిష్కారం చెబుతూ కెసిఆర్ తూర్పారబట్టేశారు. కేంద్రంలో అసమర్థ ప్రభుత్వాలు రైతు సమస్యలు పట్టించుకోవడం లేదంటూ..ఎండగట్టారు. దేశరైతాంగమంతా కలిస్తే.. కేంద్రం గడగడలాడదా.. అవసరమైతే తెలంగాణ రైతాంగమే దీనికి నాయకత్వం వహిస్తారు అంటూ ప్రకటించి సంచలనానికి తెర లేపారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశం కాగా, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయపార్టీల నేతలు సిఎంకు ఫోన్‌చేసి అభినందించారు. నేను ప్రశ్నిస్తున్నా.. రైతులకు మీరు చేసిన మేలేంటో చెప్పండి..అంటూ సూటిగా ప్రశ్నించడం చర్చనీయాంశమైంది. రైతులకు కనీస మద్దతు ధర, ట్రిబ్యునళ్ళ ఏళ్లతరబడి కాలయాపన కార్యక్రమాలపై సూటిగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు, చైనాను నమూనాగా చూపుతూ చూపిన పరిష్కారాలు.. తెలివిహీన ప్రభుత్వాలు అంటూ కేంద్రాన్ని దునుమాడిన తీరుపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. రైతు సమస్యలపై.. ఒక ముఖ్యమంత్రి నేరుగా కేంద్రాన్ని ఇలా ప్రశ్నించిన తీరు గతంలో జరగలేదని, ప్రధాని ఇప్పటికైనా కెసిఆర్ సూచనలు పరిగణనలోకి తీసుకుని దేశంలో అత్యధిక ప్రజలు ఆధారపడుతున్న వ్యవసాయరంగానికి దన్నుగా నిలవాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

రైతుల సమస్యలపై, రాష్ట్రప్రభుత్వ విజ్ఞప్తులపై ప్రధాని మోడీకి సిఎం కెసిఆర్ పలువార్లు విజ్ఞప్తి చేసినా..స్పందన లేకపోవడంతో జాతీయ స్థాయి ఒత్తిడి వ్యూహాన్ని సిఎం రచిస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే కరీంనగర్ ప్రాంతీయసదస్సులో పదునైన వ్యాఖ్యలు చేశారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రైతులకు కనీస మద్దతుధర రూ.2వేలు ఇమ్మంటే.. ఇచ్చే దమ్ము ప్రధానికి లేదు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ళయింది.. గోదావరిలో వాటా ఎంత.. ఎంత వాడుకోవాలంటే ఏళ్ళతరబడి తేల్చరు. వాటా తేల్చకుంటే ఈట్రిబ్యునళ్ళు గడ్డి పీకుతున్నయా.. ప్రధాని గడ్డిపీకుతున్నరా అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నదీ జలాల సమస్యల పరిష్కారం విషయంలో ట్రిబ్యునళ్ళు అనుసరిస్తున్న వైఖరిపై అన్ని రాష్ట్రాల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. రాష్ట్రవిభజన జరిగి నాలుగేళ్ళయినా.. ఇప్పటికీ తెలంగాణకు గోదావరి జలాల్లో కేటాయింపులు ఎన్ని టిఎంసిలు, కృష్ణాజలాల్లో ఎన్ని టిఎంసిలో తేల్చలేదు. ఏళ్లతరబడి ట్రిబ్యునళ్ల చుట్టూ.. కేంద్రమంత్రుల చుట్టూ తిరిగినా సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. కృష్ణాజలాల్లో వాటా ఖరారు చేసేందుకు నియమించిన బ్రిజేష్ ట్రిబ్యునల్ 14ఏళ్ళుగా దీనిపై విచారిస్తూనే ఉంది. ఈ విచారణ తీరుపై.. ప్రభుత్వాల్లో, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఎన్ని నీళ్ళున్నాయో.. లెక్కతేల్చి.. నీకింత నీకింత అని చెప్పడానికి ఏళ్ళతరబడి విచారణ ఏముంటుందండీ అంటూ కెసిఆర్ విరుచుకుపడిన తీరుపై రైతుల్లో హర్షం వ్యక్తమైంది. దేశంలో 70వేల టిఎంసి నీళ్లుండగా.. ప్రస్తుతం వినియోగిస్తున్నది 35నుండి 40శాతం లోపే. దీనిని కెసిఆర్ ప్రస్తావించిన తీరుపై హర్షం వ్యక్తమైంది. జాతీయ అంశాలను ప్రస్తావించి దేశ రైతాంగ పోరాటానికి తెలంగాణ సమితులే నాయకత్వం వహిస్తాయనడం ద్వారా కుదిరితే జాతీయ రాజకీయాల్లోకి వస్తామని సంకేతాలిచ్చినట్లయిందని విశ్లేషకులు పేర్కొం టున్నారు. నరేగా పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానించాలని మరోసారి డిమాండ్ చేశారు.

సీఎం కేసీఆర్‌కు తప్పిన పెనుప్రమాదం

- హెలికాప్టర్‌లోని బ్యాగ్‌లో పొగలు
- సకాలంలో గుర్తించిన సీఎంఓ అధికారులు
- విచారణ జరిపిస్తాం : డీజీపీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కెసిఆర్‌కు తృటిలో పెనుప్రమాదం తప్పింది. మంగళవారం కరీంనగర్ నుండి పెద్దపల్లి వెళ్ళే క్రమంలో హెలికాప్టర్‌లోని ఓ బ్యాగు నుండి వెలువడిన పొగలు కలకలం సృష్టించాయి. కరీంనగర్‌లో సిఎం హెలికాప్టర్ ఎక్కిన వెంటనే హెలికాప్టర్‌లోని బ్యాగులో పొగలు వస్తుండడాని సిఎంఓ అధికారి గుర్తించారు. వెంటనే ఆ అధికారి హెలికాప్టర్ నుండి బ్యాగు తీసుకుని బయటకు పరుగెత్తి సెక్యూరిటీ గార్డుకు అందజేయగా, ఆయన దీనిని దూరంగా తీసుకెళ్ళి పడేశారు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు. బ్యాగు సిఎం కాన్వాయ్‌లోని వైర్‌లెస్ బ్యాగ్‌గా గుర్తించారు. సిఎం హెలికాప్టర్‌లోకి వెళ్లడంతో ఆయనతో పాటు బ్యాగ్‌ను లోపలికి తీసుకెళ్ళారు. బ్యాగ్‌లోని బ్యాటరీ ఓవర్‌హీట్ అయిన కారణంగా పొగలు వచ్చాయని గుర్తించారు. హెలికాప్టర్ గాల్లోకి లేవక ముందే.. పొగలను గుర్తించడంతో ప్రమాదం తప్పిందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. వైర్‌లెస్‌సెట్ పొగలపై పోలీసు అధికారులు విచారణకు నిర్ణయించారు.



ప్రమాదంపై స్పందించిన కెటిఆర్

ఈ ఘటనపై మంత్రి కెటీఆర్ స్పందించారు. ముఖ్యమంత్రి క్షేమంగా ఉన్నారు..ఆల్ ఈజ్ వెల్. సిఎం ఆదిలాబాద్ జిల్లా టూర్‌ను కొనసాగిస్తున్నారు అంటూ ట్వీట్ చేశారు. ఏం జరిగిందో.. పొగలు ఎందుకు వచ్చాయో.. ముందు అర్థం కాకుండా ప్రజల్లో అయోమయం నెలకొనగా, అప్పటిదాకా ప్రజల్లో నెలకొన్న ఆందోళనను.. తన ట్వీట్ ద్వారా కెటిఆర్ తొలగించారు. ఎంపీ కవిత కూడా ప్రమాదంపై స్పందించారు. ఎవరూ.. ఆందోళన చెందొద్దు.. ఆల్ ఈజ్ వెల్ అంటూ ట్వీట్ చేశారు.ప్రమాద ఘటనపై డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వైర్‌లెస్ సెట్లో షార్ట్ సర్క్యూట్ వల్లే ఘటన సంభవించిందన్నారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని చెప్పారు.



డిఫెన్స్ కారిడార్ కేటాయించండి

- కారిడార్ ఏర్పాటుకు అన్ని అర్హతలు తెలంగాణలో ఉన్నాయి
- కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రపరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు కోరారు. ఈ కారిడార్ ఏర్పాటుకు రాష్ట్రానికి అన్నిరకాల అర్హతలు ఉన్నాయని, స్థానిక యువతకు దీనిద్వారా మరింత ఉపాధి లభిస్తుందన్నారు. గత 5దశాబ్దాలుగా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ఇకోసిస్టమ్ రాష్ట్రంలో ఉందని, ఇటీవలే బుందేల్‌ఖండ్, చెన్నై-బెంగుళూర్ ప్రాంతాలకు మాదిరిగానే తెలంగాణకు కేటాయించాలని కోరుతూ కేంద్ర రక్షణశాఖ మంత్రికి నిర్మలా సీతారామన్‌కు ఈమేరకు మంగళవారం కేటీఆర్ ఒక లేఖ రాశారు.

ఈ బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ కారిడార్‌లు ప్రకటించిన కేంద్రం అన్నిఅర్హతలు ఉన్న తెలంగాణను విస్మరించడం అసంతృప్తిని మిగిల్చిందని ఆలేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో డీఆర్‌డీవో, ఆర్‌సీఐ, డీఆర్‌డీఎల్, బీడీఎల్, మిథాని, ఎన్‌సీఎల్ లాంటి రక్షణ రంగ సంస్థలు ఉన్నాయని గుర్తుచేశారు. వీటితో పాటు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, హెచ్‌బీఎల్, ఆస్ట్రామైక్రో తదితర ప్రైవేట్ రంగంలోనూ పలు సంస్థలు ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో పనిచేస్తున్నాయని కేటీఆర్ తెలిపారు. ఆయా సంస్థలు ప్రపంచ వ్యత్యాస సంస్థలకు భాగస్వాములుగా ఉన్నాయని ఇలాంటి ప్రాంతంలో డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ ఏర్పాటు చేస్తే పెట్టుబడులు భారీగా వచ్చే అవకాశం ఉందని కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు.

ఆదిభట్ల, అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకుని రెండు పార్కుల్లో ఇప్పటికే ఈ రెండు రంగాలలో ఉత్పత్తులు కొనసాగుతున్నాయని చెప్పారు. వీటితోపాటు ఎలిమినేడులో మరో పార్క్, మెదక్‌లోని నిమ్జ్‌లో ప్రత్యేకంగా మరోక ఏరోస్పేస్ డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో పాటు నగరంలో డిఫెన్స్ ఇంక్యూబెటర్ ఏర్పాటును పరిశీలిస్తున్నామని చెప్పారు. డిఫెన్స్ తయారీ రంగానికి ఎన్నో అవకాశాలు ఉన్న తెలంగాణను పరిగణలోనికి తీసుకోవాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ స్థాయి కంపెనీలైన బోయింగ్, లాకీడ్ మార్టిన్, సికోర్స్కీ సంస్థలు తమ తయారీ కేంద్రంగా, ప్రాట్ అండ్ విట్నీ సంస్థలు ఇంజన్ శిక్షణ కేంద్రంగా నగరాన్ని ఎంచుకున్నాయని ఆ లేఖలో వివరించారు. రాష్ట్రంలో 26యూని వర్సిటీలు, 700లకు పైగా ఇంజనీరింగ్ కళాశాలలు, దాదాపు 280పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్నాయని వీటి ద్వారా ఏటా టెక్నికల్ పరిజ్ఞాణం ఉన్న యువకులు వేలాదిమంది వస్తున్నారని ఆయన తెలిపారు. నగరంలో కనీసం 1000కి పైగా ఎంఎస్‌ఎంఈలు డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో పనిచేస్తున్నాయని కేటీఆర్ వివరించారు. భారత రక్షణ, అంతరిక్ష కార్యక్రమాల్లో వీటికి భాగస్వామ్యం ఉందని, ఇలా తెలంగాణను డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం సానుకూలంగా స్పందించి తెలంగాణకు కారిడార్‌ను కేటాయించాలని ఆయన కోరారు.



అంతటి శ్రీదేవికి ఇంతటి అవమానమా?

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడిందా.. ఇవన్నీ కాకుంటే అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం కుట్రపన్ని శ్రీదేవిని చంపించాడా.. ఇందుకోసం ఆమె సేవించిన డ్రింక్స్‌లో మత్తుపదార్థాలు కలిపించాడా.. ఇలా మూ డ్రోజులుగా ఆమె మరణంపై అంతూపొంతూలేని, ఒకదానికొకటి సంబంధంలేని ప్రచా రాలు, కథనాలు వెల్లువెత్తాయి. ఇవన్నీ శ్రీదేవి వ్యక్తిత్వాన్ని మసకబార్చాయి. ఐదుపదుల సినీ జీవితంలో ఆమె ఎప్పుడూ వివాదాలకు తావి వ్వలేదు. ఏ వివాదంలోనూ ఆమె పేరు చిక్కుకోలేదు. దర్శకులు, నిర్మాతల కిష్టమైన సినీనటిగానే ఆమె పేరు గాంచారు. తమిళ, తెలుగు, మళయాళ, హిందీ ఏ పరిశ్రమలో పని చేసినా అందరికీ ఇష్టురాలిగానే గుర్తింపు పొందారు. అలాంటి శ్రీదే విని మరణానంతరం తనకు సంబంధంలేని అనేక వివాదాల్లోకి చొప్పించేశారు. దేశంలో అమితాబ్ సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్న సమ యంలోనే శ్రీదేవి ఆయనతోపాటు దాదాపు సరిసమాన స్థాయిలో పారితోషకాన్ని అందుకున్నారు. భారత చలనచిత్ర సీమలో అత్యధిక పారితోషకాన్ని పొందిన నటి శ్రీదేవే. కొంత కాలంగా సొంత నిర్మాణ సంస్థ తీసిన చిత్రాలు కూడా ఘన విజయం సాధించాయి. సల్మాన్‌తో తీసిన వాంటెడ్, మిలింగే.. మిలింగే, తీవార్, గతేడాది విడుదలైన మామ్ చిత్రాలన్నీ ఆర్థికంగా భారీ లాభాల్నే తెచ్చి పెట్టాయి. అలాంటి శ్రీదేవి మరణానంతరం ఆమె మృతదేహాన్ని దుబాయ్ నుంచి భారత్‌కు తెచ్చేందుకు సొంతంగా ప్రైవేటు విమా నాన్ని ఏర్పాటు చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకు రాకపో వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సన్నిహిత మిత్రుడు అనిల్ అంబానీకి చెందిన 16సీట్ల విమానాన్ని శ్రీదేవి భౌతికకాయం కోసం దుబాయ్ పంపించాల్సి వచ్చింది. తీరా మృతదేహాన్ని ఇవ్వడంలో జాప్యం కావడంతో ఆ విమానం తిరిగొచ్చేసింది. మృతదేహ తరలింపునకు తిరిగి విమానాన్ని అక్కడకు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు భారత ప్రభుత్వం, రాష్ట్రపతి, ప్రధానుల నుంచి ముఖ్య మంత్రులు, గవర్నర్లు, వివిధ రాష్ట్రప్రభుత్వాలు శ్రీదేవి మరణానికి పుంఖాను పుంఖాలుగా సంతాప సందేశాలు వెలువరించారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మళయాళ చిత్రసీమలతో పాటు దాదాపు అన్ని భాషలకు చెందిన చిత్రపరిశ్రమలు శ్రీదేవి మరణానికి దిగ్భ్రాంతి వ్యక్తంచేశాయి. ఆ మహానటి పార్థివ దేహాన్ని సొంతగడ్డకు తెచ్చే ప్రయత్నం మాత్రం ఇవేవీ చేయలేదు. పద్మశ్రీ అవార్డు గ్రహీత అయినప్పటికీ శ్రీదేవి మృతదేహాన్ని భారత్‌కు తరలించడంలో కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం చొరవ తీసుకోలేదు.

ఇక చిత్రపరిశ్రమ అయితే నిత్యం వందలు, వేల కోట్ల రూపాయల్లో వ్యాపారం చేస్తోంది. కానీ ఐదు దశాబ్దాల పాటు భారత చిత్రసీమలో ఓ వెలుగు వెలిగిన నటి మృతదేహం తరలింపునకు కూడా బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్, శాండిల్‌వుడ్ ఇలా ఏ వుడ్ ఒక్కడుగు కూడా ముందు కేయలేదు. ఆమెను తమదిగా చెప్పుకున్న తమిళనాడుగాని, ఆంధ్ర ప్రదేశ్ లేదా మహారాష్ట్రప్రభుత్వాలు కూడా ఆమె మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చేందుకు ఏమాత్రం చొరవ చూపలేదు. ఇదిలా ఉంటే మూడ్రోజులుగా శ్రీదేవి మరణానికి సంబంధించి భారత మీడియాలో వెల్లువెత్తిన వార్తా కథనాలు అభిమానుల్ని మరింత కృంగదీశాయి. శ్రీదేవి మరణానికి సంబంధించి నిజానిజాల నిగ్గు తేల్చేందుకు మీడియా అత్యుత్సాహం ప్రదర్శించింది. ఈ వార్తాకథనాల్ని దుబాయ్ మీడియా కూడా తీవ్రంగా తప్పుబట్టింది. పూర్తివివరాలు వెల్లడికాకుండానే భారతీయ మీడి యా తనం తతానుగా న్యాయనిర్ణేతపాత్ర పోషిస్తోందంటూ దుబా య్ నుంచి వెలువడే ఖలీజ్ టైమ్స్ పత్రిక తీవ్రంగా దుయ్య బట్టింది. శ్రీదేవి ఓ సెలబ్రిటీ. ఆమె మరణం అందర్నీ కలచివేసింది. మరణం వెనుక అంతుబట్టని కారణాలు ఉన్నాయన్న అనుమానాలు రావడం సహజం. అంతమాత్రాన నిపుణులు నిగ్గు తేల్చకముందే తమకు తామే సొంతంగా కథనాలు వండివార్చి వాటిని విశ్వసించమంటూ పాఠకులపై ఒత్తిడి తేవడాన్ని కూడా ఖలీజ్ టైమ్స్ తప్పుబట్టింది. ఓ వైపు ఫోరెన్సిక్ నివేదికకు సంబంధించి దుబాయ్‌లో వైద్యులు, పోలీసులు చర్చలు జరుపుతున్న సమయంలో కూడా ఇది హత్యని, బీమా సొమ్ము కోసమే ఇది జరిగిందంటూ జరిగిన ప్రచారాన్ని ప్రముఖ ఇండియన్ జర్నలిస్ట్ బర్కాదత్ తీవ్రంగా ఎండగట్టారు. ఈ ప్రచారతీరును తప్పుబడుతూ వాషింగ్టన్ పోస్టులో ఆమె పేరిట ఓ కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు శ్రీదేవి మరణంపై అనుమానాలు తొలగిపోయాయి. ఆమె మృతదేహం భారత్‌కు చేరింది. బుధవారం ఆమె అంత్య క్రియలు జరగనున్నాయి. ఏ జీవికైనా మరణం సహజం. మరణా నంతరం కూడా గౌరవించడం భారత సంప్రదాయం. కానీ శ్రీదేవి పార్థివదేహాన్ని తరలించేందుకు ప్రభుత్వం లేదా ఆమె పని చేసిన ఏ చలనచిత్రసీమ కూడా ముందుకు రాకపోవడం కుటుంబ సభ్యులు ఆ మాత్రం వ్యయాన్ని భరించేందుకు ప్రయత్నించకపోవడం సన్నిహితుల సాయంతో ఆమె మృతదేహం భారత్‌కు చేరడం మాత్రం అభిమానులనే కాదు.. ప్రజలందరు విస్తుబోతున్న విషయం. ఒక సెలబ్రిటీ పరిస్థితే ఇలా ఉంటే కూలి, నాలి కోసం చిన్న చిన్న ఉద్యోగాల కోసం మధ్యప్రాశ్చ్యానికెళ్లి ప్రమాదాలు, అనారోగ్యాల కారణంగా ఆకస్మికంగా మరణిస్తున్నవారి పార్థివదేహాన్ని తిరిగి స్వదేశానికి రప్పించడంలో భారత ప్రభుత్వ తీరుపై పలు సందేహాలు ముసురుకుంటున్నాయి.

పొలాల్లో గోదావరి జలాలు

- కాళేశ్వరంతో తెలంగాణ సస్యశ్యామలం
- రాష్ట్రంలోనే ధనిక జిల్లా పెద్దపల్లి
- ఎరువుల కర్మాగారంతో ఉపాధి అవకాశాలు: సీఎం కేసీఆర్



పెద్దపల్లి, ప్రభ న్యూస్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు తలాపున పారుతోంది గోదావరి... మన చేను... మన చేలుక ఎడారి అని రచయిత సదాశివుడు రచిం చిన పాట ఉద్యమ సమయంలో తనను ఎంతో కలచి వేసిందని... కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో తలాపున పారు తోంది గోదావరి... మన పొలాల్లో పారుతోంది గోదావరి అని పాడుకునే రోజులు త్వరలోనే వస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా, అంతర్గాం మండలం ముర్మూర్ వద్ద రూ.80 కోట్లతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ఆంధ్రా పాలకుల హయాంలో పక్కనే గోదావరి జలాలు ఉన్నా ఉపయోగించుకునే వనరులు లేక తెలంగాణ రైతులు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. గోదావరి 200కి.మీ పైగా 65టీఎంసీల నీటితో ఎల్లప్పుడు నిండుకుండలా ఉంటుందని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో 365 రోజులు నీటి నిల్వలు నిండుగా ఉంటాయన్నారు. తద్వారా పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా జిల్లా అభివృద్ధి చెంది పెద్దపల్లి ధనిక జిల్లాగా ఆవిర్భవిస్తోందన్నారు. నాలుగు నెలల్లో ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని, ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి స్వయంగా వస్తానన్నారు. స్వర్గీయ వెంకటస్వామి రామగుండంలో ఎరువుల కర్మాగారం పునరుద్ధరణకు ఎంతగానో కృషి చేశారని, అటువంటి ఎరువుల పునరుద్ధ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దీంతో 5వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించడంతోపాటు వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. ఎన్టీపీసీలో 1600 మెగావాట్ల పనులు వేగంగా జరుగుతున్నాయని అవి త్వరలోనే పూర్తవుతాయని, రానున్న రోజుల్లో ఒక్క సెకను కూడా కరెంట్ సరఫరాలో అంతరాయం ఉండదన్నారు. ఎస్సారెస్పీలోని డిజైన్ లోపంవల్ల రామగుండం ప్రాంత రైతులకు నీటి సరఫరా జరగక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ పట్టుపట్టి రెండు లిఫ్ట్ ఇరిగేషన్లను మంజూరు చేయించుకున్నారని, బండ్లవాసి వద్ద మరో లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు రూ.10కోట్లు కేటాయిస్తామన్నారు. 3లిఫ్ట్‌ల నిర్మాణం పూర్తయితే 22వేల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు 16 గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. సభలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు కేశవరావు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బాల్క సుమన్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తులా ఉమ, సీఎం అదనపు కార్యదర్శి స్మితాసబర్వాల్, ప్రభుత్వ సలహాదారు వివేక్, కలెక్టర్ శ్రీదేవసేన, సీపీ విక్రమ్‌జిత్ దుగ్గల్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్‌బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్, టీఎస్‌టీఎస్ చైర్మన్ రాకేష్‌కుమార్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఐసీడీఎస్ కో-ఆర్డినేటర్ మూల విజయరెడ్డి, మేయర్ కొంకటి లక్ష్మీనారాయణతోపాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

వదలం.. నిలదీస్తాం!



(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గొర్రెల పంపిణీ కార్యక్రమం యాదవుల ఆర్థికస్థితి గతులను మార్చేస్తుందని అన్నారు. రెండు సంవత్సరాల్లో ధనవంతులైన యాదవులు తెలంగాణలోనే కనిపిస్తారన్నారు. ప్రజలకు మేలు చేకూర్చే పథకాలతో సంపద పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మారుతాయని గట్టిగా నమ్ముతున్న తాము ఆ దిశగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. భూ ప్రక్షాళన కార్యక్రమం ప్రపంచంలోనే రికార్డు సృష్టించిందని అన్నారు. సమైక్యపాలనలో ఆదిలాబాద్ జిల్లా పూర్తిగా వెనుకబడి పోయిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. సాగునీటి రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చామని అన్నారు. లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు నిర్మించాలని గత దశాబ్దాలుగా ఈప్రాంత ప్రజలు పోరాటాలు చేస్తున్నారని, ఉద్యమ సమయంలో తానిచ్చిన హామీని నెరవేర్చామని, పెన్‌గంగ ప్రాజెక్టుపై నిర్మిస్తున్న చనక కోర్ట బ్యారేజీ వల్ల 70 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. వచ్చే డిసెంబర్ నాటికి పంట పొలాలకు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని పిప్పల్ కోటి ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 350 కోట్లు , గోమిత్రి ప్రాజెక్టుకు రూ. 210 కోట్లు, కుప్టి ప్రాజెక్టుకు రూ. 870 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సభలో ప్రకటించారు. ఇరుగుపొరుగు వారితో కలిసి సహజీవనం చేసే సంస్కృతి మనదని, తెలంగాణ, మహారాష్ట్ర కు సరిహద్దులో ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో మరాఠీ మాట్లాడేవారు ఎక్కువగా ఉన్నారని, తెలంగాణ కాస్మోపాలిటిన్ సంస్కృతి ని చాటి చెప్పేందుకు ఆదిలాబాద్‌లో మరాఠీ మీడియం జూనియర్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కెసీఆర్ ప్రకటించారు. చదువుల తల్లి జ్ఞానసరస్వతీ ఆలయం అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరుచేస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డబ్బుకు సంకల్పానికి కొదవ లేదన్నారు. పట్టుదలతో పిడికిలి బిగించి అందరి భాగస్వామ్యంతో పనులు చేస్తే బంగారు తెలంగాణ సాధించడం కష్టమేమి కాదని అన్నారు. పక్క రాష్ట్రం మహారాష్ట్ర ఈర్ష్య పడేవిధంగా మన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం మరింత సులువుగా చేసేందుకు ఆదిలాబాద్‌లో డొమెస్టిక్ ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆదిలాబాద్ నియోజక వర్గ అభివృద్ధికి అదనంగా రూ.100 కోట్లు ప్రకటించారు. బహిరంగ సభలో మంత్రులు జోగురామన్న, ఇంద్రకరణ్ రెడ్డి, ఈటెల రాజేందర్, ఎంపీలు జి. నగేష్, కె కేశవ్‌రావు,తదితరులు పాల్గొన్నారు.

చనక కోర్ట బ్యారేజీ పనులను పరిశీలించిన సిఎం కెసీఆర్

పెన్‌గంగ నదిపై నిర్మిస్తున్న చనక కోర్ట బ్యారేజీ నిర్మాణ పనులను మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పరిశీలించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని చనక కోర్ట వద్ద నిర్మిస్తున్న బ్యారేజీ నిర్మాణ పనులను మొదట హెలికాప్టర్ ఏరియల్ సర్వే ద్వారా అనంతరం బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్ వద్ద నుంచి పరిశీలించారు.

ఎగ్జిబిష్ స్టాల్‌లో ఏర్పాటు చేసిన బ్యారేజీ నిర్మాణ పనుల పురోగతికి సంబంధించిన మ్యాపులు ఛాయ చిత్రాలను చూశారు. చనక కోర్ట బ్యారేజీ నిర్మాణ పనులను వేగవంతం చేసి జూన్ మాసంలోగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఈసందర్భంగా కోర్ట గ్రామంలో గల పురాతన శివాలయానికి రూ. 25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కోర్ట గ్రామంలో 200ల డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసినట్లు గ్రామస్థులకు తెలిపారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రికి గ్రామ సర్పంచ్ , ఇంజనీరింగ్ అధికారులు శివాజీ విగ్రహాన్ని బహూకరించారు.

ఆగాఖాన్ నెట్‌వర్క్‌కు గవర్నర్ ప్రశంసలు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : భారత్‌తో పాటు పలు దేశాల్లో అగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ (ఎకెడిఎన్) చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. సంస్థ చేపట్టే పథకాలు సమీకృత,సుస్థిర అభివృద్ధికి దోహదపడే విధంగా ఉండాలని కోరారు. మంగళవారం రాజ్‌భవన్‌లో షియా ఇస్మాయిలీ ముస్లిం మరియు అగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్ వర్క్ చైర్మన్ ప్రిన్స్ అగాఖాన్ గవర్నర్ నరసింహన్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ నెట్‌వర్క్ చేస్తున్న సేవలను గూర్చి అగాఖాన్ గవర్నర్‌కు వివరించారు. సంస్థ కార్యకలాపాలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా లలో విస్తరించాలని అందుకు ప్రభుత్వాల పరంగా సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. విద్య,వైద్యం, సాంస్కృతికరంగాలలో సంస్థ బహుముఖ సేవలను అందిస్తోందని కితాబిచ్చారు. ఈ సందర్భంగా 2018 జనవరిలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో మర మనిషి సోఫియా సందేశం గూర్చి చర్చించారు. అగాఖాన్ మాట్లాడుతూ, ప్రస్తుతం మానవ జీవన విధానం పూర్తిగా మారిపోయిందని, పని ఒత్తిడి, అనారోగ్యకరమైన పోటీ వల్ల ఆరోగ్యం దెబ్బతింటోందని చెప్పారు.

సింగరేణి కార్మికులకు కరెంట్, నీటి బిల్లుల్లేవ్!

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, వాటిని కాపాడుకుంటామని పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ నష్టంలో ఉంటే దానికి బడ్జెట్‌లో 750కోట్లను కేటాయించి ప్రైవేటీకరణ కాకుండా చూశామని తెలిపారు. సింగరేణి సంస్థలో 1980కంటే ముందు నిర్మించిన కార్మికుల క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి బదులు సుమారు 10వేల క్వార్టర్లను కొత్తగా నిర్మించేందుకు రూ.400కోట్లను కేటాయించాలని సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. రేపటి నుంచి కార్మికులు కరెంట్ బిల్లులు మంచినీటి బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని, పదవి విరమణ పొందిన సుమారు 60వేల మంది కార్మికులకు ఉచిత ఆరోగ్య సేవలు అందించేందుకు సంస్థ నిర్ణయం తీసుకుందని, అదేవిధంగా తక్కువ పెన్షన్ ఉన్న ఉద్యోగులకు దాన్ని పెంచే విధంగా సత్వరమే చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని 156ఎకరాల్లో సింగరేణి స్థలాల్లో నివాస గృహాలకు పట్టాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు, ఇదే విధంగా సింగరేణిలోని అన్ని ప్రాంతాల్లోని



కార్మికులకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులకు, సింగరేణి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు సొంత ఇల్లు నిర్మాణం కోసం రూ.10 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇవ్వడానికి, అదేవిధంగా కారుణ్య నియామకాల కింద ఉద్యోగం అవసరం లేని కార్మికుల పిల్లలకు ఒక మొత్తంగా రూ.25లక్షలను, నెలకు రూ.25వేలను చెల్లించేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. సింగరేణి క్వార్టర్లకు ఏసీ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు సింగరేణిలో కొత్తగా ఆరు భూగర్భ గనులను ప్రారంభించడం జరిగిందని, వాటి ద్వారా సుమారు 4500ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులు అలియాస్ పేరుతో ఉండే వారిని ఇబ్బందులకు గురిచేసే ప్రసక్తే లేదని, ఈ మేరకు యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టేందుకు మార్చి మొదటి వారంలోనే కొత్త మెడికల్ బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని, అర్హత ఉన్న కార్మికులందరు తమ తమ గనులపై అధికారులకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సింగరేణిలో లంచాల సాంస్కృతి పోవాలని, లంచాలు ఇవ్వడం కార్మికులు కూడా మానుకోవాలని, వాటిని ప్రోత్సహించే నాయకులను, అధికారులను పొట్టు పొట్టు కొట్టండి అని, ఏదైనా ఇబ్బందులు కల్గితే నేరుగా నాకే ఫిర్యాదు చేయాలని కార్మికులకు సూచించారు. కార్మికులు తమ జీతం నుంచి కార్మిక సంఘాలకు రూ.1 మాత్రమే చెల్లించాలని, ఆ మేరకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేయాలని, సింగరేణి కార్మికుని జీతం నుంచి రూ.1ని మించి మినహాయించవద్దని ఆదేశించారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు విజ్ఞప్తి మేరకు మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి పెద్దపల్లి జిల్లా అంతర్గాం వరకు గోదావరి నదిపై రూ.125కోట్లతో బ్రిడ్జిని నిర్మించేందుకు, రూ.67కోట్లలతో బైపాస్ రోడ్డులో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని, కడెం ప్రాజెక్ట్ కింద ఉన్న 42వ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ లైనింగ్ పని నిమిత్తం రూ.43కోట్లు, చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం రూ.5.39కోట్లను కేటాయించినట్లు, అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ఐబి నుంచి మందమర్రి వరకు రోడ్డు వెడల్పు నిమిత్తం రూ.15కోట్లను కేటాయించడం జరిగిందని ఆయన పేర్కొ న్నారు. సింగరేణి కార్మికులు ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న ఆదాయపన్ను రద్దు విషయమై ఇప్పటికే తెలంగాణ అసెంబ్లీలో బిల్లును పాస్ చేయడం జరిగిందని, ఈ విషయంలో మరోసారి రాష్ట్ర ఎంపీలు కేంద్రప్రభుత్వంపై పార్లమెంట్‌లో ఒత్తిడి తేనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అత్యధిక ఉత్పత్తితో పాటు లాభాల బాట పట్టేలా కృషి చేస్తున్న సంస్థ సిఅండ్ఎండి శ్రీధర్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్రమంత్రులు ఈటెల రాజేందర్, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విఫ్ కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వవిప్ నల్లాల ఓదెలు, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవి, ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు పల్ల రాజేశ్వర్‌రెడ్డి, పురాణం సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పుట్ట మధు, టిబిజికెఎస్ నాయకులు వెంకట్రావ్, మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య, ప్రభుత్వ సలహాదారులు గడ్డం వివేక్, వేణుగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.



కోల్‌కతా: రవీంద్రభారతి యూనివర్సిటీలో హోలీ సంబురాలు

మైనారిటీ గురుకులాలకు నిధులివ్వండి

- కేంద్రమంత్రికి పోచారం వినతి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మైనారిటీ గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలం స్పందించింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీతో రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖల మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ మంగళవారం ఢిల్లీలోని పండిత్ అంత్యోదయ భవన్ (సీజీఓ కాంప్లెక్స్)లో సమావేశమయ్యారు. అందులో భాగంగా నిజామాబాద్ ,కామారెడ్డిలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలకు మల్టీ సెక్టరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి పోచారం విజ్ఞప్తి చేశారు. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమ ఫలాల అమలులో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని నక్వీ కితాబిచ్చారు. సమావేశం అనంతరం తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో పోచారం శ్రీనివాస రెడ్డి మీట్ ది ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్ - కామారెడ్డి జిల్లాలలో రాష్ట్రప్రభుత్వం కొత్తగా చేపట్టిన మైనారిటీ గురుకుల పాఠశాలలకు మౌలిక వసతులు, ఆర్థిక సాయం అందించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు వెల్లడించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోటగిరి, బాన్సువాడ, బిచ్కుంద, కామారెడ్డి, లింగం పేట లలోని మైనారిటీ రెసిడె న్షియల్ విద్యాలయాలలో మౌలిక వసతులు పెంచడానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామ న్నారు. బాన్సువాడలో మైనారిటీ బాలికల కోసం ప్రత్యే కంగా జూనియర్ కళాశాల ఉన్నందున మైనారిటీ బాలికల కోసం ఉర్దూ డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు పోచారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే మైనార్టీ గురుకుల పాఠశాలలకు నిధులు కేటా యిస్తామని హామీ ఇచ్చారని పోచారం సంతోషం వ్యక్తం చేశారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 28 ఫిబ్రవరి 2018

2025 నాటికి డీజిల్ ఇంజిన్లుండవ్!

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్లేలా భారతీయ రైల్వే తన ప్రాథమ్యాలను మార్చుకుంటోంది. ముఖ్యంగా గత మూడు నాలుగేళ్ళుగా బడ్జెట్ల తీరుతెన్నులు చూసిన తరువాత ఈ అభిప్రాయం కలుగుతోంది. ఒకప్పుడు రైల్వే బడ్జెట్‌లో ఇబ్బడి ముబ్బడిగా కొత్త లైన్ల నిర్మాణాన్ని ప్రకటించేవాళ్లు. ఇది గత మూడేళ్ళుగా బంద్ అయింది. ఒకప్పుడు యూపీఏ హయాంలో రైల్వే బడ్జెట్ వస్తున్నదంటే కొత్త రైళ్లు, కొత్త లైన్లువంటి ఆకర్షణీయ ప్రకటనలతో ఊరించేది. ఇప్పుడు రైల్వేకు ప్రత్యేకంగా బడ్జెట్ అంటూ లేదు. పైగా ఎన్డీయే ప్రభుత్వం రాజకీయ గ్రహణాన్ని వదిలించింది. దేశంలో ఎన్నో ఏళ్ళుగా నత్తనడకన నడుస్తున్న నిర్మాణంలోని ప్రాజెక్టులను పూర్తి చేయడమే కాకుండా, బాగా రద్దీగా ఉన్న సెక్షన్లలో డబుల్ లైన్ల నిర్మాణానికి ప్రాధాన్యతను పెంచింది. వచ్చే ఐదేండ్లలో దేశంలో డీజిల్ ఇంజిన్లతో నడిచే రైళ్లకు చరమగీతం పాడనుంది. దీనికోసం రైల్వే విద్యుద్దీకరణకు ప్రాధాన్యతనిస్తోంది. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ రాష్ట్రీయ రైల్ సంరక్షా కోశ్ (ఆర్ఆర్ఎస్‌కె)కు రైల్వే రూ. 73,065 కోట్లను కేటాయించింది. దీని ద్వారా పట్టాల నవీకరణ, సిగ్నల్స్, అధునాతన ప్రమాద నివారణ పరికరాలు ఏర్పాటు చేయనుంది. ముఖ్యంగా వీటన్నింటికీ నిధులను అప్పుల ద్వారా సమకూర్చుకుంటోంది. ఎల్ఐసీ, ఇంధన శాఖ వంటివి కీలక రుణదాతలుగా మారుతున్నాయి. ఎల్ఐసీ నుంచి రూ. లక్షన్నర కోట్ల రుణ ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపడంతో ప్రాజెక్టులు పట్టాలు ఎక్కనున్నాయి. తనకు వచ్చే ఆదాయంతో ప్రాజెక్టులను పూర్తి చేయలేని రైల్వే - ఇలా ప్రభుత్వ రంగ సంస్థల నుంచి తక్కువ వడ్డీకి రుణాలను పొందుతూ ఆధునికీకరణను కూడా చేపట్టింది. నిధులు లేకుండానే గత ప్రభుత్వాలు రైల్వేలో ప్రాజెక్టులను బడ్జెట్‌లో చేర్చడంవల్ల ఇప్పుడు వాటిని పూర్తి చేయడానికి కిందా మీదా పడుతోంది. కాలంతోపాటు ఆధునికీకరణ తప్పని సరి కావడంతో తన ప్రాథమ్యాలను మార్చుకుంటోంది.

నిర్మాణంలోని లైన్ల పూర్తికే ప్రాధాన్యం

దేశవ్యాప్తంగా రైల్వే 180 కొత్త రైలు మార్గాలను వివిధ రాష్ట్రాల్లో నిర్మిస్తోంది. వీటిని పూర్తి చేయడానికి దాదాపు రూ. ఐదు లక్షల కోట్లు అవసరమవుతాయని అంచనా. అసలే నిధుల సమస్యతో సతమతమవుతున్న రైల్వే- వీటికి కేటాయింపులను సరిగా చేయలేకపోతోంది. అందుకే కొత్తగా రైలు మార్గాల నిర్మాణానికి బడ్జెట్‌లో అనుమతించడంలేదు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని భావిస్తోంది. అందుకే కమిషనింగ్ ఆఫ్ లైన్ (మార్గాన్ని అందుబాటులోకి తేవడం) అనే విధానాన్ని ఎంచుకుంది. 2017-18లో 402 కి.మీ. కొత్తమార్గాలను మాత్రమే నిర్మించింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో 1000 కి.మీ.దాకా నిర్మాణంలోని రైలు మార్గాలను పూర్తి చేయనుంది. ఇది 148.8 శాతం అధికం. బహుశా ఇది రానున్న సంవత్సరాల్లో కూడా 1000 కి.మీ మేర కొత్త లైన్ల నిర్మాణం కొనసాగవచ్చు. ఇక దేశవ్యాప్తంగా డబ్లింగ్‌కు ప్రాధాన్యతను పెంచింది. దాదాపు 18000 కి.మీ. డబ్లింగ్ ప్రాజెక్టులు 250 దాకా ఉన్నాయి. ప్రస్తుత ఏడాది రైల్వే 945 కి.మీ. డబుల్ లైన్ నిర్మించింది. రానున్న ఏడాదిలో 2100 కి.మీ. డబుల్‌లైన్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 122శాతం అధికం. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 5000కి.మీ గేజ్ మార్పిడిని పూర్తి చేయడం ద్వారా రైల్వేను మొత్తం బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్‌లోకి తీసుకురావాలని ప్రణాళిక.

జెట్ స్పీడుతో విద్యుద్దీకరణ!

ఆధునికీకరణ దిశగా రైల్వే



దేశంలో ప్రస్తుతం 45 శాతం మార్గాల్లో విద్యుద్దీకరణ పూర్తయింది. మిగతా 55 శాతం మార్గాల్లో డీజిల్ రైళ్లు నడుస్తున్నాయి. దీనివల్ల కర్బన ఉద్గారాలు విడుదలై వాయుకాలుష్యం పెరుగుతోంది. పైగా డీజిల్‌ను అంతర్జాతీయ మార్కెట్ ధరకు కొనుగోలు చేయాల్సి రావడంవల్ల వ్యయం ఎక్కువ అవుతోంది. అందుకే ఏటా విద్యుద్దీకరణను భారీగా చేపట్టాలని రైల్వే నిర్ణయించింది. దీనికోసం రూ.41,000 కోట్లను వ్యయం చేయనుంది. వచ్చే ఐదేళ్ళలో అన్ని మార్గాల విద్యుద్దీకరణను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఏడాది 4000 కి.మీ విద్యుద్దీకరణ పూర్తి కావస్తుండగా, వచ్చేఏడాది 6000 కి.మీ విద్యుద్దీకరించనుంది. 2019-20లో 7000కి.మీ, 2020-21, 2021-22లో ఏటా 10,500 కి.మీ చొప్పున మొత్తం 38,000 కి.మీ మార్గం విద్యుద్దీకరణ పూర్తి చేయనుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలయిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్, రైల్ వికాస్ నిగమ్, ఇర్కాన్, రైట్స్‌వంటి సంస్థల సహకారం తీసుకుంటోంది. 2025 నాటికి పూర్తిగా విద్యుత్తు ఇంజిన్లతో నడిచే రైల్వే వ్యవస్థను తీసుకురావాలన్నది ప్రణాళిక. దీనివల్ల ఏటా రూ.10 వేల కోట్ల మేర ప్రభుత్వానికి ఆదా అవుతుందని అంచనా. 1925 ఫిబ్రవరి 3న దేశంలో తొలిసారిగా విద్యుత్తు ఇంజిన్లు పరుగులు తీశాయి. ఈ సందర్భంగా 2025 నాటికి వంద శాతం విద్యుద్దీకరణ లక్ష్యంగా పెట్టుకోవడం హర్షణీయం. ఈ 93 ఏళ్ళలో విద్యుద్దీకరించింది కేవలం 45 శాతమే. దాన్ని వచ్చే ఐదేళ్ళలో 100 శాతానికి విస్తరించాలనుకోవడం సవాలే. దీనితోపాటే అధిక సామర్థ్యంతో తిరిగే విద్యుత్తు ఇంజిన్లను తయారు చేయాల్సి ఉంటుంది. దీని కోసం కొత్త ఇంజిన్లను తయారు చేయడంకన్నా.. పాత డీజిల్ ఇంజిన్లనే విద్యుత్తు ఇంజిన్లుగా మారుస్తామని రైల్వే ప్రకటించింది. 4500, 6000 హెచ్‌పీ నుంచి 12000 హెచ్‌పీ సామర్థ్యంతో ఉన్న ఇంజిన్లను స్వయంగా తయారు చేసుకోవాలని నిర్ణయించింది.

ప్రమాదాలు తగ్గుతున్నాయంటున్న మంత్రి

రైలు ప్రమాదాలు 2006-07లో 195 జరిగితే.. 2015-16లో 107, 2016-17లో 104, 2017-18 (ఈఏడాది జనవరి 31నాటికి) 65 జరిగాయని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల ఓ సదస్సులో తెలిపారు. ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయంటున్నారు. కానీ ఒకటి రెండు ప్రమాదాలు జరిగినా.. ప్రయాణికుల ప్రాణనష్టం ఎక్కువ ఉంటోంది. దీని నివారణకు తగిన ప్రణాళిక అవసరం. విదేశాల్లో రైల్వే భద్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి పకడ్బందీ విధానాన్ని ప్రవేశపెట్టడం ముఖ్యం. కాలం చెల్లిన పట్టాలను మార్చాల్సి ఉంది. ఈఏడాది 3600 కి.మీ. లలో కొత్త పట్టాలను బిగించగా, రానున్న ఏడాదిలో 3900 కి.మీలలో కొత్త పట్టాలను బిగిస్తామని చెబుతోంది.

రాజకీయ ప్రయోజనాలకు దూరం

ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తరువాత రాజకీయంగా కొత్తలైన్లను బడ్జెట్‌లో చేరుస్తూ ప్రకటించే విధానానికి స్వస్తి పలికింది. రాజకీయంగా స్వరాష్ట్ర ప్రయోజనాల కోసం రైల్వేను వాడుకోవడం గత మూడేళ్ళలో పూర్తిగా కనుమరుగైంది. దీనికి ఉదాహరణగా ప్రధాన మంత్రి నరేంద్ర మోది స్వరాష్ట్రం గుజరాత్‌నే తీసుకుంటే.. అక్కడ ఇప్పటికీ 1692 కి.మీ మీటర్ గేజ్,నేరోగేజ్ మార్గాలున్నాయి. ప్రధాన మంత్రి తలచుకుంటే వాటిని ఈ నాలుగేళ్ళలో బ్రాడ్‌గేజ్‌గా మార్చే అవకాశం ఉన్నా.. ఎలాంటి అధిక కేటాయింపులు చేయలేదు. 1992 నుంచి దేశంలో ప్రాజెక్ట్ యూనిగేజ్(మీటర్, నేరోగేజ్ లైన్లను బ్రాడ్‌గేజ్‌గా మార్చే కార్యక్రమం) విధానాన్ని తీసుకువస్తే అప్పటి రైల్వే మంత్రి సి.కె. జాఫర్ షరీఫ్ తన స్వరాష్ట్రం కర్ణాటకకు భారీగా నిధులు కేటాయించుకుని మూడేళ్ళలోనే 2800 కి.మీ మీటర్‌గేజ్ మార్గాలను బ్రాడ్‌గేజ్‌గా మార్చేందుకు దోహదపడ్డారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. స్వయంగా ప్రధానే రైల్వేను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని ఆదేశించడంతో ఈ శాఖను చేపట్టిన మంత్రులు కూడా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.

సామర్థ్యం పెంపునకు ప్రణాళిక

రైల్వేలకు ప్రధాన ఆదాయ వనరయిన సరకు రవాణా కోసం ప్రత్యేక రైలు మార్గాలను నిర్మించాలని కార్యాచరణ మొదలుపెట్టింది. వీటి నిర్మాణం త్వరగా పూర్తయితే సరకు రవాణాలో వేగం పెరుగుతుంది. ప్రయణికుల రైళ్ల కోసం గూడ్సు రైళ్లను ఆపాల్సిన అవసరం ఉండదు. సమయానికి సరకుల చేరవేతవల్ల దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు అందించినట్లవుతుంది. అదేవిధంగా ఈఏడాది 7120 వ్యాగన్లను రవాణాకు కొనుగోలు చేయగా, రానున్న ఏడాదిలో అదనంగా 12000 యూనిట్లను కొనుగోలు చేయనుంది. ఈ ఏడాది కొత్తగా 279 విద్యుత్తు రైలింజన్లను కొనుగోలు చేయగా రానున్న ఏడాదిలో 300 ఇంజిన్లను కొనుగోలు చేయనుంది. భారీగా చేపడుతున్న విద్యుద్దీకరణవల్ల అనేక మార్గాలకు ఇంజిన్లు పూర్తి స్థాయిలో సరిపోకపోవచ్చని అంచనా. దీన్ని పరిష్కరించుకోవాల్సి ఉంది. కొత్తగా కోచ్‌లు కూడా భారీస్థాయిలో కావాల్సి ఉంది. ఇపుడు అధిక భద్రత కలిగిన లింక్ హాఫ్‌మన్ బాష్ బోగీలను పెద్ద ఎత్తున తయారు చేయాలని భావిస్తున్నది. 2020 కల్లా కాపలా లేని లెవల్ క్రాసింగ్‌లను తొలగించడానికి ప్రణాళిక సిద్ధం చేసింది.

ఆదాయ వనరుల పెంపు ముఖ్యం

రైల్వేకు వచ్చే ఆదాయంలో ఈఏడాది 96 శాతం నిర్వహణకు సరిపోతోందని లెక్కకట్టింది. రానున్న ఏడాదిలో ఈవ్యయం 92.8 శాతంగా ఉండవచ్చని అంచనా. మూలధన వ్యయం రూ. 1,46,500 కోట్లుగా నిర్ణయించారు. మొత్తం రాబడి రూ. 2,01,090 కోట్లు కాగా వ్యయం రూ.1,88,100 కోట్లు ఉండవచ్చని అంచనా వేసింది. 51 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత రెండేళ్లలో సరకు రవాణా క్షీణించిందని లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి వరకు 45 మిలియన్ టన్నుల సరకు రవాణా జరిగింది. అందువల్ల వచ్చే ఏడాది ఆలక్ష్యాన్ని చేరుకుంటామని రైల్వే భావిస్తోంది. దీనికి ముఖ్యంగా సకాలంలో సరకుల చేరవేత అనేది కీలకమనేది రైల్వే శాఖ గుర్తెరగాలి.

-కె. బాలకిషన్ రావు,
7013458705

విషాదంలో ఉత్కంఠ... చివరికి ఊరట!

బహుభాషా చిత్ర నటిగా పేరు తెచ్చుకున్న శ్రీదేవి తెలుగింటి ఆడపడుచు. ఆమె హఠాన్మరణం భాషలకూ, ప్రాంతాలకూ అతీతంగా అభిమానులందరినీ శోక సముద్రంలో ముంచెత్తింది. మేనల్లుని పెళ్ళికి దుబాయ్ వెళ్ళిన ఆమె అక్కడే కన్నుమూయడం విధి విలాసమే. ఫోరెన్సిక్ లేబొరేటరీలో పరీక్షల అనంతరం ఆమె శరీరంలో ఆల్కహాల్ అవశేషాలున్నాయని తేలింది. ఆమె వైన్ తప్ప ఇతర మద్యాలను సేవించరని సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అమర్ సింగ్ పేర్కొన్నారు. మోకాలు లోతు నీరు ఉండే బాత్ టబ్‌లో ప్రమాదవశాత్తూ పడితే ప్రాణం పోవడం అసహజమనీ, ఆమెకు బలవంతంగా మద్యాన్ని ఎవరో తాగించి ఉంటారని బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి అన్నారు. 72 గంటల ఉత్కంఠ తర్వాత ఈ కథనాలన్నింటికీ తెరదించుతూ ఆమె ప్రమాదవశాత్తు మరణించారంటూ ఆస్పత్రి వైద్యులు అన్ని రకాల పరీక్షలూ చేసి ప్రకటించడంతో అంతవరకూ ముసురుకున్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. గడిచిన మూడు రోజులనుంచి ఆమె మరణానికి కారణంపై ఉత్కంఠ కొనసాగింది. కోట్లాది ప్రజల ఆరాధ్య దేవతగా పేరొందిన శ్రీదేవి భౌతిక కాయం మూడు రోజుల పాటు దుబాయ్ ఆస్పత్రి ఫోరెన్సిక్ విభాగానికి చెందిన శవాగారంలో ఉండటం ఆమె అభిమానుల గుండెలను పిండేసింది. దుబాయ్ ఆస్పత్రులలో పాటించే లాంఛనాలన్నీ పూర్తయిన తర్వాతనే ఆమె భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. ఆమె ప్రాణాన్ని బలిగొన్న కారణంపై వెంటనే వెలువడిన వార్తల్లో నిజం లేదని తేల్చిన ప్రాసిక్యూషన్ విభాగం వారు భారత్ నుంచి ఆమె హెల్త్ రికార్డులను తెప్పించుకుని పరిశీలించిన తర్వాతనే గుండెపోటు కాదు, ప్రమాదమని నిర్ధారించారు. ఈలోగా లెక్కలేనన్ని కథనాలు వెలువడ్డాయి. ఆమె భర్త బోనీ కపూర్ పాస్ పోర్టును సీజ్ చేశారని ఒకసారి, అరెస్టు చేసే అవకాశం ఉందని మరోసారి వార్తలు వెలువడ్డాయి. శ్రీదేవి పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంలో దుబాయ్ ఆస్పత్రి అధికారులు, పోలీసులు చాదస్తంగా, అనవసర జాప్యం చేశారని అనిపించినప్పటికీ, ఇతర దేశానికి చెందిన సెలబ్రెటీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నింటినీ తీసుకున్నారు.

దుబాయ్‌లో ప్రమాద వశాత్తు అయినా, మరే విధంగా అయినా మరణం సంభవించినప్పుడు కాన్సులేట్ జనరల్ కార్యాలయాల్లో సమాచారాన్ని అందించాలి. ఇందుకు సుదీర్ఘమైన న్యాయపరమైన నియమనిబంధనలు ఉన్నాయి. కాన్సులేట్ కార్యాలయంలో సంబంధిత అధికారులనుంచి సలహాను పొందవచ్చు.మొదట మరణ వార్తను ఆ కార్యాలయంలో తెలియజేసి భౌతిక కాయాన్ని రషీద్ ఆస్పత్రికి తరలించాలి. అక్కడ సంబంధిత వ్యక్తి ప్రాణం కోల్పోవడానికి కారణం ఏమిటో నిర్ధారిస్తారు. మరణ ధ్రువీకరణ పత్రాన్ని అక్కడ జారీ చేస్తారు. ఆ మరణానికి కారణం ఏమిటో పోలీసుల ధ్రువీకరణ పత్రాన్ని జోడించాలి. ఒక వేళ అనుమానాస్పద స్థితిలో మరణం సంభవిస్తే,లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే, భౌతిక కాయాన్ని పోలీసుల శవాగారానికి తరలించాలి.మృతునికి బీమా ఉందో లేదో తెలియజేయాలి.ఒక వేళ ఉంటే, ఆ బీమా కంపెనీ పేరును ఉదహరించాలి.స్థానిక పోలీసు స్టేషన్‌లో మరణ ధ్రువీకరణ పత్రాన్ని పొందాలి. సాధారణంగా ఈ పత్రాన్ని ఇరవై నాలుగు గంటల వ్యవధిలోజారీ చేస్తారు.ఆ పత్రం జారీ అయిన తర్వాత మరణాన్ని గురించి సంబంధిత దౌత్య కార్యాలయంలో నమోదు చేయించాలి. ఒక వేళ దుబాయ్‌లో అంతిమ సంస్కారం వీలైతే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తారు. లేదంటే, స్వదేశానికి భౌతిక కాయాన్ని తరలించేందుకు ఏర్పాటు చేస్తారు. విదేశీయులైతే వీసా వివరాలను తెలియజేయాలి. ఇదంతా సుదీర్ఘమైన ప్రక్రియ.

శ్రీదేవి అభిమానులు భారత దేశంలోనే కాక, ప్రపంచ మంతా ఉన్నారు. అగ్గిపుల్ల దావాగ్నిని సృష్టించినట్టు, తప్పుడు సంకేతాలు జనంలోకి వెళ్తే ఆగ్రహ జ్వాలలు వ్యాపిస్తాయన్న బెదురు కూడా ఉండటం వల్లనే ఆస్పత్రిలో శల్య పరీక్షలన్నింటినీ పూర్తి చేసిన తర్వాత కేసు మూసివేస్తున్నట్టు ప్రకటన చేశారు. అక్కడి నియమనిబంధనల ప్రకారం సుదీర్ఘ ప్రక్రియ పూర్తి కావడానికి మూడు రోజులు గడువు పట్టినా, మీడియాలో వెలువడిన కథనాలు, ఊహాగానాలు దూది పింజల్లా విడిపోయింది. సుమారు నాలుగు రోజుల తర్వాత ఆమె పార్థివ దేహానికి బుధవారం అంతిమ సంస్కారం జరగనుంది. చివరి చూపు కోసం సినీ ప్రముఖులంతా ముంబాయి చేరుకున్నారు.

మంచి మాట

నలభై ఏళ్లు వచ్చేసరికి ప్రతి వ్యక్తి మూర్ఖుడన్నా అవుతాడు, లేదా వైద్యుడన్నా అవుతాడు.
-థామస్ ఫుల్లర్

గ్రామీణ విద్యుత్తు... పొంతన లేని గణాంకాలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా వేలాది గ్రామాలు ఇంకా చీకటిలోనే మగ్గుతున్నాయి. గ్రామీణ విద్యుత్ సౌకర్యాలను మెరుగు పర్చేందుకు పూర్వపు యూపీఏ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.అవి అమలు జరిగితే ఇప్పుడు గ్రామీణ విద్యుత్‌పై ఎన్‌డిఏ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందంటూ ఆరోపించేది కాదు.ప్రణాళికలు,పథకాలు ఎప్పుడూ మంచివే.ఏ పార్టీ ప్రభుత్వమైనా వాటిని ఆర్భాటంగా,అట్టహాసంగా ప్రారంభిస్తుంది.తర్వాత తదుపరి కార్యాచరణ ఉండకపోవడం వల్ల వాటి లక్ష్యాలు నెరవేరడం లేదు. గ్రామీణ విద్యుత్ కూడా అలాంటిదే. గ్రామీణ విద్యుత్ పథకానికి శాపం ఏమిటంటే,ఆ పథకంపూర్తి కావడానికి నిర్దేశించిన గడువును ప్రభుత్వాలు మార్చేస్తూ ఉంటాయి. అన్ని గ్రామాలకూ విద్యుత్ పథకాన్నే తీసుకుంటే, ఆ పథకాన్ని మొదట 2017 మే నాటికి పూర్తి చేస్తామన్నారు. అది సాధ్యం కాకపోవడం వల్ల 2018 మే నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చొరవ వల్ల ఇరవై నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా కార్యక్రమం దేశంలోని అన్ని రాష్ట్రా ల్లో అమలు జరుగుతోంది. అయితే, నిరంతర విద్యుత్ తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితమేనని రాష్ట్రా లు ప్రచారం చేసుకుంటున్నాయి. అది వేరే విషయం.

కానీ, నిరంతర విద్యుత్ పథకం విషయంలో మోడీ ప్రభుత్వం విజయం సాధించినా, నాణ్యత గల విద్యుత్‌ని అందివ్వడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి.యూపీఏ ప్రభుత్వ హయాంలో గ్రామాలకు విద్యుత్‌ని అందించారు.ఎన్‌డిఏ ప్రభుత్వం ఇంటింటికీ విద్యుత్ సౌకర్యాన్ని అందించేందుకు కృషి చేస్తోంది.గ్రామీణ విద్యుద్దీకరణ కార్యక్రమంలో అత్యధిక భాగం యూపీఏ హయాంలోనే పూర్తి అయింది.అందువల్ల ఇటీవల కాలంలో విద్యుద్దీకరణనుంచి దృష్టిని విస్తృత విద్యుద్దీకరణ పై మళ్ళించారు.

ఏదైనా ఒక గ్రామంలోని పది శాతం ఇళ్ళకు విద్యుత్ సౌకర్యం లభిస్తే,ఆ గ్రామాన్ని విద్యుద్దీకరణ జరిగిన గ్రామంగా గుర్తించడం మొదలు పెట్టారు. విస్తృత విద్యుద్దీకరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే, మౌలిక సదుపాయాలను పెంచాల్సి ఉంటుంది.దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ జ్యోతి యోజనకార్యక్రమానికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఇటీవల కాలంలో ముమ్మర విద్యుద్దీకరణ కార్యక్రమం చురుకుగా సాగుతోంది. 99.8 శాతం గ్రామాలు ఇంతవరకూ విద్యుద్దీకరణ జరిగాయి. అయితే, రికార్డుల్లో నమోదయిన గ్రామాల సంఖ్యకూ, క్షేత్రస్థాయిలో విద్యుత్ అందిన గ్రామాల సంఖ్యకూ ఎప్పుడూ తేడా ఉంటుంది.ఎన్‌డియే ప్రభుత్వం ఈ కార్యక్రమాలకు హిందీ పేర్లు తగిలించినంత మాత్రాన అవి చురుకుగా సాగుతున్నాయని అనుకోవడానికి వీలు లేదు.పథకాల పేర్లు మార్పు కన్నా, వాస్తవ పరిస్థితిని నివేదికలు ప్రతిబింబింపజేయాలి. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ జ్యోతి సంస్థ అందించిన వివరాల్లో పొంతన లేదు.అందువల్లే గ్రామీణ విద్యుద్దీకరణ కార్యక్రమంపై తీవ్ర గందరగోళం నెలకొంది.కొన్ని రాష్ట్రా ల్లో విద్యుద్దీకరణ జరిగిన గ్రామాల సంఖ్యను తరచూ మార్చడం వల్ల వాస్తవంగా ఎన్ని గ్రామాలకు విద్యుత్ అందిందో ఇదమిత్థంగా తెలియదు.డిస్కమ్‌లు ఎప్పటికప్పుడు ఈ గణాంకాల వివరాలను మారుస్తూ ఉంటాయి.విద్యుత్ పొందిన ఇళ్ళ సంఖ్యను తిరిగి అంచనా వేయడం వల్ల పట్టికల్లో తేడా వస్తోంది.

మారుమూల గ్రామాలకు ఇంకా విద్యుత్ అందని పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోందంటే ఈ నివేదికలు వాస్తవానికి ఎంత విరుద్ధంగా ఉన్నాయో స్పష్టం అవుతోంది.ప్రధానమంత్రి సహజ్ బిజిలీ హర్‌ఘర్ యోజన (సౌభాగ్య) పథకం అందించిన వివరాల్లో కూడా పొంతన లేని గణాంకాలు ఉన్నాయి.ఉదాహరణకు చత్తీస్‌గఢ్‌లో రావన్ అనే గ్రామంలో 883 ఇళ్ళకు విద్యుత్ అందుతున్నట్టు పేర్కొనడం జరిగింది.కానీ,వాస్తవానికి 81 ఇళ్ళకు మాత్రమే విద్యుత్ అందుతోంది.దీన్‌దయాళ్ సంస్థ వెబ్‌సైట్ ప్రకారం 2017 చివరి నాటికి ఆరు రాష్ట్రా ల్లో మాత్రమే 24 గంటల విద్యుత్ సరఫరా అవుతోంది. కానీ,వాస్తవం వేరు. గ్రామీణ విద్యుద్దీకరణ కార్యక్రమం లక్ష్యాలను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండటం,అందిన సమాచారంలో కూడ పొంతన లేకపోవడం వల్ల గ్రామీణ విద్యుత్ కార్యక్రమంలో తీవ్ర గందరగోళం కనిపిస్తోంది. గ్రామీణ విద్యుద్దీకరణ పథకం చురుకుగా సాగిపోవడానికి కారణం మీరంటే మీరని కేంద్రమూ, రాష్ట్రాలూవేలెత్తి చూపుకుంటున్నాయి. ఇందుకోసం వందలు,వేల కోట్ల రూపాయిలను కేటాయిస్తున్నాయి.కానీ, లక్ష్యాలు మాత్రం నెరవేరడంలేదు.

విద్యుత్ వినియోగం పెరిగినప్పుడే, ఈ గణాంకాల నిబద్ధత తేటతెల్లం అవుతుంది. వేసవి ప్రవేశించడంతో విద్యుత్ వాడకం పెరుగుతుంది.గ్రామాల్లో సైతం ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, ఇతరఉపకరణాల వాడకం ఈ మధ్య కాలంలో ఎక్కువైంది.వినియోగం పెరిగినప్పుడు సహజంగా కొరత ఏర్పడుతుంది. వేసవి కాలంలో పరిస్థితిని బట్టి విద్యుద్దీకరణ కార్యక్రమాలు ఏమేరకు ఫలవంతంఅయ్యాయో అంచనా వేయడానికి వీలవుతుంది. గ్రామీణ విద్యుత్ అనేది దశాబ్దాలుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సవాల్‌గా పరిణమించింది. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి పెద్ద రాష్ట్రా ల్లో విద్యుత్‌సౌకర్యం అంతంతమాత్రంగానే ఉంది.విద్యుత్ అనధికార వినియోగంవల్ల కూడా కొరతపెరుగుతోంది. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయిన పదేళ్ళ తర్వాత కూడా పెద్ద బంగళాకు ఉచిత విద్యుత్‌ను పొందిన ఉదంతం గత ఏడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం బహిర్గతం అయింది.ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారాన్ని చేపట్టిన వెంటనే విద్యుత్ వాడకంలో అక్రమాలకు బ్రేకు వేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ క్రమంలోనే ఆయన ములాయంకు 4.50 లక్షల విద్యుత్ బకాయిల బిల్లును పంపించారు.ఇది బయటపడింది కనుక తెలిసింది.ఇలాంటివి దాదాపు ప్రతిరాష్ట్రంలోనూ ఉన్నాయి. పదవులనుంచి దిగిపోయినా ఏళ్ళ తరబడి ప్రభుత్వ బంగళాలను ఖాళీ చేయని ప్రజాప్రతినిధుల గురించి తరచూ వార్తలు వస్తున్న ఈరోజుల్లో ఉచిత విద్యుత్ పొందుతున్న విఐపీలు ఉండటంలో ఆశ్చర్యం ఏముంది?

-పివి స్వామి

వర్సిటీల స్థాయి పెరిగేదెప్పుడు?

విశ్వవిఖ్యాత విద్యాసంస్థలకు సైతం వేదికై విశ్వగురువుగా స్థానం పొంది ప్రపంచం నలుమూలలకు జ్ఞానాన్ని ప్రసరింపజేసిన భరతభూమి నేడు నలంద,తక్షశిల అంతటి స్థాయి విశ్వవిద్యాలయాలు లేక వెలవెలపోతోంది. ప్రపంచ నలుమూలల నుండి సైతం విద్యార్థులను ఆకర్షించిందంటే గతంలోనే మన దేశం విద్యా రంగంలో ఎంతటి కీర్తి ప్రతిష్టలు సాధించిందో ఊహించుకోవచ్చు. విదేశీయుల దాడులతో విశ్వ విద్యాలయాలు నేలమట్టమవటమే గాక విలువైన జ్ఞానసంపద సైతం భూగర్భంలో కలిసి పోయింది. ఇప్పటికీ దేశంలో అనేక రంగాలలో నిష్ణాతులు అద్భుత ఆలోచనలు ఆవిష్కరణలు చేయగల వారికి కొదవలేనప్పటికీ సరైన ప్రోత్సాహం ప్రభుత్వ సహకారం లేకపోవడంతో భారతదేశం విదేశాలపై ఆధారపడటం ఎక్కువైంది. ప్రఖ్యాత మేగజైన్ టైమ్స్ పత్రిక విడుదల చేసిన 1000 ప్రపంచ ఉత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో భారత స్థానం దిగదుడుపే. ముఖ్యంగా జాబితాలో యూరోపియన్ దేశాల విశ్వవిద్యాలయాలదే అగ్రస్థానమవగా, ప్రతిఏడు అవే విశ్వవిద్యాలయాలు కాస్త అటుఇటుగా తమ స్థానాన్ని కొనసాగిస్తున్నాయి. మొత్తం 77 దేశాలు 20000 వర్సిటీలను13 అంశాల ప్రాతిపదికగా ఎంపిక చేయగా పశ్చిమ దేశాలు తమ ప్రభావాన్ని చాటాయి. ఇకపోతే ఆసియా ఖండంలో ఉత్తమ 350 విశ్వవిద్యాలయాల జాబితాలో చైనా, జపాన్ తమ ఆధిక్యతను కొనసాగించగా, మనదేశం నుండి 40 కి పైగా విద్యా సంస్థలు ఎంపిక అయినప్పటికీ టాప్20లో ఏ ఒక్క భారతీయ ఉన్నత విద్యా సంస్థ లేకపోవడం దురదృష్టకరం.




వినూత్న ఆలోచనలకు, విశ్వజనీన అంకురార్పణలకు వేదికలవ్వాల్సిన విశ్వవిద్యాలయాలు దేశంలో ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతేకాకుండా సాంకేతికత, ఆధునిక ఆవిష్కరణలను, విలువైన మానవ వనరులను సమన్వయం చేసుకుంటూ ఉపయోగించుకుని పారిశ్రామిక, సేవా రంగాలలో చైనా, జపాన్ లు అద్భుతంగా ప్రగతి పథంలో దూసుకుపోతుండగా, మనదేశం అందుకు విరుద్ధంగా నూతన ఆవిష్కరణల దిగుమతితో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని నష్టపోవడం దురదృష్టకరం. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయి పోటీనిస్తున్న ఐఐటీ, ఐఐఎంలు, మరికొన్ని శాస్త్ర సాంకేతిక సంస్థలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల పరిస్థితి కొంత నయమనిపిస్తున్నప్పటికీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వాల నిర్లక్ష్యం, ఆర్థిక తోడ్పాటు లేమికి తోడు మూస విధానాలు, నూతన కోర్సుల సృష్టి జరగకపోవడం, ఆచార్యుల ఖాళీలు, మౌలిక వసతుల లేమి, ప్రోత్సాహం లేని పరిశోధన రంగం వంటి సమస్యలు వర్సిటీలు, ఉన్నత విద్యా వ్యవస్థలను పట్టి పీడుస్తున్న ప్రధాన సమస్యలు.

ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని విద్యా రంగానికి విస్తృతమైన ప్రాధాన్యం కల్పించి అధికంగా కలిగిన యువ జనాభాను విద్యా,ఉపాధి,పారిశ్రామలకు అనుసంధానించి, స జనాత్మకత, నైపుణ్య పెంపు, ఆర్థిక తోడ్పాటు వంటి చర్యలతో మనదేశాన్ని ఆవిష్కరణలకు కేంద్రస్థానంగా, ఉత్పత్తి స్థావరంగా, మేధోసంపత్తికి నెలవుగా మారేలా త్వరితగతిన నిర్ణయాలు గైకొనక పోతే యువ భారతంతో నిండిన మన సమాజం సమస్యలను కూడా తెచ్చిపెట్టే ప్రమాదం లేకపోలేదు.ప్రస్తుత కేంద్ర బడ్జెట్లో ప్రతి 1000 ఫెలోషిప్పు ఇంజినీరింగ్ పరిశోధనలకు ప్రకటించటం హర్షనీయమే అయినప్పటికీ వాటి సంఖ్య మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా కలదు. పరిశోధనలకు వెచ్చించే ప్రతీ రూపాయికి ఫలితం ఆశించటం కంటే ఒక అద్భుతమైన పరిశోధన దేశ ప్రగతిని ఎలా మార్చగలదో ఆలోచించి పరిశోధన రంగానికి విస్త తంగా నిధులు కేటాయించాలి. అంతేకాకుండా ఇంజినీరింగ్ విద్యకే పరిమితమవకుండా వ్యవసాయం, వైద్యం, సామాజిక, మానవీయ, భాషాశాస్త్రాల పరిశోధనలకుసైతం ప్రోత్సాహకాలు ఇస్తూ పరిశోధకుల విశ్వవిద్యాలయాల పనితీరు మెరుగుకై మరిన్ని చర్యలు గైకొంటే నవ్య ఆవిష్కరణలు అంకురించి, అంకుర పరిశ్రమలు ఆవిర్భవిస్తే స్థానిక సమస్యలే పరిశోధనాంశాలుగా భావించి పరిష్కారం కనుగొంటే మన పరిశోధన మరియు అభివ ద్ధి రంగం మరింత పునరుత్తేజితమై మేధో వలస నియంత్రణతో పాటు పేటెంట్ హక్కులు పెరిగేలా క షి జరిగితే నిజమైన అభివ ద్ధితో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగి గతంలోనేకాదు వర్తమానంలోనూ భారత దేశం విద్యా వరప్రదాయినిగా మారడం తథ్యం.

-వినోద్‌కుమార్ సుద్దాల

శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి

ప్రజలెదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, నైతిక, సాంస్కృతిక సమస్యలన్నింటికీ పరిష్కారాలు సాంకేతిక రంగాలలో దొరుకుతాయి. ఉత్పత్తులను ప్రజలకందించినపుడు వారి సమస్యలైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, వినోదం, వికాసం వంటి మానవీయ అవసరాలన్నీ తీరుతాయి. దీనికనుకూలమైన సామాజిక నిర్మాణం మన సమాజంలో లేదు. కార్పొరేట్ శక్తులకూ, పెట్టుబడిదారులకు ప్రకృతి వనరుల్ని ప్రభుత్వాలే కట్టబెడుతున్నాయి. అసమానతలనూ దోపిడీ పాలనను కొనసాగించటానికి ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తుంటాయి. ఇందులో భాగంగానే మూఢనమ్మకాల్ని విపరీతంగా పెంచిపోషించడంతో పాటు మత రాజకీయాలను ప్రోత్సహించడాన్ని చూస్తున్నాం. వీటికి తోడు ఆధునిక శాస్త్రసాంకేతిక ఆవిష్కరణలైన టెలివిజన్, ఇంటర్నెట్, ఇతర సామాజిక మాధ్యమాలను కూడా ప్రజల్లో మూఢనమ్మకాల వ్యాప్తికి దుర్వినియోగం చేస్తున్నారు.


నేడు జాతీయ విజ్ఞాన దినం

శాస్త్రీయ నియమాలకు వ్యతిరేకంగా జరిగే ప్రతీ చర్యా, ప్రతీ భావన మూఢనమ్మకంగా భావించాలి. ప్రజలు తమ కష్టాలు పోవడానికి ఏ వాస్తవిక పరిష్కారం అందుబాటులో లేనపుడు నిస్సహాయత, అభద్రతా భావానికి లోనవుతారు. అప్పుడు అలౌకిక శక్తులను ఆశ్రయిస్తారు. అభూత శక్తుల ఆసరాను కోరుకుంటారు. పాలకవర్గాలు ప్రజలెదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని వాస్తవ జగత్తులో (వర్తమాన భౌతిక ప్రపంచంలో) కాకుండా మిథ్యా జగత్తులో పరిష్కార మార్గాలను చూపించడానికి ప్రయత్నిస్తుంటాయి.

వ్యక్తివాదాన్ని, పోటీతత్వాన్ని ఏకకాలంలో ప్రోత్సహించడం వల్ల ఎవరి కష్టాలకు వారే బాధ్యులన్నట్టుగా ప్రభుత్వాలు తమ బాధ్యతలను విస్మరిస్తున్నాయి. దేశంలో 73 శాతం సంపద కేవలం ఒక్క శాతం ప్రజల వద్దే (ధనికుల వద్దే) కేంద్రీకృతమైందన్న కఠోర వాస్తవం పాలకుల నిజస్వరూపాన్ని తెలియజేస్తుంది. పాలకులు చెప్పే మానవ ముఖంతో కూడిన ప్రపంచీకరణ అబద్ధమని, సమ్మిళిత అభివృద్ధి బూటకమని తేలిపోయింది. తెలుగు రాష్ట్రా ల్లో భూస్వామ్య, జమీందారి వ్యవస్థ తరతరాలుగా పాతుకుని పోయింది. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం నేటికీ కొనసాగుతోంది. అసమానతలు, నిరక్షరాస్యత, వెనుకబాటుతనం, చివరకు అంటరానితనం కూడా వివిధ రూపాల్లో నేటికీ కొనసాగుతుండటం ఒక కఠోర వాస్తవం. ఈ విధమైన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యంలో పెరిగిన మన సమాజంలో సహజంగానే మూఢ నమ్మకాలు కూడా హెచ్చుగా ఉంటాయి.

పాలకులు మతప్రసక్తి లేని లౌకిక రాజ్యమైన భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారానికి వచ్చిన తర్వాత దానికి పూర్తి భిన్నంగా ప్రవర్తించడాన్ని చూస్తున్నాం. యజ్ఞాలు, చండీ యాగాలు, వాస్తు, జ్యోతిష్యం, మొక్కులు, మొదలైన మూఢవిశ్వాసాలకు మన పాలకులే ఇటీవల కాలంలో పెద్దఎత్తున ప్రచారం కల్పిస్తున్నారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ కాంగ్రెస్ సమావేశాల వాయిదా పాలకుల అశాస్త్రీయ భావజాలానికి పరాకాష్ట. ప్రజలను నమ్మకాలు, విశ్వాసాలవైపు మరలేలా దోహదపడుతున్నాయి.

బాణామతి, చేతబడి, చిల్లంగి, మంత్రాలు, తాయెత్తులు, చేపమందు, స్వస్థత కూటములు.. ఇలా రకరకాల పేర్లతో అశాస్త్రీయ రోగ నివారణ పద్ధతులు, టెలిథెరపి, న్యూమరాలజీ, ఉంగరాలు, దిష్టిలాంటి అనేక రకాల అశాస్త్రీయ ప్రచారాలకూ, పద్ధతులకు ప్రజలు నేడు బలైపోతున్నారు. పాలకులు ఈ మధ్య ఒక మతానికి, మత విశ్వాసాలకు చోదకులుగా ఉంటూ సెక్యులరిజం అనే రాజ్యాంగ స్ఫూర్తిని అవహేళన చేస్తున్నారు. నేటిశాస్త్ర ఆవిష్కరణలు మనకు ఎప్పుడో తెలిసినవే అనే కుహనా ధోరణిని ప్రదర్శిస్తూ ప్రజల్ని గందరగోళ పరుస్తున్నారు. అంతర్జాతీయ శాస్త్ర ప్రపంచం ముందు మన దేశ పరువును తీస్తున్నారు. భారత రాజ్యాంగంలోని ప్రతి పౌరుడూ ప్రాథమిక విధిగా శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, మానవత్వాన్ని, సంస్కరణాభిలాషణ అలవర్చుకోవాలన్న రాజ్యాంగంలోని 51ఎ (హెచ్) అధికరణానికి తూట్లు పొడుస్తున్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే అభ్యుదయ శక్తుల గొంతును నులిమేస్తున్నారు. చివరికి హేతువాదులను హత్య చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రజల్ని తిరోగమన దిశలో నెట్టే ఈ మూఢనమ్మకాల్ని తిప్పికొట్టడానికి జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తరహాలో తెలుగు రాష్ట్రా ల్లో కూడా మూఢనమ్మకాల నిరోధక చట్టం వెంటనే తేవాలని జన విజ్ఞాన వేదిక పక్షాన కోరుతున్నాను.

-సి.రామరాజు
9441967100

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



నేడు ఫస్ట్ ఇయర్, ఎల్లుండి నుంచి సెకండియర్ పరీక్షలు
ఒక నిమిషం నిబంధన అమలు
ఉదయం 9 గంటలకు పరీక్ష
8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించాలని ఇంటర్‌బోర్డు
పరీక్షల సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ విద్యా మండలి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ప్రథమ సంవత్సరం పరీక్ష ప్రారంభమవుతుండగా మార్చి 2వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదలు కానున్నాయి. తొలిసారిగా ఈ పరీక్షలకు నిమిషం నిబంధన అమలు చేస్తుండటంతో విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. ఎనిమిది గంటల నుంచే పరీక్షా హాలులోనికి విద్యార్థులను అనుమతిస్తారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్‌ను తీసుకెళ్లాలి. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా హాలులోకి అనుమతించరు. పరీక్షా కేంద్రం బయటే విద్యార్థులను నిశితంగా పరిశీలించాకే లోనికి అనుమతిస్తారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి, ఆందోళనకు గురికావొద్దని అధికారులు సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు ముగించామని, తొలుత సమాధానాలు తెలిసిన ప్రశ్నలను ఎదుర్కోవాలని వారు సూచించారు. నిమిషం నిబంధన అమలులోకి తేవడంతో విద్యార్థులు ఇప్పటికే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాల దగ్గరకు వెళ్లి చూసుకున్నారు. ఉదయం వేళల్లో పరీక్షలు జరుగుతుండటంతో హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇంటినుంచి ఆలస్యంగా బయలుదేరి ఇబ్బందులు పడొద్దని, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ఇబ్బందులు తెచ్చుకోవద్దని పోలీసులు సూచించారు. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రశ్నాపత్రాల బండిళ్లను సీసీ కెమెరాల ముందే తెరిచి వాటిని విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణకు ఇప్పటికే హైపవర్ కమిటీలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ తీరును జిల్లా పరీక్షల కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షించి బోర్డు కార్యదర్శికి నివేదిస్తుంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 నిబంధన అమలులో ఉంటుంది. పరీక్షలు జరిగే సమయాల్లో .. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రథమచికిత్స పెట్టె, ఒక ఎఎన్ఎమ్ అందుబాటులో ఉంటారు. పరీక్షకేంద్రాల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలను అధికారులు తీసుకున్నారు. పరీక్షా కేంద్రం చిరునామా సులువుగా తెలుసుకునేందుకు వీలుగా ఇంటర్‌బోర్డు ఎగ్జామ్ సెంటర్ లొకేటర్ పేరుతో మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ లో విద్యార్థులు తమ హాల్‌టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే.. పరీక్షా కేంద్రానికి వెళ్లే దారులను చూపిస్తుంది. ఈ యాప్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉందని అధికారులు తెలిపారు. వార్షిక ఫీజులను చెల్లించలేదన్న నెపంతో కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు హాల్‌టికెట్లను ఇవ్వడం లేదన్న ఆరోపణలు రావడంతో ఇంటర్ బోర్డు ప్రత్యేకంగా మూడు వెబ్‌సైట్లను రూపొందించి అందులో విద్యార్థుల హాల్‌టికెట్లను అప్‌లోడ్ చేసింది. ఏ కళాశాల యాజమాన్యమైనా హాల్‌టికెట్ జారీ చేయని పక్షంలో వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రానికి వెళ్లాలని బోర్డు సూచించింది. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌పై కళాశాల ప్రిన్సిపల్ సంతకం అవసరం లేదని ఈ మేరకు ఇప్పటికే తగు ఆదేశాలను జారీ చేశామని బోర్డు కార్యదర్శి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు కలిగినా.. ఎవరైనా ఇబ్బందులు పెట్టినా తక్షణమే కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్‌కు లేదా డిపార్టుమెంటల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని అప్పటికీ సమస్య పరిష్కారం కాని పక్షంలో బోర్డు కార్యాలయం టోల్ ఫ్రీ నెంబరుకు విషయం తెలిపితే వాటిని నివారించేందుకు కృషి చేస్తామన్నారు.

సాదాబైనామాలపై చట్టసవరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సాదాబైనామాల చట్టబద్ధతపై కీలక సవరణ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఫారం 10 క్లెయిమ్ ఫారాలను చెల్లుబాటయ్యేలా సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్స్ నిబంధనలను సవరిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెక్షన్ 5(ఏ)ను సవరించారు. దీంతో తెల్లకాగితాలపై చేసుకున్న సాదాబైనామా క్రయవిక్రయాలు చెల్లుబాటవుతాయని ప్రభుత్వం ఆదేశించింది.

సీబీఆర్‌టీ ఆన్‌లైన్ పరీక్షలు పూర్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండిట్ పోస్టుల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం సీబీఆర్‌టీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 దంటల వరకు స్కూల్ అసిస్టెంట్లు (ఫిజిక్ సైన్స్ సబ్జెక్టు) పరీక్షను, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాషా పండిట్ (ఉర్దూ,మరాఠీ, హిందీ భాషా) పరీక్షలను హెచ్ఎండిఏలో ఏడు సెంటర్లలో నిర్వహించింది. స్కూల్ అసిస్టెంట్లకు మొత్తం 6635 మంది రిజిష్టర్ చేసుకోగా 4696 మంది (70.7శాతం) హాజరయ్యారు. భాషా పండిట్ పరీక్ష కోసం 6231 మంది రిజిష్టర్ చేసుకోగా 5454 మంది (87.5శాతం) హాజరయ్యారు.

నేడు టీఆర్టీ-పెట్ అండ్ స్కూల్ అసిస్టెంట్ పరీక్షలు

పెట్ (తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ,, హిందీ భాషా) పరీక్ష బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుంది.

అలాగే స్కూల్ అసిస్టెంట్లు (హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ సబ్జక్టుల) పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. ఉదయం వేళ నిర్వహించే పరీక్ష కోసం మొత్తం 15,977 మంది విద్యార్థులు రిజిష్టర్ చేసుకున్నారు. ఈ పరీక్షలను ఆదు జిల్లాల్లో 40 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో హెచ్ఎండిఏలో 22, కరీంనగర్‌లో4, వరంగల్‌లో 7, ఖమ్మంలో 5, నల్గొండలో 2 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం జరిగే పరీక్షలను హైదరాబాద్ హెచ్ఎండిఏ పరిధిలోని ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తుట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

అసెంబ్లీలో బిసి కమిటీ సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అసెంబ్లీ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ నేతృత్వంలో బిసి కమిటీసమావేశం జరిగింది. ఈసందర్భంగా బిసిల అభివృద్ధికి అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. సమావేశంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ వ్యాఖ్యలపై గవర్నర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై భాజపా నాయకులు తీవ్ర అభ్యంతరం, అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రైతు సమాఖ్య సభలో సిఎం కేసీఆర్ ప్రధాన మంత్రి పట్ల అవమానకరంగా చేసిన వ్యాఖ్యలు సిఎం స్థాయిని దిగజార్చే విధంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి భాజపా ప్రతినిధుల బృందం కేసీఆర్‌పై ఫిర్యాదు చేశారు. పార్టీ జాతీయ నాయకుడు ఇంద్రసేనారెడ్డి, పార్టీ శాసనసభా పక్షం ఉపనాయకుడు చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాపారావు, అధికార ప్రతినిధులు ప్రకాశ్‌రెడ్డి,ఎన్వీ. సుభాష్, రాకేష్‌రెడ్డి, మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ, మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ తదితరులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

ముఖ్యమంత్రి కేసీఆర్ తన హోదాను మరిచి దిగజారుడు మాటలు మాట్లాడడం సరికాదని భాజపా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ అన్నారు. 125 కోట్ల జనాభాకు ప్రతినిధి అయిన దేశ ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. మోదీపై చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సమన్వయ సమితి అవగాహన సదస్సులో కేసీఆర్ వాటిన పదజాలాన్ని లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు.ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మాట్లడాల్సిన మాటలేనా అని కేసీఆర్ తీరుపై ఆయన ఆక్షేపించారు. ప్రధానిపై ఉపయోగించిన అన్‌పార్లమెంటరీయన్ భాషపై వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో పార్టీ పక్షాన పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని మంగళవారం విడుదల చేసినఒక ప్రకటనలో లక్ష్మణ్ హెచ్చరించారు.

నిధులపై దమ్ముంటే చర్చకు రావాలి

కేసీఆర్ సోయి లేకుండా, అహంకారంతో మాట్లాడుతున్నారని భాజపా రాష్ట్ర నేతలు ధ్వజమెత్తారు. దేశ ప్రధానిపై కేసీఆర్ మాట్లాడిన తీరు, యాస, భాషపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రం రైతులకు ఏం చేసిందో.... తెలంగాణ రాష్ట్రా నికి ఏం చేసిందో....ఎన్ని నిధులు వచ్చాయో చర్చకు వచ్చే ధైర్యం తెరాసకు ఉందా? అని ప్రస్నించారు. దీనిపై ప్రగత భవన్‌లో అయినా... అసెంబ్లీలోనైనా...ఎల్‌బి స్టేడియంలోనైనా.....నడి రోడ్డుపైనా అయినా తాము చర్చకు సిద్దంగా ఉన్నామన్నారు. తాము విసిరిన సవాల్‌కు కేసీఆర్ స్పందించి... ఆయన తరపునా చర్చలకు ఎవరు వచ్చినా తమకు సమ్మతమేనని అన్నారు.

మిషన్ భగీరథ భేష్

గజ్వేల్, ప్రభ న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం చాలా చక్కగా వుందని కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ప్రెస్ అకాడమీ చైర్మన్లు సిద్ది రాజు, అల్లం నారాయణలు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై ప్రభుత్వం నిర్మించిన మిషన్ భగీరథ సంప్‌హౌజ్‌ను 25 మంది కర్ణాటక మీడియా ప్రతినిధుల బృందంతో కలిసి వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోజూ 40వేల కిలోగ్యాలన్ల నీటి సరఫరాచేస్తూ తెలంగాణ ప్రభుత్వం అద్భుతాన్ని సృష్టించిందన్నారు. మూడు నియోజకవర్గాలకు నీరందిస్తున్న కోమటిబండ సంప్‌హౌజ్ చాలా బాగుందని, మిషన్ భగీరథ పథకం చాలా గొప్ప పథకమన్నారు. ఇంత అద్భుతమైన ప్రాజెక్టును చూడడంలో తాము చాలా ఆలస్యం చేశామన్నారు. ప్రజలందరికీ ఆరోగ్యకర, సురక్షితమైన మంచినీటిని అందిస్తున్న ఈ మిషన్ భగీరథ పథకం ప్రాజెక్టుతో తెలంగాణలో మౌళిక ఆర్థిక మార్పులకు ఆస్కారం ఏర్పడిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాధించిన ప్రగతిని ఇంటింటికి మంచినీళ్ళు, ఇంటర్నెట్ అందిస్తున్న ఈ పథకం గొప్ప సాక్షమన్నారు. కర్ణాటక మీడియా బృందం మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు తమను ఎంతగానో ప్రభావితం చేసిందని, మిషన్ భగీరథ పథకం చాలా బాగుందని, దీని ద్వారా ఇంటింటికి తాగునీరు అందించడం తమ గుండెల్లో నిలిచిపోయిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. తాగునీటి సరఫరా ఎంతో కష్టతరమైన ప్రక్రియ అని, మనిషికి రోజుకు 100 లీటర్ల తాగునీటిని అందించేలక్ష్యాన్ని సాధించినందుకు ఇక్కడి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వారు అభినందనలు తెలిపారు. మౌళిక సదుపాయాల కల్పనలో తెలంగాణ రాష్ట్రం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ప్రాజెక్టు చూడడానికి తమను ఆహ్వానించినందుకు రాష్ట్ర ప్రెస్ అకాడమికి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక



మీడియా ప్రతినిధులకు మిషన్ భగీరథ ఎస్ఇ చక్రవర్తి, ఇఇ రాజయ్యలు సంప్‌హౌజ్ నిర్మాణం, నీటిశుద్ధీకరణ, గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాలకు నీటిసరఫరా చేసే విధానం గురించి వివరించారు. అలాగే ఇంటింటికి ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా, దానియొక్క రూపకల్పన తదితర అంశాల గురించి వివరించడం జరిగింది. ప్రతి ఇంటికి రోజుకు వంద లీటర్ల నీటి సరఫరాను ఉదయం, సాయంత్రం నల్లాల ద్వారా అందిస్తామన్నారు. నీరు అందరికి ఒకేరకంగా వచ్చేవిధంగా ఫ్లో కంట్రోల్‌వాల్ బిగించడం జరిగిందని, ఈ ఫ్లో కంట్రోల్ వాల్‌తో అందరికి ఒకేరకంగా నీటి సరఫరా జరుగుతుందని, భవనంపై వున్న కూడా అక్కడికి ఈ కంట్రోల్ వాల్‌తో నీరు వెళ్తుందని తెలుపడం జరిగింది. అలాగే ఈ బృందానికి మిషన్ భగీరథ నమూనా, ఫోటో గ్యాలరీని చూపించి వివరించడం జరిగింది.

వ్యవసాయ విస్తరణాధికారుల జాబితా
మార్చి 2 నుంచి 8 వరకు సర్టిఫికేట్ల వెరిఫికేషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రేడ్-2 వ్యవసాయ విస్తరణాధికారుల అభ్యర్థుల జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) మంగళవారం ప్రకటించింది. గత ఏడాది నవంబర్ 22న పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన వారంతా మార్చి 2 నుంచి 8 వరకు విద్యార్హత ధృవపత్రాల పరిశీలనకు హాజరు కావాలని కమిషన్ కార్యదర్శి తెలిపారు. అభ్యర్థులు ఏఏ సర్టిఫికేట్లు తీసుకురావాలో చెక్‌లిస్టును కమిషన్ వెబ్‌సైట్‌లో చూడాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సీ శాఖకు నిధులు పెంచాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి నిధులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపామని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు పి కరుణాకర్ తెలిపారు. మంగళవారం కొత్తపేటలోని డాక్టర్ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంపిక దరఖాస్తులను ఆయన స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వం దళిత వర్గాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 80శాతం పైగా ఫలితాలు సాధించినట్లు చెప్పారు.ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ బి ఆనంద్‌కుమార్, ఎస్సీ అభివృద్ధి ఉప సంచాలకులు అచ్యుతానందగుప్త, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ డీఎస్‌డిఓ బి విద్య తో పాటు పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మంత్రాలనెపంతో వ్యక్తి హత్య

గుర్రంపోడ్, ప్రభన్యూస్ : మంత్రాలు చేస్తున్నాడన్న నెపతంఓ ఒక వ్యక్తిని రాళ్ళతో కొట్టి చంపిన సంఘటన నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలంలోని తేరట్‌గూడెం గ్రామంలో చోటు చేసుకుంది.




గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేరట్‌గూడెం గ్రామానికి చెందిన కన్నెబోయిన రాములు (60) మంత్రాలు వస్తాయన్న నెపంతో అదే గ్రామానికి చెందిన పిల్లి సాయన్నతో మాటామాట పెరగడంతో ఇద్దరిమధ్య ఘర్షణతో పెద్ద బండరాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్యపెద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపారు.

2022కి అందరికీ రక్షిత నీరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోని ప్రజలందరికీ 2022నాటికి సురక్షితమైన తాగునీటిని అందచేయాలని కేంద్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర తాగునీటి సరఫరా విభాగం అదనపు సలహాదారు దినేష్‌చందర్ అన్నారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన 2018-19 వార్షిక తాగునీటి ప్రణాళిక సమావేశంలో పాల్గొన్న దినేష్ మాట్లాడుతూ అందరికీ సురక్షిత తాగునీటిని అందించాలన్న లక్ష్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందుగానే ఈ ఘనతను సాధించటం గొప్పవిషయం అన్నారు. మిగతా రాష్ట్రాలు తెలంగాణను మోడల్‌గా అనుసరించాలని సూచించారు. మిషన్ భగీరథ పనులను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడానికి వెబ్‌సైట్ , మొబైల్ యాప్‌ను సంస్థాగతంగానే రూపొందించుకొవడాన్ని దినేష్ ప్రశంసించారు. దాదాపు రూ.30కోట్ల ప్రజాధనం మిగిల్చిందన్నారు. అంతే కాకుండా పలు పథకాలకోసం కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన నిధులను తెలంగాణ సమర్ధవంతంగా ఖర్చు చేసిందన్నారు. అందుకే ఈ ఏడాదికి రూ41.10కోట్లు ఇన్సెంటీవ్‌గా ఇస్తున్నట్టు ప్రకటించారు. ఎన్ఆర్‌డిబ్యుపి కింద కేంద్రం చిన్ని 115కోట్ల రూపాయల్లో 92శాతం నిధులను ,ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో రక్షిత మంచినీటి సరఫరా కోసం వాటర్ సబ్ మిషన్ స్కీంలో భాగంగా మంజూరు చేసిన రూ.516కోట్లలో 75 శాతం నిధులను ఖర్చు చేసిందన్నారు. ఆయా నిధులతో తెలంగాణలోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా పథకాలను నిర్వహిస్తోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర తాగునీటి సరఫరా విభాగం ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి మిషన్ భగీరథపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలోని ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీటిని అందించేందుకే భగీరథను ప్రారంభించినట్లు వివరించారు.ఈ సమావేశంలో కేంద్ర తాగునీటి విభాగం డిప్యూటి అడ్వైజర్ రాజశేఖర్ , కన్సల్టెంట్ నర్శింగరావు పాల్గొన్నారు.

తెదేపా అండతోనే ఎస్సీ, బీసీలకు పదవులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రజాసమస్యలను పట్టించుకోకుండా ప్రగతి భవన్‌కే పరిమితమయ్యారని, తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రగతి భవన్‌ను పేదల ఆసుపత్రిగా మారుస్తామని తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షులు ఎల్.రమణ



చెప్పారు. తెరాస, కాంగ్రెస్ పార్టీలకు సమదూరం పాటిస్తూ పార్టీ అధిష్టానం ఆలోచనలకు అనుగుణంగా పని చేసి రాష్ట్రంలో మళ్లీ రామన్న రాజ్యాన్ని తీసుకువస్తామని ఆయన అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కార్యకర్తల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అండతోనే తనలాంటి బీసీలు మంత్రులు, ఎంపీలుగా ఎదిగారన్నారు. పార్టీలోని బడుగు, బలహీనవర్గాలకు చెందిన కార్యకర్తలు అంకితభావంతో పార్టీకి పనిచేసి ఉన్నతస్థాయికి ఎదగాలని రమణ పిలుపునిచ్చారు. తెలంగాణ, హైదరాబాద్‌లో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు వివరించాలని ఆయన కోరారు. రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ దేశంలోనే రెండవ స్థానంలో నిలిచిందని, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అరవింద్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.

వివాహితపై అత్యాచారం..దాడి

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో: వరంగల్ రూరల్ జిల్లాలో దారుణం చోటుచేసుకున్నది. ఓ వివాహితపై అత్యాచారం జరిపారు. ఆపై దాడి చేశారు. నాలుగు రోజులుగా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆ యువతి మంగళవారం మృతిచెందింది. దుగ్గొండి మండలంలోని తొగర్రాయి గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకున్నది. ఆగ్రామానికి చెందిన 30 సంవత్సరాల వివాహిత ఈనెల 25న వ్యవసాయ కూలీ పనికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తి ఆ యువతిపై అత్యాచారం జరిపి దాడి చేసినట్లు బాధిత యువతి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీవ్రంగా గాయపడిన ఆ మహిళను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు చికిత్స పొందిన ఆమె మంగళవారం మృతిచెందింది. బాధితురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తన భార్యపై అశోక్ అనే వ్యక్తి అత్యాచారం జరిపి హత్య చేసినట్లు బాధిత మహిళ భర్త దుగ్గొండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.


తెరాస ప్రభుత్వం రైతు వ్యతిరేకి
కేసీఆర్‌పై బీజేపీ ఎమ్మెల్సీ విమర్శలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీని సీఎం కేసీఆర్ హేళన చేయడం, బీజేపీ మీద అనవసరంగా నిందలు వేయడం సరికాదని ఆ పార్టీ ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. బీజేపీ రైతులకు వ్యతిరేకంగా ఉందనడాన్ని తాము ఖండిస్తున్నామని, అందుకు క్షమాపణలు చెప్పాలని మంగళవారం ఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఓదార్చలేదు. కనీసం వారికి ఆర్థిక సహాయం కూడా చేయలేదని ఆరోపించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రైతు ఆత్మహత్యలు పెరిగాయని రామచంద్రరావు అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని మోడీ చాలాసార్లు చెప్పారని గుర్తు చేశారు. రైతుల అభివృద్ధి కోసం ఫసల్ బీమా యోజన పథకం తీసుకొచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని రామచంద్రరావు వివరించారు. నాబార్డు ద్వారా రుణ మాఫీ అందిస్తున్నారని చెప్పారు. తెలంగాణాలో 790 కోట్లు నిధులు ఒక్కరికి కూడా ఇవ్వకుండా పక్కదారి పట్టించారని ఆయన తెలిపారు. రైతులు ఖచ్చితంగా టీఆరెస్ సర్కార్‌పై తిరగబడతారని జోస్యం చెప్పారు. ఇప్పటికే టీఆరెస్ నాయకులను ప్రజలు గ్రామాల్లో తిరగనివ్వడంలేదని రామచంద్రరావు చెప్పారు. టీఆరెస్ మాటల ప్రభుత్వమే తప్ప మంచి చేసే ప్రభుత్వం కాదు విమర్శించారు.

మిషన్‌కాకతీయ-4 ద్వారా 100 చెరువులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మిషన్‌కాకతీయ-4వ దశ కింద వంద చెరువులకు మోక్షం కల్పిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 14జీవోల ద్వారా వంద చెరువులు మంజూరుచేయగా, వీటి ద్వారా 4602ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

భాగ్యనగరానికి ఉప రాష్ట్రపతి
స్వాగతం పలికిన గవర్నర్ నరసింహన్, మహమూద్ అలీ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మంగళవారం హైదరాబాద్ చేరుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన ఉప రాష్ట్రపతికి బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్,ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, హోంశాఖ మంత్రి నాయిని నర్సింహా రెడ్డి ఘన స్వాగతం పలికారు. జీఏడి ముఖ్య కార్యదర్శి అధర్‌సిన్హా, హైదరాబాద్ జాయింట్ కలెక్టర్ నిఖిల తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. మధ్యాహ్నం 1.50 గంటలకు వెంకయ్యనాయుడు భారత వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో నగరం చేరుకున్నారు.

దేశ సంస్కృతిని నిలబెట్టుకుందాం
ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



హైదరాబాద్, ఆంధప్రభ: ప్రపంచ దేశాలన్ని మన ఆహారంవైపు చూస్తుంటే మనం మాత్రం పాశ్చాత్య దేశాల మంచూరియాలకోసం పరుగుడెతూ జబ్బుల పాలు కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జవనశైలిని మార్చుకుందామని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. మంగళవారం లలితకళా వేదికలో నిర్వహించిన శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ 23వ కాన్వకేషన్‌లో ఉపరాష్ట్రపతి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఎంబీఏ పూర్తి చేసుకున్న విద్యార్థుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జీవితంలో కొత్త అధ్యాయం ఇప్పటినుంచే ప్రారంభం అవుతుందన్నారు. విద్యాభ్యాసం డిగ్రీ పొందగానే పూర్తయినట్లు కాదన్నారు. బలమైన వ్యక్తిత్వం, నైతిక విలువలు, జాతీయ భావం కలిగి ముందుకు సాగాలన్నారు. విద్యారంగంలో సిలబస్ భారాన్ని 50శాతం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. సగం సమయం విద్యాలయంలో గడిపితే మిగిలిన సగం ప్రకృతి ఒడిలో గడపాలన్నారు. ప్రతి విద్యార్థికి తల్లే తొలిగురువు అన్నారు. ప్రకృతిని కాపాడుకోకపోతే వైపరిత్యాల ప్రభావానికి గురికావాల్సివస్తుందన్నారు. టెక్నాలజీ పెరిగి శరీరానికి శ్రమలేక కొత్త కొత్త జబ్బులు వస్తున్నాయన్నారు. మన పూర్వీకులు అనుభవించి వారసత్వంగా అందించిన ఆహారపు అలవాట్లను ఆచరించాలన్నారు. అమ్మభాషలో మాధుర్యం మరెందులోనూ ఉండదన్నారు. కన్నతల్లిని , జన్మభూమిని పూజించాలన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్ , చంద్రబాబు నాయుడు విద్యారంగంలో మాతృభాషను నిర్బంధంగా అమలు చేయాలని నిర్ణయం తీసుకోవటం అభినందనీయం అన్నారు. కాన్వెంట్‌పై మోజు తగదన్నారు. ఏపీ తెలంగాణ , తమిళనాడు , కేరళ, కర్నాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు , ప్రధాని, చివరకూ తనతో సహా అంతా కాన్వెంట్‌లో చదవకుండానే ఇంతటి స్థాయికి చేరినవారమే అని గుర్తించాలన్నారు. ఇంగ్లీస్ నేర్చుకోవచ్చుకాని నిత్యం వాడటం తగదన్నారు. దేశ చరిత్రను మరిచిపోయినవాడు చరిత్రలోనే కలిసిపోతాడని హెచ్చరించారు. మతం వ్యక్తిగతమైనదే అని మనమంతా భారతీయులం అన్న భావనతో ఉండాలన్నారు. నలంద, తక్షశిల వంటి మహా విశ్వవిద్యాలయాల్లో ఎంతో మంది విదేశీయులు విద్యనేర్చుకున్నారన్నారు. ప్రపంచంలో 27శాతం జిడీపీ ఇండియాలోనే ఉండేదన్నారు. అగ్గిపెట్టెలో చీరలు ఎగుమతిచేసిన దేశం మనదే అన్నారు. సమాజంలో ఎదిగిన వారు తిరిగి సమాజానికి ఏదో రూపంలో సేవలందించాలన్నారు. విద్య ఉద్యోగం కోసం కాకుండా వికాసం కోసం ఉపయోగపడాలన్నారు. సోషల్ మీడియాపై ప్రపంచం సీరియస్‌గా ఉందన్నారు. గూగుల్ గుడ్ ..అయితే గూగుల్ గురువు కాదు ఇన్ఫర్మేషన్‌ను కన్ఫర్మేషన్ చేసుకోవాలన్నారు. తాను రాజకీయ నాయకుడిని కాదని , రాజకీయాలనుంచి రిటైర్డ్ అయ్యానని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయుని నరసింహారెడ్డితో పాటు శివ శివాని సంస్థ అధినేతలు , విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణీకుల భద్రతకే ప్రాధాన్యం
జీఎం వినోద్‌కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రయాణీకుల భద్రతకే తొలిప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణమధ్యరైల్వే జీఎం వినోద్ కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రైల్ నిలయంలో జీఎం వివిధ విభాగాల ప్రధానాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేల భద్రత విషయంలో రాజీపడేది లేదన్నారు. రైళ్ల నిర్వహణలో భద్రకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రక్షణ , సమయపాలనతోపాటు సరుకుల లోడింగ్ తదితర అంశాలపై జీఎం సమీక్ష నిర్వహించారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలోని అన్ని డివిజన్ల డీఆర్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైల్వే ఆస్తుల నష్టాలను కనిష్టానికి తగ్గించాలన్నారు. ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. వంతెనలు, ట్రాక్‌ల రిపేర్లు గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆహార ధాన్యాలు, రసాయనిక ఎరువులు, చక్కెర , సిమెంట్ తదితర సరుకుల లోడింగ్ ,రవాణలో మరింత శ్రద్ధ తీసుకోవాలని హెచ్చరించారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

రూ.50 కోట్లు దాటితే కుంభకోణమే!

● ఎన్‌పీఏ ఖాతాలపై సీబీఐకి ఫిర్యాదు
● బ్యాంకులకు ఆర్థిక శాఖ ఆదేశం

న్యూఢిల్లీ: రూ.50 కోట్లు పైబడిన అన్ని నిరర్ధక ఆస్తులు (ఎన్‌పిఎ) ఖాతాలు కుంభకోణానికి దారితీసే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. అలాంటి కేసులపై సిబిఐకి ఫిర్యాదు చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకులను (పిఎస్ బిలు) మంగళవారం ఆదేశించింది. పిఎన్‌బి కుంభకోణం చోటు చేసుకున్న దృష్ట్యా ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ఒక ట్వీట్ ద్వారా పిఎస్‌బి ఎండీలను ఆదేశించారు. బ్యాంకు మోసాలు, తదనంతరం ఉద్దేశ్యపూర్వక ఎగవేతను సకాలంలో గుర్తించాలి. అలాంటి కేసులను సిబిఐ దృష్టికి తీసుకువెళ్ళాలి. కుంభకోణం జరగడానికి అవకాశం ఉన్న రూ.50 కోట్లకు పైబ డిన అన్ని ఎన్‌పిఎ ఖాతాలను తనిఖీ చేయాలని పిఎస్‌బి ఎండీ లను ఆదేశించడమైనది అని రాజీవ్‌కుమార్ ట్వీట్ చేశారు.

ఈడీ సాయం తీసుకోవాలి

పిఎంఎల్, ఫెమా లేదా ఎగుమతి దిగుమతి నిబంధనల ఉల్లంఘనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)/రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్(డిఆర్ఐ)ల జోక్యం కోరాలని కూడా పిఎస్‌బిలను ఆదేశించారు. మోసాలను గుర్తించి నిర్దేశిత కాల వ్యవధిలో వాటిపై చర్య తీసుకోవాలని దాదాపు రూ.8.5 లక్షల కోట్ల స్థూల ఎన్‌పిఎలతో ఉన్న బ్యాంకులను ఆదేశించడమైనది. రూ.50 కోట్లకు పైబడిన మోసాలపై సిబిఐకి ఫిర్యాదు చేసి, సమన్వయపరిచే అధికారం సంబంధిత బ్యాంక్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌కు ఉంటుందని కుమార్ తెలిపారు. బ్యాంకులు ఎన్‌పి ఎగా రూపాంతరం చెందే ఖాతాపై రుణగ్రహీత స్థితిగతుల నివే దికను సెంట్రల్ ఎకనమిక్ ఇంటెలిజెన్స్ అండ్ బ్యూరో(సిఇఐబి) నుంచి కోరాలని, దానికి సిఇఐబి వారం రోజుల్లోగా స్పందించాలని ఆదేశించారు.

మౌలిక సదుపాయాలకు నిధులు

● ఏఐఐడీకి ఆర్థిక మంత్రి జైట్లీ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఏఐఐబి నుంచి భారత్‌కు మరిన్ని నిధులను ఆకాంక్షించారు. ఆసియా ప్రాంతంలో మౌలిక సదుపాయల కల్పనకు ఒక వారధిగా బహుపాక్షిక రుణవిధానం ఉండాలని అన్నారు. ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబి) మూడవ వార్షిక సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఏఐబిలో మరింత చురుకైన భాగస్వామ్యం వహించడానికి భారత్ నిర్ణయించిందని చెప్పడానికి గర్విస్తున్నాను అని జైట్లీ తెలిపారు. బ్యాంక్ సమర్ధమంతంగా నిధులను ఇవ్వడం ప్రారంభించిందని, మౌలిక సదుపాయాలు కొరవడిన ఆసియా ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. భారత ప్రభుత్వం మౌలిక సదుపాయల అభివృద్ధికి మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. 84 మంది సభ్యుల ఏఐబి 2016 నుంచి కార్యకలాపాలను ప్రారంభించింది. జూన్ 25 నుంచి 26 దాకా ముంబైలో బ్యాంక్ మూడవ వార్షిక సమావేశాన్ని నిర్వహించనుంది.

పెట్టుబడి పెడతాం: ఏఐఐబి ప్రెసిడెంట్


జైట్లీ బ్యాంక్ ప్రెసిడెంట్ జిన్ లికున్‌తో కలసి ఏఐఐబి వార్షిక సమావేశం లోగో మరియు థీమ్‌ను ఆవిష్కరించారు. భారత్ ఏఐఐబిలో రెండవ అతిపెద్ద వాటాదారు అని జిన్ తెలిపారు. బ్యాంక్ నిర్వహణలో భారత్ అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదని చెప్పారు. వినూత్నమైన మార్గాల్లో భారత్ మౌలికసదుపాయాలకు పెట్టుబడి అవసరాలను తీరుస్తామని తెలిపారు.

'ఒకే జీఎస్‌టీ రేటు సాధ్యంకాదు'

న్యూఢిల్లీ: ఒక జీఎస్టీ సాధ్యం కాదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. మంగళవారమిక్కడ భారత్-కొరియా సదస్సులో సభికుల ప్రశ్నలకు సమాధానమిస్తూ భారత్‌లో నెలకొన్న విస్తారమైన అసమానతలతో ప్రస్తుతం ఒక జీఎస్టీ రేటు సాధ్యం కాదని మంత్రి తెలిపారు. పన్ను అనుకూల ప్రమాణాల మెరుగుదల అనంతరం ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు చేపడుతుందని పెట్టుబడిదారులకు జైట్లీ హామీ ఇచ్చారు. ఉదాహరణకు ప్రస్తుతం మేం రెండు ప్రామాణిక రేట్లను అనుసరిస్తున్నాం. సుదీర్ఘ కాలంలో అవి ఒకటిగా విలీనం కావడాన్ని నేను కూడా చూస్తాను. అలా జరగడానికి కొంత సహేతుకమైన సమయం పడుతుంది అని తెలిపారు. అంతేకాక భారత్‌లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి జనాభా గణనీయంగా ఉంది. అందుకే ప్రస్తుతానికి ఒక రేటు పనిచేయదు అని మంత్రి చెప్పారు. బ్యాంకింగ్ రంగంపై సమాధానమిస్తూ కొందరు ఖాతా దారులు మోసాలకు పాల్పడుతున్న కారణంగా కొద్దికాలంగా బ్యాంకులు అప్రమత్తంగా ఉంటున్నాయన్నారు.

ప్రపంచంతో వ్యాపారానికి రెడీ

● భారత్ అత్యంత స్వేచ్ఛా విపణి ● భారత్– కొరియా వాణిజ్య సదస్సులో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: ప్రపంచంలోకెల్లా అత్యంత స్వేచ్ఛా విపణి భారత్ మాత్రమేనని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రపంచంతో వ్యాపారం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని మంగళవారం అన్నారు. భారత్-కొరియా వాణిజ్య శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మాట్లాడుతూ ఒక నిలకడైన వాణిజ్య వాతావరణ సృష్టికి, నిర్ణయాలు తీసుకోవడంలో మధ్యవర్తిత్వాన్ని తొలగించడానికి తమ ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు.

కొనుగోలు శక్తిలో మనది మూడో స్థానం



రోజువారీ లావాదేవీల్లో సాను కూలతను కోరుకుంటున్నాము. సందేహాలను తవ్వుకుంటూ పోవడానికి బదులుగా విశ్వసనీయతకు చెందిన ప్రాంతాలను విస్తరించుకుంటూ పోతు న్నాం. ఇది ప్రభుత్వ ఆలోచనా ధోరణిలో ఒక సంపూర్ణమైన మార్పునకు ప్రాతినిధ్యం వహిస్తున్నది అన్నారు. కొనుగోలు శక్తి విషయానికి వస్తే భారత్ ఇప్పటికే అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుంది.

మీరు ప్రపంచాన్ని పరికించినప్పుడు ఆర్థిక వ్యవస్థకు చెందిన ముఖ్యమైన మూడు అంశాలను సంతరించుకున్న దేశాలు కొన్ని మాత్రమే కనిపిస్తాయి. ఆ మూడు అంశాలు ప్రజాస్వామ్యం, జన సాంద్రత,

మూడు విధాల బెస్ట్

గిరాకీ. భారతదేశం ఈ మూడింటిని సమష్టిగా సంత రించుకుంది అని మోడీ చెప్పారు. ఈ సందర్భంగా కొరియా వాణిజ్యవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యాపారం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. వారి పెట్టుబడులను ప్రోత్సహించి, రక్షణ కల్పించేందుకు అవసరమైనది ఏం చేయడానికైనా వాగ్దానం చేస్తుందని ప్రధాని చెప్పారు.

పారిశ్రామిక లైసెన్సులకు 15 ఏళ్ళ పరిమితి

నామమాత్రపు జిడిపితో మనం అతి త్వరలో ప్రపంచంలో అతి పెద్ద ఐదవ ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తాము. ప్రస్తుతం ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలచింది అని మోడీ తెలిపారు.

అంతేకాక అతిపెద్ద స్టార్టప్ ఎకో-సిస్టమ్ కలిగిన దేశాల్లో ఒకటిగా సైతం భారత్ ఉంది అని చెప్పారు. తమ ప్రభు త్వం అనియంత్రిత, లైసెన్సు రహిత మార్గంలో ఉందని, అందులో భాగంగా పారిశ్రామిక లైసెన్సుల చెల్లుబాటు కాలవ్యవధిని మూడు సం వత్సరాల నుంచి 15 సంవత్సరాలకు పెంచినట్టు ప్రధాని తెలిపారు.

ఇంక్యుబేటర్‌తో 'అంకురా'నికి సానుకూలత

● హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ యుబి దేశాయ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్, చిప్ డిజైన్ రంగంలో ఇప్పుడే ఉద్భవిస్తున్న అంకుర పరిశ్రమలకు ఒక సానుకూల వాతావరణాన్ని కల్పించ డానికి ఇంక్యుబేటర్‌ను ఆవిష్కరించిందని ప్రొఫెసర్ యు.బి.దేశాయ్, డైరెక్టర్, ఐఐటీ హైదరాబాద్ అన్నారు. మంగళవారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని పేర్కొన్నారు. ఫ్యాబ్‌లెస్ చిప్ డిజైన్ ఇంక్యుబేటర్ ప్రోగ్రాం లేదా ఫ్యాబ్సీ అనే ఈ కార్యక్రమం ఇండియాలో ఫ్యాబ్‌లెస్ ఐసి అంకుర పరిశ్రమలకు ఐఐటీ హైదరాబాద్ ఆధారంగా పనిచేస్తుందన్నారు. ఫ్యాబ్‌లెస్ చిప్ డిజైన్ ఇంక్యుబేటర్ అనేది ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఎంఇఐటివై యొక్క మద్ధతుతో మరియు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటొమేషన్ (ఇడిఎ) సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ మరియు ఐపి యొక్క అగ్రగామి ప్రధాత కాడెన్స్ డిజైన్ సిస్టం ఐఎన్‌సి భాగస్వామ్యంతో అమలు చేయబడే కార్యక్రమన్నారు. ఈ కొత్త ఇంక్యుబేటర్ ప్రోగ్రాం చిప్ డిజైన్ రంగంలో ఐపీఆర్ ఉత్పాదనలో నిబద్ధతను ప్రదర్శిస్తుందన్నారు. కాడెన్స్ డిజైన్ సిస్టం (ఇండియా), కార్పొరేట్ వైఎస్ ప్రెసిడెంట్, ఎండీ జస్వీంద్ అహుజా మాట్లాడుతూ ఇండియాలో ఎలక్ట్రానిక్ సిస్టం డిజైన్ మరియు తయారీ (ఇఎస్‌డిఎం) వాతావరణం యొక్క ఎదుగుదలకు సృజనాత్మక ఆవిష్కరణ మరియు ఔత్సాహిక పారిశ్రామిక తత్వం చాలా ఆవశ్యకమైందన్నారు. హేమంత్ కనాకియా, ముఖ్య సలహాదారు కూడా మాట్లాడారు.

గూగుల్ సర్వాధికారి పిచాయ్



● అన్నింటా తనదైన ముద్ర
● పేరుకు ఇతర సీఈవోలు...

మొత్తం గ్రూప్ సుందర్ చేతుల్లో

న్యూయార్క్: సిఇఒ సుందర్ పిచాయ్ గూగుల్‌పై అనితర సాధ్యమైన అధికారాన్ని సాధించారని యూఎస్ మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. దీనికి తార్కాణంగా గూగుల్ మాతృ కంపెనీ ఆల్ఫాబెట్ యుఎస్ సెక్యూరిటీ అండ్ ఎక్స్‌చేంజ్ కమిషన్(ఎస్ఇసి)కు సమర్పించిన పత్రాలను చూపుతున్నాయి. ఆల్ఫాబెట్ గూగుల్, తన అదర్ బెట్స్ తాలూకు ఆర్థిక వ్యవహారాలను ప్రస్తుతం వేరు చేసింది. ప్రస్తుతం అదర్ బెట్స్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కారు యూనిట్ వేమో, హెల్త్ కేర్ కంపెనీ వెరిలీ లాంటి 11 వేర్వేరు కంపెనీలు ఉన్నాయి. ఎస్ఇసి గతేడాది చివర్లో ఆల్ఫాబెట్‌ను నిర్దేశిత అంశాలపై వివరాలను కోరింది. వాటిలో గూగుల్ వ్యాపారాలపై ఆల్ఫాబెట్ సిఇఒ ల్యారీ పేజ్ నిర్ణయాత్మక శక్తి, పేజ్, ప్రెసిడెంట్ సెర్జె బ్రిన్, గూగుల్ సిఇఒ పిచాయ్‌లకు ఇస్తున్న వేర్వేరు రకాల సమాచారం, తదితరాలు ఎస్ఇసి కోరినవాటిలో ఉన్నాయి.

అనంతరం ఆల్ఫాబెట్ ఎస్ఇసికి సంబంధిత పత్రాలను సమర్పించింది. సదరు పత్రాల ప్రకారం ఆల్ఫాబెట్ సిఇఒ పేజ్ ఆల్ఫాబెట్ కంపెనీ ఆర్థిక సమాచారాన్ని క్రమం తప్పకుండా పొందుతుంటారు. కానీ గూగుల్ లేదా అదర్ బెట్స్‌లో ఉత్పాదక ప్రాంతాలకు వనరులు కేటాయించరు. అలాగే గూగుల్‌కు ఆల్ఫాబెట్ పూర్తిస్థాయి వనరుల కేటాయింపుపై పిచాయ్‌కు సైతం ఎలాంటి అధికారం లేదు. కానీ గూగుల్‌పై పిచాయ్‌కు విస్తృతమైన అధికారం ఉందని సిఎన్‌బిసి ఒక వార్తా కథనంలో పేర్కొంది. ఆయన గూగుల్ ఉత్పాదక ప్రాంతాలకు చెందిన వ్యక్తిగత ఆర్థిక సమాచారంతో వారపు, త్రైమాసిక నివేదికలు పొందుతుంటారు. వాటిలో యుట్యూబ్, అడ్వర్‌టైజింగ్, హార్డ్‌వేర్, ఆపరేటింగ్ ఫలితాలు, మూలధన వ్యయాలు, సిబ్బంది సంఖ్య ఉన్నాయి. పేజ్ కానీ ఆయన సహ వ్యవస్థాపకుడు, ఆల్ఫాబెట్ ప్రెసిడెంట్ సెర్జె బ్రిన్ కానీ పిచాయ్‌కు వచ్చిన నివేదికలను పొందరు. గూగుల్‌కు సంబంధించి పేజ్ అనుమతి లేకుండా పిచాయ్ నిర్ణయాలు తీసుకోవచ్చు. అప్రమాణిక లైసెన్సింగ్ లేదా అదే రకమైన ఏర్పాట్లు, పెట్టుబడులు, విలీనాలు మరియు స్వాధీనాలు, మూలధన వ్యయాలు, రియల్ ఎస్టేట్, వాణిజ్య ఏర్పాట్లు, భాగస్వామ్యం, ఆదాయం కల్పించే ఒప్పందాలు, ఇతరములైన అలాంటి లావాదేవీలు, వ్యయాలు పిచాయ్ పరిధిలో ఉంటాయి. యుట్యూబ్ సిఇఒగా సుసాన్ వొజ్సికి, క్లౌడ్ సిఇఒగా డయానె గ్రీన్ ఉన్నప్పటికీ పేజ్‌తో నేరుగా క్రమంతప్పకుండా సంప్రదింపులు జరిపి నివేదించే గూగుల్ ఏకైక సిఇఒగా పిచాయ్ నిలిచారని సిఎన్‌బిసి కథనం తెలిపింది.

పీఎఫ్ ఖాతాకు ఆధార్ అనుసంధానం

● ఉమంగ్ యాప్‌లో సౌలభ్యం



న్యూఢిల్లీ: పిఎఫ్ ఖాతాదారులు ఉమంగ్ యాప్ ద్వారా వారి ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించవచ్చని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. ఉద్యోగ భవిష్య నిధి సంస్థ(ఇపిఎఫ్ఒ) ఉమంగ్ యాప్‌లో ఇపిఎఫ్ఒ లింకును వినియోగిస్తున్న పిఎఫ్ ఖాతాదారుల సౌకర్యార్థం యుఎఎన్-ఆధార్ లింకింగ్ సదుపాయాన్ని ప్రవేశపెట్టిందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఇపిఎఫ్ఒ వెబ్‌సైట్‌పై ప్రస్తుతం ఉన్న దానికి అదనంగా కొత్త సదుపాయం తోడైంది. ఇపిఎఫ్ఒ డిజిటల్ ఇండియా దిశగా ఇ-నామినేషన్ సదుపాయాన్ని సైతం ఆరంభించింది. కేంద్రం పలు ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే ఉద్దేశ్యంతో ఉమాంగ్ యాప్‌ను ప్రవేశపెట్టింది.

టీవీఎస్ కొత్త 125 సీసీ స్కూటర్



కొత్త స్కూటర్‌తో జీఎం బినోయ్ ఆంథోనీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ద్విచక్ర వాహనాల తయారీ రంగంలో ప్రఖ్యాతి గాంచిన టీవీఎస్ తన కొత్త 125 సీసీ మోడల్ స్కూటర్‌ను మార్కెట్‌లో విడుదల చేసింది. మంగళవారం ఇక్కడ తాజ్ కృష్ణా హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ బినోయ్ ఆంథోనీ నూతన స్కూటర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతను ఈ స్కూటర్ అమితంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. దేశంలోనే తొలి బ్లూటూత్ కనెక్టెడ్ స్కూటర్ కావడం టీవీఎస్ ఎస్ టార్క్ 125 సీసీ స్కూటర్ ప్రత్యేకతగా ఆయన అభివర్ణించారు. దీని ధర రూ.61,450 గా బినోయ్ పేర్కొన్నారు. అమ్మకాలు మొదలయ్యాయని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అందరు డీలర్ల వద్ద వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. ద్విచక్ర వాహనాల క్రయ, విక్రయాలు పెరుగుతున్నాయని, 2012- 13లో కేవలం 19.2 శాతం మాత్రమే అమ్మకాల రేటు ఉంటే, 2017-18 కి 33.5 శాతానికి చేరుకుందన్నారు.ఈ విలేఖరుల సమావేశంలో కంపెనీ జీఎం ఆర్ బాలాజీ, ఇతర విభాగాల అధిపతులు వర్గీస్ ఎం థామస్, కెఎస్ హరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ-స్కూల్స్ రంగంలో 'లిటిల్ మిలీనియం' పెట్టుబడులు

● సంస్థ డైరెక్టర్ రామన్ బజాజ్ వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా వృద్ధి చెందుతున్న ప్రి-స్కూల్స్ విభాగంలో పెట్టుబడులను ఆహ్వానించి మెరుగైన ప్రాథమిక విద్యకు బాటలు వేస్తున్న లిటిల్ మిలీనియం ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ నగరంలో సేవలను విస్తరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 100 నగరాల్లో 550లకు పైగా ప్రి-స్కూళ్ళను నిర్వహిస్తున్న ఈ సంస్థ దక్షిణాది రాష్ట్రాల్లో సేవలను విస్తృతపర్చాలని సంకల్పించింది. తమ బ్రాండ్ పేరుతో ప్రి-స్కూల్‌ను నెలకొల్పేందుకు పెట్టుబడులు పెడితే ఉపాద్యాయుల నియామకంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను తామే సమకూరుస్తామని సంస్థ డైరెక్టర్, సీఈవో రామన్ బజాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం నగరంలో 50 స్కూళ్ళను నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరో 50 స్కూళ్ళను నెలకొల్పాలన్న లక్ష్యంతో చర్యలు ప్రారంభించామన్నారు. వార్షిక ప్రాతిపదికన చూస్తే ప్రతియేటా ఈ రంగం 20శాతం వృద్ధి సాధిస్తోందన్నారు. 2020 నాటికి దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో లిటిల్ మిలీనియం ప్రి-స్కూళ్ళను నెలకొల్పి తమ సంస్థ వార్షిక టర్నోవర్‌ను రూ.25వేల కోట్లకు పెంచగలమని సంస్థ సీఈవో రామన్ బజాజ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లకు కొత్తవేదిక


● బ్యాచ్‌ట్యాగ్ డాట్ కామ్‌ను ఆవిష్కరించిన మెడ్‌ప్లస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫార్మసీ రిటైల్ చైన్ వ్యాపార రంగంలో అగ్రగామిగా పేరున్న మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కొత్తగా ఆన్‌లైన్ వ్యాపార వేదికను ఆవిష్కరించింది. ఇందుకు సంబంధించి రూపొందించిన బ్యాచ్‌ట్యాగ్ డాట్ కామ్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీఈవో డాక్టర్ మధుకర్ గంగాడి మంగళవారం ఇక్కడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నేరుగా కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని వినియోగదారులకు ఆ ధరలనే అమలు చేస్తామన్నారు. 50శాతం మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించి మిగతా మొత్తాన్ని వస్తువులు డెలివరీ చేసిన తర్వాత చెల్లించేందుకు వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. వస్తువు ఖరీదు మొత్తాన్ని క్యాష్ ఆన్ డెలివరీకి తమ ఆన్‌లైన్ వ్యాపారంలో ఆవకాశం లేదన్నారు. రూ.15 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఈ వ్యాపారాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఫర్నీచర్, గృహోపకరణాలు మొదలుకుని భవన నిర్మాణ సామాగ్రి వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

3 బిలియన్ల గృహాలకు సెక్యూరిటీ

● మైగేట్ సంస్థ డైరెక్టర్ అభిషేక్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా ఈ ఏడాది 2 బిలియన్‌ల గృహాలకు సెక్యూరిటీ సర్వీసులు అందించడమే లక్ష్యంగా కార్యకలాపాలను విస్తరిస్తున్నామని 'మైగేట్' సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ అభిషేక్ తెలిపారు. ముందుగా హైదరాబాద్, ముంబై, బెంగుళూరు లాంటి మెట్రో పాలిటన్ నగరాల్లో గేటెడ్ కమ్యూనిటీ విభాగంలో సేవలండించేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రాకపోకల వివరాలను నమోదు చేస్తామన్నారు. పాలు, నీళ్ళు, పేపర్ సర్వీసులు అందించే వాళ్ళతో పాటు ఉబర్, ఓలా లాంటి పెయిడ్ ట్రాన్స్‌పోర్టు సేవలందించేవాళ్ళ వివరాలు కూడా ఆన్‌లైన్‌లో పమోదు చేయబడుతాయన్నారు. నిత్యం వచ్చే బంధుమిత్రులు, సందర్శకుల వివరాలను, వారి వాహనాల నెంబర్లను నమోదు చేయడంతో పాటు సీసీ టీవీ కెమెరాల నిఘాలో భద్రత కల్పించడమే తమ సంస్థ ప్రత్యేకతలని అభిషేక్ వెల్లడించారు. మైగేట్ మొబైల్ యాప్ ద్వారా తాము అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని వివరించారు. ఈ సమావేశంలో మైగేట్ సంస్థ ఓ ఫౌండర్, సీఈవో విజయ్ అరిశెట్టి కూడా ఉన్నారు.

ఎస్‌బీఐలో డిజిటల్ లాకర్ సిస్టం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తక్షణం ఖాతాలను తెరిచే ందుకు వీలైన ఎస్‌బిఐ హబ్‌ల విస్తరణ కొనసాగుతోంది. ఎస్‌బిఐ ప్రత్యేక ఖాతాల నిర్వహణ కార్యకలాపాలను ప్రారంభించి ఏడాది అయిన సందర్భంగా మంగళవారం మాధాపూర్‌లో కొత్త హబ్‌ను బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ జే స్వామినాథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే జంట నగరాల్లోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మియాపూర్, సికింద్రాబాద్, ఈసీఐఎల్, కోటి, గన్ ఫౌండ్రీలలో మొత్తం 8 ప్రత్యేక హబ్‌లను ప్రారంభించామని చెప్పారు.ఈ హబ్‌లలో ఖాతాలు తెరవడంతో పాటు డెబిట్ కార్డులను తీసుకోవడం సులభమని చెప్పారు.ఈ బ్రాంచిల్లో డిజిటల్ లాకర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హబ్‌ల ఏర్పాటు ప్రోత్సాహకరంగా ఉందని, ఇప్పటి వరకు రూ.1100 కోట్ల వ్యాపారం జరిగినట్లు పేర్కొన్నారు.

నీరవ్ దివాలా రూటు

● అమెరికాలో దరఖాస్తు ● ఫైర్ బ్రాండ్ డైమండ్‌తో మొదలు



న్యూయార్క్: పిఎన్‌బి కుంభకోణంలో నిందితుడు నీరవ్ మోడీకి చెందిన అంతర్జాతీయ ఆభరణాల కంపెనీ ఫైర్‌స్టార్ డైమండ్ ఇన్‌కార్పొరేషన్ దివాలా దరఖాస్తును అమెరికాలో దాఖలు చేసింది. న్యూయార్క్ సదరన్ బ్యాంక్‌రప్ట్సీ కోర్టులో ఫైర్‌స్టార్ డైమండ్ చాప్టర్ 11 పిటిషన్‌ను సోమవారం దాఖలు చేసిందని కోర్టు పత్రాలనుబట్టి తెలుస్తున్నది. జడ్జి సియాన్ హె. లేన్‌కు కేసు విచారణను అప్పగించారు.

కంపెనీ చూపిన కారణాలు

అమెరికా, ఐరోపా, మిడిల్ ఈస్ట్‌లకు తన కార్యకలాపాలు విస్తరించాయని తన వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఫైర్‌స్టార్ డైమండ్... తాను దివాలా తీయడానికి లిక్విడిటి, సప్లయ్ చైన్ సవాళ్లను తప్పుపట్టింది. అది 100 మిలియన్ డాలర్లను ఆస్తులు, అప్పులుగా చూపిందని కోర్టు పత్రం పేర్కొంది. దీనిపై కంపెనీ అటార్నీ క్లెస్టాడ్ వింటర్స్ జురెల్లెర్‌కు పంపించిన ఇ-మెయిల్‌కు సమాధానం రాలేదు.

విడి వజ్రాలతో వ్యాపారం మొదలు


ఫైర్‌స్టార్ డైమండ్ 1999లో ఆవిర్భవించింది. మొదట విడి వజ్రాల సరఫరాతో ప్రారంభమైన కార్యకలాపాలను 2001 సంవత్సరానికి ఆభరణాల తయారీకి విస్తరించింది. ఒక ప్రయివేట్ లేబుల్ పొంది, అమెరికా జాతీయ రిటైల్ మార్కెట్‌లో అడుగుపెట్టడం కోసం ఫ్రెడెరిక్ గోల్డ్‌మ్యాన్ డైమండ్ జ్యువలరీని హస్తగతం చేసుకుంది. ఆ తర్వాత అమెరికా పంపిణీని విస్తరించింది. 2009లో బెల్జియంలో ఒక యూనిట్ నెలకొల్పింది.

నీరవ్ బ్రాండ్ పదకొండేళ్ళకు...

నీరవ్ మోడీ అల్ట్రా-లగ్జరీ డైమండ్ జ్యువలరీ బ్యాండ్‌ను 2010లో ప్రారంభించినట్టు ఫైర్‌స్టార్ డైమండ్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయితే యాజమాన్య వివరాలను కంపెనీ వెబ్‌సైట్‌లో పొందుపరచలేదు. దివాలా దరఖాస్తులో ఇతర కంపెనీలుగా ఫైర్‌స్టార్ డైమండ్ అనుబంధ ఎ.జెఫ్ ఇన్‌కార్పొరేషన్ వెడ్డింగ్ జ్యువలరీ, ఫాంటసీ ఇన్‌కార్పొరేషన్లను చేర్చారు. రుణదాతల సంఖ్య 50 నుంచి 99 మధ్య ఉంటుందని చూపించారు.

పీఎన్‌బీ కుంభకోణం రూ. 12,717 కోట్లు

● రూ. 1,323 కోట్లు అదనపు జోడింపు
● స్టాక్ ఎక్స్ఛేంజీలకు పీఎన్‌బి స్టేట్‌మెంట్



న్యూఢిల్లీ: వజ్రాల వ్యాపారులు నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ చేసిన మోసం మొత్తం విలువ దాదాపు 2 బిలియన్ డాలర్లు ఉండవచ్చని, అది గతంలో అంచనా వేసినదాని కన్నా 204 మిలియన డాలర్లపైమాటేనని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) తెలిపింది. ఈ మేరకు పిఎన్‌బి స్టాక్ ఎక్స్‌చేంజ్‌లకు సోమవారం రాత్రి పొద్దుపోయాక దాఖలు చేసిన ఫైలింగ్‌లలో పేర్కొంది. అనధికృత లావాదేవీల పరిణామం 204.25 మిలియన్ డాలర్లకు పెరగవచ్చు అని పిఎన్‌బి వెల్లడించింది. గతంలో కుంభకోణ మొత్తాన్ని రూ.11,394.02 కోట్లకు పేర్కొన్న బ్యాంకు తాజాగా ఆ మొత్తానికి రూ.1,323 కోట్లు జోడించింది. దీంతో కుంభకోణం మొత్తం విలువ రూ.12,717 కోట్లకు చేరుకుంది. కుంభకోణంతో నష్టపోయిన ఇతర బ్యాంకులకు చెల్లింపులు జరపాలంటూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశం అందలేదని పిఎన్‌బి తెలిపింది.

పిఎన్‌బి అధికారులతో కుమ్మక్కు అయిన నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, ఆరోపిత కంపెనీలు ఎల్ఓయులు పొందారు. వాటితో అలహాబాద్, యాక్సిస్ బ్యాంక్, యుకో బ్యాంక్ లాంటి భారతీయ బ్యాంకులకు చెంది విదేశాల్లోని శాఖల నుంచి రుణాలు పొందారు. చట్టప్రకారం అలాంటి చెల్లింపులు జరపాల్సివస్తే బ్యాంక్ వద్ద సరిపడ పెట్టుబడి, ఆస్తులు ఉన్నాయని స్టాక్ ఎక్స్‌చేంజ్‌కు విడిగా ఇచ్చిన ఒక స్టేట్‌మెంట్‌లో పిఎన్‌బి పేర్కొంది.


పంచాయతీలకు కార్యదర్శుల కొరత



● గ్రామాల్లో కుంటినడకన పాలన ● పంచాయతీల సంఖ్య 8,684
● శాంక్షన్ పోస్టులు 5,065, పని చేస్తున్నది 3,519

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టెక్నాలజీ వినియోగం పెరిగుతూ వస్తోంది. మరో వైపు గ్రామీణాభివృద్దే లక్ష్యంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త కొత్త పధకాలను అమలు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ సర్కారు మరో అడుగు ముందుకేసి గ్రామీణ తెలంగాణ దిశగా పంచాయతీరాజ్ చట్టాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి కొత్త చట్టం రూపోందించే పనిలో ఉంది. మరో వైపు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అత్యధిక శాతం గ్రామ పంచాయతీలు కార్యదర్శులు లేక ఉస్సూరు మంటున్నాయి. ఉన్న కొద్ది మంది కార్యదర్శులపై పనిభారం పెరిగిపోతోంది. ఒక్కో గ్రామ పంచాయతీ కార్యదర్శి రెండు మూడు గ్రామాలకు ఇంచార్జిగా విధులు నిర్వ హించాల్సి వస్తోంది. దీంతో చాలా గ్రామాల్లో పంచాయతీ పాలన కుంటినడకన గెంటుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉండగా 2004లో కాంట్రాక్టు పద్దతిన పంచాయతీకార్యదర్శుల నియామకాలు జరిపారు. అ తరువాత రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడగానే పెద్ద ఎత్తున కార్యదర్శుల నియామకాలు జరుగుతాయని ఆశించారు. తీరా పరిస్థితి చూస్తే నిరాశే మిగిలిందంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 8684గ్రామ పంచాయతీలు ఉన్నాయి . ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంఖ్యను పరిశీలిస్తే మొత్తం పంచాయతీల సంఖ్యలో 50శాతం లోపే ఉంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 5163 పంచయాతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీ గా ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం నాలుగు గ్రేడ్ల కింద గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శుల పోస్టులు కూడా గ్రేడ్ల వారీగానే విభజించారు. నాలుగు గ్రేడ్లకు కలిపి శాంక్షన్ పోస్టులు 5065 కాగా ప్రస్తుతం 3519 మంది కార్యదర్శులు మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో ఒక్కో కార్యదర్శి మూడు నాలుగు గ్రామాలకు కూడ ఇంచార్జిలు ఉన్నారు. గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శుల విధులు బాద్యతలు ఎంత కీలకమైనవో ఎవరికి తెలియనవి కావు. జనన మరణాల నమోదు, ధృవీకరణ సర్టిఫికెట్లజారీ, గ్రామ పంచాయతీల రికార్డుల నమోదు, గ్రామ సభల నిర్వహణ, గ్రామ పంచాయతీలకు చెందిన ఆస్తుల పరిరక్షణ, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పించన్ల పంపిణీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పధకాల అమలు పర్యవేక్షణ, మండల జిల్లా స్థాయి అధికారుల సమావేశాలు, సమీక్షలకు హాజరు, గ్రామ స్థాయి సమగ్ర సమాచారంతో కూడిన నివేదికల రూపకల్పన వంటి పనులన్ని పంచాయతీ కార్యదర్శి ద్వారానే జరగాల్సి ఉంది. గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 34 అంశాలు పంచాయతీ కార్యదర్శులపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ నేపద్యంలో ఇంతటి గురుతర బాద్యతలు ఉన్న వీరికి పనిభారం పెరగటంతో గ్రామాల్లో పాలన మందగిస్తోంది.

జిల్లాల వారీగా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఖాళీలు పరిశీలిస్తే ఖమ్మం జిల్లాలో అత్యధికంగా ఖాళీలు కనిపిస్తున్నాయి. జిల్లాల వారీగా అదిలాబాద్‌లో 33, ఆసీఫాబాద్‌లో 60, నిర్మల్‌లో 59, మంచిర్యాలలో 37, కరీంనగర్‌లో 11, జగిత్యాలలో 71, రాజన్న సిరిసిల్లలో 27 ఖాళీలు ఉన్నాయి. పెద్దపల్లిలో 40, వరంగల్ అర్బన్‌లో 13, వరంగల్ రూరల్‌లో 50, జనగాంలో 21, జయశంకర్ భూపాలపల్లిలో 73, మహబూబాబాద్‌లో 102, ఖమ్మంలో 229, భద్రాద్రి కొత్తగూడెంలో 115, నల్లగొండలో 56,సూర్యాపేటలో 59, యాదాద్రి భువనగిరిలో 20, మహబూబ్ నగర్‌లో 48ఖాళీలు ఉన్నాయి. నాగర్ కర్నూల్‌లో 25, జోగులాంబ గద్వాలలో 19, వనపర్తిలో 10, రంగారెడ్డిలో 11, మేడ్చెల్‌లో 3, వికారాబాద్‌లో 36, సంగారెడ్డిలో 34, మెదక్‌లో 29 సిద్దిపేటలో 25, నిజామాబాద్‌లో 131, కామారెడ్డిలో 121 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక శాంక్షన్ పోస్టుల్లో కూడా జిల్లాల వారీగా ఖాళీల సంఖ్య పెద్దజాబీతాగానే ఉన్నట్టు చెబుతున్నారు. త్వరలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సివుంది. అన్నీ అనుకూలిస్తే ఈ లోపు కొత్త పంచాయతీ రాజ్ చట్టం కూడా అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పాలన కుంటు పడకుండా కార్యదర్శుల నియామకాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతయినా ఉందంటున్నారు.



భాగస్వామ్య సదస్సులో ఉపాధి కల్పనకు పోటాపోటీ

విశాఖపట్నం, ప్రభన్యూస్: ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా ఇక్కడ ఉత్పాదకతను పెంచడంతో పాటు రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను పెంచాలనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంలో ఈసారి స్వదేశీ, స్వరాష్ట్ర సంస్థలు పోటీ పడ్డాయి. సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు ఏడు వందలకుపైగా ఒప్పందాలు జరుపుకున్నట్లుగా ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సింగపూర్, దక్షిణ కొరియా దేశా లతో పాటు అంబానీ, రిలయెన్సు వంటి బడా సంస్థల పెట్టుబడులూ చోటుచేసుకు న్నాయి. విద్యుత్తు ఛార్జీలు పెంచని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతా నని పదే పదే చెబుతున్న చంద్రబాబు నాయుడు రీన్యూ పవర్ వెంచర్‌లను ఆంధ్రప్రదేశ్‌లో నెల కొల్పేందుకు అవసరమైన కసత్తులను జరిపారు. ఇదే ఆలోచనల లో ఉన్న పొరుగు రాష్ట్రాల పారిశ్రామిక వేత్తలనూ కదిలించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ లో రూ. 13 వం దల కోట్లతో ఓ కొత్త ప్రాజక్టుకు సిగ్నల్ లభించింది. రూ.75 కోట్ల వ్యయంతో సన్న కారు రైతులకు చెందిన వ్యవసాయ మెషిన్‌ల తయారీ పరిశ్రమల స్థాపనకూ ఒప్పం దాలు చోటు చేసుకున్నాయి.

రూ.13 వేల కోట్లతో రీన్యూ పవర్ వెంచర్

వెయ్యి మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తినిచ్చే రీన్యూ పవర్ వెంచర్‌ను రెన్యూవబుల్ ఎనర్జీ కెపాసిటీ సంస్థ రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఆంధ్రలో స్థాపించేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించిన భాగస్వామ్య ఒప్పందాన్ని ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడు స్వయంగా నిర్వహించారు. రీన్యూ పవర్ సంస్థ సీఈవో సుమంత్ సిన్హా ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు వేల మందికి పరోక్షంగానూ, నాలుగు వేల మందికి ప్రత్యక్షంగానూ ఉపాధి కల్పన లక్ష్యంగా నెలకొల్పుతున్నట్లుగా చెప్పారు. 2022 నాటికి 175 మెగావాట్ కెపాసిటీ లక్ష్యంలో భాగంగా వెల్లడించారు. ఇప్పటికే మూడు వందల మెగా వాట్స్ కెపాసిటీతో కూడిన రీన్యూ వెంచర్‌ని నడుపుతున్నామని,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తుందని ఆశిస్తున్న సహకారంతో ఈ సామర్థ్యాన్ని మరింతగా పెంచేయోచనలో ఉన్నట్లుగా సుమంత్ వెల్లడించారు.

తహశీల్దార్ల ఆఫీస్‌లకు నెట్‌వర్క్ కష్టాలు

● 473 కార్యాలయాలకు ఎలా?
● సమస్య తీవ్రం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తహశీల్దార్లకు రిజిస్ట్రేషన్ అధికారాలను మార్చి 11నుంచి కట్టబెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. రిజిస్ట్రేషన్లకు అవసరమైన సాంకేతిక సమస్యలు అంత సులువుగా తీరేవి కావని ఇరు శాఖలు అంచనా వేస్తున్నాయి. రిజిస్ట్రేషన్ నెట్‌వర్క్ సాంకేతికతను తహశీల్దార్ కార్యాలయాలకు అనుసంధానం అంత సులువుగా జరగదని తెలుస్తోంది. ఇప్పుడున్న 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నెట్‌వర్క్‌ను మరో 473 కార్యాలయాలకు విస్తరించడం ఇబ్బందిగా మారనున్నదని తెలిసింది.

ఉమ్మడి రాష్ట్రంలో జాయింట్‌గా కొనసాగించిన సర్వర్‌తో మూడున్నరేళ్లుగా రిజిస్ట్రేషన్ల శాఖ అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో అడ్డంకులను అధిగమించేందుకు సొంత మెరుగైన సర్వర్ దిశగా ప్రయత్నాలు చేసింది. ఇప్పటివరకు కొనసాగించిన పాత సర్వర్‌తో గత ఆరునెలలుగా అవాంతరాలు, ఇబ్బందులు ఎదురయ్యాయి. కీలక సమయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆన్‌లైన్ ఇబ్బందులు అనేక సమస్యలను సృష్టించాయి. అనేక సందర్భాల్లో ఆన్‌లైన్ సర్వర్ పనిచేయక రాష్ట్రంలోని 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్రయ విక్రయాలకు చెందిన రిజిస్ట్రేషన్లు గంటల తరబడి ఆలస్యమవడం నిత్యకృత్యమైంది. ప్రతిష్ఠాత్మక కార్డ్ విధానంలో సర్వర్ సరిగా పనిచేయని కారణంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న అధికారులు సర్వర్‌ను సొంతంగా అప్‌డేట్ చేసుకున్నది.

రిజిస్ట్రేషన్ చిక్కులకు చెక్ పెట్టేందుకు అధునాతన సర్వర్‌కు అంకురార్పణ చేశారు. ఒరాకిల్ ఎక్సా డాటా హైస్పీడ్ స్టాండ్ మిషిన్‌తో నూతన సర్వర్‌ను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ అమలు చేస్తున్న అనేక సేవల్లో ఎటువంటి అంతరాయాలు, ఇబ్బందులు లేకుండా ఈ అధునాతన నూతన వ్యవస్థను ఏర్పాటు చేశారు. 7 టెరా బైట్ల గరిష్ట సామర్ధ్యంతో గచ్చిబౌలిలోని స్టేట్ డేటాసెంటర్‌లో సెంట్రల్ సర్వర్‌ను నెలకొల్పారు. ఉమ్మడి రాష్ట్రంలోని సర్వర్‌ను ఒక్కో రిజిస్ట్రార్ కార్యాలయంనుంచి వేరుచేసే పనిని చురుకుగా కొనసాగిస్తున్నారు. మరోవైపు నెట్‌వర్క్‌నూ వేగంవంతం చేయడంలో భాగంగా రెయిల్ టెల్ నెట్‌వర్క్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఎంపిఎల్ఎస్ టెక్నాలజీ ద్వారా అన్ని ఎస్ఆర్‌వోలను అనుసంధానించారు. రైల్వే శాఖకు చెందిన రైల్‌టెల్ సంస్థ నెట్‌వర్క్ అందజేస్తోంది.

మరోవైపు అక్రమాల నిరోధానికి స్థిర చరాస్తుల క్రయవిక్రయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా వీడియో రికార్డింగ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందుకు ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రెండు సీసీ కెమెరాలను రిజిస్ట్రేషన్ల శాఖ సమకూర్చింది. ఆధార్ లింకేజీ తర్వాత ఇప్పుడు కొత్తగా క్రయ విక్రయదారులతోపాటు సాక్షులు సంతకాలు చేసే అంశం వరకు అంతా వీడియో రికార్డు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఈ ప్రక్రియను కొనుగోలు దారుకు సీడి రూపంలో ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పుడీ సేవలను 473 కార్యాలయాలకు కొత్తగా విస్తరించాల్సి ఉంటుంది. ఐటీ శాఖ అందించే స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్ (స్వాన్)తోనే సరిపెట్టుకునేలా కూడా కార్యాచరణ చేస్తున్నారు.

ఏపీ బీఈడీ, డీఈడీ ప్రైవేట్ కాలేజీల

ఫలితాలు ప్రకటించవద్దు: హైకోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏపీ రాష్ట్రంలోని ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు రాసిన పరీక్షలకు సంబంధించిన ఫలతాలను ప్రకటించొద్దని ఏపీ ఉన్నత విద్యాశాఖను హైకోర్టు ఆదేశించింది. ఆ కళాశాలల్లో అక్రమ పద్దతుల ద్వారా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం పట్ల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కన్వీనర్ కోటా కింద మిగిలిపోయిన సీట్లన్నింటినీ యాజమాన్య కోటా కింద సీట్ల భర్తీ చేసుకోడానికి ప్రభుత్వం అనుమతినివ్వడం వెనుక ఏదో జరిగిందని సందేహాన్ని వ్యక్తం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంనాథన్ జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

'జడ్జీల ఖాళీలు భర్తీ చేయాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి హైకోర్టుకు వెంటనే రెగ్యులర్ ప్రధాన న్యాయమూర్తి ని నియమించాలని, న్యాయమూర్తుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాలని న్యాయవాదులు తీర్మానించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘాల ప్రత్యేక సర్వసభ్య సమావేశం హైకోర్టు న్యాయవాదుల సంఘం సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జరిగింది. ఆందోళనలో భాగంగా హైకోర్టులో మార్చి1, 2 తేదీల్లో విధులను బహిష్కరించి, ఏపీ బార్ కౌన్సిల్ నుంచి మదీనసర్కిల్ వరకు ఊరేగింపు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘాల అధ్యక్షులు జల్లి.కనకయ్య, చల్లా.ధనంజయ ఒక ప్రకటనలో తెలిపారు. 2012కు ముందు కేసులను పరిష్కరించాలంటూ వివిధ హైకోర్టులు, సబార్డినేట్ కోర్టులకు జారీ చేసిన సర్క్యులర్ ను విరమించుకోవాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అలాగే సీఆర్ పీసీ లోని సెక్షన్ 41-ఏ ను విరమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను కనుక్కోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయవాద సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

భోజగుట్టలో నిర్మాణాలు చేపట్టవద్దు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆసిఫ్ నగర్ మండలం గుడిమల్కాపూర్ ప్రాంతంలోని భోజగుట్ట భూముల్లో జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకోకుండా ప్రహరీగోడ తో పాటు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు ముస్తఫా సొసైటీని ఆదేశించింది. ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా చూడాలని జీహెచ్ఎంసీ అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. భోజగుట్టలోని ఆరు ఎకరాల భూమిని తప్పుడు పత్రాల ఆధారంగా ముస్తఫా హిల్స్ సొసైటీకి కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను రద్దు చేయాలని, అలాగే హైదరాబాద్ జిల్లా కలెక్టర్ సిఫారసులను అమలు చేయాలని అభ్యర్థిస్తూ సీపీఎం నాయకుడు ఎం.శ్రీనివాస్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

తిరుపతిలో జియో ఫోన్ల తయారీ

అమరావతి, ఆంధ్రప్రభ: రిలయన్స్ కంపెనీ త్వరలోనే తిరుపతిలో జియో మొబైల్ తయారీ కంపెనీని ప్రారంభించబోతుందని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళవారం బెంగుళూరులో జరిగిన ఇండియన్ ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీ కండెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న విజన్ సమిట్-2018లో పాల్గొన్నారు. ఈసందర్భంగా టెక్నోవేషన్ అవార్డులను విజేతలకు అందజేశారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత చిన్న రాష్ట్రంగా నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటు అయిందని, ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం తక్కువగా ఉందన్నారు. కేవలం మూడున్నరేళ్లలోనే సమస్యలను అధిగమించి అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన మూడు రాష్ట్రాలలో ఒకటిగా, 2029 నాటికి దేశంలో మొదటిగా, 2050 నాటికి ప్రపంచంతోనూ పోటీపడాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. లక్ష్యాలు సాధించాలంటే 15శాతం వృద్ధి సాధించాలని, ప్రస్తుతం 12శాతం వృద్ధి మాత్రమే సాదించామన్నారు. రియల్ టైం గవర్నెన్స్ అమలు చేస్తున్నామని, సెన్సార్లు, డ్రోన్లు, ఈక్యాబినెట్, ఈ ఆఫీస్, ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు.

వారంలో పోలవరంపై నివేదిక

● ఖర్చు తగ్గించే అవకాశాలపై అధ్యయనం ● ప్రాజెక్టును సందర్శించిన శాసనసభ అంచనాల కమిటీ

ఏలూరు, ప్రభన్యూస్ బ్యూరో: పోలవరం జాతీయ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేది కను వారం రోజుల్లో రాష్ట్రశాసనసభకు తాము అంది స్తామని ఏపీ శాసనసభా కమిటీ అంచనాల కమిటీ ఛైర్మన్ మోదుగుల వేణుగోపాలరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పోలవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాజా పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టుపై జనంలో పలు సందేహాలు నెలకున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. జరుగుతున్న పోలవరం పనుల్లో నాణ్యతా ప్రమాణాలతో పాటు, జరిగిన పనులకు ఏ మేరకు ఖర్చులు జరిగాయన్న దానిపైనా తమ కమిటీ దృష్టిని సారించిందన్నారు. అలాగే జరగాల్సిన పనులపై ఇంకా ఏ మేరకు నిధులు అవసరమౌతాయన్న దానిపైనా తాము ఓ సమగ్ర అంచనాలతో నివేదికను తయారు చేస్తామన్నారు. జరిగిన పనుల్లో ఏమైనా అవకతవకలు సాగాయా..? అన్న కోణంలోనూ తాము నిశితంగా పనుల్ని పరిశీలిస్తామన్నారు. ముఖ్యంగా జరగాల్సి ఉన్న పనుల్లో దుబారా వ్యయం ఏమైనా చోటు చేసుకుం దా..? అన్న కోణంలోనూ తాము సమగ్రంగా దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. సాధ్యమైనంతలో జరగాల్సి ఉన్న పనుల్లో ప్రత్యామ్నాయ తగ్గింపు అవకాశాలు ఏ మేరకు ఉన్నాయన్న దానిపైన తాము నిపుణులతో ప్రత్యేకంగా చర్చిస్తామన్నారు. ప్రజా ధనాన్ని వృధా కానివ్వబోమన్నారు. తమ కమిటీ కేవలం రాజకీయాలకు అతీతంగానే ఏర్పడిందన్నా రు. ఏ విధంగానూ తమపై ఏ పార్టీ ఒత్తిడి లేదన్నారు. రాజకీయాలకు ఏ కోశానా తమ కమిటీ అవకాశం ఇవ్వబోదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కాఫర్ డ్యాం డయా ఫ్రం వాల్ పనులను కమిటీ సభ్యులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ఒకవేళ ప్రాజెక్టు పనులు సకాలంలో స క్రమంగా ముందుకు సాగని పక్షంలో చూస్తే ప్రాజెక్టు వ్యయం ఏ విధంగా పై పైకి పెరుగుతుందన్న దానిపైనా కమిటీ దృష్టిని సారించిందని వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఇంతకీ పనులు ఏ స్థాయిలో ఎలా జరుగుతున్నాయన్న దానిపైనా కూలంకుషంగా చర్చిస్తామన్నారు. ప్రస్తుత పరిస్తితుల్లో పోలవరం పనులు ప్రశ్నార్థకంగా మారాయనే ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు. ట్రాన్స్ ట్రాయ్ కంపెనీ పనుల్నుండి వైదొలిగాక ప్రాజెక్టు పనులు వేగం ఎంతన్న దానిపైనా ఓ అంచనాకు రాగలమన్నారు. ఏపీ జీవనాడిగా ఉన్న పోలవరం పనులపై ప్రజానీకం ఎంతో ఆసక్తితో ఉన్నారన్నారు. రానున్న బడ్జెట్ సమావేశాలకు తమ పోలవరం నివేదికపై అంచనాలతో ప్రత్యేక నివేదికను అందిస్తామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఈ అంచనాల కమిటీ పోలవరంలో పర్యటిస్తుందంటూ సమాచార శాఖ పాత్రికేయులకు సమాచారం అందించింది. కానీ ఉదయం10.30 గంటల ప్రాంతంలోనే కమిటీ సభ్యులు పోలవరంకు చేరుకోవడంతో ఈ ప్రాంత వాసులు అవాక్కయ్యారు. బిజెపికి చెందిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రాజెక్టుపై ఆసక్తికరమైన వ్యాఖ్యానాలే చేశారు.

పోలవరంపై ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ఎంతో ఆసక్తితో ఉందన్నారు. 2005లో పోలవరం పనుల్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించాయన్నారు. అప్పట్లో దీనిపై ఏ అంచనాలతో పనులు ప్రారంభమయ్యాయన్నది ఆసక్తికరంగా మారాయ న్నారు. జాతీయ ప్రాజెక్టుగా మారాక దీనిపై ఏ స్థాయిలో నిధుల్ని ఖర్చు చేసారన్న దానిపైనా తాము సమగ్రంగా పరిశీలిస్తు న్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక గడిచిన రెండేళ్లలో సాగిన పనులకు సంబంధించి దాదాపు రూ. 5 వేల కొట్లు ఇచ్చామన్నారు. ఈ రెండేళ్లల్లో సాగిన పనులపై తాము నిశితమైన విచారణ చేస్తామన్నారు. జరిగిన ప్రతి పైసా ఖర్చును అసెంబ్లీకే కాక ఆ సభ ద్వారా జనానికి సైతం తెలియ జేసేందుకే తామిక్కడకు వచ్చామన్నారు. తాము కేవలం పోలవరంపై విచారణ జరిగిన పనులపై అంచనాలు వేసేందుకు, మిగతా పనులపై ఏ విధంగా ముందుకు వెళితే అంతా బాగుంటుందన్న దానిపై తమ కమిటీ అధ్యయనం చేస్తుందన్నారు.

అసెంబ్లీ స్పీకర్, రాష్ట్రప్రధాన కార్యదర్శి పర్యవేక్షణలోనే తాము సమగ్ర పరిశీలన, దర్యాప్తు చేస్తామన్నారు. పోలవరంపై జనంలో నెలకున్న ప్రతిష్టంభన తొలగించేందుకు తామిక్కడకు వచ్చామని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు చెప్పారు. పోలవరంపై తానేమీ రాజకీయం గా మాట్లాడబోనంటూనే. జరిగిన పోలవరం పనుల్లో కేంద్రం ఎంతగానో చేసిందనే ధోరణిలో ఆయన మాట్లాడటం విశేషం. ముందుగా ప్రాజెక్టు ప్రాంతంలోని కార్యాలయంలో పోలవరం పనులుకు సంబందించిన వ్యాపుల ద్వారా అధికారుల నుండి వివరాలును కమిటీ అడిగి తెలుసుకుంది. ఆ తర్వాత ప్రాజెక్టు ప్రాంతంలోని హెలీప్యాడ్ హిల్‌వ్యూ ప్రాంతం నుండి కమిటీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మరో సభ్యులు చిక్కాల రామచం ద్రరావులు దూరం నుండే పనుల్ని చూశారు. అనంతరం గోదావరి నదీతీరాన లోయర్ కాఫర్ డ్యాం పనులను కమిటీ పరిశీలించింది. సంబంధిత వివరాలను కమిటీ సభ్యులకు ఇంజనీరింగ్ చీఫ్ ఎం వెంకటేశ్వరావు, రమేష్‌బాబులు వివరించారు.

అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో సంబంధిత ఇంజనీర్లతో, అధికారులతో బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. వారం రోజుల్లోగా ప్రాజెక్టు పనులపై నివేదికను సిద్ధం చేయడంలో తాము సాంకేతిక పరమైన అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటా మన్నారు. త్వరలో జరిగే విజయవాడ సమావేశంలో తమ కమిటీ రూపొందించే నివేదికను.. ఉన్నతాధికారుల సమావేశంలోప్రవేశపెడతామన్నా రు. బడ్జెట్‌కు ముందు కానీ, తర్వాత కానీ, ప్రాజెక్టు విషయంపై చర్చలు కొనసాగే అవకాశం ఉందని కమిటీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి అభిప్రాయపడ్డారు. ఏదేమైనప్పటికీ మిత్రపక్షాల మధ్య తలెత్తిన రాజకీయ గందరగోళ పరిస్థితులు నేపథ్యంలో పోలవరంలో పర్యటించిన ఈ రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీపై ఆసక్తి నెలకుంది.



స్విస్ చాలెంజ్‌ని ఎలా సవాల్ చేస్తారు?


హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి అభివృద్ధి నిమిత్తం ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న స్విస్ ఛాలెంజ్ విధాన నిర్ణయంలో రెండేళ్ల క్రితం ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వాహించిన మీరు కూడా భాగస్వామి అయినపుడు కోర్టులో ఎలా సవాలు చేస్తారో చెప్పాలని హైకోర్టు పిటిషనర్ ఐవైఆర్ కృష్ణారావును ప్రశ్నించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వారం రోజులకు వాయిదా వేసింది.ఏపీ రాజధాని అమరావతి నగర అభివృద్ధిని స్విస్ ఛాలెంజింగ్ విధానంలో అభివృద్ధి చేసేందుకు అనుమతినిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని అభ్యర్థిస్తూ ఉమ్మడి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది.

స్విస్ ఛాలెంజ్ పద్ధతిని సవరిస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన 179, 581 జీవోను రద్దు చేయాలని అభ్యర్థిస్తూ ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్.కృష్ణారావు ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఈ సందర్భంగా పిటిషనర్ ఐవైఆర్.కృష్ణారావు (పార్టీ ఇన్ పర్సన్) వాదనలు వినిపిస్తూ ఆంధ్రప్రదేశ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ ఎనేబులింగ్(ఏపీఐడీఈ) నిబంధనలకు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు స్విస్ ఛాలెంజ్ విధానం విరుద్ధమన్నారు. బహిరంగ పోటీలో తాజాగా టెండర్లను ఆహ్వానించే ప్రక్రియను ప్రారంభంచేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అసెండస్ సింగ్ బ్రిడ్జ్-సెంబ్ కార్బ్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ సంస్థల సింగపూర్ కన్సార్టియం సమర్పించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించడాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరారు.

బావమరిదిపై గొడ్డలితో దాడి

కౌటాల, ప్రభన్యూస్ : ఆసిఫాబాద్ కుమ్రంభీం జిల్లా, కౌటాల మండల కేంద్రంలో భూతగాదాలో బావమరిదిపై బావ గోడ్డలితో దాడి చేయడంతో బావమరిదికి తలకు తీవ్ర గాయమైంది. ఏఎస్సై హనుమాండ్లు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని విజయనగరం గ్రామానికి చెందిన రాయప్ప నాలుగు ఎకరాల భూమి అతని బావ అయిన కౌటాలకు చెందిన చిన్నబత్తిని బాలస్వామి అనుభవిస్తున్నాడు. ఈ విషయంపై మంగళవారం ఉదయం రాయప్ప తన బావ బాలస్వామి ఇంటికి వెళ్లి భూమి విషయం మాట్లాడుతున్న క్రమంలో మాటా మాటా పెరిగి కొట్టుకున్నారు. కోపంలో బాలస్వామి రాయప్పపై గొడ్డలితో దాడిచేసి గాయపర్చాడు. గొడ్డలితో బలంగా తలపై కొట్టడంతో తలకు తీవ్ర గాయాలుకాగా ఎడమ కన్నుకు కూడా గాయమైంది. విషయం తెలుసుకున్న ఏఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి రాయప్పను స్థానిక ప్రభుత్వ దవాఖానాకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. గాయం పద్దగా కావడంతో రక్తస్త్రావం ఆగకపోవడంతో రాయప్పను 108 వాహనంలో సిర్పూర్(టి) దరఖానాకు తరలించారు.

రాజ్యసభ రేసులో వర్ల రామయ్య!



అమరావతి, ఆంధ్రప్రభ: రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఆశావహులలో ఆశలు చిగురిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు రాజ్యసభకు వెళ్లేందుకు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ను కూడా కలిసి ఈసారి తమకు అవకాశం కల్పించాలని పలువురు నేతలు అభ్యర్థించారు. ఎవరికి వారే తమకు ఉన్న ప్లస్ పాయింట్లు చెబుతూనే పార్టీకి తాము అందించిన సేవలను వివరిస్తూ అధినేతను ప్రసన్నం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభలో ఖాళీ అయ్యే మూడు స్థానాలకు వచ్చే నెల 23న ఎన్నికలు జరగనున్నాయి. ఖాళీ అయ్యే మూడు స్థానాల్లో రెండు తెలుగుదేశం పార్టీ, ఒకటి వైకాపా దక్కుతాయి. రాష్ట్రంలోని 175 మంది శాసనసభ్యులు సంఖ్య ఆధారంగా ఒక్కో రాజ్యసభస్థానానికి ఎంత మంది ఎమ్మెల్యేలు ఓట్లు వేయాలో ఎన్నికల కమిషన్ నిర్ధారిస్తుంది. దాని ప్రకారం ఒక్కో రాజ్యసభ స్థానానికి 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ఆ లెక్కన తెలుగుదేశం పార్టీకి 103 ఎమ్మెల్యేల బలం ఉంది కాబట్టి రెండు స్థానాలు దక్కుతాయి. ఖాళీ అవుతున్న ఎంపీ సీట్లలో సీఎం రమేష్ కూడా ఉన్నారు. దీంతో సీఎం రమేష్‌కు తిరిగి టిక్కెట్ ఇస్తారా లేక ఈసారి ఆయన స్థానంలో మరొకరి కేటాయిస్తారా అనేదానిపై పార్టీలో చర్చజోరుగా సాగుతోంది. వచ్చే శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రెండు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతోంది. సామాజిక సమీకరణలకు అనుగుణంగా రెండు సీట్లు వేర్వేరు సామాజిక వర్గాలకు కేటాయిస్తారనే ప్రచారం సాగుతోంది. ఒక సీటు బీసీగానీ, ఓసీ గానీ కేటాయిస్తే, మరో సీటు ఎస్సీలకు కేటాయించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఎస్సీ కోటా కింద ఎంపీ సీటు కేటాయిస్తే ఆ సీటు దక్కించుకునేందుకు పలువురు సీనియర్ నేతలు తమ అదృష్టాన్ని పరిక్షించుకుంటున్నారు. అందులో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ వర్ల రామయ్య ముందు వరుసలో ఉన్నారు.

రసాయన ప్రమాదాల నివారణకు కమిటీలు

ఆంధ్రప్రభ, హైదరాబాద్: పరిశ్రమల రసాయన ప్రమాదాలు, ఇతర సంక్షోభాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, స్థానిక స్థాయిల్లో సంక్షోభ గ్రూపులను ఏర్పాటు చేసింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర స్థాయి సంక్షోభ గ్రూపుతోపాటు 31 జిల్లాల్లో జిల్లా గ్రూపులను, ఇతర స్థానిక గ్రూపులను ప్రకటించింది. జిల్లా క్రైసిస్ గ్రూపులో జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. మరో 14 మందిని సభ్యులుగా నియమిస్తారని ప్రభుత్వం వెల్లడించింది. స్థానిక సంక్షోభ గ్రూపులో సబ్ డివిజినల్ మెజిస్ట్రేట్ ఛైర్మన్‌గా మరో 14మంది ఇతరులు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అభయ హస్తమా..? కమల వికాసమా..?



● ఎన్నికల ప్రకటనకు ముందే కర్ణాటకలో ప్రచార హోరు
● రంగంలోకి మోడీ, రాహుల్ ● సిద్ధరామయ్యది సీదారూపీ సర్కారని సెటైర్లు ● పీఎన్‌బీ స్కాంపై మోడీ మౌనంపై కాంగ్రెస్ విమర్శలు

బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందే కర్నాటకలో రాజకీయ పార్టీల ప్రచార జోరు ఊపందుకుంది. కర్నాటకలో గెలుపే లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఢిల్లీ నేతలు గల్లీగల్లీలు చక్కర్లు కొడుతూ జనానికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాని మోడీ దగ్గర నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వరకు కీలక నాయకులంతా కర్నాటకలోనే మకాం వేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ పోటాపోటీ ర్యాలీలు,రోడ్ షోలతో హోరెత్తిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మరోసారి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ.. ఎలాగైనా గెలవాలని బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇప్పటికే రెండు సార్లు కర్నాటకను చుట్టేశారు. మారుమూల ప్రాంతాల్లో సైతం బస్సు యాత్ర నిర్వహించి జనానికి మరింత చేరవయ్యే ప్రయత్నంచేశారు. కాంగ్రెస్ నేతల్లో జోష్ నింపడంతో పాటు ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచేలా ప్రసంగాలిస్తున్నారు. గతానికి భిన్నంగా రాహుల్ గుడులు, గోపురాలను కూడా చుట్టేస్తున్నారు. ప్రాంతీయంగా ఉన్న సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునేందుకు అందివచ్చిన అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా లింగాయత్ వర్గాన్ని తనవైపు తిప్పుకునేందుకు రాహుల్ గాంధీ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నిజాం కాలం నాటి హైదరాబాద్ సంస్థానంలోని కర్నాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని..మరోసారి హస్తం పార్టీనే అక్కున చేర్చుకోవాలని ప్రచారం సాగిస్తున్నారు. ఇక ప్రధాని మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సైతం కర్నాటక ప్రజలకు చేరవయ్యేందుకు అవినీతి మంత్రాన్ని జపిస్తున్నారు.సిద్ధరామయ్య సర్కారు అవినీతిమయంగా మారిందని..పైసలివ్వందే ఏ పని కాదని విమర్శ గుప్పిస్తూ బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలుచేస్తున్నారు.

సిద్ధరామయ్యది మనీ ఫస్ట్ సర్కార్

కర్నాటక బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల ర్యాలీలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సిద్ధరామయ్య ప్రభుత్వం సీదా రుపీ సర్కార్(ఫస్ట్ మనీ) గా మారిందని ఆరోపించారు. డబ్బులివ్వందే సిద్ధరామయ్య ప్రభుత్వంలో ఏ పనీ జరగదని మండిపడ్డారు. రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని ఆరోపించిన మోడీ..బీజేపీ అధికారంలోకి వస్తే ఒక్కనిమిషం కూడా అలాంటి కార్యక్రమాలు తావునివ్వబోమని స్పష్టం చేశారు. కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప 75వ పుట్టినరోజు సందర్భంగా లింగాయత్‌లు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మోడీ..అవినీతిపాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందనిప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రధానిపై కాంగ్రెస్ మౌన మోడీ సెటైర్లు

కర్నాటకలోని అధికార కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ విమర్శనాస్త్రాలు సంధిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా మాట్లాడుతూ నీరవ్ మోడీ..లాంటి బ్యాంక్ స్కామ్ ల గురించి మాట్లాడేందుకు ప్రధాని ఎందుకు నిరాకరిస్తున్నారనిమండిపడ్డారు. ప్రధానిని మౌన మోడీగా అభివర్ణిస్తూ సెటైర్లు వేశారు. 2012 హిమాచల్ ఎన్నికల ప్రచారంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ..నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ను మౌన మోహన్ సింగ్‌గా అభివర్ణించారు.

మరి ఇప్పుడు మోడీ చేస్తున్నదేంటీ.. బ్యాంక్ లూటీలపై మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారు అని సూర్జేవాలా మండిపడ్డారు.

మరో జడ్జిని బలిగొన్నారు:రాహుల్

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మోడీ సర్కారుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోహ్రబుద్దీన్ షేక్ కేసులో మరో జడ్జినిబలిగొన్నారని రాహుల్ ఆరోపించారు. ఈ కేసుపై విచారణ జరిపినజస్టిస్ లోయ మృతి చెందగా.. పలు పిటిషన్లు స్వీకరించిన బాంబే హైకోర్టులోనూ జడ్జిలను బలిగొంటున్నారని మండిపడ్డారు. సిబీఐని సవాల్ చేసిన జస్టిస్ రేవతి దెబేను తొలగించారు. ఈ కేసులో కోర్టుకు బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా హాజరుకావాలని ఆదేశించిన జస్టిస్ ఉత్పత్‌ను పక్కకు తప్పించారు. అని ట్వీట్ చేశారు.

ఎదురు కాల్పుల్లో ఉగ్రవాది హతం

శ్రీనగర్: భారత రక్షణ దళాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో లష్కరే తొయిబాకు చెందిన ఉగ్రవాది ఒకరు మరణించాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. నార్త్ కాశ్మీర్లోని బందిపొర జిల్లాలో బాన్ మొల్లాహ గ్రామంవద్ద ఉగ్రవాదులకు, రక్షణ దళాలకు మధ్య ఆదివారం ఎదురు కాలుపులు జరిగాయన్నారు. కాలుపుల విరమణ అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా ఎటువంటి ఆచూకీ లభించలేదన్నారు. కాగా అనంతరం మిలిటెంట్ ఒకరు ఎదురుకాల్పుల్లో తీవ్రగాయాలపాలై మరణించినట్టు గ్రామస్థుల నుంచి సమాచారం లభించిందన్నారు. ఈ ఘటనలో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తొయిబాకు చెందిన ఉగ్రవాది ఒకరు భారత రక్షణ దళాలు జరిపిన ఎదురు కాలుపుల్లో తీవ్రంగా గాయాలపాలై మరణించాడని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. చనిపోయిన ఉగ్రవాది మృతదేహం గ్రామంలోనే ఉండటంతో గ్రామస్థులు పోలీసులకు స్వాధీనం చేశారన్నారు. అనంతర మృతుడి ఆచూకీ కోసం విచారించగా స్థానికుడు కాదని తేలిందన్నారు. దీంతో తగిన న్యాయపరమైన చర్యలు తీసుకుని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ప్రజలును రెచ్చగొట్టేలా వ్యాఖ్యానించిన కొంతమందిపై చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించామన్నారు.

పాక్ దాడిలో ఇద్దరు జవాన్లకు గాయాలు

జమ్ము: పాకిస్థాన్ సైన్యం జరిపిన దాడిలో ఇద్దరు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన జవాన్లు గాయపడ్డారు. జమ్మూ కాశ్మీర్లోని పూంచ్, రాజౌరి జిల్లాల్లో నియంత్రణ రేఖ వెంబడి ఉన్న జనావాసాలపై, సైనిక శిబిరాలపై పాక్ దళాలు దాడి చేయగా ఈ ఘటనలో ఇద్దరి జవాన్లకు గాయాలయ్యాయని రక్షణశాఖ అధికారులు తెలిపారు. బీజీ సెక్టార్లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ విచక్షణ రహితంగా మోర్టార్ బాంబులతో, చిన్నపాటి ఆయుధాలతో విరుచుకుపడిందని రక్షణశాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. భారత సైన్యం కూడా పాక్‌పై ఎదురుదాడికి దిగి సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు.ఈ సందర్భంగా రాజౌరి జిల్లా కలెక్టర్ షాహిద్ ఇక్బాల్ చౌదరి మాట్లాడుతూ పాక్ దళాలు మన్జాకోట్ సెక్టార్లోని నియంత్రణ రేఖ వెంబడి ఉన్న టర్కుండీ గాలి, లాంబీ బారీ, కోరినార్, డార్, పంజ్‌గ్రెయన్ ప్రాంతాలపై మంగళవారం ఉదయం నుంచే దాడికి దిగాయన్నారు. ఈ దాడిలో ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లకు గాయాలయ్యాయన్నారు. కాగా ఈ విషయంపై పాకిస్థాన్ అధికారులు స్పందిస్తూ తమ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించి ఎటువంటి దాడులకు పాల్పడలేదన్నారు.

నేడు బీజేపీ సీఎంలతో ప్రధాని మోడీ సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తంపై చర్చ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధా నమంత్రి నరేంద్రమోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా బుధవారం సమావేశం కానున్నారు. తమ పరిపాలనలో ఉన్న రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరపనున్నారు. ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే ఉండడంతో ప్రధానంగా పేదలు, బలహీనవర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాల అమలు తీరుపై దృష్టి సారించనున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయా ? లేదా, ఆశించిన లక్ష్యాలు నెరవేరుతున్నాయా అనే అశాలపై లోతుగా చర్చించనున్నారు. గతంలోనూ ఈ అంశాలపై రోజంతా సీఎంలతో ప్రధాని సమావేశమై చర్చించారు. బుధవారం పార్టీ నూతన ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులతో సాధారణంగా జరిగే సమావేశమేనని పార్టీ వర్గాలు చెపుతున్నాయి. ఈ సమావేశంలో ప్రధానంగా సమాజంలో వెనుకబడిన వర్గాలైన దళితులు, గిరిజనులు, బీసీలు, మహిళలకు అందిస్తున్న పథకాల అమలుపై సమీక్షించనున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలు తీరు ఆయా రాష్ట్రాలలో ఎలా ఉందనేదానిపైనా లోతుగా విశ్లేషణ చేయనున్నారు. తమది పేదల ప్రభుత్వంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ పదేపదే అనేక సభల్లో చెపుతున్న నేపథ్యంలో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పథకాలను ప్రధానంగా అడిగి తెలుసుకోనున్నారు. దేశంలో పెద్దసంఖ్యలో ఉన్న దళితులు, ఓబిసిలపై బీజేపీ ప్రధానంగా కన్నేసింది.

దళిత కుటుంబంపై దాడి

బాలుడి మృతి.. తల్లి, సోదరిపై అత్యాచారం

విల్లుపురం: విల్లుపురానికి దగ్గరలోని ఓ గ్రామంలో నివసిస్తున్న దళిత కుటుంబంపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆ కుటుంబంలోని 12 ఏళ్ల బాలుడు మరణించాడు. బాలుడి సోదరి(15), తల్లికి తీవ్ర గాయాలయినట్టు పోలీసులు తెలిపారు. ఈ దాడి జరగడానికి ముందు ఫిబ్రవరి 22న తల్లి, సోదరిపై అత్యాచారం జరిగినట్టు వెలుగులోకి వచ్చింది. వారిద్దరినీ వైద్య పరీక్ష కోసం పంపినట్టు వెల్లడించారు. అయితే, సోదరి, తల్లిలను పాండిచ్చేరికి దగ్గరలోని జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జెపిఎంఈఆర్)లో చేరారని, ఈ దాడి వెనుక ఎవరున్నారని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.అయితే, తల్లి, సోదరిపై అత్యాచారం చేసిన దుండగులకు కఠిన శిక్ష విధించాలని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. సోదరికి, తల్లికి తలకి తీవ్ర గాయాలయ్యాయని సీనియర్ జిల్లా పోలీసు అధికారి తెలిపారు. ఈ దాడి వెనుక భూమి వివాదాలే కారణమని, దీనిపై రాజకీయ పార్టీల ప్రమేయాలు కూడా ఉండొచ్చని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, ఇందులో కొందరిపై హత్య కేసు నమోదయిందని, ఈ కేసులో ఇంకా తెలియాల్సిన విషయాలు ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

ఇప్పటికే దుండగులకు కఠిన శిక్ష విధించవలసిందిగా పీఎంకే నేత, ధర్మపురి ఎంపీ అన్బుమని రామ్‌దాస్ డిమాండ్ చేశారు. దళిత కుటుంబంపై అది అతి దారుణమైన దాడి అని ఆయన పేర్కొన్నారు.

అయితే, తల్లి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇటువంటి దాడులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను ఎస్‌డీపీఐ తమిళనాడు అధ్యక్షుడు తెహలాన్ బక్వీ కోరారు. ఈ దాడిని ఖండిస్తూ, దుండగులను వెంటనే అరెస్టు చేసి, వారి కుటుంబానికి రూ.25 లక్షలు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఆరేళ్ల చిన్నారిపై తండ్రి అత్యాచారం... అరెస్టు

పగ్వారా(పంజాబ్): బాధ్యతగా పిల్లలను పెంచాల్సిన తండ్రే, ఆ పిల్లల పట్ల అమానుషంగా, అతి మానవీయంగా ప్రవర్తించిన తీరు పంజాబ్‌లో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పంజాబ్‌లోని పార్మార్‌నగర్‌లో ఆరేళ్ల చిన్నారిపై 35 ఏళ్ల వయసున్న తండ్రి నిద్రలో ఉన్న కూతురిపై అత్యాచారం చేసినట్టు పోలీసులు వెల్లడించారు. బాలిక తల్లి ఈ ఘటనను పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతడిని అదుపులోకి తీసుకున్నట్టు సబ్ ఇన్‌స్పెక్టర్ మన్‌ప్రీత్ కౌర్ తెలిపారు. నిందితుడిపై పీవోసీఎస్‌వో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కూతురు అరుపులతో తాను గమనించగా తండ్రి వ్యవహారం బయటపడిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తల్లి తెలిపింది. చిన్నారిని వైద్య పరీక్షలకు పంపినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉగ్రవాదంపై పాక్ చర్యలు గుర్తించండి

బీజింగ్: ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు పాకిస్తాన్ తీసుకుంటున్న నిర్మాణాత్మకమైన చర్యలను భారత్‌తో సహా ప్రపంచ దేశాలు గుర్తించాలని చైనా విజ్ఞప్తి చేసింది.కొద్ది రోజుల క్రితం పారిస్‌లో జరిగిన ఫైనాన్షియల్ యాక్షన్ ఫోర్స్ సమావేశంలో పాక్‌ని ఉగ్రవాద సంస్థలకు సాయంఅందించే దేశాల జాబితాలో చేర్చే తీర్మానంపై ఓటింగ్‌లో చైనా పాల్గొనలేదు..అయితే, ఈ జాబితాలో పాక్ ని చేర్చినట్టు అధికారికంగా ప్రకటించకపోయినా, ఉగ్రవాదం నిర్మూలన కోసం తీసుకున్న చర్యల గురించి ఈసంస్థకు పాక్ నివేదికసమర్పించాల్సి ఉంది.అంతకుముందు చైనా పాక్‌ని ఈ జాబితాలో చేర్చే తీర్మానాన్ని వ్యతిరేకించింది.ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక సాయం అందకుండా చేయడంలో పాకిస్తాన్ తగిన చర్యలు తీసుకుంటోందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లూ కాంగ్ తెలి పారు. పాక్ తీసుకుంటున్న చర్యలను అన్ని దేశాలూ గుర్తించాలని లూ కాంగ్ విజ్ఞప్తి చేశారు.

మాల్దీవుల్లో ఎమర్జెన్సీ కారణంగా నావికాదళ ఆహ్వానం తిరస్కరణ

న్యూఢిల్లీ: మాల్దీవుల్లో నెలకొన్న అత్యవసర స్థితి కారణంగా భారత్ నావికాదళం నిర్వహించనున్న మిలన్ కార్యక్రమంలో పాల్గొనలేక పోతున్నామని ఆ దేశ రాయబారి వెల్లడించారు. కానీ ఇరుదేశాల మధ్య పరస్పర సైనిక సహకారం, స్నేహం ఖచ్చితంగా కొనసాగుతుందన్నారు. మార్చి 6నుంచి ఎనిమిదిరోజులపాటు జరగనున్న మెగా నావికాదళ సాహస కార్యక్రమాలు మిలన్‌కు హాజరుకాలేకపోతున్నామన్నారు. మాల్దీవుల్లో ప్రస్తుతం సంక్షోభ పరిస్థితులు నెలకొన్నదృష్ట్యా నావికా మిలన్‌లో పాల్గొనలేకపోతున్నామని వెల్లడించారు.

అమెరికాతో చర్చలకు తాలిబన్లు సిద్ధం



కాబూల్ : అమెరికాతో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమేననీ,అయితే,ఈ చర్చల్లో ఆఫ్ఘన్ ప్రభుత్వానికి కూడా ప్రమేయం కల్పించాలనితాలిబన్లు కోరారు. ఈ మధ్య కాలంలో అమెరికన్ సేనలను ఎదుర్కోవడానికి తాలిబన్లు కాబూల్‌లోనూ,ఇతర నగరాల్లో దాడులు ముమ్మరం చేయడంతో అనేక మంది పౌరులు మరణించారు.అంతేకాక,పాఠశాలలు,ప్రభుత్వ భవనాలు దెబ్బతిన్నాయి. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను పురస్కరించుకుని తాలిబన్లు చర్చలకు అంగీకరించారు.అయితే, అమెరికన్ సైనికాధికారులు తమ సంసిద్ధతను అమెరికన్ ప్రభుత్వానికి తెలియజేయలేదనీ, దాంతో సైనికులు దాడులను ముమ్మరం చేశారనీ,వారినిఎదుర్కోవడానికి తాము కూడా ప్రతిదాడులను జరుపుతున్నామని తాలిబన్ ప్రతినిధి తెలిపారు.

హజ్ యాత్రికులకు విమాన చార్జీలో రాయితీ



న్యూఢిల్లీ: కేంద్రం హజ్ యాత్రికులకు శుభవార్త ప్రకటించింది. హజ్ యాత్రకు వెళుతున్నవారికి విమాన ఛార్జీల్లో రాయితీ ప్రకటించింది. హజ్ యాత్రపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఎత్తివేసిన నెలరోజుల తరువాత మంగళవారం కేంద్రం హజ్ యాత్రికులకు ఉపశమనం కలిగేలా రాయితీ ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంపై మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ మాట్లాడుతూ కేంద్రం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అత్యంత ప్రధానమైనదిగా ఆయన వర్ణించారు. ఈ రాయితీ ఎయిర్ ఇండియా, సౌదీ ఎయిర్‌లైన్స్‌లో ప్రయాణించేవారికి లభిస్తుందన్నారు. ఇండియాలోని 21ఎయిర్‌పోర్టుల నుంచి సౌదీలోని జెడ్డా, మదినాకు వెళ్లేవారికి ప్రభుత్వం విమాన చార్జీల్లో రాయితీ అందిస్తుందన్నారు. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విమాన ఛార్జీలతో పోలిస్తే మోడీ సర్కారు ఇచ్చిన రాయితీ కారణంగా హజ్ యాత్ర ఛార్జీలు చాలా తగ్గుముఖం పట్టాయన్నారు. 2013-14 యూపీఏ పాలనలో అహ్మదాబాద్ నుంచి విమాన చార్జీ 98,750ఉండగా తాజాగా 65,015కి తగ్గిందన్నారు. అదేవిధంగా 2013-14లో ముంబై నుంచి వెళ్లేవారికి 98,750 ఉండగా ప్రస్తుతం చార్జీ 57,757కి తగ్గిందన్నారు. కాగా 2012లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్రం ఈ ఏడాది జనవరి నుంచి హజ్ యాత్రికులకు ఇచ్చే సబ్సిడీ ఎత్తివేసిన సంగతి విదితమే.

ఈజిప్ట్‌లో 12 మంది ఉగ్రవాదుల కాల్చివేత

న్యూఢిల్లీ : ఈజిప్ట్‌లోని ఉత్తర, మధ్య సినాయ్‌లో సోమవారం సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లలో 12 మంది ఉగ్రవాదులు మరణించగా మరో 92 మంది ఉగ్రవాదులు పట్టుబడ్డారు. ఉగ్రవాదులు తిష్ట వేశారన్న సమాచారం అందిన వెంటనే ఆర్మీ చేసిన దాడులలో ఆదివారం నాడు 16 మంది ఉగ్రవాదులు మృత్యువాత పడగా 24 గంటలు గడవక ముందే సైన్యం సోమవారం నాడు మరో 12 మంది మిలిటెంట్లను కాల్చివేసింది. ఆదివారం నాటి దాడుల్లో 30 మంది అనుమానిత ఉగ్రవాదులను ఆర్మీ అరెస్టు చేసింది. ఈరెండు రోజుల్లో ఆర్మీ నిర్వహించిన ఆపరేషన్లలో 120 కి పైగా ఉగ్రవాద శిబిరాలను, వారు వినియోగించిన వాహనాలను సైనికులు ధ్వంసం చేశారు. ఈ దాడులను ఆపరేషన్ సినాయ్-2018 అని సైన్యం పేర్కొంది.

2011 లో తిరుగుబాటు జరిగినప్పటి నుంచి ఉత్తర సినాయ్ లో తరచుగా ఉగ్రదాడులు చోటుచేసుకుంటూనే వున్నాయి. 2013 లో ఇస్లామిస్ట్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ మోర్సీ పదవీచ్యుతుడైనప్పటి నుంచి ఉగ్రదాడులు మరింతగా పెచ్చరిల్లాయి. పోలీసు, మిలిటరీ సిబ్బంది లక్ష్యాలుగా సాగిన ఈ ఉగ్ర దాడులలో వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది నవంబరులో మిలిటెంట్లు ఒక మసీదుపై దాడి చేసి 300 మంది ప్రాణాలు బలిగొన్న అనంతరం అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా అల్-సిసి ఉత్తర సినాయ్ ప్రాంతంలోని ఉగ్రవాద శిబిరాల్ని ధ్వంసం చేయాల్సిందిగా ఆదేశించారు. అప్పటినుంచి సైన్యం ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమం తీవ్రస్థాయిలో చేపట్టింది.

ఇసుక, కంకర అక్రమ మైనింగ్‌కి 8 కోట్ల జరిమానా

ఈరోడ్ : తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో ఇసుక,కంకర అక్రమ మైనింగ్‌కి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు ఆర్‌డిఓ నర్మదాదేవి ఎనిమిది కోట్ల రూపాయిల జరిమానా విధించారు.

ఈ జిల్లాలోని చెల్లిమలై, కొంగంపాలెం,కరుమంది చెల్లయపాలెం గ్రామాల్లో 2008నుంచి 2012 వరకూ సేనా పతి,టీసీ సుబ్రహ్మణ్యం అనే ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఇసుక,కంకర మైనింగ్ చేసి కోట్లాది రూపాయిలు లాభాలు గడించినట్టు ఆరోపణలు వచ్చాయి.మూడు గ్రామాలో ప్రభుత్వ భూములలో మైనింగ్ చేసి నట్టు ఆరోపణలు వచ్చాయి.దీనిపై ఆర్‌డిఓ విచారణ జరిపి తీర్పు ఇచ్చారు.

కల్తీ బియ్యం, కందిపప్పు స్వాధీనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఎస్‌వోటీ పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. ఆ ప్రాంతంలోని కల్తీ బియ్యం, కందిపప్పు స్థావరంపై పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా చేపట్టిన తనిఖీల్లో పోలీసులు రెండు వేల క్వింటాళ్ల బియ్యం, 1200 క్వింటాళ్ల కందిపప్పును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

సౌదీ ఆర్మీలో భారీ మార్పులు



రియాద్: సౌదీ అరేబియా సైన్యంలోకి కొత్త రక్తానికి ప్రవేశం కల్పించేందుకు ఆర్మీ చీఫ్‌తో పాటు పలువురు కమాండర్లను మార్చారు. యెమన్‌లో సౌదీ సైన్యం జోక్యం చేసుకుని మూడేళ్ళు పూర్తి కానున్న తరుణంలో సౌదీ సైన్యంలో భారీ మార్పులు చేశారు.సౌదీ రాజు సల్మాన్ తన వారసునిగా ప్రిన్స్ మహ్మద్‌ని గత జూన్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. సైనిక దళాల ప్రధానాధికారిగా అబ్దుల్ బిన్ సలేహ్ అల్ బన్యాన్ స్థానే ఫయ్యద్ అల్‌రౌహాలీని నియమించారు. ఎంతో కాలంగా మహిళలను దూరంగా ఉంచుతూ వచ్చిన సౌదీ అరేబియా సైన్యంలో మహిళలకు అవకాశం కల్పించాలని సంచలన నిర్ణయం తీసుకుంది.సైన్యంలో చేరేందుకు ఆసక్తి గల వారు మార్చి ఒకటవ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటన జారీ చేసింది.సౌదీ ఆర్మీలో చేరాలనుకున్న మహిళల వయసు 25నుంచి35 ఏళ్ళ మధ్య వయస్కులై ఉండాలి.

ఆప్ ఎమ్మెల్యేకు నో బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అన్షుప్రకాశ్‌పై దాడి కేసులో అరెస్టైన ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్‌కు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు తిరస్కరించింది. సీనియర్ ప్రభుత్వ ఉద్యోగి ఆత్మగౌరవానికి, హుందాతనానికి బహిరంగంగా జరిగిన అవమానానికి సంబంధించిన విషయమని ఈ సందర్భంగా ఢిల్లీ కోర్టు వ్యాఖ్యానించింది.అంతకుముందు డియోలి ఎమ్మెల్యే జర్వాల్ తన బెయిల్ పిటీషన్లో న్యాయమూర్తిని ఉద్దేశించి తాను యువకుడిని అని ఇటీవలే తనకు పెళ్లయిందని అందుచేత బెయిల్ మంజూరు చేయవలసిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రత్యేక న్యాయమూర్తి అంజు బాలాజీ చంద్ర మాట్లాడుతూ ఈ కేసు 56ఏళ్ల పెద్ద మనిషి గౌరవానికి సంబంధించిన విషయమన్నారు. అత్యంత ఉన్నత స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి అధికారాన్ని బహిరంగంగా ఉల్లంఘించారన్నారు. అందుచేత బెయిల్ పిటీషన్ తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. తొలుత మెజిస్ట్రీరియల్ కోర్టు ఫిబ్రవరి 23న సీఎస్‌పై దాడి ఆరోపణలపై అరెస్ట్ చేసిన ఆప్ ఇద్దరు ఎమ్మెల్యేలు జర్వాల్, అమానుతుల్లాఖాన్ బెయిల్ పిటీషన్ తిరస్కరిస్తూ ఈ కేసును సాధారణ కేసులా పరిగణించలేమన్నారు. ఎమ్మెల్యేలు చేసిన దాడి కేసు సాధారణ రౌడీషీటర్లు చేసిన దాడి తరహా కేసులా చూడలేమన్నారు. ఎమ్మెల్యే జర్వాల్ అంతకుముందు సెషన్స్ కోర్టులో తన వాదన వినిపిస్తూ తాము రౌడీషీటర్లం కాదని అన్నారు. కాగా ఎమ్మెల్యేలు ఖాన్, జర్వాల్ ఇద్దరిని ఫిబ్రవరి 22న కోర్టు ఇద్దరికి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఈ కేసు అత్యంత సున్నితమైనదని వ్యాఖ్యానించింది. ఢిల్లీ సీఎస్‌పై ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇంట్లో ఈ నెల 19న దాడిచేశారనే ఆరోపణలపై 20వతేదీని ఎమ్మెల్యే జర్వాల్‌ను, 21న ఓఖ్లా ఎమ్మెల్యే ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే.

నాగాలాండ్‌లో 75%..మేఘాలయలో 67%

● ఇరు రాష్ట్రాలలో 59 నియోజకవర్గాల్లోనే పోలింగ్
● నాగాలాండ్‌లోని ఉత్తర అంగారిం-2లో ఎన్‌డీపీపీ చీఫ్ నీఫీరియో ఏకగ్రీవం



న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగినా ఆ తరువాత పుంజుకొంది. సాయంత్రం 5 గంటలకు ముగిసిన ఈ పోలింగ్ లో నాగాలాండ్‌లో 75 శాతం, మేఘాలయలో 67 శాతం నమోదయినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నాగాలాండ్‌లో మధ్యాహ్నం 3 గంటల వరకు 67 శాతం పోలింగ్ నమోదు కాగా సాయంత్రం 5 గంటలకు 75 శాతానికి చేరుకున్నట్టు నాగాలాండ్ ముఖ్య ఎన్నికల అధికారి అభిజిత్ సిన్హా తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ఓటర్లు వెలుపల చాలా మంది బారులు తీరి వున్నా పోలింగ్ బూత్ లోప ఇదిలావుండగా నాగాలాండ్‌లోని అకులుతో ఎసి 31 నియోజకవర్గంలో ఇరుపార్టీలకు చెందిన రెండు గ్రూపుల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరు చనిపోగా మరో ఇరువురికి గాయలైనట్టు అభిజిత్ సిన్హా తెలిపారు. ఈ గ్రూపులను చెదరగొట్టేందుకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారని, పోలింగ్ మాత్రం ఆపలేదని చెప్పారు. మాన్ జిల్లాలోని తిజిత్ పోలింగ్ కేంద్రం వద్ద బాంబు పేలిన ఘటనలో ఒకరు గాయపడినట్టు సమాచారం అందింది. నాగాలాండ్‌లోని లాపా పోలింగ్ కేంద్రంపై కొందరు రాళ్ళ దాడి చేసి పోలింగ్ సామాగ్రిని ధ్వంసం చేయగా, అక్కడి ఎన్నికల సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టి పోలింగ్‌ను పునరుద్ధరించారు. నాగాలాండ్, మేఘాలయ శాసనసభలకు చెరో 60 నియోజకవర్గాలుండగా మంగళవారం నాడు 59 నియోజకవర్గాలలోనే పోలింగ్ నిర్వహించారు.



నాగాలాండ్‌లోని ఉత్తర అంగారిం-2 నియోజకవర్గంలో ఎన్‌డిపిపి చీఫ్ నీఫీరియో ఏకగ్రీవం కాగా మేఘా లయలో ఈనెల 18 న ఎన్‌సిపి అభ్యర్థి జొనాథన్ ఎన్ సంగ్మా హత్య కారణంగా విలియంనగర్ నియోజకవర్గంలో పోలింగ్ రద్దు చేసిన విషయం తెలిసిందే.

సమస్యల పరిష్కారానికే 'పల్లె నిద్ర'

శాసన సభ స్పీకర్ మధుసూధనచారి



టేకుమట్ల, ప్రభన్యూస్: నేను చెబితే అసెంబ్లీలో వింటారు. ప్రజలు చెబితే నేను వింటాను. అని వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రగతి పల్లె నిద్ర కార్యక్రమం మొదలు పెట్టానని రాష్ట్ర శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూదనచారి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం రోజున మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో దళిత కాలనీకి చెందిన బీంపెల్లి రాజేందర్ ఇంట్లో నిద్ర చేశానని అన్నారు. తెల్లవారు జామున 5 గంటలకు లేచి ఆ గ్రామంలో ప్రతి వాడను వేప పుల్ల వేసుకుని వుమెకమై తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకున్నానని, ఆ గ్రామానికి శివారు పల్లెలైన బోయినపల్లి, కలికోటపల్లి గ్రామంలో బైక్‌తో వెళ్లి ఆ పల్లెలు కూడా పర్యటించి వారి సమస్యలను తెలుసుకున్నానని వివరించారు. గత పాలకుల లాగా మాయమాటలు చెప్పేవాడిని కాదన్నారు. మాటకు కట్టుబడి పని చేస్తానని అన్నారు. గర్మిళ్ళపల్లి, కలికోటపల్లిలో 50 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. మదిరాజ్ కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. అనంతరం గర్మిళ్ళపల్లికి చెందిన వంతెన పనులను పరిశీలించారు. మొత్తం గర్మిళ్ళపల్లికి రూ. 4 కోట్ల 10 లక్షల అభివృద్ధి పనులకు మంజూరు చేశానని అన్నారు. అర్హులందరికి డబుల్ బెడ్ రూం ఇండ్లు దశల వారిగా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

విభజన సమస్యలపై మరో భేటీ

ఇరు రాష్ట్రాల సీఎస్‌లకు ఆహ్వానం

ఆంధ్రప్రభ, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల నడుమ విభజన సమస్యల నివారణకు కేంద్రం మరో అవకాశమిచ్చింది. ఇరు తెలుగు రాష్ట్రాల సీఎస్‌లతో మార్చి 5న డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీ కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన సమావేశమయ్యేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సమాచారం ఇచ్చింది. ఈ మేరకు హోంశాఖ కార్యదర్శి ఎకె మహేష్ ఇరు రాష్ట్రాల సీఎస్‌లు లేఖ చేసుకుని సుహృద్భావ వాతావరణంలో సమస్యల పరిష్కారానికి దోహద చూపాలని లేఖలు రాశారు. షెడ్యూల్ 13లోని అంశాలతోపాటు ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టం-2014లోని అనేక సమస్యలపై చర్చించనున్నారు. ఇందుకోసం ఢిల్లీలోని హోంశాఖకు చెందిన నార్త్ బ్లాక్‌లో రూం నెంబర్ 119లో సమావేశమయ్యేందుకు హోంశాఖ ఏర్పాట్లు చేసింది. విభజన చట్టం అమలుతీరు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, ఆస్తులు, అప్పుల పంపిణీ, వంటి అంశాలపై స్పష్టతకు కేంద్ర హోంశాఖ ప్రయత్నిస్తోంది. కాగా ఈ సమావేశం ఫిబ్రవరి 28న జరగాల్సి ఉండగా తెలంగాణ సీఎస్ హాజరుకాలేని చెప్పడంతో మార్చి 5కు వాయిదా వేశారు. ఇరు తెలుగు రాష్ట్రాల నడుమ విభజన సమస్యలు పీక్ స్టేజికి చేరాయి. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయ లేమితో సమస్యలు మరింత జటిలంగా మారుతున్నాయి. దీంతో కేంద్రం రంగంలోకి దిగింది. రాష్ట్ర విభజన జరిగి మూడున్నరేళ్లయినా ఇంకా ఆస్తులు, అప్పుల విభజనలో ప్రతిష్టంభన తొలగలేదు.

రైతులపై కపట ప్రేమ

- ఓట్ల కోసం ప్రజాధనంతో ఎర
- ఎన్నికలు వస్తున్నాయనే 4వేల పెట్టుబడి పథకం
- బస్సు యాత్రను చూసే పంటకు 5 లక్షల బీమా
- కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్రలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి



తాండూరు టౌన్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అడుగడుగునా రైతాంగాన్ని మోసం చేస్తూ వచ్చిన సిఎం కేసీఆర్ ఎన్నికలు దగ్గరపడుతున్నాయని మరోసారి రైతులను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ప్రజాధనంతో పథకం పేరుతో ఓట్లు రాబట్టేందుకు రూ. 4వేలు పెట్టుబడి పథకాన్ని ప్రవేశపెట్టారని ఆరోపించారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేపట్టిన మొదటి విడత ప్రజా చైతన్య యాత్ర రెండో రోజు వికారాబాద్ జిల్లా, తాండూరులో కొనసాగింది. తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు రాష్ట్ర నాయకులు భారీగా తరలివచ్చారు. ఈ సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రైతులు, ప్రజలు, విద్యార్థులు, యువకులు కొత్త ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అందరి ఆశలను వమ్ము చేస్తూ సిఎంగా గద్దెనెక్కిన కేసీఆర్ దుర్మార్గపు పాలన కొనసాగించారని ధ్వజమెత్తారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టులతో కమీషన్లను కొల్లగొట్టారని మండిపడ్డారు. అభివృద్ధి మాటేమోగాని.. ఈ నాలుగేళ్లలో దోపిడీ వ్యవస్థ పెరిగిపోయిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని 5 విడతల్లో విడుదల చేసి వడ్డీ చెల్లింపులకే సరిపెట్టారని అన్నారు. అప్పులు.. ఆర్థిక ఇబ్బందులతో 4వేల మంది రైతులు ఆత్మబలిదానాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను అడుగడుగునా మోసం చేసిన ప్రభుత్వం మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతుందని అన్నారు. రైతుల ఓట్ల కోసం 4వేల పెట్టుబడి పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. ప్రజాధనంతోనే ఓట్లకు ఎరవేస్తుందని మండిపడ్డారు. ఎవడబ్బా సొమ్మని.. నీ జాగీరా అంటూ మండిపడ్డారు.

అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బస్సు యాత్రతో గుబులు పెట్టిన సిఎం కేసీఆర్ కొత్త వాగ్దానాలు చేస్తున్నారని అన్నారు. 4వేల పెట్టుబడి పథకంలో ఆకర్షించిన ప్రభుత్వం తాజాగా రూ. 5లక్షల పంట బీమా అంటూ కొత్త హామిలు ఉన్నారని అన్నారు. నాలుగేళ్ల కాలంలో రైతులకు పంట బీమాను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఓట్ల రాజకీయానికి సిఎం కేసీఆర్ ఆరాటపడుతున్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంకు రోజులు దగ్గర పడ్డాయనే విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయ రంగాన్ని లాభాదాయకంగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన ఆరు మాసాల్లోనే రూ. 2లక్షల రుణమాఫీతో పాటు పత్తి, కంది, పసుపు, మిర్చి వంటి 17రకాల పంటలకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందనే చాటిచెప్తామన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ కుంతియా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నాలుగు కోట్ల మంది బాగుపడలేకున్నా.. ఆ నలుగురు కుటుంబ సభ్యులు బాగుపడ్డారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో 4వేల మంది రైతులు ఆత్మబలిదానాలకు పాల్పడ్డారని, ఇవేవి పట్టని టిఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. రాబోయే రోజుల్లో రైతు ఆత్మహత్యలను నివారించేందుకు కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్ర చేపట్టిందని స్పష్టం చేశారు. అంతకముందు సిఎల్పీ నేత జానారెడ్డి, కౌన్సిల్ నేత షబ్బీర్ అలీ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్కలు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం కాంగ్రెస్ పార్టీ తీసుకవచ్చిందని, ఈ పార్టీలోనే ఉన్న నేతలతో ఎన్నో పార్టీలు ఉద్భవించాయని.. దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన పార్టీపై 70ఏళ్లలో ఏం చేసిందని.. ఏం ముఖం పెట్టుకుని బస్సుయాత్రలు చేస్తున్నారని విమర్శించిన వారిపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని ప్రశ్నించే నైతిక హక్కు వారికి లేదని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు అందరు సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలు వస్తున్నాయనే రైతు జపం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే డీకే అరుణ ఫైర్ అయ్యారు. రైతులను ఆదుకోవాలనే సోయి తెలంగాణ ప్రభుత్వానికి నాలుగేళ్ల తర్వాత గుర్తుకొచ్చిందా..? అని ఆమె ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్నందునే సీఎం చంద్రశేఖర్‌రావు రైతుల జపం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. మంగళవారం ఆమె సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతు సమన్వయ సమితిల వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఇప్పటి వరకు ఒక్క ఎకరా కూడా సర్వే చేయలేదని ఆమె తెలిపారు. ఎకరా భూమికి రూ. 4 వేలు ఇవ్వడం వచ్చే ఎన్నికల్లో ఓట్లను కొనుగోలు చేసేందుకేనని అరుణ ఆరోపించారు. నాలుగు వేలు ఇచ్చినంత మాత్రాన రైతులు టీఆర్ఎస్ పక్షాన ఉంటారనుకుంటే పొరపాటేనని, ఇప్పటి వరకు అన్యాయం చేసిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో ఒక్క కొత్త ప్రాజెక్టును తీసుకురాలేని, ఎకరా భూమికి నీళ్లు ఇవ్వలేదని ఆమె విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. కొత్త హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అయితే రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంలో టీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు ఒక్కటేనని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రైతులకు అన్యాయం జరగకుండా.. తమ పార్టీకి చెందిన కార్యకర్తలుతో సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

అలంపూర్ టు అదిలాబాద్ పాదయాత్రకు సన్నాహాలు

కాంగ్రెస్‌లో యాత్రల జోరు పెరుగుతోంది. పార్టీలోని పలువురు ముఖ్యనేతలు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు చేయాలని ఉత్సుకతతో ఉన్నారు. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే ప్రజా చైతన్య బస్సుయాత్ర పేరుతో ప్రజల్లోకి వెళ్లగా.. మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే అరుణ పాదయాత్ర ద్వారా జనం బాట పట్టేందుకు సిద్ధం అవుతున్నారు. రాష్ట్రంలోని 119 నియోజక వర్గాలను చుట్టేందుకు అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా అలంపూరు నుంచి అదిలాబాద్ జిల్లా వరకు పాదయాత్ర చేసేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. పాదయాత్ర ఎలా వెళ్లాలనే దానిపైన రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేస్తున్నట్లు డీకే అరుణ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీలోని వివిధ జిల్లాలకు చెందిన సీనియర్లతో కూడా పాదయాత్ర విషయంపై సంప్రదింపులు జరుపుతున్నట్లుగా కూడా సమాచారం. చాల మంది నేతలు కూడా డీకే అరుణ పాదయాత్రను స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ యాత్రను ఏప్రిల్ మొదటి లేదా రెండో వారంలో మొదలు పెట్టి జూన్ రెండు లేదా మూడో వారం వరకు కొనసాగించాలనే అభిప్రాయంతో ఉన్నట్లుగా తెలిసింది.

టీఆర్ఎస్‌లోనే ఉద్యమ ద్రోహులు



విభజన హామీలపై కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసే ముందు.. నాలుగేళ్లలో టీఆర్ఎస్ ఏం చేసిందో చెప్పాలని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంతో చెట్టాపట్టాలేసుకుని తిరిగే సీఎం చంద్రశేఖర్‌రావు విభజన హామీలను కేంద్రం నుంచి ఎందుకు సాధించడం లేదన్నారు. మంగళవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని తమ నాయకుడు జైరాం రమేష్ కోరడాన్ని మంత్రి జగదీష్‌రెడ్డి తప్పుపట్టడం సరికాదన్నారు. విభజన హామీలపై టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడటం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను ఎందుకు సాధించలేదన్నారు. ఈ నాలుగేళ్లలో ఒక్కసారైనా కేంద్రాన్ని విమర్శించారా..? అంటూ జీవన్‌రెడ్డి నిలదీశారు. జై తెలంగాణ నుంచి జై ఆంధ్ర వరకు వెళ్లారని ఎంపీ కవితనుద్దేశించి జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నిజమైన ఉద్యమ ద్రోహులు టీఆర్ఎస్‌లోనే ఉన్నారని ఆయన విమర్శించారు.

రైతులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలి



గిట్టుబాటు ధర కోసం ఉద్యమం చేసిన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ కమిటీలు నామమాత్రంగానే మారాయని ఆయన విమర్శించారు. నిజాం షుగర్స్, ఇసుక పాలసీ తదితర అంశాలపై అస్యూరెన్స్ ఇచ్చినప్పటికి అమలు కావడం లేదన్నారు. గార్ల మైనింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

అవకాశాలన్నీ యువతవే

- మూడేళ్లలో 15 లక్షల ఫిర్యాదులు పరిష్కరించాం
- సరళతరమైన పాలనలో ప్రజాజీవనం సులభం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అపారంగా ఉన్న మానవ వనరులను ఆధునిక భారతంలో అభివృద్ధి చేసే దిశలో అవకాశాలు అన్నీ యువతకే ఉన్నాయని కేంద్ర పాలనాసంస్కరణలు, ప్రజాఫిర్యాదుల మంత్రిత్వ శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేందర్‌సింగ్ అన్నారు. పరిపాలనను సులభతరం చేయడం ద్వారా ప్రజాజీవనం సరళతరం అవుతుందని, ఆదిశలో డిజిటల్ ఇండియాను తీర్చిదిద్దేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రాధాన్యతలను రూపొందించారని ఆయన చెప్పారు. అన్ని రహదారి మార్గాలు యువత వైపే వెళ్తున్నాయని, అందుబాటులోకి వస్తున్న టెక్నాలజీని యువత అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. హెచ్ఐసీసీలో గత రెండు రోజులుగా జరిగిన ఈ-గవర్నెన్స్ 21వ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో మంగళవారం ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన సంస్కరణల మంత్రిత్వశాఖ కార్యదర్శి కేవీ. ఇపన్, కేంద్ర ఐటీశాఖ కార్యదర్శి అజయ్‌ప్రకాశ్ సహన్, రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఈ-గవర్నెన్స్ ద్వారా వినూత్న పద్ధతుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న వివిధ రాష్ట్రాల ప్రాజెక్టులకు కేంద్రమంత్రి ఈ సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జితేంద్రసింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వ జోక్యం తక్కువగా ఉంటూ ప్రజలకు సౌకర్యవంతమైన పరిపాలన అందించాలంటే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్య సాధనలో బ్యూరోక్రసీ కీలకపాత్ర పోషిస్తుందని, వారికి పూర్తి స్వేచ్ఛ బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు కీలకంగా వ్యవహరించాల్సి ఉందని, దీనికి తగ్గట్టుగా ప్రభుత్వం సుపరిపాలన అందించాలని జితేందర్‌సింగ్ అన్నారు.

గతంలో సగటున యేటా 2లక్షల ఫిర్యాదులు తమ మంత్రిత్వశాఖకు వచ్చేయని, అయితే గత మూడేళ్లలోనే 16లక్షల ఫిర్యాదులు స్వీకరించామని చెప్పారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరిస్తుందన్న భావన కలిగినప్పుడే ఫిర్యాదులు చేస్తారని, తమపై నమ్మకంతో చేసిన ఫిర్యాదుల్లో 90శాతం పరిష్కరించామని జితేందర్‌సింగ్ చెప్పారు.

కొన్ని రాష్ట్రాల్లో ప్రజాఫిర్యాదుల్లో ఏడాది గడిచినా పరిష్కారానికి నోచుకోవడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఈ-గవర్నెన్స్ పెంచామని, వయోవృద్ధులకు ఇచ్చే పెన్షన్లకు కూడా బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. అలాగే ప్రభుత్వ నియామకాల్లో దరఖాస్తు విధానాన్ని సులభతరం చేశామని, అవసరంలేని నిబంధనలు పూర్తిగా తొలగించామని చెప్పారు. ప్రభుత్వ నియామకాల్లో స్వయం ధృవీకరణపత్రం సమర్పించే సరికొత్త అవకాశం తెచ్చామని కేంద్రమంత్రి చెప్పారు. తమ ప్రభుత్వం అనేక కొత్త సంక్షేమ పథకాలతో పాటు సుపరిపాలనలో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. జన్‌ధన్‌యోజన, ఆధార్, మొబైల్‌యాప్స్ ద్వారా అనుసంధానం చేసి సేవలు అందిస్తున్నామని జితేందర్‌సింగ్ చెప్పారు.

ఎన్ఎండీసీకి లీడర్‌షిప్ అవార్డు



ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు ఈటీ నౌ ఛానల్ సీఎస్ఆర్ లీడర్‌షిప్ అవార్డును ప్రదానం చేసింది. ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రంలో బస్తర్ ప్రాంతంలో మహిళా సాధికారత, సామాజిక అభివృద్ధికి ఎన్ఎండీసీ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపికైంది. ఈ ప్రాంత మహిళలకు ఆరోగ్య, పౌష్టికాహారం, విద్య, మౌలిక సదుపాయాల కలపన, సుస్థిర అభివృద్ధి ద్వారా జీవన విధానాన్ని మార్చి వారిని స్వశక్తులుగా, స్వయం సంవృద్ధి సాధించే విధంగా తీర్చిదిద్దడంలో ఎన్ఎండీసీ ఎనలేని సేవలు అందిస్తుంది. ఎన్ఎండీసీ హైదరాబాద్ హెడ్‌ఆఫీస్‌లో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఈ సంస్థ సీఎండీ ఎన్.బైజేంద్రకుమార్‌కు బీవోఐఎం బేస్లీకాంప్లెక్స్ డైరెక్టర్ తుల, ఈడీ ఏకే సుక్లా ఈ అవార్డును అందజేశారు.

సాంకేతికతతో అక్రమాలకు అడ్డుకట్ట




ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంతమేరకు పెంచుకుని పారదర్శకత, జవాబుదారీతనం, సత్వరఫలితాలే లక్ష్యంగా పౌరసరఫరా శాఖలో చేపట్టిన సంస్కరణలు మంచిఫలితాలు ఇస్తున్నాయని ఆశాఖ కమిషనర్ సీవీ.ఆనంద్ అన్నారు. సాంకేతికతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కాక రేషన్‌సరుకుల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేశామని ఆయన చెప్పారు. హెచ్ఐసీసీలో జరుగుతున్న జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ, జాతీయ ఆహారభద్రత కారులకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి నెలకు 3రూ.లకే 5కిలోల బియ్యం సరఫరా చేస్తుండగా, రాష్ట్రప్రభుత్వం 6కిలోల చొప్పున ఒక్క రూపాయికే సరఫరా చేస్తుందన్నారు. దీనిద్వారా 2.75కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని, నెలకు లక్షన్నర టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కనీస మద్దతు ధరకు రైతు నుంచి ధాన్యం సేకరించి ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేస్తున్నామని చెప్పారు. 2016ఖరీఫ్, 2017రబీ, ఖరీఫ్‌లో రూ.11వేల కోట్లు 15లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేశామని చెప్పారు. రేషన్‌షాపు ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరుకులు పక్కదారి పట్టకుండా అర్హులకు అందేలా సరఫరా నుండి పంపిణీ వరకు కంప్యూటీకరణ, రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ మిషన్లు, ఎలక్ట్రానిక్ తూకాలు, సరుకుల రవాణా వాహనాలకు జీపీఎస్, గోదాంలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆనంద్ వివరించారు.

తెలంగాణ మీ-సేవ 2.0కు రజతం

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వివిధ రాష్ట్రాల 19 ప్రభుత్వశాఖలకు కేంద్ర పాలనా సంస్కరణల శాఖ సహాయమంత్రి జితేందర్‌సింగ్ జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. హెచ్ఈసీసీలో జరిగిన జాతీయ ఈ -గవర్నెన్స్ ముగింపు సందర్భంగా మంగళవారం జాతీయ అవార్డులు, మెమొంటో, నగదు పురస్కారాన్ని ఆయన బహూకరించారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వ సంస్థలు ఐటీని వినూత్నంగా ఉపయోగించి పౌరసేవలు అందిస్తున్న వాటిని ప్రభుత్వం ఎంపికచేసింది. కేంద్ర ప్రభుత్వ ఇనాంప్రో, కర్ణాటక సంరక్షణే, మధ్యప్రదేశ్ ఎడ్యుకేషన్ పోర్టల్, హిమాచల్‌ప్రదేశ్ రోతంగ్‌పాస్ పర్మిట్ మంజూరు, మహారాష్ట్ర మంచినీటి సరఫరా, శానిటేషన్, బీహార్ స్మార్ట్ ఎనర్జీ ఇన్‌ఫ్రా, మధ్యప్రదేశ్ పాంచ్ పరమేశ్వర్ పోర్టల్, హిమాచల్‌ప్రదేశ్ మానవసంపద పోర్టల్స్‌కు స్వర్ణ పతకం లభించింది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మీ-సేవ 2.0కు రజత పతకం ప్రదానం చేశారు. స్వర్ణ పతకం కింద రెండు లక్షలు, వెండి పతకం లక్ష రూపాయల నగదు పారితోషికం అందించారు. హిమాచల్‌ప్రదేశ్ శాసనసభను కాగిత రహితంగా (ఈ-విధానం) తీర్చిదిద్దినందుకు ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించింది.

తెలంగాణ వరప్రదాయని 'కాళేశ్వరం'

నిజామాబాద్ ఎంపీ కవిత



వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి వరప్రదాయని అని జీవనది గోదావరిపై నిర్మిస్తున్న ఈప్రాజెక్టు వల్ల రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం ఆమె జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి కవిత ప్రాజెక్టు పనులను పరిశీలించారు. రాత్రింబవళ్లు జరుగుతున్న పనులను చూసిఆమె ఆశ్చర్యపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అద్భుత కట్టడమని కొనియాడారు. కరీంనగర్ జిల్లా నుంచి 500 మంది ప్రతినిధులతో కవిత మంగళవారం మధ్యాహ్నం కాళేశ్వరానికి చేరుకున్నారు. అక్కడి నుంచి మహాదేవ్‌పూర్ మండలం అంబటిపల్లిలో నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజి వద్దకు చేరుకున్నారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పనుల పురోగతిని చూసి ఇంజనీర్లను అభినందించారు. మ్యాప్ ద్వారా ప్రాజెక్టు పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సంకల్పం ఉంటే ఏవరైనా ఏ పనినైనా చేయవచ్చని అతి తెలంగాణ ప్రభుత్వంకే ఉందని, మూడు సంవత్సరాలల్లో ఇంత పెద్ద ప్రాజెక్టు నిర్మాణాన్ని శరవేగంగా రాత్రింబవళ్లు అని తేడా లేకుండా 24 గంటలు మూడు షిఫ్ట్‌ల్లోచేయడం ఆ సత్తా తెలంగాణ రాష్ట్రప్రభుత్వానికి ఉందన్నారు. దాదాపు తెలంగాణలో 70 శాతం త్రాగు, సాగునీరు అందుతుందన్నారు. 80 వేల కోట్ల ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతుందని, రాబోయే బడ్జెట్ రూ.25 కోట్లు కేటాయించనున్నట్లు ఆమె చెప్పారు. సాగులో ఉన్న 18 లక్షల ఆయకట్టుతో పాటు మరో 18 లక్షల ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. త్రాగునీటి సైతం 36 టీఎంసీల నీరు అందిస్తామన్నారు. 2050 సంవత్సరం వరకు తెలంగాణ రాష్ట్రంలో నీటి కొరతలేకుండా ప్రాజెక్టు ద్వారా నీరు అందించవచ్చని అన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఎంత మంది అడ్డుకున్నా... ప్రాజెక్టు ఆగదని అన్నారు. తెలంగాణలో చెరువులు, కుంటలకు ఈ ప్రాజెక్టు జీవనరాధరమన్నారు. భవిష్యత్తు తరాలకు ప్రాజెక్టు మెట్లు లాగా ఉపయోగపడుతుందన్నారు. రేపటి తరాలు స్థిరంగా ఉండటానికి ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ యేడాది డిసెంబర్ నెల వరకు నీరు అందించేందుకు తెలంగాణ రాష్ట్రం సంకల్పించిందన్నారు. ఆమె వెంట మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆగ్రోస్ ఛైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్ బాజిరెడ్డి గోవర్ధన్ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీకి రెండు జాతీయ అవార్డులు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఇంధన పొదుపు విభాగంలో దేశంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి తెలంగాణా రాష్ట్ర రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) రెండు జాతీయ అవార్డులు దక్కించుకుంది. మంగళవారం ఢిల్లీలో ఎస్ఆర్‌టీయూఎస్ ఆధ్వర్యంలో కానిట్యూషన్ క్లబ్‌లో 62వ వార్షిక సదస్సు జరిగింది. అసోసియేషన్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా రవాణా రంగంలో విజయాలు సాధిస్తున్న సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా పలు సంస్కరణలు, ఇంధన పొదుపు, వాహన ఉత్పాదకత మెరుగుదలలో టీఎస్ఆర్టీసీ రెండు అవార్డులు దక్కించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి యుద్‌వీర్ సింగ్ మాలిక్ చేతుల మీదుగా టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు ఈ అవార్డులను అందుకున్నారు. అవార్డుల కార్యక్రమం అనంతరం రమణరావు ఢిల్లీ మీడియాతో మాట్లాడుతూ... టీఎస్ఆర్టీసీ ఇంధన పొదుపు విభాగంలో డ్రైవర్ల నైపుణ్యంతో దేశంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిందని సంతోషం వ్యక్తం చేశారు.

కంది రైతుల రాస్తారోకో

ఇచ్చోడ, ప్రభన్యూస్ : అధికారులు కంది పంట కొనుగోళ్లను నిలిపివేయడంతో ఆగ్రహించి న రైతన్నలు మంగళవారం రోజున ఆదిలాబాద్ జిల్లా, ఇచ్చోడ మండల కేంద్రంలోని నాలుగులైన్ల జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వారం రోజులుగా ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో కందుల కొనుగోళ్లు గన్నిబ్యాగుల కొరత కారణంగా నిలిపివేయగా సోమవారం రోజున కొంతమంది రైతుల నుంచి కందులకొనుగోళ్లు చేసి తిరిగి నిలిపివేయడంతో మంగళవారం ఉదయం రైతులు తీవ్ర ఆగ్రహంతో కంది కొనుగోళ్లను ఏవిధంగా నిలిపివేశారని గత వారం రోజులుగా తాము రేయింబవళ్లు మార్కెట్ కార్యాలయంలో పస్తునుంటూ కందులను అమ్మకానికి తీసుకువస్తే అధికారులు గన్ని బ్యాగుల కొరత పేరిట కందులను కొనుగోలు చేయడం లేదని, కందులను గుట్టు చప్పుడు కాకుండా కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహిస్తు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

రైతు సమన్వయ సమితే సూపర్ పవర్!

● అన్ని పథకాలపైనా రాష్ట్ర రైతు సమన్వయ సమితి అజమాయిషీ ● వ్యవసాయం, అనుబంధ శాఖల నిధుల వ్యయంపైనా పర్యవేక్షణ ● పథకాల వారీగా ఖర్చు చేసిన నిధులు, లక్ష్యాలు, ఫలితాలపై నివేదికలు ● వాటిపై ఆర్థిక గణాంకాల తనిఖీపై విశిష్ట అధికారాలు ● ఒకే గొడుగు కిందకు దాదాపు 16 ప్రభుత్వ విభాగాలు ● స్వయం ప్రతిపత్తి సంస్థగా రైతు కార్పొరేషన్ ఆవిష్కరణ ● విధి విధానాలు రూపొందిస్తున్న ఉన్నతాధికారులు


(ఫైల్ ఫొటో)

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతు సంక్షేమ రంగంలో దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణాలో రైతు సమన్వయ సమితుల వ్యవస్థ ఆవిష్కృతమైంది. నాలుగంచెల్లో ఈ వ్యవస్థ లక్ష్య సాధనవైపు దూసుకెళుతోంది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఏర్పాటైన సమన్వయ సమితులకు రెండు ప్రాంతీయ సదస్సుల ద్వారా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మార్గనిర్దేశం చేశారు. రాష్ట్ర సమితిని ప్రభుత్వ రంగ సంస్థగా నెలకొల్పి స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్నారు. అధికారికంగా ఉత్తర్వులు వెలువడనప్పటికీ పార్లమెంట్ సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలంగాణ రైతు కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమితులయ్యారు. వ్యవసాయ రంగంపై ఆసక్తి, అనుభవం ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారిని ఈ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్ నుంచి వ్యవసాయం, అనుబంధ శాఖల అమలయ్యే అన్ని సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర సమితి ఆధీనంలో, పర్యవేక్షణలోనే కొనసాగుతాయి. పథకాల అమలుపై 42 మంది సభ్యులతో కూడిన సమితి పాలకమండలి అజమాయిషీ, ఆధిపత్యం ఉంటుంది.

క్షేత్రస్థాయిలో పథకాల వారీగా ఖర్చుచేసిన నిధులు, లక్ష్యాలు, ఫలితాలపై అధికారులు నివేదికలు నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది. ఆ లెక్కలపై రైతు కార్పొరేషన్ ఆడిట్ కూడా చేస్తుంది. దాదాపు 16 ప్రభుత్వ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోనున్నారు. కొత్తగా ఏర్పాటయ్యే ఈ స్వయం ప్రతిపత్తి వ్యవస్థ ఏ విధంగా పనిచేయాలన్న అంశంపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న సహజ వనరులన్నింటినీ సద్వినియోగం చేసుకుని ఇక్కడి వ్యవసాయాన్ని దేశానికే ఆదర్శంగా మార్చాలన్న ధృడ సంకల్పంతో ప్రభుత్వం రైతు సమన్వయ సమితిలను నెలకొల్పిన విషయం విధితమే. వ్యవసాయ సహకార పరపతి వ్యవస్థలో ఊహించని అభివృద్ధి సాధించి రికార్డు బద్దలు కొట్టేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాలుగంచెల సహకార వ్యవస్థ పూర్తి సిద్ధమైంది.

రాష్ట్రవ్యాప్తంగా 10,733 రెవెన్యూ గ్రామాల్లో గ్రామ రైతు సమాఖ్యల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. జనవరి రెండో వారంలో ప్రారంభమైన మండల రైతు సమాఖ్యల ఏర్పాటు ప్రక్రియ ఈ నెల మొదటివారంలో ముగిసింది. అనంతరం జిల్లా స్థాయి రైతు సమాఖ్య ఏర్పాటుకు మంత్రుల నేతృత్వంలో పూర్తయింది. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులంతా క్షేత్రస్థాయిలోనే తిష్టవేసి ప్రత్యేక చొరవ చూపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మొత్తం 559 మండలాల్లో రైతు సమాఖ్యల ఏర్పాటు ప్రక్రియ ముగిసింది. సుమారు ఎనిమిది దశాబ్దాల తర్వాత కేసీఆర్ సర్కారు తెలంగాణాలో భూ రికార్డుల ప్రక్షాళనను విజయవంతంగా పూర్తిచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 9 గ్రామాలకొక బృందం చొప్పున మొత్తం 1193 బృందాలను ఏర్పాటు చేశారు. ఇంత పెద్దమొత్తంలో ప్రభుత్వాధికార యంత్రాంగం ఏకకాలంలో ప్రక్షాళనకు పూనుకోవడం ఇదివరకు ఎన్నడూ జరుగలేదని సామాజికవేత్తలు చెబుతున్నారు.

జిల్లా కలెక్టర్ల ప్రత్యేక చొరవ, త్వరలోనే రాష్ట్ర సమితి పాలక మండలి

మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సమన్వయ సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించి పూర్తి చేశారు. రైతు కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సబ్సిడీలు, రాయితీలు అందించాలన్నా సంబంధిత పథకాల పురోగతి రైతు సమాఖ్యల పర్యవేక్షణలోనే కొనసాగుతుంది. సీఎం ఆమోదించిన ప్రతిపాదనల ప్రకారం 42 మంది సభ్యులతో రాష్ట్రీయ రైతు సమన్వయ సమితి పాలకమండలిని అతిత్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర కేబినెట్ హోదాలో రాష్ట్ర సమితి అధ్యక్షుణ్ణి నియమించారు. 24 మంది సభ్యులతో జిల్లాస్థాయి, మండల స్థాయి రైతు సమన్వయ సమితిలను ఏర్పాటయ్యాయి.

వ్యవసాయ రంగ పరిపుష్టే కేసీఆర్ లక్ష్యం

వ్యవసాయ రంగ పరిపుష్టికి ముందుచూపు ఆలోచనతో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సరికొత్తగా తరహాలో నాలుగంచెల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. రైతుల పక్షాల ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ప్రభుత్వ పథకాల ద్వారా అన్నదాతలకు లబ్ధి చేకూర్చేలా చూసేందుకు అధికారికంగా నాలుగంచెల్లో రైతు సమన్వయ సమితులను నెలకొల్పారు. గ్రామ స్థాయిలోనే కాకుండా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనూ ఈ సంఘాలు ఏర్పాటవుతున్నాయి. ఇదివరకు దశాబ్ద కాలం పాటు వ్యవసాయ రంగం ఎదుర్కొన్న దుర్భిక్ష పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లోనూ పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని క్షేత్రస్థాయిలో మెరుగైన వనరులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అదే సమయంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు ఉన్నతాధికార యంత్రాంగం నిర్దిష్టమైన కార్యాచరణను సిద్ధం చేసుకుంది.

రూ.1.80 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్?

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదానికై 15 పనిదినాలు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఒకనిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. బడ్జెట్ సమావేశాల నిర్వహణ తేదీ ఖరారు కావడంతో ఆర్థికశాఖ 2018 -19 బడ్జెట్ రూపకల్పనను వేగవంతం చేసింది. వాస్తవంగా ఇప్పటికే బడ్జెట్‌కు తుది రూపం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం 2018 -19 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్రా లకు కేటాయింపులపై స్పష్టత ఇవ్వకపోవడంతో రాష్ట్రబడ్జెట్ కూర్పులో ఆలస్యం జరుగుతోంది. మార్చి 5నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కేంద్రం రాష్ట్రానికి కేటాయించే నిధులపై స్పష్టత ఇచ్చాక ఏఏ పద్దులకు ఎంత మొత్తం కేటాయించాలన్న అంశంపై బడ్జెట్ స్వరూపం తెలుస్తుంది. 2017-18 బడ్జెట్‌ను రూ. 1,49,646 కోట్లతో ప్రభుత్వం రూపొందించింది. అందులో నిర్వహణ పద్దు కింద రూ. 61,607.20కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.88, 038.80 కోట్లను ప్రతిపాదించింది. ఇప్పటికే అమలవుతున్న పథకాల అంచనా వ్యయం పెరుగుదల, నూతన పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నందున 2018 -19 బడ్జెట్ రూ. 1,80,000 కోట్లకు పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అంచనావేస్తున్నాయి. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు 15 నెలల గడువు మాత్రమే ఉన్నందున పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు కొత్త వరాలు కురిపించనుంది. రైతుల ఆత్మహత్యల నివారణతో పాటు రైతును రాజుగా మార్చాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం ఆ దిశలో రాష్ట్రంలో ఉన్న 70 లక్షల మంది రైతులకు పంటల పెట్టుబడి పథకానికి ఈ బడ్జెట్‌లోనే నిధులను ప్రభుత్వం కేటాయిస్తోంది. ఒక్కో రైతుకు సీజన్‌కు రూ. 4,000 చెల్లించాలని సర్కార్ నిర్ణయించింది. పెట్టుబడి పథకం నిర్వహణకు రూ. 12,000 కోట్లు అవసరమవుతాయని సీఎం కేసీఆర్ ఇదివరకే ప్రకటించారు. ఈ మేరకు బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని కేటాయించడం తేలిపోయింది. అదే విధంగా ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జూన్‌లో నీరివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 50 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చి చరిత్ర సృష్టించాలనుకుంటున్న ప్రభుత్వం ఆ దిశలో ఈ ప్రాజెక్టుకు పెద్దమొత్తంలో దాదాపు రూ. 30,000 కోట్లు ఈ ప్రాజెక్టుకు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. కాళేశ్వరంతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టులను కూడా ఎన్నికల్లోపే పూర్తిచేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అదే విధంగా 2018 లోగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని అందిస్తామని సీఎం ప్రకటించారు. అంతేగాక నీరివ్వకపోతే 2019 ఎన్నికల్లో పోటీ చేసే ప్రసక్తిలేదని కూడా విపక్షాలకు సవాల్ చేశారు. అందవల్ల ఇంటింటికి తాగునీరందించే మిషన్ భగీరథకు రూ. 25,000 కోట్లు కేటాయించే అవ కాశంఉంది. గిరిజనుల ఇంట్లో ఆడపిల్ల పుడితే రూ. లక్ష బ్యాంకులో ఫిక్స్‌డ్ చేయా లనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. అంతేగాక నిరుద్యోగులకు రూ. 2 వేలు లేదా రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇచ్చే విషయమై ఆర్థిక శాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే నిధులు, మార్గదర్శకాలను రూపొందించాలని సీఎం ఆదేశాల మేరకు ఆ దిశలో కసరత్తు చేస్తున్నారు. షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల కింద ఇప్పుడు చెల్లిస్తున్న మొత్తాన్ని ప్రభుత్వం పెంచే విషయంలో యోచిస్తోంది. ఆసరా పెన్షన్ల మొత్తం పెంచడంతో పాటు పరిధిని కూడా పెంచనుంది. ఎస్సీ, ఎస్టీ బీసీ,మైనారిటీల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో నిధుల మొత్తం భారీగా పెరిగే అవకాశం ఉంది. బడ్జెట్ కూర్పుపై ఆర్థిక మంత్రి ఈటల, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషీ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు, ఆర్థిక శాఖ సలహాదారు జీపీ రెడ్డి కసరత్తు చేస్తున్నారు.

త్వరలో రైతు కమిషన్!

(మొదటిపేజీ తరువాయి)

బలోపేతం చేసి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల అమలులో అధికారుల నిర్లక్ష్యంపైనా నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక కేవలం మూడేళ్ళ వ్యవధిలోనే అనేక రంగాల్లో కొత్త విధానాలకు నాంది పలికి రికార్డు సొంతం చేసుకున్న కేసీఆర్ రైతు సంక్షేమ రంగంలోనూ తనదైన శైలిలో కొత్త పుంతలు తొక్కేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలోనే దేశంలోనే ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ఫార్మర్స్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న కొత్త ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. నిజానికి అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఈ తరహాలో కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు కేసీఆర్ ప్రభుత్వం ఆమోదం తెలిపినప్పటికీ, ఇటీవల హైకోర్టు ఆదేశాలతో కసరత్తు ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన విధి విధానాల రూపకల్పనలో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనా నేతృత్వంలో ఉన్నతాధికారులు డ్రాఫ్ట్‌ను రూపొందిస్తున్నారు. దీంతో త్వరలోనే అన్నదాతల హక్కులకు రక్షణ వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

పీడిత రైతులకు చట్టబద్ధమైన వెసులుబాటు

ప్రస్తుతం నిత్యం జరుగుతున్న మోసాలు, దగాలను అడ్డుకునే మార్గంలేక, బాధిత రైతులు తమ బాధలు చెప్పుకునేందుకు ఉన్నతస్థాయిలో చట్టబద్ధమైన వ్యవస్థ లేక ఆందోళన చెందుతున్న రైతులకు శాశ్వత పరిష్కారం లభించబోతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు గరిష్టంగా ఆరు నెలల్లోగా తెలంగాణ ఫార్మర్స్ కమిషన్‌ను నెలకొల్పాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ కమిషన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాక రైతు సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత మరింతగా పెరగనుంది. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చడంలో, అభివృద్ధి ఫలాలను వారికి అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపైనా చట్టపరమైన నిఘా వ్యవస్థ అందుబాటులోకి వస్తున్నందున కర్షక లోకానికి కొండంత అండ లభించనుంది. రాష్ట్ర జనాభాలో దాదాపు ఎనభై శాతం ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నందున ఈ తరహా కమిషన్ ఏర్పాటు ప్రభుత్వానికి ఆవశ్యకమైంది.

హైకోర్టు జోక్యంతో ప్రక్రియ వేగవంతం

వ్యవసాయ రంగంలో మోసాలను, దోపిడీని అరికట్టడం ద్వారా పెద్దఎత్తున ప్రయోజనాలను చేకూర్చే ఈ అంశంపై ప్రభుత్వ పరమైన చర్యల్లో కొంత ఆలస్యం కనిపించడంతో ఒక జాతీయ పార్టీకి చెందిన సీనియర్ నేత హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తగిన మార్గదర్శకాలు జారీ చేసింది. గరిష్టంగా మూడు నెలల కాల వ్యవధిలో కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఏడాది క్రితమే హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి నిర్దిష్టమైన సూచనలు చేసింది. ఇప్పటికే ఆలస్యమైన విషయాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ ఇటీవల రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కసరత్తు వేగవంతమైంది. పదవీ విరమణ పొందిన న్యాయమూర్తి అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో తెలంగాణ ఫార్మర్స్ కమిషన్ త్వరలోనే ఏర్పాటు కాబోతోంది. ఈ ఏడాది యాసంగి సీజన్ తర్వాత కమిషన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తు న్నాయి.

మోసాలకు గ్రామస్థాయి నుంచే అడ్డుకట్ట

గ్రామస్థాయిలో పంట పెట్టుబడులు సమకూర్చుకునే క్రమంలో రైతులకు జరుగుతున్న మోసాలు, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల ఆగడాలు, ఇష్టారాజ్యపు దోపిడీలు కళ్ళెం పడబోతోంది. విత్తనాలు, ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి దోపిడీ చేసే వ్యాపారులకు, కష్టపడి పండించిన వ్యవసాయోత్పత్తులను బహిరంగ మార్కెట్లో కనీస మద్దతు ధరలను అమలు చేయని అధికారులకు కమిషన్ ఏర్పాటయ్యాక వెన్నులో వణుకు పుట్టబోతోంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో అక్రమాలు 90 శాతం నియంత్రించబడతాయి. తమకు అన్యాయం జరిగితే కమిషన్‌ను ఆశ్రయిస్తామన్న ధీమా రైతుల్లో వస్తే గనుక బలపడితే వ్యవసాయ రంగం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లడం ఖాయమని వ్యవసాయ రంగ నిపుణులు, సామాజికవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడున్న మహిళా, మానవ హక్కుల కమిషన్ మాదిరిగానే తెలంగాణ ఫార్మర్స్ కమిషన్‌కు కూడా ప్రభుత్వాన్ని ఆదేశించే అధికారాలు ఉంటాయి. వైఫల్యాలు లేకుండా రైతు సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలవుతాయి. అన్నదాతలకు అప్పుల బాధలు తగ్గి ఆత్మహత్యలు అరికట్టేందుకు ఈ కమిషన్ దోహదపడుతుంది. ప్రస్తుతం దేశంలో జాతీయ స్థాయిలో కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైజెస్ (సీఏసీపీ), నేషనల్ కమిషన్ ఫర్ ఫార్మర్స్ ఉన్నాయి. ఈ తరహాలో రాష్ట్రస్థాయిలో ఫార్మర్స్ కమిషన్ ఏర్పాటు కావడం తెలంగాణాలోనే ప్రప్రథమం.

రెవెన్యూ శాఖ కసరత్తు : పార్థసారధి

తెలంగాణాలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఆశించిన పురోగతి, రైతు సంక్షేమ కార్యక్రమాల్లో మరింత పారదర్శకత, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వివిధ రకాల దోపిడీని నియంత్రించాలంటే తెలంగాణ ఫార్మర్స్ కమిషన్ అవసరమని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి పార్థసారధి అభిప్రాయపడ్డారు. ఇందుకు సంబంధించిన కసరత్తు రెవెన్యూశాఖ ఉన్నతాధికారుల నేతృత్వంలో జరుగుతోందని తెలిపారు. ఈ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ముందుగా రాష్ట్ర ప్రభుత్వమే సంకల్పించిందని, ఆ మేరకు రూపొందించిన ప్రతిపాదనను ఆమోదించిందని చెప్పారు. కమిషన్ ఏర్పాటులో ఆలస్యం జరుగుతుందని మాత్రమే కొందరు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. కోర్టు మార్గదర్శకాల మేరకు ప్రస్తుతం ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు.

ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరేలా..

(మొదటిపేజీ తరువాయి)

చర్యలను సమర్ధవంతంగా పోషించింది. ఇక కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్స్ వంటి పథకాలు జాతీయ స్థాయిలో మన్ననలు పొందుతున్నాయి. రైతులకు ఎకరాకు రూ. 8వేల పెట్టుబడీ సాయంపై దేశమంతా వేచి చూస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా నిర్దేశిత పథకాల కొనసాగింపుతో పాటు ఇరిగేషన్, సంక్షేమం, వైద్యం, విద్య రంగాలకు భారీగా నిధుల కేటాయింపు జరగనున్నట్లు సమాచారం. సాగునీటి పారుదల శాఖకు రూ. 25వేల కోట్లు, పెట్టుబడి మద్దతు పథకానికి రూ. 12 వేల కోట్లు, బీసీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ. 20వేల కోట్లు, మిషన్ భగీరథకు కూడా భారీగా నిధులను కేటాయించేలా కసరత్తు చేస్తున్నారు. 2018-19 బడ్జెట్‌లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు భారీగా నిధులను కేటాయించాల్సిన అవసరం నెలకొంది. ఈ మేరకు ప్రతిపాదనలు కూడా పెరుగుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ, కాకతీయ, డబుల్ బెడ్ రూం ఇండ్లు, సామాజికి పించన్లు, ఉద్యోగుల జీత భత్యాలు, ఇతర పథకాలు నిధుల అవసరం భారీగా కానుంది.

ఈ నేపథ్యంలో 2018-19వార్షిక బడ్జెట్ రూ. 1.85 లక్షల కోట్లకు చేరే దిశగా అంచనాలు సిద్దమవుతున్నాయి. ప్రగతి పద్దు రూ. 88,038 కోట్లనుంచి మరో 10శాతం అదనంగా పెంచుకునే అవకాశం పరిశీలిస్తున్నట్లుగా తెలిసింది. వ్యయాన్ని క్రమబద్ధీకరించడం ద్వారానే నిర్వహణా వ్యయం కంటే ప్రగతి పద్దు వ్యయం ఎక్కువగా ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. 2018-19 ఆర్థిక ఏడాదిలో నిర్వహణా వ్యయం రూ. 61,607కోట్లనుంచి రూ. 75వేలకుపైగా చేరనున్నాయి. కాగా ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో రెవెన్యూ మిగులు రూ. 4571కోట్లను అంచనా వేసుకున్నారు. అయితే సవరించిన అంచనాలతో వచ్చే నెలలో ఇది ఎంత మొత్తం సాధ్యమైందనే అంశం వెలుగులోకి రానుంది.

గత లెక్కల ఆధారంగానే...

రూ. 1,49,646 కోట్ల బడ్జెట్‌లో సొంత వనరుల రాబడిని రూ. 69,220కోట్లనుంచి రూ.80వేల కోట్లకుపైగా అంచనాలను నిర్దేశించే అవకాశం కనిపిస్తున్నది. ప్రధాన రాబడి శాఖలనుంచి పెరిగిన రాబడి, జీఎస్టీ లోటును కేంద్రం సర్దుబాటు చేస్తుండటం, పెట్రో, మద్యం ఉత్పత్తులపై పన్నుల వసూలు రాష్ట్రానిదే కావడంతో భారీ లక్ష్యం నిర్దేశించనున్నారు. అయితే 2016-17లో సవరించిన అంచనా మేరకు రూ. 1,12,191కోట్లు వ్యయం అవుతాయని భావించినా ఆ మేరకు సాధ్యపడలేదు. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో కూడా వ్యయంలో కోతలు పడనున్నట్లుగా ఆర్థిక శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో వాణిజ్య పన్నుల శాఖ రాబడిని రూ. 46,499కోట్లకు అంచనా కాగా దీనిని 2018-19లో దాదాపు 10శాతం మేర వృద్ధిరేటును అంచనాగా నిర్ణయించనున్నట్లు తెలిసింది. అబ్కారీ శాఖ లక్ష్యం రూ. 8999కోట్లనుంచి రూ.12వేలకోట్లకు చేరనుందనే అంచనాలున్నాయి. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ రాబడి లక్ష్యం రూ. 3వేల కోట్లకు పరిమితం చేయగా ఈ ఏడాది అనుసరించనున్న నూతన విధానం, పెరిగిన రియల్ జోరుతో రూ. 5 వేల కోట్లకు పెంచుకునేందుకు రంగం సిద్దమైందని తెలిసింది. వాహన పన్నుల రాబడిని రూ. 3వేల కోట్లనుంచి రూ. 3500 కోట్లకు ఇతర మార్గాల్లో రూ. 36,237కోట్లను రూ. 40 వేల కోట్లను ప్రభుత్వం అంచనాగా వేసుకునేందుకు లెక్కలు సిద్ధమవుతున్నాయి.

ఈ ఏడాది వ్యవసాయ రంగానికి విశేష ప్రాధాన్యత దక్కనుంది. ఎకరాకు రూ.4వేల ఆర్థిక సాయానికి భారీగా నిధుల అవసరం కానుంది. వ్యవసాయ బడ్జెట్‌ను రూ. 15 వేల కోట్లతో ప్రతిపాదించేలా కరస్తు జరుగుతోంది. ఇందులో దాదాపు రూ. 12వేల కోట్లు పంటకు సాయం నిధులకే ఖర్చు కానున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టత తెచ్చేలా వ్యవసాయం, అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి నిలపాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో ఈ రంగానికి ప్రాధాన్యత ఖాయమని తేలిపోయింది. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో సాగునీటి రంగంతో కలుపుకుని వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ. 46,946కోట్లను కేటాయించింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రెండు పడక గదుల ఇండ్లు, పించన్లు, రూ. 1,16,000లకు పెరగనున్న షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి సాయం, హాస్టళ్లకు సన్న బియ్యం, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, రుణాల రీ పేమెంట్, వడ్డీలకు భారీగా నిధుల అవసరం నెలకొననుంది.

అత్యవసర నిధి కూడా...

ఊహించని అవసరాలు, ప్రత్యేక వ్యయాలకు తక్షణ సాయంగా నిధిని కేటాయించేందుకు పరిశీలిస్తున్నారు. 2017-18 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు అయ్యే వ్యయాలకు, ఆకస్మిక అవసరాలకు ముందస్తు వ్యూహం మేరకు రూ. 4675 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకుంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు అయ్యే వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు కేటాయింపులు చేస్తాయి. ఇలా ముందస్తు అంచనాలతో కేటాయింపులు చేసినప్పటికీ కొన్ని శాఖల్లో నిధుల లేమి, పథకాలకు సరిపడా నిధులు రాక కొరత ఏర్పడుతుంది. ఇది ఏటా జరిగేదే. ఇలాంటి తరుణంలో ప్రభుత్వాలు అప్పటికప్పుడు నిధులను జారీ చేయడమో...ప్రతిపాదనలు చేయడమో చేస్తుంది. దీంతో కొంత జాప్యం కారణంగా పథకాల అమలు క్లిష్టంగా మారిన సందర్భాలు తటస్థిస్తాయి. వనరులను అప్పటికే నిర్దేశిత అవసరాలకు కేటాయించి ఉండటంతో అప్పటికప్పుడు సర్దుబాటు కొంత కష్టంగానే ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. అనుకోని అవసరాలు, ఆకస్మిక కేటాయింపులు కావాల్సి వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు వ్యూహంలో భాగంగా ఈ నిధిని వాడుకోనున్నారు.

వరాల చంద్రుడు





● ఆదిలాబాద్ అభివృద్ధిపై నిధుల వర్షం ● పిప్పల్ కోటి, గోమిత్రి, కుప్టీ ప్రాజెక్టులపై రూ. 1430 కోట్లు ● బాసర జ్ఞాన సరస్వతి ఆలయానికి రూ. 50 కోట్లు ● పెద్దపల్లి లిఫ్ట్‌లకు రూ. 90 కోట్లు ● సింగరేణి కార్మికులకు 10వేల క్వార్టర్లు..రూ. 400 కోట్లతో నిర్మాణం ● కొత్త గనులతో 4,500 ఉద్యోగాలు ● ఒకేరోజు పెద్దపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల చుట్టేసిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వరాల వానలో ప్రజలను, సింగరేణి కార్మికులను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తడిపి ముద్ద చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం పర్యటించిన ముఖ్యమంత్రి మూడుసభల్లో పాల్గొని.. ప్రజలపై, జిల్లాల అభివృద్ధిపై వరాలు కురిపించి ప్రజలను ఆనందపరిచారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అనేక సమస్యలను తన పర్యటన సందర్భంగా పరిష్కరించారు. ప్రాజెక్టుల పనులను పరిశీలించి.. వేగానికి ఆదేశాలిస్తూనే అనేక కొత్త ప్రాజెక్టులను, పనులను ప్రకటించారు. కరీంనగర్‌లో బసచేసిన ముఖ్యమంత్రి కెసిఆర్ మంగళవారం ఉదయం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూరు వద్ద రూ.80కోట్లతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకానికి శంఖుస్థాపన చేయడంతో పాటు నాలుగుమాసాల్లోనే పనులు పూరి చేయాలని అధికారయంత్రాంగానికి నిర్దేశం చేశారు. రూ.10కోట్ల వ్యయంతో మరో ఎత్తిపోతల పథకాన్ని మంజూరుచేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలో లోయర్ పెన్‌గంగపై నిర్మిస్తున్న చనాకా-కొరాటా బ్యారేజీ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి కెసిఆర్.. ఇంకా 50శాతం పనులు కూడా పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జూన్ నాటికి పనులు పూర్తవుతాయా అని అధికారులను, ఏజెన్సీలను ప్రశ్నించారు. పూరి చేయమని ఆదేశించారు. అక్కడి నుండి ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సమావేశానికి వెళ్ళిన ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

ఆదిలాబాద్ జిల్లాలోని జ్ఞానసరస్వతి ఆలయానికి రూ.50కోట్లు మంజూరుచేస్తున్నట్లు ప్రకటించారు. పిప్పల్‌కోటి ఎత్తిపోతల పథకానికి రూ.350కోట్లు, గోమిత్రి ప్రాజెక్టుకు రూ.210కోట్లు, కుప్టీ ప్రాజెక్టుకు రూ.870కోట్లు మంజూరుచేస్తున్నట్లు ప్రకటించారు. లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు కోసం దశాబ్దాలుగా ఆదిలాబాద్ ప్రాంతంలో ఉద్యమాలు జరగ్గా, ఈ ప్రాజెక్టును జూన్‌కు పూర్తిచేసి 70వేల ఎకరాలకు సాగునీరందిస్తామని ప్రజల హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరుచేస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ కాశ్మీరంగా పేరున్న ఆదిలాబాద్ అభివృద్ధిపై సిఎం కురిపించిన వరమాలతో ప్రజలు ఆనందానుభూతికి గురయ్యారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రిగా కెసిఆర్ పర్యటించడం ఇదే తొలిసారి కావడంతో ప్రజలు ఆయనకు అపూర్వస్వాగతం పలికారు.

బెంగటిల్లొద్దు.. ఆగం కావొద్దు..

సింగరేణి కార్మికులకు తన పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ పూర్తి భరోసానిచ్చారు. బెంగటిల్లొద్దు.. ఆగం కావొద్దు అంటూ అభయహస్తం అందించారు. సింగరేణి ప్రైవేట్ పరం కాదు.. కాదు అంటూ కుండబద్దలు కొట్టారు. కేంద్రం వాటాలు వదులుకుంటానంటే అవసరమైతే మేమే కొంటాం అంటూ ప్రకటించడం ద్వారా సింగరేణి కార్మికులలో నెలకొన్న అలజడిని తొలగించారు. సింగరేణి కార్మికుల కోసం పదివేల క్వార్టర్లు నిర్మించబోతున్నామని, ఇందుకోసం రూ.400కోట్లు యాజమాన్యం ఇస్తుందని ప్రకటించారు. సింగరేణి కార్మి కులు ఎదురుచూస్తున్న మెడికల్ బోర్డును ఏర్పాటుచేస్తున్నామని, మార్చిలో దీని పని ప్రారంభమవుతుందని చెప్పడం ద్వారా కార్మికు లకు స్పష్టతనిచ్చారు. మెడికల్ బోర్డు ఏర్పాటుతో కారుణ్య నియా మకాల రూపంలో వారసత్వ ఉద్యోగాల ప్రక్రియ ప్రారంభ మైనట్లే నని సిఎం సంకేతాలిచ్చారు. ఏదో ఒకరూపంలో కొడుకుల ఉద్యో గాల సమస్యను బయటపడేస్తాం.. బెంగటిల్లొద్దు.. ఆగం కావొద్దు అంటూ కార్మిక కుటుంబాల్లో సంతోషం నింపారు. ఆరు కొత్త గనులకు అంకురార్పణ చేసిన సిఎం వీటి ద్వారా 4,500మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను తెలు సుకున్న సిఎం.. సింగరేణిలో ఎవరైనా లంచమడిగితే చెప్పుతో కొట్ట మంటూ మరోసారి చెప్పారు. ప్రాజెక్టులు సందర్శించి.. అభివృద్ధిని సమీక్షించి.. నూతన గనులు ప్రారంభించి.. కార్మికులతో ఆత్మీయసభ నిర్వహించి.. మంగళవారమంతా సభలు, సమా వేశాలతో బిజీ బిజీగా గడిపారు. ఒకేరోజు ముఖ్యమంత్రి మూడు జిల్లాల్లో సభల్లో పాల్గొనడం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమమని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

కేసు ముగిసింది... మిస్టరీ మిగిలింది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠ, ఊహాగానాలకు చెక్ పెడుతూ శ్రీదేవి మృతదేహం స్వదేశానికి చేరుకుంది. తన మేనల్లుడు మోహిత్ పెళ్లికి సంతోషంగా దుబాయ్‌కి వెళ్లిన శ్రీదేవి విగతజీవిగా రావడం కోట్లాది మంది అభిమానులను కంటతడి పెట్టించింది. శనివారం రాత్రి తుదిశ్వాస విడిచిన శ్రీదేవి మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి.. ఎంబామింగ్ పూర్తిచేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. దుబాయ్ ఎయిర్‌పోర్టు నుంచి సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ ఏర్పాటు చేసిన విమానంలో శ్రీదేవి భౌతిక కాయాన్ని ముంబైకి తీసుకొచ్చారు. పోలీసులు, ఫోరెన్సిక్ రిపోర్టులలో ఎలాంటి తేడా లేదని పబ్లిక్ ప్రాసిక్యూషన్ తెలిపింది. ప్రమాదవశాత్తు బాత్ టబ్‌లో మునిగి చనిపోయినట్లు వెల్లడించారు. ఎలాంటి అనుమానాలు లేవు. ఎన్నో అను మానాలు, అపోహలు, ఎన్నో మలుపులు తిరిగిన శ్రీదేవి మృతి కేసులో దర్యాప్తు పూర్తయినట్లు దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ అధికారులు చెప్పడంతో కేసు ముగిసింది.

శ్రీదేవి మృతిపై ఆరోపణలా?తగ్గవయ్యా స్వామి..!



లెజెండర్ నటి శ్రీదేవి మృతి కేసును మూసివేస్తున్నట్లు దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకటన.. తదనంతర ఫార్మాలిటీస్ పూర్తి కావడంతో రాజకీయ నాయకుడు అమర్‌సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మీడియా మిత్రులు, నా మిత్రుడు సుబ్రహ్మణస్వామి తప్పుడు ఆరోపణలకు స్వస్తి చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు సుబ్రహ్మణస్వామి దుబాయ్‌లో శ్రీదేవి మృతిపై సంచలన ఆరోపనలు చేశారు. దుబాయ్‌లో శ్రీదేవి హత్యకు గురైనట్లు కనిపిస్తోందని, ప్రాసిక్యూషన్ ఏమి చెబుతుందో చూడాలని ఆయన అన్నారు. ఆమె అస్సలు మద్యం ముట్టరని, ఆమె శరీరంలో మద్యం తాగిన ఆనవాళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

అభిమాన తార కోసం భారీ సంఖ్యలో..

శ్రీదేవిని కడసారి చూసేందుకు ఆమె అభిమానులు అనిల్ కపూర్ నివాసానికి భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అభిమానులు విషాద వదనంతో చివరిచూపు కోసం వేచిచూస్తున్నారు.

నేడు అంత్యక్రియలు

శ్రీదేవి అంత్యక్రియలు నేడు నిర్వహించనున్నట్లు ఆమె కుటుంబసభ్యులు వెల్లడించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యంత భావోద్వేగ సమయంలో తమకు అండగా నిలిచిన మీడియాకు ఈ సందర్భంగా బోనీ కపూర్, కుమార్తెలు ఖుషి,జాహ్నవితో పాటు కపూర్, అయ్యప్పన్ కుటుంబ సభ్యులంతా కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకూ ప్రజలు, అభిమానుల సందర్శనార్థం శ్రీదేవి భౌతికకాయాన్ని స్పోర్ట్స్ క్లబ్‌లో ఉంచుతారు. అనంతరం రెండు గంటల నుంచి అంతిమయాత్ర మొదలు కానుంది. తర్వాత మధ్యాహ్నం 3.30 గంటల నుంచి విల్ పార్లే సేవా సమాజ్ హిందూ స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఏవి?

శ్రీదేవి డెత్ కేసు ముగిసినా.. శ్రీదేవి మరణంపై సమాధానం లేని ప్రశ్నలు అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇన్వెస్టిగేషన్ రిపోర్టులో శ్రీదేవి బాత్ టబ్‌లో పడిపోవడం వల్లే మరణించింది అని ఉంది. బాత్ టబ్‌లో పడిపోయినప్పుడు బలమైన గాయం అయితే తప్ప మరణించే అవకాశం లేదు. అయితే ఆమె శరీరం మీద చిన్నగాయం కూడా లేకపోవడంతో అభిమానుల్లో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శ్రీదేవి శరీరంలో ఆల్కహాల్ ఆనవాళ్లు ఉన్నట్లు ఫోరెన్సిక్ రిపోర్టులో ఉంది. అయితే ఆమెకు మద్యం అలవాటు లేదని, అప్పుడప్పుడు వైన్ మాత్రం తాగుతుందని సన్నిహితులు అంటున్నారు. మరి ఆమె బాడీలోకి ఆల్కహాల్ ఎలా వచ్చింది? అనే దానికి సమాధానం లేదు. ఇక బోనీ డాక్టర్‌కు ఎందుకు ఫోన్ చేయలేదు? బాత్రూంలో శ్రీదేవి పడిపోయి ఉండటాన్ని తొలుత చూసింది బోనీ కపూర్ అని అంటున్నారు. మరి బోనీ వెంటనే హటల్లో ఉండే ఎమర్జెన్సీ డాక్టర్‌కు ఫోన్ చేయకుండా తన స్నేహితుడికి ఎందుకు ఫోన్ చేశారు? అనే ప్రశ్నకు సమాధానం లేదు. పెళ్లి వేడుక ముగిసిన అనంతరం భర్త బోనీ కపూర్ ఇండియా వెళ్లిపోయారు. వేడుక ముగిసినా, భర్త ఇండియా వెళ్లి పోయినా శ్రీదేవి దుబాయ్ హోటల్‌లోనే ఎందుకు ఉండిపోయారు? అనే ప్రశ్నకు సమాధానం లేదు. పోస్టుమార్టమ్ రిపోర్టు ప్రకారం శ్రీదేవి 9 గంటలకు చనిపోయినట్లు ఉంది. అయితే ఆమె మరణవార్త మిడ్‌నైట్ తర్వాత గానీ బయటకు రాలేదు. ఇంత ఆలస్యం ఎందుకు జరిగింది? అనేది ఎవరికీ అంతుబట్టడం లేదు.

ఈ అగ్లీ ప్రపంచానికి శ్రీదేవి గురించి తెలియదు: వర్మ

శ్రీదేవి మృతితో చాలామంది అభిమానులు ఆమె జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ గడిపేస్తున్నారు. శ్రీదేవి గురించి ఇదే లాస్ట్ ట్వీట్.. ఇక ఆమె జీవించే ఉన్నారని ఫీలవుతా అంటూ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ ట్వీట్‌చేశారు.తాజాగా శ్రీదేవి నటించిన ఓ సాంగ్‌ని 1000 సార్లు చూశానంటూ వర్మ ట్వీట్ చేశారు. ఈ సాంగ్‌ని 1000 సార్లు చూశాను. ఇప్పటికీ ఆమె అందం నన్ను కట్టిపడేస్తోంది.ఆమె తన అందాన్ని ఎలా కాపాడుకున్నారో అని ట్వీట్ చేశారు.

శ్రీదేవి తన తండ్రి మరణం తర్వాత పంజరంలో పక్షిలా అయిపోయిందని రామ్‌గోపాల్‌వర్మ అన్నారు. నేను శ్రీదేవిని కలుసుకున్న నాటి నుంచి ఆమె జీవితం నాకు తెలుసు. తండ్రి మరణించే ముందు వరకు శ్రీదేవి జీవితం ఆకాశంలో ఎగిరే పక్షిలా ఉండేదని, ఆమె తల్లి అభద్రతాభావం కారణంగా శ్రీదేవి జీవితం పంజరంలో పక్షిలా మారిపోయింది అని అన్నారు. పన్నుల భయం కారణంగా ఆ రోజుల్లో నటీనటులకు నల్లధనాన్ని రెమ్యూనరేషన్‌గా ఇచ్చేవారు. శ్రీదేవి తండ్రి తన బంధువులను, స్నేహితులను బాగా నమ్మేవారు. ఆ డబ్బును వారి వద్ద దాచేవారు. తండ్రి చనిపోయిన తర్వాత ఆ డబ్బును ఆమెకు ఇవ్వకుండా ందరూ మోసం చేశారు. అని ఆ లేఖలో పేర్కొన్నారు.

శ్రీదేవి అంత పిరికిది కాదు



శ్రీదేవి మరణం చాలా బాధాకరమని, సినీ వినీలాకాశంలో ఆమె ఓ ధ్రువతార అని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. శ్రీదేవి మృతికి సంబంధించిన నిజనిజాలు తెలియాల్సి ఉందన్నారు. ఊహాగానాలతో తప్పుడు ప్రచారం సరికాదని, అది ప్రజల్లోకి వెళ్లడం మంచిది కాదన్నారు.

జాతకం ప్రకారం 70 ఏళ్లు.. చావును పిలిచారంటున్న జ్యోతిష్యుడు...!!

శ్రీదేవి జాతకం ప్రకారం ఆమెకు 70 ఏళ్లు ఆయుష్షు ఉందని, అయితే చావును కొని తెచ్చుకున్నారని కర్ణాటకలోని ఉడిపికి చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు ప్రకాష్ అమ్మణ్ణయ్య అంటున్నారు. శ్రీదేవి జాతకం క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన పూర్తి సమాచారం ఇచ్చారు. శ్రీదేవి మరణించారన్న విషయం తెలియగానే సోషల్ మీడియాలో ఆమె జాతకం తీసుకున్నామని అన్నారు.శ్రీదేవికి అన్ని గ్రహాలు అనుకూలంగానే ఉన్నాయని ఆయన చెప్పారు.

శ్రీదేవిని కచ్చితంగా మృత్యువు వెంటాడలేదని, అయితే ఆమె చావును కొని తెచ్చుకున్నారని అన్నారు. పాపం, పుణ్యం బల్ప్ పిలమిట్ లాగే మనుషులు జీవనశైలి ఉంటుందని, పాపం, పుణ్యం, స్వయం అపరాధాలు, ఆరోగ్యంపైన మన ఆయుష ఆధారపడి ఉంటుందని, వస్తువలకు వారంటీ ఉన్నట్లు జ్యోతిష్యుడు నీవు ఇంతకాలం బతుకుతావు అని మాత్రమే చెబుతారని, వస్తువును కాపాడుకున్నట్లే మనం కాపాడుకుంటే ఆయుష ఉన్నంతకాలం ప్రాణాలతో ఉంటామని ఆయన వివరించారు.

శ్రీదేవిపై అవాకులు, చవాకులు ఆపండి : సెలబ్రిటీలు

అతిలోకసుందరి శ్రీదేవి మృతిపై మీడియా రకరకాల కథనాలు వెలువడటంపై సెలబ్రిటీలు మండిపడుతున్నారు. హార్ట్ ఎటాక్, బాత్ టబ్‌లో ప్రమాదం, కాస్మొటిక్ సర్జరీలు, ఆస్తిగొడవలతో మనస్తాపం, ఆత్మహత్య.. హత్య అంటూ అనేక రకాలుగా మీడియాలో కథనాలు రావడంపై అసహనం వ్యక్తం చేస్తూ ఇకనైనా వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలని ట్వీట్స్ చేస్తున్నారు.

అల్లు అర్జున్ :

మీడియా, సోషల్ ప్లాట్‌ఫాం కంటెంట్ ప్రొవెడర్లు, ప్రజలకు నా విన్నపం. ఓ వ్యక్తి మరణాన్ని గౌరవించమని అందర్నీ కోరుతున్నాను.

రానా దగ్గుబాటి :

భారత చిత్ర పరిశ్రమలో శ్రీదేవి నటించిన తీరు ఇతర నటీనటులతో పోల్చలేనిది. నిజమైన లెజెండ్ శ్రీదేవి గురించి తప్పుగా ప్రచారం చేసి, ఆమె జ్ఞాపకాలను తుడిచేయకండి.

కాజల్:

సీరియస్‌గా చెబుతున్నా.. ఊహాగానాలని, పుకార్లను ఆపండి..

మెహరీన్ :

మరణాన్ని అవమానించకండి. ఆమె ఆత్మకు శాంతిని చేకూరనివ్వండి.

తాప్సి :

దయచేసి శ్రీదేవి ఆత్మకు శాంతి చేకూరనివ్వండి..

సిరత్ కపూర్ :

దయచేసి ఆమె ఆత్మకు శాంతి చేకూరనివ్వండి..

సుశాంత్ :

ఊహాగానాలు వద్దు.. ఆమె ఆత్మకు శాంతి చేకూరనివ్వండి..

ప్రణిత :

ఒకరి మరణాన్ని టీజ్ చేయకండి. ఇది వదంతులు రాసే సమయం కాదు..

చివరి చూపు



- ఉదయం 9: 30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు స్పోర్ట్స్ క్లబ్‌లో అభిమానుల సందర్శనార్థం
- మధ్యాహ్నం 2:00 గంటల నుంచి అంతిమ యాత్ర మొదలు
- మధ్యాహ్నం 3:30 గంటలకు విల్‌పార్లే సేవా సమాజ్ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు

దుబాయ్ వెళ్లే ముందు నాతో మాట్లాడింది..

శ్రీదేవికి ఆప్త మిత్రురాలు పింకీ రెడ్డి



నటి శ్రీదేవి దుబాయ్‌కి వెళ్లే ముందు తనతో మాట్లాడారని, తన ఆరోగ్యం కొద్దిగా బాగుండలేదని, జ్వరం, గొంతునొప్పి ఉందని తనకు చెప్పిందని ప్రముఖ సోషలేట్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి కూతురు పింకిరెడ్డి అన్నారు. శ్రీదేవికి ఆప్తమిత్రురాలైన పింకిరెడ్డి మాట్లాడుతూ, శ్రీదేవి చనిపోయిందంటే తనకు మొదట ఏమీ అర్థం కాలేదని, ఆ తర్వాత తన భర్తను అడిగానని చెప్పారు. ఆ తర్వాత అనిల్ కపూర్ భార్యకు ఫోన్ చేసి మాట్లాడాను. బోనీకపూర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేశారని, అయితే ఆయన ఏడుస్తూనే ఉన్నారని అన్నారు. బోనీ-శ్రీదేవి జంట ఒకరంటే మరొకరికి ప్రాణమని, ఇద్దరు పిల్లలు వారి ప్రాణమని అన్నారు. జాహ్నవి సినిమా విడుదలకు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీదేవి చనిపోయారంటే ఎలా స్పందించాలో కూడా అర్థం కావట్లేదని, ఆమె మరణించిందంటే నమ్మలేకపోతున్నానని వాపోయారు. పెళ్లిలో బాగా అలిసిపోవడం వల్లే ఆమె దుబాయ్‌లోనే ఉండిపోయిందని అన్నారు.

అవంటే ఆమెకు ఎంతో ఇష్టం...

శ్రీదేవి తమ ఇంటికి ఎప్పుడొచ్చినా చేపల పులుసు, బొమ్మిడాయిల పులుసు బాగా ఇష్టంగా తినేదని చెప్పారు. తాను ఎప్పుడైనా ముంబైలోని శ్రీదేవి నివాసానాకి వెళ్లేదానినని, తామిద్దరం కలిసి బయటకు వెళ్లేవాళ్లమని, తన బాడీగార్డ్, మేనేజర్ కూడా లేకుండా ఆమె తనతో బయటకు వచ్చేదని పింకీరెడ్డి గుర్తు చేసుకున్నారు.

టబ్ మరణాలు.. టఫ్ వాస్తవాలు

లెజెండరీ యాక్టర్ శ్రీదేవి హఠాత్మరణంతో ఆమె అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. అభిమాన తార అకాల మరణాన్ని జీర్ణించుకోలేక చాలామంది ఇంకా ఆ చేదు వార్తను నమ్మలేకపోతున్నారు.అయితే శ్రీదేవి మరణించిన తీరు అసాధారణమే. గతంలోనూ ప్రపంచ వ్యాప్తంగా పలువురు ప్రముఖులు బాత్ రూంలోని టబ్‌లో పడి మృతి చెందారు. అలాంటి వారి గురించి సంక్షిప్తంగా..

జిమ్ మోర్రిసన్




మోరిసన్ అమెరికా గాయకుడు, పాటల రచయిత, కవి. తన పాటల ద్వారా జనాన్ని ఉర్రూతలూగించిన మోర్రిసన్ శ్రీదేవి లాగే హఠాత్మరణం చెందాడు. 1971 లో పారిస్‌లో బాత్‌రూమ్ టబ్‌లో పడి మరణించాడు. ఎక్కువ మొత్తంలో డగ్స్ తీసుకుని .. ఆ మత్తులోనే బాత్ రూమ్ టబ్‌లో పడిపోయిన మోర్రిసన్ అక్కడే తుదిశ్వాస విడిచాడు. అయితే మోర్రిసన్ భౌతికకాయానికి శవపరీక్ష చేయకపోవడం గమనార్హం.

జూడీ గార్లాండ్



నటిగా, గాయనిగా అమెరికాలో జనం మదిలో చెరగని ముద్రవేసుకున్న జూడీ గార్లాండ్‌కు చిన్నప్పటి నుంచి లలిత కళలంటే ఎంతో మక్కువ. దీం తో ప్రపంచ వ్యాప్తంగా వివిధ షోలతో అభిమానులను సంపాదించుకుంది. సంగీతం, డ్రామాలతో జన హృదయ నటిగా పేరుతెచ్చుకున్న జూడీ గార్లాండ్ 1969 లో అధిక మత్తుపదార్థాలను తీసుకుని బాత్ రూంలోని టబ్‌లో జారిపడి ప్రాణాలొదిలింది.

విట్నీ హూస్టన్



ఈమె ప్రఖ్యాత అమెరికన్ గాయని, నటి, ప్రొడ్యూసర్, మోడల్.1963 లో జన్మించిన విట్నీ హూస్టన్ తన పాటలతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధిం చింది. ఆల్ టైల్ బెస్ట్ మ్యూజిక్ సెల్లింగ్ ఆర్టిస్ట్‌గా పేరు సంపాదించింది. అయితే ఈమె కూడా అకాలమరణం చెందింది. 2012 లో కాలిఫోర్నియాలో తన గెస్ట్ హౌస్‌లోని బాత్‌రూమ్ టబ్‌లో పడి మృతి చెందింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆమె కొకైన్ తీసుకుని ఉందని ఆ మత్తులోనే టబ్ నుంచి పైకిలేవ లేక నీటమునిగి చనిపోయిందని పోస్ట్‌మార్టంలో తేలింది.

బాబీ క్రిస్టినా బ్రౌన్



ప్రముఖ గాయకులు బాబీ బ్రౌన్, విట్నీ హూస్టన్ కూతురుగా అమెరికాలో మంచి పేరున్న బాబీ క్రిస్టినా బ్రౌన్ రియార్టీ షో ద్వారా, టీవీ కార్యక్రమాల ద్వారా జనాలను తన వైపు తిప్పుకుంది. 2015 లో ప్రమాదవశాత్తు బాత్ రూంలోని టబ్‌లో పడిపోయిన ఈమె దాదాపు ఆరునెలల పాటు కోమాలో ఉండి.. ఆ తర్వాత తనువుచాలించింది. ప్రమాదం జరిగిన సమయంలో మత్తుపదార్థాలు తీసుకున్నట్లు వైద్యులు నిర్ధారించారు.

జపాన్‌లో ఏడాదికి 19వేల మంది

బాత్‌రూం టబ్ మరణాలు ఇప్పుడేం కొత్త కాకపోయినా జపాన్ వీటి సంఖ్య అధికంగా ఉంది. ఓ అధ్యయనం ప్రకారం జపాన్‌లో ఏడాదికి 19వేల మంది బాత్‌రూంలోని టబ్‌లో పడి మృతి చెందిన వారేనని తేలింది. జపాన్ వినియోగదారుల వ్యవహారాల ఏజెన్సీ ఈ వివరాలను వెల్లడించింది. గత పదేళ్లలో బాత్‌రూం టబ్ మరణాలు 70 శాతంపెరిగినట్లు పేర్కొంది. ప్రతీ 10 మందిలో 9 మంది 65 ఏళ్ల పైబడిన వారే ఇలా మరణిస్తున్నట్లు తెలిపింది. జపాన్‌లో 41 డిగ్రీల వేడినీటితో కూడిన టబ్‌లో స్నానం చేయడం అలవాటు. ఆ అలవాటే చాలా మంది ప్రాణాలు మింగేస్తోంది.



అమెరికాలో రోజుకొకరు

స్నానపు గదుల్లో చనిపోయే వారి సంఖ్య అమెరికాలోనూ ఎక్కువ. 2006లో నిర్వహించిన ఓ అధ్యయనంలో ప్రతీరోజు ఎక్కడో ఓ చోట బాత్ టబ్‌లోనో... హాట్‌టబ్‌లోనో...స్పాలోనో ఒకరు మరణిస్తున్నట్లు తేలింది.2015 లో అట్లాంటాకు చెందిన సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ సంస్థ, అమెరికా కూడా బాత్ డెత్‌లపై కీలక విషయాలను బయటపెట్టాయి. బాత్ రూంలు చాలా చిన్నవిగా ఉండటం కూడా మరణాలకు కారణవౌతున్నట్లు వెల్లడించాయి. ప్రతీ ఏడాది రెండు లక్షలకుపైగా బాత్‌రూంలో పడి గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన వారే ఉన్నట్లు పేర్కొన్నాయి.

మృతదేహానికి ఎంబాల్మింగ్ ఎలా చేస్తారు

చనిపోయిన మూడు రోజుల తర్వాత శ్రీదేవి భౌతికకాయాన్ని దుబాయ్ పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇప్పటికే చాలా సమయం కావటంతో ఎంబాల్మింగ్ చేయించారు. మృతదేహాన్ని కొన్ని రోజులపాటు అంత్యక్రియలు చేయకుండా ఉంచాల్సిన సందర్భాల్లోఎంబాల్మింగ్ చేస్తారు. ప్రస్తుతం శ్రీదేవి భౌతికకాయం మూడు రోజులుగా మార్చురీ ఫ్రీజర్‌లో ఉంచారు. ఒక్కసారి బయటకు తీసుకొచ్చి ఇండియా తరలించాంటే కొంత సమయం పడుతుంది.

ఆ విధంగా చేస్తే శరీరం దెబ్బతింటుంది. అందుకే అతిలోక సుందరిని కడసారిగా చూడాలనుకునే అభిమానుల కోసం ఎంబాల్మింగ్ చేశారు. ఎంబాల్మింగ్ చేయడం వల్ల మృతదేహం చెడిపోదు.ఈ ప్రక్రియలో కొన్ని రసాయన ద్రవాలను ధమనుల ద్వారా శరీరంలోకి పంపిస్తారు. ఈ ద్రవాలను ఎంబాల్మింగ్ ఫ్లూయిడ్స్ అంటారు. ఫార్మాల్డిహైడ్, మెథనాల్, ఇథనాల్‌తోపాటు కొన్ని రసాయనాలను ఈ ప్రక్రియలో వాడతారు. ఎంబాల్మింగ్ ఫ్లూయిడ్స్‌ని ఎక్కించడం వల్ల బాక్టీరియా వంటి సూక్ష్మజీవులు చచ్చిపోతాయి.

దీంతో శరీరం యథావిధిగా ఉంటుంది. ఏడాది క్రితం చనిపోయిన జయలలితకి కూడా ఎంబాల్మింగ్ చేశారు. భారత దేశంలో ఈ ప్రక్రియను ప్రముఖులకు వాడుతూ ఉంటారు.. అమెరికా లాంటి దేశాల్లో ఇది కామన్. ఒక్క అమెరికాలోనే ఏడాదికి 2 కోట్ల లీటర్ల ఎంబాల్మింగ్ ఫ్లూయిడ్స్, కెమికల్స్ అమ్ముడుపోతుంటాయని ఓ అంచనా.

బాత్‌రూంలో గుండెపోటు ఎందుకొస్తుంది..?

శ్రీదేవి హఠాత్మరణం తర్వాత కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. శ్రీదేవి బాత్ టబ్‌లో పడిపోయే ముందు గుండెపోటు వచ్చిందని వార్తలు రావడంతో అసలు బాత్ రూంలో ఉన్నప్పుడు స్ట్రోక్ ఎందుకొస్తుందనే దానిపై మలేషియాకు చెందిన ఐటీఎం వర్సిటీకి చెందిన ఓ ప్రొఫెసర్ కారణాలను వెల్లడించారు. షవర్ బాత్ చేసేటప్పుడు మొదట తల, వెంట్రుకలను తడపడం మంచిదికాదంటున్నారు. ఇలా చేయడం వల్లే శరీరంలోని ఉష్ణోగ్రతలో తేడా వస్తుందని చెప్పారు. ఎందుకంటే మన శరీరంలోని రక్తం వేడిగా ప్రసరిస్తుంది కాబట్టి ఒక్కసారిగాతలను నీటితో తడపడం ఉష్ణోగ్రతల్లో పెనుమార్పులు సంభవించి రక్తం ఒక్కసారిగా తలనాడుల వైపు దూసుకొస్తుందని.. దాని ప్రభావంతో రక్త దమనులు చిట్లిపోవడం గానీ.. ఒక్కసారి స్ట్రోక్ రావడం గానీ జరగవచ్చని తెలిపారు.

షవర్ కింద స్నానం చేసే వారు మొదట కాళ్ల నుంచి బాడీని తడుపుకుంటూ తలను తడపాలని అలా చేయడం ద్వారా రక్త ప్రసరణలో మార్పులు రావని పేర్కొన్నారు. కొంత మంది తలకు ఆవిరిపట్టుకునే క్రమంలోనూ సరైన విధానాలు అవలంభించకపోవడం వల్ల కూడా ప్రమాదాలు జరగవచ్చని హెచ్చరించారు. రక్తపోటు ఉన్నవారు ఖచ్చితంగా షవర్ స్నానం చేసే వారు ఈ విధానాన్ని పాటిస్తే ఎలాంటి హానీ జరగదని తెలిపారు.



శ్రీదేవి పార్థివదేహం ముంబయిలోని ఆమె నివాసానికి అంబులెన్స్‌లో తరలింపు



ముంబయికి చేరుకున్న బాలీవుడ్ నటుడు అనిల్‌కపూర్



శ్రీదేవి ఇంటికి వస్తున్న నటుడు సంజయ్‌కపూర్

క్రీడాప్రభ



హజారే కర్నాటక

41 పరుగుల తేడాతో సౌరాష్ట్రపై విజయం.. కప్ కైవసం

న్యూఢిల్లీ: సౌరాష్ట్రపై కర్నాటక ఆధిపత్యం చెలాయించింది. విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌరాష్ట్రను 41 పరుగులతో చిత్తు చేసి, ప్రతిష్టాత్మక టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో మూడు సార్లు హజారే ట్రోఫీని సొంతం చేసుకున్నట్లు అయింది. కర్నాటక బ్యాట్స్‌మన్ మయాంక్ 90 పరుగుల చేసి, జట్టు విజయానికి బాటలు వేశాడు. మయాంక్, అగర్వాల్ రాణించడంతో 45.5 ఓవర్లకు 253 పరుగులు చేసింది. ఆ తర్వాత బరిలోకి దిగిన సౌరాష్ట్ర జట్టు లక్ష్య ఛేదనలో తడబడింది. చతేశ్వర్ పుజారా ఒంటరి పోరాటం ఆ జట్టును విజయ తీరాలకు చేర్చలేక పోయింది. పుజారా 127 బంతుల్లో 94 పరుగులు చేశాడు. మిగతా బ్యాట్స్‌మన్ నుంచి అతనికి సరైన సహకారం లభించలేదు. ఏ ఒక్కరూ మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు తోడ్పాటు అందివ్వలేదు. దాంతో 46.3 ఓవర్లకు 212 పరుగుల వద్ద సౌరాష్ట్ర పోరాటానికి తెరపడింది. కర్నాటక బౌలర్లలో ఆఫ్ స్పిన్నర్ క్రిష్ణప్ప గౌతమ్ 3 వికెట్లతో రాణించాడు. సమార్త్ వ్యాస్ (10), పించ్ హిట్టర్ ధర్మేంద్ర (1)ను వెంటవెంటనే అవుట్ చేశాడు. పుజారా, అవి బరాట్ మూడో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన మిగతా బ్యాట్స్‌మన్ సరిగా నిలదొక్కుకోలేక పోయారు. రవీంద్ర జడేజా పేలవ షాట్‌కు ప్రయత్నించి పెవిలియన్ చేరడంతో, విజయం కర్నాటకవైపు మొగ్గింది. మొత్తంగా ఈ టోర్నమెంట్‌లో అగర్వాల్ హీరోగా నిలిచాడు. టోర్నీలో 723 పరుగులు చేసాడు. తద్వారా ఈ సీజన్‌లో 2141పరుగులు సాధించాడు. ఇంకా రెండు టోర్నీలు ఆడాల్సి ఉంది. మంగళవారం నాటి ఫైనల్ మ్యాచ్‌లో అతను 11 ఫోర్లు , మూడు సిక్సర్ల సాయంతో .... పరుగులు చేశాడు. కెప్టెన్ కరుణ్ నాయర్ (00, కేఎల్ రాహుల్ (0) వెంటవెంటనే ఔటయ్యారు. ఈ దశలో అగర్వాల్, రవికుమార్‌జోడీ మూడో వికెట్‌కు 21.5 ఓవర్లలో 136 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. అగర్వాల్ స్పిన్ బౌలింగ్‌లోనూ ధారాళంగా పరుగులు రాబట్టాడు. సెంచరీకి చేరువవుతున్న క్రమంలో ధర్మేంద్ర అతని ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు.



"ఈ పరుగులతో నా కల సాకారమైంది. ఈ సీజన్ మధురం. గడ్డుకాలంలో అండగా నిలిచి, నాపై నమ్మకంఉంచిన కర్నాటక సెలెక్టర్లకు కృతజ్ఞతలు. మంచి ఆత్మవిశ్వాసంతో ఉన్నాను. ఈ మధ్య కాలంలో నా ప్రేమ ప్రతిపాదనను ప్రియురాలు ఓకే చేసింది. ఇది కూడా ఒక శుభసూచకం"

\- మయాంక్ అగర్వాల్

స్కోర్లు:

కర్నాటక: 253 (45.5 ఓవర్లు). మయాంక్ అగర్వాల్ 90, రవికుమార్ సమర్త్ 48, పవన్ దేశ్ పాండే 49. బౌలింగ్: కమ్లేశ్ మక్వానా 4/34

సౌరాష్ట్ర: 121 (46.3 ఓవర్లు). పుజారా 94. బౌలింగ్ : క్రిష్ణప్ప 3/37



'254 పరుగుల ఛేదన సాధ్యమే. మిడిల్ ఓవర్లలో స్పిన్ బౌలింగ్‌ను జాగ్రత్తగా ఆడాలని బ్యాట్స్‌మన్‌కు సూచించాను. ముఖ్యంగా కోట్లా వంటి చిన్న మైదానంలో చివరి 10 ఓవర్లలో 100 పరుగులు సాధించడం తేలికే. అయితే చివరి దశలో వికెట్లు చేతిలో ఉండాలి. మా బ్యాట్స్‌మన్ వైఫల్యం చెందారు"

\- చతేశ్వర్ పుజారా

ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు శ్రీనాథ్ అర్వింద్ గుడ్‌బై



కర్నాటక లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ సమీర్ శ్రీనాథ్ అర్వింద్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. 2015లో ద.ఆఫ్రికాపై చివరిసారి టీ20 మ్యాచ్ ఆడాడు. దేశవాళీ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలగుతున్నట్లు చెప్పాడు. కర్నాటక జట్టు జాతీయ వన్డే చాంపియన్ షిప్ నెగ్గిన నేపథ్యంలో రిటైర్మెంట్ ప్రకటించాడు. పదేళ్ల కెరీర్‌లో ఇతను 56 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. మొత్తంగా 186 వికెట్లు సాధించాడు. 84 టీ20 మ్యాచ్‌లు ఆడి 103 వికెట్లు తీసాడు. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు టీమ్ తరఫున కొన్ని మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. యువ ప్రతిభావంతులకు అడ్డంకిగా ఉండాలని భావించడం లేదు. కర్నాటక క్రికెట్ అసోసియేషన్‌కు, తల్లిదండ్రులకు, కోచ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇటీవల కాలంలో కర్నాటక జట్టు దేశవాళీ టోర్నీలన్నింట్లోనూ జైత్రయాత్ర కొనసాగించింది. రంజీట్రోఫీ, ఇరానీ కప్, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలను గెలిచింది.

టీమిండియాకు స్ఫూర్తి ధోనీ, కోహ్లీలే

కెప్టెన్‌గా విరాట్ కాస్తంత దూకుడు తగ్గించాలి

మహి గొప్ప నాయకుడూ... విజేత కూడా...

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ పర్యటనలు సవాలే

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా వెల్లడి



మొనాకో: దక్షిణాఫ్రికా పర్యటనలో విరాట్ కోహ్లీ దూకుడు కొంచెం పెరిగింది. ఆకర్షణీయ టీమిండియా కెప్టెన్‌గా అతని ఎదుగుదలలో ఇదీ ఒక భాగంగా భావిస్తున్నాను అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా వ్యాఖ్యానించాడు. వన్డే, టీ20 సిరీస్ విజయాలతో 58 రోజుల సఫారీ పర్యటనను ఇండియా ఆస్వాదించింది. భారత జట్టులో మొత్తంగా కోహ్లీ బ్యాటింగ్ పెర్ఫార్మెన్స్ అద్భుతం. ఈ అరుదైన విజయం వారికి అతిపెద్ద సానుకూల అంశమని పేర్కొన్నాడు. లారస్ ప్రపంచ స్పోర్ట్స్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా స్టీవ్ వా పీటీఐతో తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'సఫారీ పర్యటనలో కోహ్లీ అత్యున్నతంగా కనిపించాడు. కెప్టెన్‌గా అతను ఎదిగేదశలోనే ఉన్నాడు. బ్యాటింగ్ తరహాలోనే ఉత్సాహం, భావోద్వేగాల్లోనూ సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. విరాట్ మాదిరిగా మిగతా ఆటగాళ్లు దూకుడు ప్రదర్శించరు. రహానే, పుజారా చాలా గుంభనంగా ఉంటూనే జట్టుకు విలువైన బ్యాట్స్‌మన్‌గా పేరుతెచ్చుకున్నారు. ఈ విషయాన్ని కోహ్లీ గ్రహించాలి. ఉద్వేగాన్ని నియంత్రించుకుంటేనే సెంచరీలు సాధించామన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఒక ఆటగాడిగా అతడిని అపారమైన గౌరవం ఉంది అని స్టీవ్ వా చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం జట్టును విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. అతనిలో ఆ సామర్థ్యం ఉంది. సహచర ఆటగాళ్లు తనలాగా పాజిటివ్‌గా ఉండాలని, వేగంగా విజయాలు సాధించాలని కోరుకుంటాడు. అన్ని ఫార్మాట్లలోనూ జట్టును నంబర్ వన్‌గా నిలపాలన్న తపన అతనిది. గత కొన్నేళ్లుగా టీమిండియా మంచి రికార్డు కలిగివుంది అని స్టీవ్‌వా వెల్లడించాడు.

కోహ్లీ, ఇండియా తదుపరి లక్ష్యం ఇంగ్లండ్,ఆస్ట్రేలియా పర్యటనలే. ఇక్కడ గట్టి సవాల్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. ఆస్ట్రేలియాలో ఇండియా విజయాలకు కోహ్లీయే కీలకం. కిందటిసారి కూడా అతను బాగా రాణించాడు. ఇండియాలో ఇండియా ఎంత బలమైన జట్టో, ఆస్ట్రేలియా కూడా స్వదేశంలో అంతే గొప్ప టీం. అయితే టీమిండియా కుర్రాళ్లు అమితమైన ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. కెప్టెన్ నమ్మకాన్ని నిజం చేయడంలో సక్సెస్ అవుతున్నారు. ఆస్ట్రేలియాను కచ్చితంగా ఓడించగలమన్న విశ్వాసం వారిలో కనిపిస్తోంది. ఆసీస్ పిచ్‌లు ఇండియా తరహాలోనే ఉండే అవకాశం ఉంది. అందువల్ల అటు బ్యాట్స్‌మన్, స్పిన్నర్లు రాణించొచ్చు. మొత్తంగా ఆసీస్‌తో టీమిండియా సమరం పోటాపోటీగా ఉంటుందని మాత్రం చెప్పగలను అని స్టీవ్ వా వివరించాడు.

ధోనీలో సత్తా ఉంది..



వికెట్‌కీపర్ మహేంద్ర సింగ్ టీమిండియాకు స్ఫూర్తి. కీపర్‌గానే కాదు.. బ్యాట్స్‌మన్‌గా కూడా యువకులకు ప్రేరణ. అతనిలో ఇంకా సత్తావుంది. కనీసం వచ్చే యేడాది ప్రపంచకప్ వరకు జట్టులో ఉంటాడని ఆశిస్తున్నాను. మెగా ఈవెంట్‌కు ఇంకా 12 నెలల వ్యవధి ఉంది. అప్పటిదాకా తన శక్తిసామర్థ్యాలను కాపాడుకోవడమే ప్రధానం. ఇదివరకు సీనియర్ ప్లేయర్ అంటే పెద్దగా ప్రణాళికలు, ప్రాక్టీసు అవసరం లేదన్న భావన ఉండేది. కానీ, ధోనీ ఇందుకు భిన్నం. నెట్స్‌లో కుర్రాళ్లతో పోటీగా ప్రాక్టీసు చేస్తుండటమే ఇందుకు నిదర్శనం. మహీ గొప్ప నాయకుడు.. అంతకు మించి గొప్ప విజేత అని ఆస్ట్రేలియా లెజెండ్ స్టీవ్ కితాబిచ్చాడు.

ఆసీస్‌తో వన్డే సిరీస్ మహిళా టీమ్

కెప్టెన్‌గా మిథాలీ రాజ్



ముంబై: ఆస్ట్రేలియా మహిళల జట్టుతో వన్డేసిరీస్‌కు భారత జట్టు ఎంపిక పూర్తయింది. 15మంది సభ్యుల బృందాన్ని బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఈ సిరీస్‌లో జట్టుకు మిథాలీ రాజ్ సారథ్యం వహించనుంది. హర్మన్ ప్రీత్‌కౌర్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. వడోదారలో మార్చి 12-18 మధ్య భారత్, ఆసీస్ మధ్య 3 వన్డే మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆల్ ఇండియా సెలక్షన్ కమిటీ పేటీఎం వన్డేసిరీస్‌కు భారత జట్టును ఎంపికచేసింది. ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ (2017-2020)లో భాగంగా ఈ మ్యాచ్‌లు జరుగుతాయని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌధరి తెలిపారు. సిరీస్ ముగిసిన తరువాత టీ20 ట్రైసిరీస్ జరుగుతుందని చెప్పారు. టీ20 జట్టును కొద్ది రోజుల తర్వాత ప్రకటిస్తామన్నారు. సౌతాఫ్రికా పర్యటనలో మిథాలీ సారథ్యంలోని వన్డే జట్టు 2-1తోను, హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని టీ20 జట్టు 3-1తో సిరీస్‌లను గెలిచి చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తొలి వన్డే మార్చి 12న, రెండో వన్డే 15న, మూడో వన్డే 18న జరగనుంది. టీ20 సిరీస్‌కు జట్టు ఎంపిక త్వరలో ఉంటుందని చెప్పారు.

వన్డే జట్టు; మిథాలీ రాజ్ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్ కౌర్ (వైస్‌కెప్టెన్), స్మృతి మంధన, పూనం రౌత్, జెమిమా రొడ్రిగ్యూస్, వేద క్రిష్ణమూర్తి, మోనా మేష్రం, సుష్మా వర్మ (కీపర్), ఏక్త బిష్త్, పూనం యాదవ్, రాజేశ్వరి గాయక్వాడ్, శిఖా పాండే, సుకన్య పరిడా, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ.

ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్- 1 కాంపిటీషన్ సర్క్యూట్‌లో జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా పసిడి పతకం సాధించాడు. 82.88 మీటర్ల దూరం విసిరాడు.

యువకెప్టెన్ రషీద్

కాబూల్: అఫ్ఘనిస్తాన్ స్పిన్ మిస్సైల్ రషీద్ ఖాన్ మరో అరుదైన రికార్డును చేరుకున్నాడు. అతిచిన్న వయస్సులోనే కెప్టెన్ బాధ్యతలు చేపట్టిన క్రికెటర్‌గా నిలిచాడు. రెగ్యులర్ కెప్టెన్ అస్గర్‌కు ఆపరేషన్ జరగడంతో, అతని స్థానంలో రషీద్‌ను తాత్కాలిక కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు ఆ దేశ క్రికెట్ బోర్డు ప్రకటించింది. దీంతో 19 ఏళ్ల 159 రోజులకు కెప్టెన్సీ స్వీకరించిన పిన్న వయస్కుడిగా రషీద్ ఘనత సాధించాడు. ఇతనికంటే ముందు బంగ్లా క్రికెటర్ రజన్ సలేహ్ పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా రికార్డుల్లో ఉన్నాడు. ఇప్పుడు అతని రికార్డును రషీద్ బ్రేక్ చేసాడు. ఈమధ్య ఐసీసీ ప్రకటించిన వన్డే, టీ20 బౌలింగ్ ర్యాంకుల్లో అగ్రస్థానానికి రషీద్ చేరాడు. పిన్న వయసులో టాప్ బౌలర్ అయిన ఘనతను తన పేరిటే లిఖించుకున్నాడు.

అంతర్జాతీయ క్రికెట్‌లో యువ కెప్టెన్‌లు వీరే

రషీద్ ఖాన్ (అఫ్ఘనిస్తాన్) - 19 ఏళ్ల 159 రోజులు , రాజిన్ సలేహ్ (బంగ్లాదేశ్) - 20 ఏళ్ల 297 రోజులు, రోడ్నీ ట్రోట్ (బెర్ముడా) - 20 ఏళ్ల 332 రోజులు, తతెందతైబు (జింబాబ్వే) - 20 ఏళ్ల 342 రోజులు, నవాబ్ పటౌడి (భారత్) - 21 ఏళ్ల 77 రోజులు





కొత్త రూల్స్ కంగాళీయమే..

ఫెడరేషన్ నిర్ణయంపై బ్యాడ్మింటన్ కోచ్‌ల పెదవి విరుపు

న్యూఢిల్లీ: ఆట జరుగుతున్నప్పుడు కోర్టు - కోచింగ్ ప్రాత్రను తగ్గించడంలోని ఆంతర్యమేమిటో అంతు చిక్కడం లేదు. అదేవిధంగా పాయింట్ల విధానాన్ని సమూలంగా మార్చడానికి గల లాజిక్కు అర్థం కావడం లేదు అని బ్యాడ్మింటన్ కోచ్‌లు బాహాటంగా నిట్టూరుస్తున్నారు. ప్రపంచ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) ప్రతిపాదిత నిబంధనల సడలింపును పలువురు అంతర్జాతీయ కోచ్‌లు వ్యతిరేకిస్తున్నారు. పుల్లెల గోపీచంద్ నుంచి, కెన్నెత్ జొనాస్సెన్ వరకు ప్రతి ఒక్కరూ ఈ చర్యను ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మూడు గేమ్‌ల విధానం స్థానంలో బెస్ట్ ఆఫ్ ఫైవ్ ఫార్మాట్ తీసుకు రావాలని బీడబ్ల్యూఎఫ్ ప్రతిపాదించింది.

ప్రతి గేమ్‌లో ఇప్పుడున్న 21 పాయింట్లకు బదులు 11 పాయింట్లు ఉంటాయి. ఈ తరహా మార్పుల ప్రతిపాదనల అమలుపై మే నెల బ్యాంకాక్ వార్షిక సర్వసభ్య సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు. ఆన్ కోర్ట్ కోచింగ్ సమయం కుదింపు ఎంత వరకు అన్నది స్పష్టంగా తెలీదు. అసలు దీని ఉద్దేశ్యం, ప్రయోజనం ఏమిటో మాకైతే అర్థం కావడం లేదు. ఏమేం మార్పులు చేస్తున్నారో నాకు అవగాహన లేదు. సదరు ముసాయిదాను నేను పరిశీలించలేదు అని గోపీ చంద్ వ్యాఖ్యానించాడు. ఆన్‌కోర్టు కోచింగ్ అనేది విలక్షణమైనది. అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. మిగతా ఆటలతో బ్యాడ్మింట్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది ఇదే అని డెన్మార్క్ చీఫ్ కోచ్ కెన్నెత్ జొనాస్సెన్ పేర్కొన్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణ పతక విజేత విక్టర్ యాక్సెసెన్‌కు ఇతనే మార్గదర్శి. ఆన్‌కోర్టు కోచింగ్ వల్ల మ్యాచ్ సమయం పెరిగిపోతోందన్న వాదన సరైంది కాదు. దీనికి విరుద్ధమైన కార్యాచరణ చెడు ఫలితాలనే ఇస్తుందని కెన్నెత్ అభిప్రాయపడ్డారు. కాగా, ఇండియా మాజీ కోచ్‌లు విమల్ కుమార్, సయ్యద్ మహ్మద్ ఆరిఫ్‌లు మాత్రం భిన్నంగా స్పందించారు. బీడబ్ల్యూఎఫ్ నిర్ణయాన్ని స్వాగతించారు. కొత్త ఫార్మాట్ మూలంగా ఆటగాళ్లు మరింత రాటుదేలతారని చెప్పారు.

ముక్కోణపు సిరీస్‌కు మాథ్యూస్ దూరం



కొలంబో: వచ్చే నెల మొదటి వారంలో భారత్, బంగ్లాదేశ్ జట్లతో ఆరంభం కానున్న ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాల్గొనే శ్రీలంక జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. కీలక ఆటగాడు, ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ గాయం కారణంగా సిరీస్ నుంచి వైదొలిగాడు. మాథ్యూస్‌కు కాలిపిక్క గాయం కావడంతో అతను ట్రైసిరీస్‌కు దూరమవుతున్న విషయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు(ఎస్ఎల్‌సీ) ప్రకటించింది. ట్రై సిరీస్ నుంచి మాథ్యూస్ ఉన్నపళంగా తప్పుకోవడం నిరాశకు గురి చేసిందని లంక మేనేజ్‌మెంట్ పేర్కొంది. గత నెల్లో శ్రీలంక వన్డే జట్టుకు కెప్టెన్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించిన మాథ్యూస్.. కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఆడాడు. ట్రై సిరీస్ నేపథ్యంలో ఫిట్‌నెస్ సాధించడం కోసం కొలంబోలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మాథ్యూస్ శిక్షణ పొందుతున్నాడు. శిక్షణలో అతని కాలిపిక్క గాయం తీవ్రం కావడంతో సిరీస్ నుంచి తప్పుకోక తప్పలేదు. "ట్రై సిరీస్‌కు అందుబాటులో ఉండేందుకు మాథ్యూస్ చాలా నిబద్ధతతో కష్టపడ్డాడు. ఫిట్‌నెస్, ఫామ్ సాధించేందుకు కఠోర సాధన చేశాడు. దురదృష్టవశాత్తు ట్రైనింగ్ సెషన్‌లో అతడి గాయం తిరగబెట్టిందని" శ్రీలంక క్రికెట్ బోర్డు పేర్కొంది. మార్చి 6 వ తేదీ నుంచి శ్రీలంకలో ట్రై సిరీస్ ఆరంభం కానుంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
బుధవారం 28 ఫిబ్రవరి 2018

బాడీ ఇమేజ్... చెక్కిన శిల్పాలు!



శ్రీదేవి మరణం తరువాత ఆమెకు నటిగా ఇమేజ్ ఏ స్థాయిలో ఉందో కళ్లకు కట్టినట్టుగా కనిపించింది. సాధారణంగా ప్రభుత్వంలో ఉన్నతస్థాయిలో ఉన్నవారు మరణిస్తే...మూడురోజులు సంతాపదినాలు ప్రకటించి..రేడియో, దూరదర్శన్‌లలో విషాదం ధ్వనించే సంగీతం, పాటలు వినిపించడం ఆనవాయితీ. కానీ శ్రీదేవి విషయంలో మీడియా...తమకు తాముగా సంతాపదినాలు ప్రకటించుకున్నట్టుగా మూడురోజులుగా పూర్తిగా...శ్రీదేవికి అంకితమై పోయింది. భారతదేశపు మొట్టమొదటి మహిళా సూపర్‌స్టార్‌గా, అభిమానుల అందాల ఆరాధ్యదేవతగా, అంతులేని సౌందర్యం, ప్రతిభలు కలబోసిన నటీమణిగా ఆమెకు దక్కిన గౌరవం చూస్తున్నపుడు...సినిమా ఉన్నంతకాలం ఆమె జీవించే ఉంటుందనే మాట చాలా చిన్న మాట అవుతుంది. అయితే ఒక పక్క ఈ స్థాయిలో శ్రీదేవి పట్ల ఆరాధన, ఆవేదన కనబడగా మరోపక్క...అదే ఆరాధన శ్రుతిమించి మరోదారి పట్టింది. శ్రీదేవి అందంకోసం చేయించుకున్న ఆపరేషన్లే వికటించాయని, ఆమె కొన్నాళ్లుగా పిల్స్, ద్రవాలమీదే బతుకుతున్నారని, బరువు తగ్గడానికి మందులు వాడుతున్నారని...ఇలా రకరకాల అపోహలు విస్తృతంగా వ్యాపించాయి. నటీమణుల విషయంలో ఇలాంటి విచిత్రపరిస్థితి ఒకటి వారిని వెంటాడుతుంది. ప్రేక్షకులు... శరీర అందాన్ని బట్టే వారిని ఆరాధించడం మొదలుపెడతారు...కానీ దాన్ని కాపాడుకోవడానికి వారు చేసే ప్రయత్నాలపై విమర్శలు, వ్యంగ్యాస్త్రాలను సంధిస్తుంటారు. హీరోలకు దక్కేది ఇమేజ్...అయితే హీరోయిన్ల పేరు ప్రతిష్టలు వారి బాడీ ఇమేజ్ పైనే ఆధారపడి ఉండటం విషాదమే. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో నటీమణులు అందం కోసం చాలా మూల్యాన్ని చెల్లిస్తున్నారు.

స్త్రీలు... ముఖ్యంగా సెలబ్రిటీల విషయంలో బాడీ ఇమేజ్ అనే పదం ఇప్పుడు చాలా పాపులర్ అయ్యింది. ఒక వ్యక్తి తన శరీర అందం ఆకర్షణలను గురించి తానేమి అనుకుంటున్నాడో తెలిపే పదం బాడీ ఇమేజ్. ఈ పదాన్ని మొట్టమొదట ఆస్ట్రియా దేశానికి చెందిన న్యూరాలజిస్ట్, సైకో ఎనలిస్ట్ పాల్ ఛిండర్ సృష్టించాడు. ఈ పదానికి చాలా విస్తృతమైన అర్థం ఉంది. స్త్రీల విషయంలోనే దీనిని ఎక్కువగా వాడుతున్నారు. ఎందుకంటే...స్త్రీలకే 'నేను అందంగా ఉన్నానా' అనే ప్రశ్న జీవన్మరణ సమస్యగా మారుతోంది. నటీమణులకు ఇది మరింత ఎక్కువ. అందుకే ఎవరూ..ఏమీ అనకపోయినా వారు తమశరీరాన్ని మరింత మరింత అందంగా మార్చుకోవాలని తపిస్తుంటారు. ముఖ్యంగా బాడీ ఇమేజ్ అనే పదం విషయంలో గుర్తుంచుకోవాల్సిన విషయం...మనసులో ఎవరి రూపం పట్ల వారికి ఏర్పడిన ముద్ర అది. ఉదాహరణకి ఒకమ్మాయి కాస్త బొద్దుగా ఉండి...చూసేవారికి చాలా అందంగానే కనబడుతుందను కోండి...కానీ ఆమె మాత్రం ఆ విషయాన్ని నమ్మదు. ఎందుకంటే...ఆమె మనసులో తన బాడీ ఇమేజ్ లావుగా అందవికారంగా కనబడుతుందన్నమాట. ఇక దాన్ని సరిచేసుకోవాలని తిండితినటం మానేస్తుంది. గంటలుగంటలు వ్యాయామం చేస్తుంది. ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటుంది. అంటే ఒక్కోసారి ఇది లేని సమస్యలను కలిగిస్తుంది. అయితే ఈ బాడీ ఇమేజ్ భావాన్ని మహిళల్లో ఏర్పరచి వారిని అన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నది ఎవరు...అంటే చాలా అంశాలున్నాయి...అందాల పోటీలు, సౌందర్య ఉత్పత్తుల తయారీ దారులు, వాటి ప్రకటనలు, సినిమాలు, ఫ్యాషన్ రంగంలో మోడల్స్..ఇలా ఎన్నో అంశాలు...అన్నీ వ్యాపారానికి సంబంధించనవే కావటం గమనార్హం.

అది వారి ఆలోచన కాదు...సమాజం మాట!

నేను అందంగా ఉన్నాను...అనేది మహిళలకు అన్నింటికంటే ఇష్టమైన మాట. అయితే ఇదంతా వారిలోని వ్యక్తిగత అభిరుచిగా మనం చెప్పలేము. ఇదంతా సమాజం దృక్పథం దాన్నే వారు...తమ దృక్పథంగా (బాడీ ఇమేజ్‌గా) మలచుకుంటున్నారు. సినిమాల్లో నటన కంటే హీరోయిన్ ఎంత అందంగా ఉంది....ఏ భాగంలో ఎంత లావయింది..లేదా సన్నబడింది...లాంటివి అత్యంత ముఖ్యమైన విషయాలు అయినప్పుడు...ఆ విషయాలనే వేదికలమీద హీరోలు మాట్లాడుతున్నపుడు, ఆ విషయాలనే రివ్యూల్లో రాస్తున్నపుడు, వాటిమీదే ప్రేక్షకుడు కూడా దృష్టిపెడుతున్నపుడు... ఇక ఏ హీరోయిన్‌కైనా అందం జీవన్మరణ సమస్య కాకుండా ఉంటుందా?

బాడీఇమేజ్ మాయ...ప్లాస్టిక్ సర్జరీలు

నటుల విషయంలోనూ అందం, వ్యాయామం, సిక్స్‌ప్యాక్... లాంటి మాటలు వినబడుతుంటాయి కానీ...ఇలా శరీరంలో ఒక్క పిసిరంత లావయినా...గుర్తుపట్టేసి ఆ విషయం గురించి చర్చలు తీర్మానాలు చేసేవారు ఉండరు. ఆ మధ్య అనుష్క సైజ్‌జీరో గురించి లావయినప్పుడు...ఆమె అలాగే ఉందా...లేదా తగ్గిందా అనేది ఒక ముఖ్యమైన విషయంగా మారిపోయింది. హీరోయిన్ల విషయంలో మాత్రమే వారి శరీర భాగాలకు సైతం ప్రత్యేకంగా గుర్తింపు వస్తుంది. హీరోయిన్ల కళ్లు కాళ్లు, నడుము...అన్నింటికీ ప్రత్యేక గుర్తింపు. ఇంతలా శరీరానికి మాత్రమే ఇమేజ్ వస్తున్నపుడు వారు...బాడీ ఇమేజ్ మాయలో పడిపోకుండా ఉంటారా...ప్లాస్టిక్ సర్జరీలకు వెళ్లకుండా ఉంటారా? బాలీవుడ్‌లో ఒక్క శ్రీదేవే కాదు...ప్లాస్టిక్ సర్జరీలతో అందాన్ని పెంచుకున్న నటీమణులు కోకొల్లలుగా కనబడతారు. ప్రియాంకా చోప్రా, కంగనారనౌత్, కాజోల్, అనుష్కశర్మ, కత్రినా కైఫ్, శ్రుతి హాసన్..ఇలా ఎంతోమంది శరీరాన్ని రాయిగా మార్చేసి...వైద్యుడనే శిల్పి చేతుల్లో పెట్టి...అందాన్ని పెంచుకున్నవారే. నిన్నకాక మొన్న ఆర్తీ అగర్వాల్ ఈ ప్రక్రియలో ఉండగానే ప్రాణాలు కోల్పోవటం చూశాం. తమ మనసులో తమ అందం పట్ల తమకు సంతృప్తి కలిగే వరకు ఇలాంటి ప్రయత్నాలు ఏవోఒకటి చేస్తున్నారు. నోరుకట్టుకుని తిండి తినకుండా...ప్రేక్షకుడు, ప్రపంచం ఎలాంటి కొలతలతో తనను చూడాలనుకుంటున్నారో అదే కొలతలలో ఇమిడే ప్రయత్నం చేస్తున్నారు. తమ బ్యూటీపట్ల ఇతరులకు స్పృహ పెరిగిపోయినప్పుడు వాళ్లు మాత్రం ఏం చేస్తారు. ఇదంతా కనిపించని భావాల అల్లికతో కూడుకున్న సాలెగూడు. అత్యధిక జనాభా ఉన్న మనదేశం సౌందర్య ఉత్పత్తులకు మార్కెట్‌గా మారాలి...అని తపించే విదేశీ పారిశ్రామిక రంగం ఒకవైపుంటే...స్త్రీని అందంగా చూపించి డబ్బు చేసుకుందాం...అని ఆశించే సినీ పరిశ్రమ మరో వైపు. ఇలాంటి స్థితిలో నటీమణులే కాదు...సాధారణ అమ్మాయిలు కూడా...ఇలాగే బాడీ ఇమేజ్ బారిన పడి అందానికి నమూనాగా మారిపోవాలని తపిస్తున్నారు.








ఇది స్త్రీ లక్షణమా...హాస్యాస్పదం

అందం పట్ల అత్యంత స్పృహతో ఉన్న శ్రీదేవికయినా, ఆర్తిఅగర్వాల్ కయినా, మన కళ్లముందు కనబడుతున్న టీనేజి అమ్మాయిలకైనా...అందరిలో ఉన్నది ఆ బాడీ ఇమేజే. ఎవరో జ్వాలను రగిలించారు...వేరెవరో దానికి బలి అయినారు అన్నట్టుగా....ఎన్నో కారణాలతో ఏర్పడిన బాడీ ఇమేజ్ దృక్పథం...స్త్రీల లక్షణంగా చెప్పటం...అత్యంత హాస్యాస్పదం...దారుణం కూడా. చివరగా... మరి మహిళలకు బాడీ ఇమేజ్ అవసరమా అనే ప్రశ్న వేసుకుంటే....అవసరమే అనే సమాధానాన్ని సమాజంలో చాలా వర్గాలు ముక్త కంఠంతో చెబుతాయి. జాగ్రత్త...ఆ సాలెగూడులో చిక్కుకుని...చిక్కులు తెచ్చుకోవద్దని వాస్తవికవాదులు, స్త్రీ మనిషిగా ఎదగాలని తపించేవారు చెబుతారు...ఒక ప్రశ్నకి పరస్పర విరుద్ధమైన రెండు భిన్న సమాధానాలు.

-వి.దుర్గాంబ





నేను-నా ప్రజలు

లాఠీతో శాసించలేం!

అడిషనల్ డీజీపీ అంజనీ కుమార్

శాంతి భద్రతల పరిరక్షణ.....క్షణం తీరిక దొరకని ఉద్యోగం....అయినా తన అభిరుచులను వదులుకోరు...అలాగని వృత్తి ధర్మాన్ని నిర్లక్ష్యం చేయరు.....వేసుకునేది ఖాకీ డ్రెస్సే అయినా....సున్నితమైన వ్యక్తిత్వం....ప్రజలను నొప్పించ కూడదనే మనస్తత్వం.... స్మార్ట్ పోలీస్‌కు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. అతను ఎవరో కాదు....తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్).... అంజనీ కుమార్! 1990లో ఐపీఎస్ సెలెక్ట్ అయిన అంజనీ కుమార్, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తిచేశారు. శిక్షణ కాలంలో హార్స్ రైడింగ్‌లో మహారాజా ఆఫ్ టాంగ్ కప్, స్విమ్మింగ్‌లో ఆర్డీ సింగ్ కప్ కైవసం చేసుకున్న కుమార్, బాస్కెట్ బాల్ లో మంచి ప్లేయర్. తన 27 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానపు అనుభవాలను, అనుభూతులను ఆంధ్రప్రభ లైఫ్‌తో పంచుకున్నారు అంజనీకుమార్. వివరాలు ఆయన మాటల్లోనే....!

వరంగల్ జిల్లా జనగాం ఏఎస్పీగా నా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. నక్సల్స్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతం. నేను పోస్టింగ్ తీసుకోవడానికి మూడు నెలల క్రితమే ఒక ఎస్ఐని రైల్వే స్టేషన్‌లో పబ్లిక్‌గా నక్సల్స్ కాల్చి చంపారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కూంబింగ్, ఎన్‌కౌంటర్లకన్నా.. ప్రజల్లో మార్పు తేవడమే సమస్యకు అసలు పరిష్కారమని భావించాను. నక్సల్స్‌ను ఏరివేస్తే కొత్త రిక్రూట్ మెంట్ జరుగుద్ది. నక్సలిజం భావజాలాన్ని ప్రజల నుంచి తొలగిస్తే.. చేరికలు ఉండవు.. ఆటోమెటిగ్గా నక్సలిజం తగ్గుతుందన్నది నా ఉద్దేశ్యం. అందుకే ప్రజలకు వారి మీద ఉన్న సానుభూతిని, భయాన్ని దూరం చేసేందుకు ప్రయత్నించాను. నక్సల్స్ వల్ల జరిగే నష్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కళా బృందాలతో ప్రచారం నిర్వహించాము. సంబంధితఅధికారులతో మట్లాడి..గిరిజన ప్రాంతాల్లో విద్యాసౌకర్యాలు మెరుగయ్యేలా చూశాను. మెడికల్ క్యాంపులు నిర్వహించాము. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు చేరువయ్యాను. నా శ్రమ ఫలించింది.. ప్రజల్లో మార్పు వచ్చింది. ఆవేశంతో నక్సల్స్‌లో చేరిన వారు ముఖ్యంగా యూత్ చాలా మంది..పోలీసులకు సరెండర్ అయ్యారు.

ఆమె బోరున ఏడ్చింది...!

లొంగిపోయిన వాళ్లలో ఓ యువ జంట ఉంది. పేర్లు చెప్పనుగాని ..భర్త వయస్సు ..22, భార్య వయస్సు..21. వారిని నా ఆఫీస్‌లో కూర్చోపెట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చినప్పుడు ఆమె బోరున ఏడ్చింది. ఆవేశంతో దళంలో చేరాము కాని, అక్కడ స్వేచ్ఛ లేదని చెప్పింది. తూపాకులు పట్టి మూపై కేసులు నమోదు చేయించుకున్నాము కాని సాధించింది ఏమీ లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. అక్కడా బానిస బతుకులేనని చెప్పింది. వారికి ప్రభుత్వం ద్వారా స్వయం ఉపాధి ఏర్పాటు చేయించాను. ఇప్పుడు వాళ్లు హ్యాపీగా ఉన్నారు.

అతను జంటగా వచ్చి కలిశాడు

లొంగి పోయిన వాళ్లలో టీనేజ్ కుర్రాడు ఉన్నాడు. జనగాం పరిధిలోని చేర్యాల అతనిది. అతనితో నాలుగు గంటలు మట్లాడాను. మధ్యలో ఆపిన చదువును తిరిగి కంటిన్యూ చేసేందుకు ఒప్పించాను. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి తిరిగి కళాశాలలో చేర్పించాను. అతను బాగా చదువుకుని బాగుపడ్డాడు. నేను అక్కడి నుంచి వచ్చిన 10 సంవత్సరాల తర్వాత హైదరాబాద్‌కు వచ్చికలిసాడు. ఒంటరిగా కాదు జంటగా..అంటే పెళ్లిచేసుకుని భార్యతో వచ్చి కలిసినప్పుడు చాలా సంతోషం వేసింది.

గోదావరిలో 2 గంటలు ప్రయాణించి

వరంగల్ ఐజీగా ఉన్న రోజుల్లో ..భద్రాచలం అడవుల్లో ఓ చెంచుగూడెం. వారికి నాగరిక ప్రపంచపు వాసన కూడా తెలియదు. అదితెలిసి ఓ రోజు ఐటీడీఏ అధికారి ప్రవీణ్ కుమార్‌ను వెంటతీసుకుని, గోదావరి నదిలో రెండు గంటలు ప్రయాణించి, చెంచుగూడెం చేరుకున్నాను. వారి అమాయకత్వం చూస్తే జాలేసింది. కనీసం వాచ్‌ను కూడా చూడలేదు వాళ్లు. పిల్లల కోసం చాక్లెట్స్, బిస్కెట్స్ తీసుకెళ్లి పంచాము. రోజంతా వారితో ఉండి, వారి సమస్యలు తెలుసుకుని, ఐటీడీఏ ద్వారా పరిష్కరించగలిగాను.

40 కిలోమీటర్లు నడిచివెళ్లాం..!

నేను గ్రేహౌండ్స్ చీఫ్‌గా ఉన్న రోజులు..కూంబింగ్ నిర్వహిస్తూ.. మన రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న దంతేవాడ జిల్లా బస్తర్ చేరుకున్నాము. అక్కడ నక్సల్స్ ప్రభావం ఎక్కువ. బస్తర్ అడవుల్లో 40 కిలోమీటర్లు నడిచి ఓ కోయగూడెం వెళ్లాను. ఆ రాష్ట్ర డీజీపీ,బస్తర్ ఐజీ కూడా వెంట వచ్చారు. వాళ్లకు బట్టలు పంపిణీ చేశాము. అది నాకు చాలా సంతృప్తినిచ్చింది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నా సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం ఇంటర్నేషనల్ సెక్యూరిటీ మెడల్ ఇచ్చింది.

20వేల మందికి వైద్య సేవలు..

నిజామాబాద్ ఎస్పీగా పనిచేసినప్పుడు..జిల్లాలో ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో ప్రజల కోసం మెడికల్ క్యాంపులు నిర్వహించాము. ఆర్మూర్ మండలం మానాల తాండాలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించా. ప్రైవేటు డాక్టర్ల సహకారంతో చాలామందికి కంటి ఆపరేషన్లు చేయించాము. జిల్లా వ్యాప్తంగా 20వేల మందికి ఉచిత వైద్యసేవలు అందిచడం చాలా తృప్తినిచ్చింది.

ఇద్దరి ప్రాణాలు కాపాడాను

నేను సికింద్రాబాద్‌లో రైల్వే ఎస్పీగా పనిచేస్తున్నప్పుడు ఓ సంఘటన జరిగింది. ఓ యువకుడు ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. అతని వాలకం నాకెందుకో అనుమానం వేసింది. అతనికి దగ్గర్లో ఉండి గమనించా. నా అనుమానం నిజమైంది. అతను వేగంగా వస్తున్న రైలు కింద దూకబోయాడు. అతన్ని ఆత్మహత్య చేసుకోకుండా అడ్డుకున్నా. ప్రస్తుతం అతను ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ హాయిగా జీవిస్తున్నాడు. ఇక జనగాం ఏఎస్పీగా ఉన్నప్పుడు ఇలాంటి సంఘటనే జరిగింది. ఓ విద్యార్థి పరీక్షలో ఫెయిల్ అయిన బాధలో ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని కాపాడ గలిగాను. అతను ప్రస్తుతం జీవితంలో స్థిరపడ్డాడు. నాకు మాత్రం రెండు నిండు ప్రాణాలను కాపాడానన్న తృప్తి మిగిలింది.

ఆ ఘటన కలిసివేసింది.

నేను నిజామాబాద్ డీఐజీగా ఉన్నప్పుడు జరిగిన సంఘటన. డీజీపీ ఆఫీస్‌లో జరిగే మీటింగ్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ వస్తున్నా. కామారెడ్డి- రామాయంపేట మధ్య ఓ యాక్సిడెంట్ జరిగింది. రోడ్డు దాటుతున్న ఇద్దరు విద్యార్థులను లారీ ఢీకొట్టింది. ఓ విద్యార్థి స్పాట్ డెడ్. ఒకతను ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఇప్పటిలాగా 108 వాహనాలు సెల్ ఫోన్లు లేవు. అందుకే వారిని నా కారులో తీసుకొని కామారెడ్డిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి, లోకల్ పోలీసలకు సమాచారం ఇచ్చి, వారు వచ్చాక కేసు వాళ్లకు అప్పగించే మీటింగ్‌కు గంట ఆలస్యంగా చేరుకున్నాను. మీటింగ్ అయిన తర్వాత వాకబు చేస్తే రెండో విద్యార్థి కూడా చనిపోయాడని తెలిసి చాలా బాధేసింది.

చేతిలో కెమెరా లేనందుకు బాధేసింది

మహబూబ్‌నగర్ జిల్లాలో ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీగా పనిచేసప్పటి సంఘటన. అమ్రాబాద్ అడవుల్లో నా సిబ్బందితో కూంబింగ్ నిర్వహిస్తున్నాం. అప్పుడు సమయం ఉదయం ఆరు గంటలు.. పొహరాబాద్ ప్రాంతంలో జింకల గుంపు ఎదురైంది. చేతిలో ఏకే -47 ఉంది. అంత అహ్లాదకరమైన వాతావరణంలో జింకల గుంపును చూస్తే.. ముచ్చటేసింది. చేతిలో కెమెరా లేనందుకు బాధేసింది.... అంత మంచి దృశ్యాన్ని షూట్ చేయలేక పోయినందుకు. ఇక ప్రకాశం జిల్లా ఎస్పీగా పనిచేసినప్పుడు టూర్ వెళ్లి వస్తుంటే దోర్నాల ప్రాంతంలో ఓ చిరుత పిల్ల కనిపించింది. ఏదో వెహికిల్ ఢీకొట్టి గాయపడింది. వేంటనే దానిని తీసుకొని వచ్చి, ప్రథమ చికిత్స చేసి, ఫారెస్ట్ అధికారుల ద్వారా తిరుపతి ఎస్వీ జూకు తరలించాం. ఇప్పుడది క్షేమంగా ఉంది. ఓ మూగజీవిని కాపాడాననే తృప్తి నాకు మిగిలింది.

మేడారం జాతర

నేను ఇప్పటి వరకు నాలుగు సార్లు (1992,1994,2012,2018) మేడారం జాతరలో డ్యూటీ చేశాను. జాతర జరిగినన్ని రోజులు అక్కడే బస్‌లో బసచేశాను. భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోగలిగాను.ఇది నా అదృష్టంగా భావిస్తాను. తెలంగాణ ఉద్యమాన్ని దగ్గరుండి చూశా..ప్రజల మనోభావలకు, ఆకాంక్షకు విలువిచ్చా. ఏనాడు ఉద్యమ కారుల మీద లాఠీ ఎత్తలేదు. నేను అనుభవంతో చెప్పేది ఒక్కటే...ప్రజల మనసెరిగి, వారి మనోభావాలకు విలువిస్తూ....సమస్యను పరిష్కరించగలిగితేనే... శాంతి భద్రతతలు శాశ్వతంగా వర్ధిల్లుతాయి..ఖాకీ డ్రెస్ వేసుకుని లాఠీ పట్టుకుని భయపెట్టడం వల్ల కలిగే ప్రయోజనం తాత్కాలికమే!

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

అప్పుడు తింటే...యాపిల్ ఔషధమే!

యాపిల్ పండులో రోగనిరోధక శక్తిని పెంచేగుణాలు మెండుగా ఉన్నాయి. రోజుకో యాపిల్ తింటే డాక్టరు అవసరమే లేదనే ప్రచారమూ ఉంది. అయితే... ఇక్కడో తిరకాసు ఉంది. ఎప్పుడు పడితే అప్పుడు యాపిల్‌ని తింటే ప్రయోజనం ఉండదట. ఫలానా పండును ఫలానా టైంలోనే తినాలి అప్పుడే ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతుంటారు. అది యాపిల్‌కి కూడా వర్తిస్తుంది. ప్రస్తుతం పరిశోధనలు కూడా ఆవిషయాన్ని ధృవీకరిస్తున్నాయి. మరి యాపిల్‌ను ఏ టైంలో తింటే మంచిది-

తాజా పరిశోధనల ప్రకారం యాపిల్ పండును ఉదయం వేళల్లో తినడం మంచిది. అందులోనూ మార్నింగ్ వాక్ చేసిన తర్వాత తింటే మరీ మంచిది. యాపిల్ పండు తొక్కలో ఫైబర్, పెక్టిన్ సమృద్ధిగా ఉన్నట్లు పరిశోధనలు తేల్చాయి. రాత్రులు సరిగ్గా నిద్రపోలేనివారు, పొద్దుపోయిన తర్వాత ఆహారం ీసుకునేవారు..ఉదయాన్నే రోజుకో యాపిల్ తింటే...యాపిల్‌లోని ఫైబర్ పెక్టిన్‌లు అజీర్తి సమస్య రాకుండా నివారిస్తాయట. ఇతర పండ్లకంటే ఉదయాన్నే యాపిల్ తింటే జీర్ణ శక్తి పెరుగుతుందని తాజా పరిశోధనల్లో తేలింది. అంతేకాదు యాపిల్ పెద్దపేగులోని లాక్టిక్ యాసిడ్‌ను రక్షిస్తుంది. మంచి బ్యాక్టీరియా వృద్ధికి దోహద పడుతుంది. తద్వారా జీర్ణవ్యవస్థ పనితీరుని మెరుగుపరుస్తుంది. క్యాన్సర్‌ని నివారించగల రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

ఇక ఉదయం కాకుండా సాయంత్రం వేళల్లో యాపిల్ తింటే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రివేళ యాపిల్ తింటే అది... గ్యాస్ ట్రబుల్‌కు దారితీస్తుంది. అందుకే మార్నింగ్‌వాక్ తర్వాత లేదా భోజనానికి, స్నాక్స్ తినడానికి మధ్య యాపిల్ తింటే ఆరోగ్యానికి చాలా మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.



పరిశుద్ధమైన ఆత్మ స్థితికి చేరేందుకు మానవుడు 12వ భూమికకు చేరుకోవాలి. ఈ దశలోని వారికి అనంత శక్తి, అనంత జ్ఞానం, అనంత వ్యాపకత్వం సహజ సిద్ధంగా ఉంటాయి. మానవుడు భగవంతుడైతే అతనిని సమర్థ సద్గురువని పిలుస్తారు. ఇక భగవంతుని అవతారాలు వేరు. ఇవి భూమిపై కాలానుగుణంగా వస్తుంటాయి. దైవం మానవునిగా వస్తే అతనిని అవతారము, అవతార పురుషుడు లేదా పురుషోత్తముడు అని పిలుస్తారు.



మానవుని నుంచి దేవుని దాకా...

జీవాత్మ శిల నుంచి మానవుని దాకా వివిధ దశలు ధరించి చివరకు మానవ జన్మ పొందుతుంది. మానవ జన్మ ఎత్తినాక అతను వివిధ భూమికల్లోకి వెడతాడు. వాటి వివరాలు.

మొదటి భూమిక : ఈ భూమిక యందు స్థూల దేహేంద్రియాలు, సూక్ష్మ దేహేంద్రియాలు ఏక కాలంలో ఉపయోగించబడతాయి. ఇది సామాన్య మానవ జన్మ.

రెండవ భూమిక :ఈ భూమికలో మానవుడు సూక్ష్మ శరీరేంద్రియాలతో సూక్ష్మ ప్రపంచ భావాన్ని పొందుతూ చిన్న చిన్న మహిమలను చేయగల సామర్థ్యం పొందుతాడు.



మూడవ భూమిక : ఈ భూమికలో సూక్ష్మ శరీరంతో సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయగల శక్తిని పొందుతాడు. ఈ భూమిక తరువాత నాలుగవ భూమిక చేరే మధ్య స్థితిలో వశీకరణ కేంద్రం ఒకటి ఉంది. వశీకరణకు లోనైనపుడు ఏ స్థితిలో ఉంటే అదే స్థితిలో ఉండిపోతాడు. ఉదాహరణకు అహల్య విషయమే తీసుకుందాం. గౌతముడు ఆమెను శపించినపుడు ఆమె దిగ్భ్రాంతికి లోనయింది. అప్పుడు ఆమె తాను శిలా రూపంలో ఉన్నట్టు భావించుకుంది. ఆమె శ్రీరామ దర్శనం వరకూ అదే స్థితిలో ఉండిపోయింది. అహల్య శరీరం శిలా స్థితి పొందలేదు. ఆమె మనస్సు మాత్రమే ఆ స్థితిని పొందింది. అంటే మూడు నాలుగు దశల మధ్య ఉన్న వశీకరణ స్థితిలో ఉండిపోయింది. శ్రీరాముని పాద ధూళి సోకగానే ఆమె మనో పుష్పం వికసించనారంభించింది. ఆమె తిరిగి తన సహజ స్థితిని పొందింది.

నాలుగవ భూమిక :ఈ భూమికలకు చేరిన ఆత్మకు అత్యంత విస్తారమైన యోగ శక్తులు లభిస్తాయి. తమ యోగ శక్తులను లోక కళ్యాణార్థం అంతరాత్మ ప్రబోధానుసారం వినియోగిస్తే పై స్థితిలోనికి పోయే వీలుంటుంది. అలాకాక పాప కార్యాల నిమిత్తం, తుచ్ఛమైన ప్రయోజనాల కోసం ఈ శక్తులను వాడితే పతనావస్థకు చేరి జీవాత్మ పరిణామ క్రమంలో మొదటిదైన శిలా దశకు పడిపోతుంది. అతను మరల అనేక వేల జన్మలెత్తితే గాని మానవ జన్మలోకి అడుగుపెట్టే అవకాశం లేదు.

ఐదవ భూమిక :ఈ దశకు చేరుకున్న వారు సంకల్ప జ్ఞానులు. వీరు దైవ సాక్షాత్కారాన్ని కోరుతూనే ప్రాపంచిక కార్యక్రమాలను కూడా సాగిస్తారు

ఆరవ భూమిక :ఈ భూమికలోనున్న వారు భావ జ్ఞానులు. ఈ భూమికలోనున్న వారికి ప్రాపంచిక కార్యకలాపాల పట్ల ధ్యాస చాలా తక్కువగా ఉంటుంది.

ఏడవ భూమిక :ఈ స్థితిలోనున్న వారు పరమాత్మ యందుండే అనంత స్థితి యొక్క జ్ఞానాన్ని పొందగలుగుతారు ఈ విధంగా అనేక భూమికలు ఉంటాయి.

పరిశుద్ధమైన ఆత్మ స్థితికి చేరేందుకు మానవుడు 12వ భూమికకు చేరుకోవాలి. ఈ దశలోని వారికి అనంత శక్తి, అనంత జ్ఞానం, అనంత వ్యాపకత్వం సహజ సిద్ధంగా ఉంటాయి.

మానవుడు భగవంతుడైతే అతనిని సమర్థ సద్గురువని పిలుస్తారు. ఇక భగవంతుని అవతారాలు వేరు. ఇవి భూమిపై కాలానుగుణంగా వస్తుంటాయి. దైవం మానవునిగా వస్తే అతనిని అవతారము, అవతార పురుషుడు లేదా పురుషోత్తముడు అని పిలుస్తారు.

భగవద్గీత 16వ అధ్యాయంలో దైవీ గుణాలు వర్ణించబడ్డాయి. దైవీ గుణాలు పెంపొందించుకోమని భగవద్గీత తెలుపుతోంది. దైవ గుణాలు 26 ఉన్నాయి. అవి:

అభయం: భయం లేకుండుట

అంత:కరణ శుద్ధి: వంచన, అసత్యం వంటివి లేకుండా ఇతరులతో సత్సంబంధాలు కలిగి ఉండటం

జ్ఞాన యోగంలో ఉండుట: నిత్య అనిత్య వస్తువులను సుస్పష్టంగా ఎరుగుటయే జ్ఞానం. చిత్తాన్ని సదా జ్ఞానమునందు, యోగమునందు ఉంచాలి.

దానం: తనుపయోగించిన వస్తువులు ఇతరులకు కూడా ఉపయోగించి లబ్ధి పొందాలనే సదుద్దేశంతో వాటిని ప్రీతితోను, వినయంతోను వారికిచ్చుటయే దానం.

దమము లేదా ఇంద్రియ నిగ్రహం: బాహ్య ప్రపంచంలో గల వస్తువులపై అసక్తిని నియంత్రించడం. వాటిని అనుభవించాలనే అభిప్రాయంతో ఇంద్రియాలు సంచరించకుండా నిగ్రహించగలగడమే దమము.

యజ్ఞము - యాగం: తాను చేసే పనుల ద్వారా తనను భగవంతునికి అర్పణ చేయటమే యాగమనబడుతుంది. దైవారాధనలనలన్నీ యాగమని చెప్పవచ్చు.

వేదాధ్యయనం: పారమార్థిక విషయాలను బోధించే శాస్త్రాన్ని భక్తి శ్రద్ధలతో పఠించడమే వేదాధ్యయనం

తపస్సు: శరీరాన్ని, మనసును కట్టుబాట్లకు లోబరచి తనను ఉత్తమునిగా మార్చుకోవటమే తపస్సు అనబడుతుంది.

ఋజుత్వం: మనోవాక్కాయములలో ఎటువంటి వక్రాలు లేక సక్రమంగా ఉండే గుణమే ఋజువర్తనం.

అహింస: హింసా గుణం లేకపోవడం.

సత్యం: భగవంతుడు ఒక్కడే అని పలికేది సత్యం

క్రోధం లేకుండుట: ఇతరులు తనను హింసించునపుడు వారిని తన వారిగా భావించి వారిపై కోపించకుండుట

త్యాగం: వస్తువులన్ని భగవంతుని స్వంతములని తెలిసి వాటిపై హక్కును అపేక్షించకపోవడమే త్యాగం.

శాంతి: అవేశానికి గురి కాక అన్ని వేళల్లో ప్రశాంతంగా ఉండడం.

ఇతరుల దోషాలను ఎంచకపోవడం
విషయ లోలత్వం లేకపోవడం
మృదు స్వభావం కలిగి ఉండడం.
ధర్మ విరుద్ధమైన పనుల పట్ల ఆసక్తి లేకపోవడం
సర్వ భూతదయ
చపలత్వం లేకపోవడం
బ్రహ్మ తేజస్సు కలిగి ఉండడం
ఓర్పు స్థిరత్వం కలిగి ఉండడం
ధైర్యం - గర్వం లేకపోవడం
శుచి, నిర్మలత్వం కలిగి ఉండడం
ద్రోహం చేయకపోవడం
నిరభిమానం


ఇవన్నీ దైవసంపదలతో పుట్టిన వారికి సహజ స్వభావాలుగా ఉంటాయి.

హయగ్రీవ జ్యోతిష కేంద్రం
9949514583

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

బలవంతపు భోజనాలు



(గత సంచిక తరువాయి భాగం)

ఇందుకుగాను నా పక్కనే కూర్చుండేవారు. నేనవన్నీ తినగలనా? కాస్త రుచి చూసి లేచి వెళ్లితే ఆ శేషం అన్ని పదార్థాలతో కలిపి స్వామి ప్రసాదమని తినేవాళ్ళట. రెండు మూడు సార్లది గమనించి, ఇది కాదని బుద్ధిపుట్టినపుడు తెలియకుండా వచ్చి పచ్చెయమ్మన్ కోవెలలోనో, ఎక్కడో ఉండి నైవేద్యపు గంట కొట్టగానే వెళ్ళి, వీధి గుమ్మంలో నిలిచి ఆ నివేదన చేసింది తెమ్మంటే తెచ్చేవాళ్ళు. దోసెడు వేయించుకుని తినేవాణ్ని దానిలో ఉప్పు కూడ ఉండేది కాదు. (శివాలయాల్లో నివేదనకు ఉప్పులేని ఆహారమే ఉపయోగిస్తారు). ఏదైతేనేమి ఆకలి తీరటం ప్రధానం. ఆ మఠాధిపతి మేడమీదే ఉంటూ ఉండటం వల్ల కొన్నాళ్ళిది తెలియలేదు. ఒకనాడు అకస్మాత్తుగా వారి కంటపడింది. ఎవరురా? స్వామికి మర్యాద చేయక ఉప్పులేని ఆహారమిచ్చింద'ని కోపగించుకున్నారు. వెనుక విషయం తెలుసుకుని పై ఉపద్రవం మానారు. ఇప్పుడు గతించిరే వీరు మాత్రం అట్లా కాదు. మహా సాధువు. అందరితో పాటు నా ప్రక్కనే కూర్చుని తినేవారు. అందరి వలెనే నాకూ పెట్టించేవారు అన్నారు భగవాన్.

'అక్కడొక సారి భగవాన్ ప్రవచనం గూడా చేశారట గదూ?' అన్నారొకరు. అవును ఇప్పుడు గతించిన వారుండగానేవారు పాఠం చెబుతుతండగా వెళ్లానొక సారి. మర్యాద చేసి కూర్చోబెట్టారు. కానీయండి పాఠం అన్నాను. 'స్వామి ఎదుట నేనా పాఠం చెప్పేది. స్వామే చెప్పాలి. తప్పదని గీతాసారం తెప్పించి, శిష్యుని చేత చదివించి చెప్పమన్నారు. ఇక తప్పదని అర్థంచెప్పాను అన్నారు భగవాన్.

'రామచంద్రయ్యరు తాత వారింటికి ఒక సారి పిలుచుకుని వెళ్ళారని విన్నామే?' అన్నారు వారు. 'అది ఇంకా ముందే, 1896లో. నేనప్పుడు గోపుర సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ఉన్నాను. వారు నిత్యం నా వద్దకు వచ్చి, కాస్సేపు కూర్చుని వెళ్లేవారు. నేను మౌనం కదా. మాటలేదే, మంతి లేదు. అయినా వారికి అమిత భక్తి. ఒక దినం వారింటికెవరినో విందుకు పిలిచారట. మధ్యాహ్న భోజనానికి ముందే ఇంకొకరిని వెంట బెట్టుకుని నా వద్దకు వచ్చారు. చెరి ఇక పక్కా నిలిచి 'స్వామీ లేవండి పోదా'మంటారు. ఎందుకని సంజ్ఞ చేశాను. విషయం చెప్పారు. నేను రానన్నాను. వింటారా? చెయ్యి పట్టుకుని అమాంతం లేవదీశారు. ఎత్తుకొని పోదామన్న ంత తీవ్రంగా ఉన్నారు. ఇంత లావూ, అంత పొట్టా, ఆజానుబాహువు మనిషి.

తెలిసీ తెలియని ప్రశ్నలు

28-6-47

నాలుగైదు రోజులు క్రితం ఈ ఊళ్ళో వైశ్య సంఘ సమావేశం జరిగింది. ఆంధ్ర దేశం నుంచి వైశ్య ప్రముఖులెందరో వచ్చారు. మొన్న ఉదయం వారంతా ఆశ్రమానికి వచ్చారు. వారిలో ప్రముఖులైన వారు ఒకరు భగవానునుద్దేశించి 'స్వామీ దేవుడే జీవుడైనాడు కదా! జీవుడికి కలిగే దుఃఖం దేవుడికి అంటునా? అని ప్రశ్నించారు.

(తరువాయి భాగం వచ్చేసంచికలో) - సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: ప్రయాణాల విషయంలో అనుకూలత ఉంటుంది. పనుల్లో శ్రమ తగ్గుతుంది. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆర్థిక చిక్కులు పరిష్కరింఎబడతాయి. శత్రు భీతి పోతుంది.

వృషభ రాశి: ఆర్థిక అనుకూల పరిస్థితులు కొనసాగుతాయి. ప్రయాణాల ద్వారా అనుకూలత ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు పరిష్కరించబడతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి: గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారుతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి

కర్కాటక రాశి: దూర ప్రయానాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబ రీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచన దోషాల ద్వారా సమస్యలు అవమానాలు ఉంటాయి. జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు అనుకూలం. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో అశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్య రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. సంబంధ బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చికాకులు కొనసాగుతాయి.

తుల రాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళా రంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనుల్లో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఉంటాయి.


వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు వస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రతికూలత ఉంటుంది. వేగంగా నిర్ణయాలు తీసుకోలేక పోతారు. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి

మకర రాశి: ఆరోగ్య రీత్యా అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులుంటాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలం.

కుంభ రాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య క్రమశిక్షణ తప్పనిసరి. ఆరోగ్యం ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది.

మీన రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ంటాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

మూడడుగుల్లోనే అంతా-2

(నిన్నటి సంచిక తరువాయి భాగం)

వారిజాక్షులందు వైవాహికములందు
బ్రాణ విత్త మాన భంగమందు
జకిత గోకులాగ్ర జన్మ రక్షణ మందు
బొంకవచ్చు నఘము వొందవధిప

గురువుగా నేను నీకు నీతి చెబుతున్నాను. స్త్రీ విషయంలో వివాహం, ప్రాణం, విత్తం, మానం, విషయంలో అసత్యం చెప్పవచ్చు. అబద్ధం ఆడినా పాపం రాదుకనుక ఇస్తానని ఎప్పుడు అన్నానని అను, మాటలు వక్రీకరించారు అని వటువుతో పలుకు అని శుక్రాచార్యుడు బలిని ఆపటానికి శతధా ప్రయత్నించాడు.

కాని బలి గురువుగా మీరు నాకు చెప్పవలసిన మాటలు కావివి. నేను ఆడిన మాటను తప్పను



బ్రదుక వచ్చుగాక బహుబంధనములైన,
వచ్చుగాక లేమి వచ్చుగాక
జీవధవములైన జెడుగాక పడుగాక
మాట దిరుగలేదు మానధనులు


నా ప్రాణం పోయినా పరవాలేదు, కానీ ఇచ్చిన మాట తప్పనని దానానికి సిద్ధపడుతూ, వచ్చిన వాడు శ్రీ మహావిష్ణువే ఐతే అంతకంటే పరమాద్భుతమేమున్నది

ఆదిన్ శ్రీ సతి కొప్పుపై.. కాయంబు నా పాయమే

సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మిని స్పర్శించిన ఆ చేయి క్రిందగుట నా చేయి పైనగుట సృష్టిలో ఎప్పుడైన జరిగినదా ఏమి అదృష్టం ఇక ఈ రాజ్యం, ఈ శరీరం అవసరమా..? అంతటి కీర్తి నాకొస్తుంటే ఎలా వదులుకోను నేను దానం ఇచ్చేస్తాను అన్నాడు.

కారే రాజులు..? రాజ్యములు గలుగవే..? యిక్కాలమున్ భార్గవా..!

ఈ భూమిని పాలించిన రాజులు ఏరి..? ఎంతమంది వచ్చి పోయారు..? ఇచ్చిన శిబి లాంటి మహనీయులు శాశ్వతంగా కీర్తింపబడుతున్నారు. గురువర్యా ఇవ్వడం గొప్ప, ఇచ్చిన మాట తప్పలేను అని స్పష్టం చేశాడు బలి చక్రవర్తి. అంత శుక్రాచార్యుడు నేను ఇవ్వొద్దు అంటే నువ్వు ఇస్తానంటున్నావు నా మాట ధిక్కరించినందుకు నీ సమస్త ఐశ్వర్యం నశించి పోవుగాక అని శపించాడు.



అలా గురువు మాట తిరస్కరించి మూడడుగుల దానం చేయటానికి నీరు వదులుతుంటే ఆ పాత్రలోకి దూరాడు శుక్రుడు. ఎంతైనా శిష్య మమకారం ఊరుకోదు కదా..?' ఇదమ్ నమమ' అని నీటిధార పడితేగాని దానం చేయటం కుదరదు కాబట్టి అలా చేశాడు.

నీరధారబడుగనీక యడ్డంబుగా... నేత్రుడయ్యెనతడు

నీరు పడకపోవటం గమనించి ఆశ్చర్యంతో వింధ్యావళి ఉండగా వటుడు, 'ఉండమ్మా నేను చూస్తాన'ని తన చేత ఉన్న దర్భతో శుక్రుడి కంటిలో గుచ్చుకునేటట్లుగా పొడిచాడు. దానితో ఒక కన్నును పోగొట్టుకుని చేసేది ఏమి లేక బయటకు వచ్చాడు. మూడడుగుల నేల ఇస్తున్నానని ధార విడిచాడు బలి.

తాను సృష్టించిన భూమిని తానే దానం పట్టిన దృశ్యమది. ఎంతటి అపూర్వ దానం బలి చక్రవర్తిది. దానికి సంతోషించి వటుడు మూడడుగులిచ్చావు కదా నేను కొలుచుకుంటాను అంటే బలి సరే అన్నాడు.

ఇంతింతై వటుడింతై.. బ్రహ్మండ సంవర్థియై

పొట్టిగా ఉన్న పిల్లవాడు ఒక్కసారిగా అమాంతంగా పెరిగి పోయాడు.

రవిబింబముపమింప... బ్రహ్మండమున్ నిండగన్

అలా పెరిగిన వటుడికి సృష్టి ఎలా అలంకారమయిందో చెబుతున్నాడు పోతన. సూర్యబింబమే గొడుగై, చెవిపోగై, కంఠాభరణమై, మోచేతి కంకణమై, నడముకు వడ్డాణమై, కాలికి అందై, పాదానికి పీఠంగా మారిందని అద్భుతంగా వర్ణించాడు..

ఒక పదంబు క్రింద నుర్వి పద్మము .... త్రివిక్రమమున


ఒక పాదం భూమిపై, ఇంకొక పాదం ఆకాశంపై పెట్టి మూడవ అడుగు ఎక్కడ అన్నాడు వటువు రూపంలో ఉన్న విష్ణువు. అంత బలి ' నూనృతంబు గాని సుడియందు నాజిహ్వ అంటూ తన తలపై పెట్టమని అన్నాడు. దానికి వటువు సిద్ధపడగా వింధ్యావళి దుఃఖిస్తూ నా భర్త చేసిన అపరాధమేమి, విష్ణువని తెలిసినా దానం ఇచ్చేసాడు కదా అంటున్న ఆమెతో 'అమ్మా దుఃఖించవలదు. నేను ఇంద్రునికి అతని రాజ్యం ఇస్తానని అదితికి మాట ఇచ్చాను. అతని లోకం అతనికి ఇచ్చేస్తాను. పాతాళ లోకాన్ని బలికి ఇస్తున్నాను. నా సుదర్శన చక్రం అతనిని ఎల్లవేళలా కాపాడుతుంది. అనంతరం అతనిని 'సావర్ణిమనువు' వచ్చే వేళకు ఇంద్ర పదవిలో కూర్చోబెట్టి తదుపరి ఎవరూ రాలేని వైకుంఠానికి రప్పించి నాలో ఐక్యం చేసుకుంటాను. నీవు కూడా నీ భర్తతో పాటుగా పాతాళ లోకానికి వెళ్ళు ' అని ఆమెను ఓదార్చాడు.

అద్భుత వర్తనుడగు హరి
సద్భావితమైన విమల చరితము వినువా
డుద్భట విక్రముడై తుది
మద్భాసిత లీల బొందునుత్తమ గతులన్

అనంత కోటి బ్రహ్మాండ నాయకుడు, భక్త వత్సలుడు త్రివిక్రమ స్వరూపుడైన వామన అవతార లక్ష్యానికి కారకుడు , జన్మ అంటే ఇలానే ఉండాలని అనిపించేంత అద్భుత జన్మ బలి చక్రవర్తిది. సాక్షాత్తు పరంధామునిలో ఐక్యం అయిన దానశీలి బలి చక్రవర్తి ఔన్నత్యాన్ని చాటే ఈ ఘట్టం ఆస్తికత్వ మార్గాన్ని బలీయం చేస్తుంది.

అట్లూరి వెంకటరమణ
9177237945

భగవద్గీత



పూర్ణత్వానికి బ్రహ్మచర్యమూ మార్గం

అధ్యాయం 8
శ్లోకం 11

యదక్షరం వేదవిదో వదంతి
విశంతి యద్యతయో వీతరాగాః।
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి
తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥

తాత్పర్యం


వేదవిదులైనవారు, ఓంకారాన్ని ఉచ్చరించువారు, సన్యాసాశ్రమము నందున్న మహర్షులు బ్రహ్మము నందు ప్రవేశిస్తున్నారు.అట్టి పూర్ణత్వ మును కోరినవారు బ్రహ్మచర్య వ్రతమును అభ్యసింతురు. మోక్షము ను గూర్చు ఈ విధానమును ఇప్పుడు నీకు నేను సంగ్రహంగా వివరిస్తాను.

భాష్యం

శ్రీకృష్ణుడు అర్జునునికి షట్చక్ర యోగా పద్ధతి ద్వారా భృకుటి వద్ద ప్రాణ వాయువుని నిలుపమని సూచించి ఉన్నాడు. ఇప్పుడు కొన్ని శ్లోకాలలో ఆ పద్ధతిని వివరిస్తున్నాడు. బ్రహ్మమునకు అనేక రూపాలు, లక్షణాలు ఉన్నాయని భగవంతుడు తెలియజేస్తున్నాడు. నిరాకార వాదుల కు అక్షరం లేదా 'ఓం' కారము బ్రహ్మ ముతో సమానం. శ్రీకృష్ణుడు సన్యాసు లు చేరు నిరాకార బ్రహ్మము గురించి వివరిస్తున్నాడు. పూర్వం శిష్యులు గురుకులములో గురువును సేవిస్తూ వేదవాఙ్మయాన్ని నేర్చుకునేవారు. వారు మొదటి నుండీ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ 'ఓం' కార ఉచ్చారణను అభ్యాసం చేస్తూ నిరాకార బ్రహ్మము గురించి అధ్యయనం చేసేవారు. ఈ రోజున అటువంటి విద్యాలయం గాని, బ్రహ్మచర్యాన్ని పాటించు అవకాశము గాని లేకుండా పోయింది. బ్రహ్మచర్యం పాటించకుండా ఆధ్యాత్మిక జీవితములో పురోగమించుట దుర్లభము. కాబట్టి శ్రీచైతన్య మహాప్రభు శాస్త్రానుసారము కలియుగమున 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే 'మంత్ర జపము కంటే వేరు మార్గము లేదని నిర్ధారించారు.

....పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఎ సి భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారి 'భగవద్గీత యథాతథం' నుంచి ఇస్కాన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో .....

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.





నాన్న కోసం...

ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో తొలిపతకం! చరిత్ర సృష్టించిన తెలుగు తేజం!

70 సంవత్సరాల స్వతంత్రభారత చరిత్రలో .. మెల్ బోర్న్ వేదికగా మువ్వన్నెల జెండా మురిసి మెరిసిన దృశ్యం.. 22సంవత్సరాల అరుణారెడ్డి.. జిమ్నాస్టిక్స్ వరల్డ్ కప్‌లో తొలి పతకం సాధించిన అపూర్వఘట్టం. వ్యక్తిగత కేటగిరీలో వరల్డ్ కప్‌లో భారతదేశానికి లభించిన తొలి పతకం ఇదే కావడం విశేషం.2013లో జరిగిన ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్ తో సహా.....2014లో నిర్వహించిన కామన్ హెల్త్ గేమ్స్, 2014, 2017సంవత్సరాల్లో ఆసియాగేమ్స్‌లో ఓటమి చవిచూసినా ..ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ, తండ్రి కన్న కలలు నిజం చేయాలన్న పట్టుదలతో... అనుకున్నది సాధించారు. భారతీయ క్రీడా జగతిలో అరుణతారగా ప్రకాశించారు. అంతర్జాతీయ క్రీడావేదికపై భారతదేశ కీర్తి పతాకను రెపరెపలాడించి చరిత్ర సృష్టించారు. ప్రపంచ క్రీడా రంగంపై తెలుగు కీర్తి బావుటాను ఎగరేశారు.

బుద్ధ అరుణారెడ్డి...ఇంకెవరో కాదు..పదహారణాల తెలుగు అమ్మాయి. అడుగడుగునా ఎదురైన అవరోధాలను ఎదిరిస్తూ.. తండ్రి కన్న కలల సాకారంకోసం..అనుకున్న లక్ష్యాన్ని ముద్దాడిన మన హైదరాబాద్ ఆడపడుచు. అరుణ తండ్రి నారాణ రెడ్డి....చిన్న ఉద్యోగి.. దానికి తోడు ..పేదరికం.. అదేదీ తండ్రి మమకారం ముందు నిలువలేదు. కూతురులోని చురుకుదన్నాన్ని గుర్తించింది...ఆమె దేశం గర్వించదగిన క్రీడాకారిణి అవుతుందని నమ్మింది ఆయనే. అందుకే అరుణకు ఐదు సంవత్సరాలు ఉన్నప్పుడే హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో ఆమె పేరును నమోదు చేయించారు. అలా తండ్రి ప్రోత్సాహంతో కరాటే నేర్చుకునేందుకు మైదానంలోకి అడుగుపెట్టారు అరుణారెడ్డి. అయితే ఆమె బాడీ లాంగ్వేజ్‌ను గమనించిన గురువు, అరుణకు జిమ్నాస్టిక్స్‌లో తర్ఫీదు ఇప్పించాలనే సలహాతో అటువైపు అడుగులు వేశారు. కరాటేలోనూ బ్లాక్ బెల్ట్ సాధించారు.



ఆల్ ఇండియన్ ఛాంపియన్‌గా..

జిమ్నాస్టిక్స్ కోచ్‌లు స్వర్ణలత, రవిందర్‌ల వద్ద మొదట శిక్షణ ప్రారంభించారు అరుణారెడ్డి. ఆతర్వాత స్వర్ణలత భర్త, కోచ్ గిరిరాజ్ శిక్షణలో జిమ్నాస్టిక్స్‌లో ఆరితేరారు. 2008 సంవత్సరంలో గిరరాజ్ మరణించే వరకు అరుణారెడ్డి అతని వద్దే అకుంఠిత దీక్షతో జిమ్నాస్టిక్స్ సాధన చేశారు. పేదరికాన్ని లెక్కచేయకుండా తండ్రి అందిస్తున్న ప్రోత్సాహంతో జిమ్నాస్టిక్స్‌లో కఠోర శిక్షణ పొందిన అరుణా రెడ్డి... అందులో కీలకమైన ఆర్టిస్టిక్‌లో ఆరితేరారు. గిరిరాజ్ మరణానంతరం కోచ్ బ్రిజ్ కిశోర్ మార్గ దర్శనం... పర్యవేక్షణలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. తండ్రి అకాల మరణం..ఆర్థిక సమస్యలు చుట్టిముట్టినా.. కుంగిపోకుండా.. తండ్రి లేకున్నా ..కూతురు మేటి జిమ్నాస్ట్‌కావాలన్న ....ఆయన కన్న కలసాకారానికి అవిశ్రాంతంగా సాధన చేశారు. అంతర్ యూనివర్సిటీ స్థాయిలో బంగార పతకాలు గెలుచుకున్నారు. జాతీయి స్థాయిలోనూ మూడు పతకాలు సాధించారు.

మెల్ బోర్న్ లో మెరిసిన అరుణ

మెల్ బోర్న్ వేదికగా జరిగిన జిమ్నాస్టిక్స్ ఫైనల్స్‌లో అరుణారెడ్డి..మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం అందుకున్నారు. జిమ్నాస్టిక్స్‌లో కీలకమైన ఆర్టిస్టిక్‌లో వ్యక్తిగత కేటగిరీలో పతకం సాధించడం దేశచరిత్రలో ఇదే ప్రథమం. ఈ పోటీల్లో స్లోవేనియాకు చెందిన జాసా కైస్లెఫ్..13.800 స్కోరుతో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం.. 13.699 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలిచి.. ఆస్ట్రేలియాకు చెందిన ఎమిలీ వైట్ హెడ్ రజత పతకం సాధించగా..13.649స్కోరుతో అరుణారెడ్డి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం కైవసం చేసున్నారు. విజేతగా నిలిచిన అరుణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ..నేను సాధించిన విజయం తన తండ్రికే చెందుతుందన్నారు. తండ్రిలేని లోటును తలుచుకుని ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. జిమ్నాస్ట్‌గా నేను కష్టాలతో పోరాటం చేసి రోజులు చూసి తన తండ్రి....విజేతగా నిలిచిన రోజు లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

మరో సంవత్సరమే..

మరోవైపు 23-24 సంవత్సరాల వయస్సు వరకే జిమ్నాస్టిక్స్‌లో పాల్గొనడం క్రీడాకారులకు సాధ్యం.. వయసు పెరిగితే శరీరం అందుకు అనుకూలించదు. ప్రస్తుతం అరుణ వయస్సు 22.. అంటే మరో ఒకటి రెండు సంవత్సారాలు మాత్రమే మన తెలుగు తేజం అంతర్జాతీయ వేదికలపై జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొనే ఛాన్స్ ఉందన్న మాట. అయితే అరుణా రెడ్డి మాత్రం తాను 23 సంవత్సరం వరకే పాల్గొంటానని అంటోంది. ఈ వార్త బాధకరమే అయినా జీర్ణించుకోక తప్పదు. ఇకపోతే 2018 కామన్‌వెల్త్ క్రీడల్లో అరుణారెడ్డి పాల్గొననున్నారు. ఆస్ట్రేలియా గోల్డ్ కోస్ట్ వేదికగా జరగనున్న కామన్ వెల్త్ క్రీడల్లో అరుణారెడ్డి స్వర్ణ విజేత కావాలని ఆశిద్దాం! ఆకాంక్షిద్దాం!!

ఆస్తి అంతా 'అక్షరార్పణం'

♦ విద్యార్థుల చదువు కోసం 4 కోట్ల ఆస్తి విరాళం

♦ 80 ఏళ్ల వృద్ధురాలి దాతృత్వం

ఆస్తి అంతా 'అక్షరార్పణం' విద్యార్థుల చదువు కోసం 4 కోట్ల ఆస్తి విరాళం 80 ఏళ్ల వృద్ధురాలి దాతృత్వం

80 ఏళ్ల పొన్నని దేవి సమాజాన్ని మార్చే పనిలో నిమగ్నమైంది. చాలామంది ఈ వయసులో రామ కృష్ణా అని కాలక్షేపం చేస్తుంటారు. కానీ పొన్నని దేవి మాత్రం అలా కాదు. సమాజానికి ఏదో చేయాలని పరితపిస్తుంది.

ఎరోడ్ ప్రాంతం స్వస్థలం అయిన పొన్మనిదేవి 1964 నుంచి తమిళ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ వృత్తిలో కొనసాగుతున్న సమయంలోనే మరో టీచర్ అయిన వరదప్పన్‌తో ఆమెకు పరిచయమైంది. ఈ పరిచయం పెళ్లికి దారితీసింది. వీరిద్దరికి ఒకకొడుకు కలిగాడు. దురదృష్టవశాత్తు తన భర్త, కొడుకు ఒక ప్రమాదంలో చనిపోయారు. పెళ్లయిన కొద్ది సంవత్సరాల్లోనే తన నుంచి భర్త, కొడుకు దూరం కావడంతో పొన్మని దేవి గుండె పగిలిపోయింది. అయినా ధైర్యం తెచ్చుకుంది. జీవితంలో ఏదో ఒకటి సాధించాలనుకుంది.

పొన్మనిదేవి నిరాండంబర జీవితం

పొన్మనిదేవి పేద విద్యార్థులకు ఏదో ఒక సహాయం చేయాలని నిర్ణయించుకుంది. పిల్లలు చదువు నేర్చుకునే సమయంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా ఉండాలి. అప్పుడే వారు రాణించగలుగుతారని ఆమె నమ్మకం. తాను ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బుతో పొదుపు చేయగలిగింది. అంతేకాదు కొన్ని ఆస్తులను సంపాదించింది. ఒంటరిగా ఉండటం వల్ల ఆమెకు పెద్దగా ఖర్చులు లేకుండా పోయాయి. అయినా ఆమె నిరాడంబరంగా జీవితాన్ని గడిపింది. కానీ తన లక్ష్యాన్ని ఆమె ఏనాడు మరవలేదు. పేద పిల్లలకు ఉచితంగా విద్య నందించింది.

ఆమె రిటైర్ అయ్యే సమయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉన్నారు. ''నా కుటుంబ సభ్యులు అకస్మాత్తుగా చనిపోయారు. నేను, నా భర్త ఇద్దరం తమిళభాషను బాగా ప్రేమించాం. కాబట్టి మేమిద్దరం తమిళ టీచర్లుగా స్థిరపడ్డాం. భర్త, కొడుకు చనిపోయిన తర్వాత ఆధ్యాత్మిక చింతన మొదలైంది. అనేక ప్రశ్నలకు ఆధ్యాత్మికత చింతనలో సమాధానాలు దొరికాయి.

కొంతకాలం గడిచిన తర్వాత అర్థవంతమైన జీవితాన్ని అందించాలంటే పిల్లలకు విద్యనందించి సహాయం చేయాలి అని పొమ్మనిదేవి నిర్ణయించుకుంది. దీంతో ఆమె తన ఆస్తులను అమ్మి పేదపిల్లలకు విద్యనందిస్తోంది. పెద్ద ఎత్తున విరాళాలు ఇవ్వడం వల్ల పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపినట్టయ్యింది.

2005లో ఆమె చిత్తోడ్‌లో 25వేల చదరపు మీటర్ల భూమిని హాస్టల్ భవన నిర్మాణ సముదాయానికి విరాళంగా ఇచ్చింది. అంటరాని కులానికి చెందిన విద్యార్థులకు సంబంధించిన ఈ హాస్టల్‌తో బాటు తన స్వస్థలమైన ఇరోడ్‌లో రూ 2 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చింది.



భూమి ఎకరం విరాళం

తాను పనిచేసిన స్కూల్‌లో అదనపు తరగతి గదులను నిర్మించడానికి భూమి అవసరం ఉంది అని గుర్తించిన పొన్మని దేవి ఎలాంటి తాత్సారం చేయకుండానే భూమిని విరాళంగా ఇచ్చింది. ఈ భూమి ఒక ఎకరం ఉంటుంది. మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి రూ 4 కోట్ల వరకు ఉంటుంది.

''నా ఆస్తిని విరాళంగా ఇచ్చినందుకు నాకెలాంటి ఆందోళన లేదు. నా భూమి వల్ల ప్రతీ విద్యార్థి విద్య నేర్చుకుంటే అంతకంటే సంతోషం ఏం ఉంటుంది. నేను ప్రజలకు ఉపయోగపడాలి '' అని ఆమె అంటున్నారు.

''చిత్తోడ్‌లో కొత్తగా కట్టబోయే భవనం పేరు నా కుమారుడు మయూరా కార్తికేయన్ పేరు పెట్టబోతున్నాను'' అని పొన్మనిదేవి చెప్పారు.

గుడుంబా జీవితాలలో వెలుగులు

పోలీస్ అధికారిణి మంజితా కృషి

ఛరాస్ ....198 గిరిజన తెగల్లో ఇదీ ఒకటి. అహ్మదాబాద్ నగర శివార్లలో చట్టవ్యతిరేక కార్యకలాపాల సాగిస్తూ జీవిస్తున్న గిరిజన తెగ. 1871లో క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ కింద్ అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఛరాస్‌ను క్రిమినల్ తెగగా గుర్తించింది. తర్వాత ఈ చట్టం రద్దుచేయ బడింది. చట్టం రద్దైది కాని వాళ్లు అలాగే జీవనం సాగిస్తున్నారు. అలాగని వీరేమీ క్రిమినల్స్ మాత్రం కాదు.బతుకు తెరువుకోసం చట్టవిరుద్ధంగా నాటాసారా కాచి విక్రయిస్తుంటారు. ఈ గుడుంబా వ్యాపారంలో మహిళలు భాగస్వాములు కావడం గమనార్హం.అయితే .. బ్రిటిష్ కాలం నుంచి వారు ఎందుకు అలా అక్రమాలకు పాల్పడుతున్నారు? ప్రస్తుతం మహిళలు కూడా గుడుంబా వ్యాపారంలో ప్రవేశించారు? కారణాలేంటి? పాలకులు కాని, అధికారులు కాని పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. పోలీసులు కూడా వీరు దొరికినప్పుడు అరెస్టు చేయడం, ఐపీసీ ప్రకారం చర్యలు తీసుకోవడం తప్ప వారిలో మార్పుకోసం యత్నించిన పాపాన పోలేదనే చెప్పాలి. అయితే ఐపీఎస్ అధికారి శంషేర్ సింగ్ ప్రేరణతో ..పోలీసు అధికారిణి మంజీతా, స్వచ్ఛంద కార్యకర్త అర్పితలు ఛరాస్ తెగ మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. దానికోసం స్థానిక కుబేర్ నగర్ పోలీస్‌స్టేషన్‌నే వృత్తి శిక్షణ కేంద్రంగా మార్చారు.


అర్పిత మంజీతా

సురక్షా సేతు ప్రోగ్రామ్

ఒక సారి గుడుంబా కేసులో పట్టుబడిన మహిళలతో ఐపీఎస్ అధికార శంషేర్ మాట్లాడినప్పుడు వారు నేరాలకు పాల్పడడానికి ఆర్థిక సమస్యలే కారణమని తెలుసుకున్నారు. ఏలాగైనా నేర వృత్తి నుంచి వారి బయటకు తెచ్చి ..సమాజంలో గౌరవంగా బతికేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించుకున్నారు. అతని కృషి ఫలితంగా సురక్షా సేతు ప్రోగ్రామ్ కార్యరూపం దాల్చింది. మానవీయ కోణంలో సమాజంలో నేరాలు అదుపు చేయడం అనేది దీని లక్ష్యం.

గుడుంబా వ్యాపారంలో ప్రవేశించిన ఛరాస్ తెగ మహిళలకు స్వయం ఉపాధి, పునరావాసం కల్పించడం కోసం.. సురక్షా సేతు ప్రోగ్రామ్‌లో భాగంగా సాఖి సహాయ్ ప్రాజెక్టును చేపట్టారు. దీనికి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మంజీతా నేతృత్వం వహిస్తున్నారు. వింగ్స్ టూ ఫ్లై అనే స్వచ్ఛంద సంస్థకు చెందించిన అర్పితా వ్యాస్ ఇందులో భాగస్వామి అయ్యారు. వింగ్స్ టూ ఫ్లై సంస్థ సాయంతో ఛరాస్ తెగమహిళలకు టైలరింగ్, జ్యూయలరీ మేకింగ్, హస్త కళల్లో శిక్షణ ఇప్పించారు. దాదాపు 200 మంది మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు ఉండే వృత్తులలో శిక్షణ పొందారు. అంతే కాదు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వారికి ఉపాధి కల్పించారు. మరో 150 మందికి గాడ్రెజ్ సెలూన్‌లో బ్యూటీ అండ్ వెల్‌నెస్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఈ కుటుంబాలు పోలీసుల చేయూతతో హాయిగా జీవనం సాగిస్తున్నాయి. కేవలం కుటుంబానికి ఆర్థిక సాయం చేసేందుకు మాత్రమే గుడుంబా వ్యాపారంలో దిగిన ఛరాస్ తెగ మహిళలు....ఐపీఎస్ అధికారి శంషేర్ సింగ్ తపన... పోలీసు అధికారిణి మంజీతా, స్వచ్ఛంద కార్యకర్త అర్పిత కృషిఫలితంగా... ప్రస్తుతం సమాజంలో గౌరవప్రదంగా జీవనం సాగిస్తున్నారు.



మిగ్‌తో 'అవని' రికార్డు

ఆమె అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. దేశ తొలి మహిళా ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ పైలెట్‌గా అవని చతుర్వేది ఇప్పుడు వార్తలలోకెక్కారు. ఆమె ఈ యుద్ధ విమానాన్ని నడిపే సమయంలో తోడుగా ఎవరూ లేరు. అయినా ఎంతో ధైర్యంగా దాదాపు 30 నిమిషాలపాటు నడపగలిగారు. మిగ్- 21 సూపర్ సోనిక్ యుద్ధ విమానాన్ని నడిపి చరిత్ర సృష్టించారు. ''అత్యుత్తమ ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ పైలెట్‌గా ఎగరాలనుకుంటున్నా. ఈ క్రమంలో ప్రతీరోజు నేర్చుకుంటూనే ఉంటాను'' అని అవని చతుర్వేది పేర్కొంది. గుజరాత్ జామ్ నగర్ ఎయిర్ బేస్ నుంచి ఈ యుద్ధ విమానాన్ని ఆమె ఎంతో చాకచక్యంగా నడిపారు. ''ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నుంచి మొట్టమొదటిసారిగా ఇది సరికొత్త రికార్డు '' అని ఎయిర్ కమాండర్ ప్రశాంత్ దీక్షిత్ అన్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ బీ ఎస్ ధనోవ్ స్పందిస్తూ.. అవనికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మహిళా అధికారులను ప్రోత్సహించడంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. భారత సైనిక దళాల చరిత్రలో ఇది గొప్పరోజని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికార ప్రతినిధి అనుపమ్ బెనర్జీ అన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. మిగ్-21



యుద్ధ విమానం నడిపిన తర్వాత ఆ విమానం పక్కన నిల్చుని ఉన్న అవని చతుర్వేది ఫోటోను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. మరో ఇద్దరు మహిళా ఫైటర్ పైలట్లు భావనా కాంత్, మోహన్ సింగ్‌లు 2016 జూన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. వారిద్దరూ సైతం శిక్షణలో భాగంగా త్వరలోనే యుద్ధ విమానాలను నడపనున్నారు. ప్రస్తుత ఫైటర్ పైలట్ల శిక్షణ బ్యాచ్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ మొత్తం ముగ్గురు మహిళలకు అవకాశం కల్పించింది. వీరిలో అవని చతుర్వేది ఒకరు. అవని చతుర్వేది ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో 2016 జూన్ 18వతేదీన చేరారు.

మధ్య ప్రదేశ్‌లోని రేవా జిల్లా దియోలాండ్ అనే చిన్న పట్టణం నుంచి వచ్చిన ఈ 24 ఏళ్ల చతుర్వేది రాజస్థాన్‌లోని బనస్థలి విశ్వవిద్యాలయం నుంచి 2014లో బాచిలర్ ఇన్ టెక్నాలజీ పూర్తి చేశారు.

''అత్యుత్తమ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌పైలెట్‌గా ఎగరాలనుకుంటున్నా. ఈ క్రమంలో ప్రతీరోజు నేర్చుకుంటూనే ఉంటాను'' అని అవని చతుర్వేది పేర్కొంది.

హైదరాబాద్ దుండిగల్ లో శిక్షణ

దుండిగల్ లోని హైదరాబాద్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ నుంచి శిక్షణ పొందారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఎగ్జామ్ పూర్తికాకమునుపు ఆమెకు హైదరాబాద్‌తో పరిచయం బాగా ఉంది. దుండిగల్‌లో శిక్షణ తీసుకునే సమయంలో తీవ్రంగా కృషి చేశారు. ఆమె ప్రదర్శించిన ధైర్య సాహసాలకు ప్రభుత్వం కొన్ని మినహాయింపులు ఇచ్చింది. 2015లఅక్టోబర్‌లో యుద్ధ విమానాల్లో పైలట్‌గా పనిచేయడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీంతో ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతానికి అయితే బ్రిటన్, యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయిల్, పాకిస్తాన్ దేశాల్లో మాత్రమే మహిళా ఫైటర్లు ఉన్నారు. ప్రస్తుతం మన దేశంలో కూడా యుద్ధ విమానాలను నడపడానికి మహిళా పైలట్‌లు ముందుకొస్తున్నారు.

నటిగా ఎదిగి... వాస్తవంలో జీవించి..





♦ విశిష్టం శ్రీదేవి వ్యక్తిత్వం... ♦ వివాదాలకు దూరం...

♦ కుటుంబానికే ప్రాధాన్యం... ♦ సామాజీక హోదాకు తగిన జీవితం...

స్టార్‌గా ఎదిగినా తానొక సాధారణ మహిళలాగే వ్యవహరించేది శ్రీదేవి. నేను చేసిన పాత్రలన్నీ నా నిజ జీవితానికి దగ్గరవి కావు. అలా నేను వ్యక్తిగతంగా ఉండనంటూ....చెప్పుకునేది. గ్లామర్ పాత్రలు చేసిన సందర్భంలో హద్దులు దాటిన అందమే మిమ్మల్ని స్టార్‌ను చేసిందా అని ప్రశ్నిస్తే....తనకంటే ఎక్కువ చేసేవాళ్లున్నారంటూ చురకలు అంటించింది. ఆమె అంతర్ముఖి. ఎక్కువగా ఎవరితో మాట్లాడేది కాదు. సెట్‌లోకి వెళితే నటిగా తన పని చూసుకుని వచ్చేసేది. నాయికలకు లేని బంధాలు అంటగట్టడం తరచూ జరిగేదే. అయితే ఈ విషయంతో శ్రీదేవి లాంటి సూపర్‌స్టార్ ఎదుర్కొన్న సందర్భాలు తక్కువే. ఒక్క మిథున్ చక్రవర్తితో పుకార్లు చెలరేగిన తర్వాత....ఇక అతనితో నటించడమే మానేసింది శ్రీదేవి. అంటే కెరీర్ కంటే పేరు ప్రతిష్టలకే ఆమె ప్రాధాన్యత ఇచ్చింది. అలా ఇంకొన్ని హిట్ చిత్రాల్లో భాగమయ్యే అవకాశాన్ని తృణప్రాయంగా వదిలేసుకుంది.

తల్లి సంరక్షణలో శ్రీదేవి సుశీలగా ఎదిగింది. ఎవరి దగ్గర ఎలా ప్రవర్తించాలి. ఎక్కడ ఎలా ఉండాలి అనే పద్దతులు నేర్చుకుంది. పెద్దలను గౌరవించడం, చిన్నవాళ్లతో ప్రేమగా ఉండటం, అవసరంలో ఉన్న వాళ్లను ప్రేమగా ఆదరించడం ఆమె వ్యక్తిత్వానికి మరింత వన్నె తీసుకొచ్చాయి. శ్రీదేవి నడవడికకు ముగ్ధులయ్యేవారు అప్పటి దర్శక నిర్మాతలు. ఎంత ఎదిగినా ఇంకా కొత్త నాయికే అన్నంత సమయపాలన పాటించడం ఆమె విశిష్టత.

ఇంగ్లీష్ వింగ్లీష్ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో ఇంత సుదీర్ఘ అనుభవంలో ఇంకా మీలో ఉత్సాహాన్ని నింపేది ఏంటని అడిగితే....ఈ సినిమా నా తొలి చిత్రంగా భావించి నటించాను. మంచి కథ విన్నప్పుడు కలిగే అనుభూతి, నటిగా ఆ పాత్ర నాలో తీసుకొచ్చే స్ఫూర్తి ఎప్పటికప్పుడు కొత్తగా ఉంటుంది. ఇన్నేళ్లలో ప్రతి సినిమా నా తొలి చిత్రంగానే భావించి నటించాను. అని శ్రీదేవి చెప్పుకుంది. నటిగా తీరని దాహాన్ని, సంతృప్తిని ఆమె మాటల్లో వింటే....ప్రతి చిత్రంలో నటించిన తర్వాత ఇంకా బాగా చేస్తే బాగుండును అనిపిస్తుంది. సినిమా తెరపై చూసుకున్నాక కూడా అదే అసంతృప్తి కలుగుతుంది. నటిగా ఎప్పుడూ పూర్తిగా సంతృప్తి చెందలేదు. ఆ దాహం ఎప్పటికీ తీరదు. అని చెప్పింది.

ఇతర నాయికలు ఎదుగుతుంటే ద్వేషించడం, దూషించడం చూడలేదని శ్రీదేవి నట ప్రయాణాన్ని గమనించిన వాళ్లు చెబుతారు. ఆమె తనకు వృత్తిపరమైన పోటీ అనుకుంది ఒక్క జయప్రద విషయంలోనే. ఆ పోటీ సినిమా వరకే. వ్యక్తిగతంగా తీసుకున్నది లేదు. ఇక సంతోష విషాధ సమయాల్లో శ్రీదేవి, జయప్రద ఒకరినొకరు కలుసుకునేవాళ్లు. సూపర్‌స్టార్ డమ్ ఎల్లవేళలా ఉండదు..కొత్త వాళ్లు వస్తూనే ఉంటారు అనే వాస్తవంలోనే శ్రీదేవి ఉండేది. మాధురీ దీక్షిత్ కొత్త ఒరవడిని బాలీవుడ్‌లో తీసుకొచ్చినప్పుడు మాధురి ప్రత్యేకతను హుందాగానే స్వీకరించింది. హిందీ చిత్ర సీమలో మీరొక్కరే లేడీ సూపర్‌స్టార్ అంటే....ఎందుకు దీపికా, కత్రీనా, ఆలియా భట్, సోనాక్షీ, విద్యా బాలన్ వీళ్లంతా అద్భుతంగా నటిస్తున్నారు. స్టార్‌లుగా పేరు తెచ్చుకుంటున్నారంటూ...తోటి నాయికల ఘనతను చాటింది.

నిర్మాతల కష్టాలు తెలిసి ప్రవర్తించడం శ్రీదేవి సుగుణం. అగ్ర తారగా ఉన్నా గొంతెమ్మ కోర్కెలు ఏ నిర్మాతనూ కోరలేదని, అలా అయితే యాభై ఏళ్లు పరిశ్రమలో ఉండేదాన్ని కాదని...బాహుబలి వివాదం సందర్భంగా శ్రీదేవి చెప్పుకుంది. తన భర్త నిర్మాత కాబట్టి ఆ కష్టాలు బాగా తెలుసంటూ పేర్కొంది.

తల్లి సంరక్షణ ముగిసిన తర్వాత తనకో తోడును కోరుకుంది శ్రీదేవి. తల్లిలా కాపాడే భర్త కావాలనుకుంది. అప్పటికే పెళ్లై, సంతానమున్న బోనీ కపూర్‌లో ఆ వ్యక్తిత్వాన్ని చూసింది. ఆయన మనసును అర్థం చేసుకుంది. మొదటి భార్యకు దూరమైన సందర్భాన్ని సానుకూలంగా ఆలోచించింది. బోనీని పెళ్లి చేసుకోవడం తప్పు అనే సందర్భం ఆమె జీవితంలో ఒక్కసారి కూడా రాలేదు. వాళ్ల దాంపత్యంలో గొడవలు అనేవి తెలియవు.

తల్లి అందించిన మాతృత్వపు మమకారాన్ని తన పిల్లలకూ అందించాలని కోరుకుంది శ్రీదేవి. అందుకే పదిహేనేళ్లు నటనకు దూరంగా ఉంది. నటనపై ఉన్న ప్రేమను పిల్లల కోసం చంపుకుంది. వాళ్లు ఎదిగే క్రమాన్ని కళ్లారా చూస్తూ ఆస్వాదించింది. త్యాగానికి మారు పేరు తల్లి అనే మాటను నిజం చేసింది.

డబ్బే జీవితం అని అనుకోని శ్రీదేవి...దాని అవసరాన్నీ గుర్తుంచుకునే ఉంది. అవసరంలో ఉన్నామన్న వాళ్లకు విరాళాలు ఇచ్చింది. కొన్ని సేవా కార్యక్రమాల కోసం స్వయంగా తానే వివిధ నగరాలకు వెళ్లేది. తను వేసిన బొమ్మలను వేలం వేసి ఆ సొమ్మును స్వచ్ఛంద కార్యక్రమాలకు ఇచ్చేసేది. అయితే ఉన్నంతలో రాజీ పడకుండానే బతికింది. తను సంపాదించిన దానికి, తన స్టేటస్‌కు గొప్పలకు పోకుండా, తక్కువ చేసుకోకుండా ఆమె జీవన శైలి ఉండేది. ముంబై విడిచి ఎక్కడికి వెళ్లినా ఫైవ్ స్టార్ హోటళ్లో సూట్ రూములోనే విడిది చేసేది.





దండుపాళ్యం పాటలొచ్చాయి

నేరప్రవృత్తి కలిగిన ఓ గ్యాంగ్ చేసే నేరాలు ఎలా ఉంటాయి? అనే కథాంశంతో దండుపాళ్యం సినిమా తెరకెక్కింది. యదార్ధ సంఘటనతో తీసిన సినిమా ఇది. ప్రేక్షకుల్లో మంచి ఆదణ లభించింది. ఆ తర్వాత దండుపాళ్యం సిరీస్ తీశారు. కన్నడంలో రూపొందిన దండుపాళ్యం మూడవ భాగం వస్తోంది. దీనికి సంబంధించిన పాటలను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. శ్రీనివాస రాజు దర్శకుడు. శ్రీ వాడవల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ తెలుగులో అనువదించి విడుదల చేస్తోంది. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ఈ చిత్రంలో ప్రధఆన తారాగణం. పాటలు వేడుకను హైదరాబాద్‌లో జరిపారు. యువ దర్శకుడు వి.ఐ.ఆనంద్, త్రినాథ్‌తో పాటుగా రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, మల్కాపురం శివకుమార్ అతిథిగా హాజరయ్యారు. సినిమాలో నటించిన గ్యాంగ్ మొత్తం ఆడియో వేడుకకు హాజరైంది. హీరోయిన్ పూజాగాంధి మాట్లాడుతూ గతంలో గ్లామర్ పాత్రలు చేశాను. దర్శకుడు చెప్పిన కథ, కథనం నచ్చడంతో దండుపాళ్యం సినిమా చేశాను. వరుసగా మూడు భాగాలు తీశారు. ఇందులో లక్ష్మి పాత్రకు కొంచెం కష్టపడాల్సి వచ్చింది. నా మాటతీరు, బాడీ లాంగ్వేజ్ మార్చుకున్నాను అన్నారు.

పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిత్ర దర్శకుడు శ్రీనివాసరాజుకు సినిమా నాలెడ్జ ఉన్న వాడు. వరుసగా సీక్వెల్స్ తీస్తూ విజయం సాధిస్తున్నాడు అన్నారు. నిర్మాతలు శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణపెండ్యాల మాట్లాడుతూ దండుపాళ్యం మూడవ భాగం సినిమాతో నిర్మాతలుగా ప్రవేశించాం.

చివరి పార్ట్‌గా వస్తున్న దండుపాళ్యం మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. అర్జున్ జన్యా మంచి బాణీలు ఇచ్చారు అని చెప్పారు.

వివాదం పెరగలేదు

ఒక చిన్న మాట పెద్ద వివాదానికి దారితీయవచ్చు. ఎదుటివారి మనసుని గాయపర్చవచ్చు. కానీ పరిస్థితిని అర్థం చేసుకుంటే మాత్రం సర్దుకుపోవచ్చు. నటి సాయిపల్లవి విషయంలో ఇలాగే జరిగింది. ఫిదా సినిమాతో వెలుగులోకి వచ్చిన నటి సాయిపల్లవి. తన సహనటుడు నాగశౌర్య చేసిన కామెంట్స్‌ను ఆమె స్పోర్టివ్‌గా తీసుకుంది. దాంతో వివాదం సద్దుమణిగింది. అసలు విషయానికి వస్తే నాగశౌర్య, సాయిపల్లవి జంటగా కణం పేరుతో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఇటీవల ఓ సంద ర్భంలో సాయిపల్లవిపై నాగశౌర్య కామెంట్ చేశారు. అదేమంటే సాయిపల్లవి షూటిం గ్‌లకు సమయానికి రాదని, బాగా ఆలస్యం చేస్తుందని. దీనివల్ల తను చాలా ఇబ్బంది పడ్డానని కూడా అన్నాడు. నిజానికి నాగశౌర్యకు సర్దుకుపోయే తత్వం ఉంది. వివా దాలకు దూరం గా ఉంటాడు. అయిన ప్పటికీ కో స్టార్‌పై ఆరోపణలు చేయడం చర్చనీ యాం శమైంది. దీనిపై సాయిపల్లవి స్పం దన ఎలా ఉంటుందని పరిశ్రమ వర్గాలు ఎదురుచూశాయి. ఇటీవల తన తమిళ సినిమా ప్రమోషన్ సందర్భంగా సాయిపల్లవి ఈ విషయం ప్రస్తావించింది. నాగశౌర్య చేసిన ఆరోపణలు చూశాను. ఆ వెంటనే చిత్ర దర్శకుడు విజయ్‌తో మాట్లా డాను. తన వల్ల షూటింగ్‌లో ఎవరైనా ఇబ్బందిపడ్డారాని అడిగాను. అలాంటిది ఏమీ లేదని విజయ్ జవాబిచ్చారు అని సాయిపల్లవి తెలిపింది.

తన వల్ల ఎవరైనా ఇబ్బంది పడితే తనకు బాధగా ఉంటుందని, నాగశౌర్య చేసిన వ్యక్తిగత అభిప్రాయాన్ని గౌరవిస్తున్నాను అని చెప్పింది. ఈ వివాదాన్ని మరింత పెంచకుండా పులిస్టాప్ పెట్టేసింది.



సాయిపల్లవి



సన్నీ లియోన్

క్వీన్ పాత్రకోసం

నటన వృత్తిగా స్వీకరించాక నిబద్ధతతో కొనసాగడానికి చాలామంది ప్రయత్నిస్తారు. కొందరు మాత్రం కెరీర్‌ను సరదాగా తీసుకుంటారు. అలాంటి వారి నట జీవితం ఎక్కువ రోజులు కొనసాగదు. నటి సన్నీ లియోన్ మాత్రం తన కెరీర్ సీరియస్‌గా కొనసాగిస్తోందని చెప్పవచ్చు. వివాదాలకు దూరంగా ఉంటే నటనపైనే దృష్టి నిలిపింది. హిందీ చిత్రాలతో పాటుగా రెండు తెలుగు సినిమాల్లో నటించిన సన్నీపై హాట్ బ్రాండ్ ఇమేజ్ ఇంకా పోలేదు. ఆమె శరీరానికి ఇచ్చిన ప్రాధాన్యత నటికి ఇవ్వడం లేదంటారు. ఇప్పుడు నటిగా ఆమెకు అరుదైన అవకాశం వచ్చింది. తమిళంలో వారియర్ క్వీన్ పాత్రలో నటించనుంది. సినిమా పేరు వీరమాదేవి. ఇందులో పూర్తిస్థాయి నాయికగా నటిస్తుంది. ఈ పాత్ర పోషణ కోసం ఇప్పటికే గుర్రపు స్వా రీ, కత్తి యుద్ధం వంటివి నేర్చుకుందట. వీటి తో పాటుగా తమిళ భాష నేర్చుకుం టోందని అంటున్నారు. తనకు లభించిన క్వీన్ పాత్రకు పూర్తి న్యాయం చేయాలంటే భాష సమస్య ఎదురుకాకూడదని ఆమె అభిప్రాయపడుతోంది. సన్నీ లియోన్ నటిస్తున్న ఈ సినిమాపై పరిశ్రమ వర్గాలు ఆసక్తిని చూపుతున్నాయి. ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది.

ఆర్మీ అధికారిగా ఎన్టీఆర్.!

జై లవకుశ తర్వాత ఎన్టీఆర్ చాలా గ్యాప్ తీసుకున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించే చిత్రానికి కేవలం పూజా కార్యక్రమాలు మాత్రమే జరిగాయి. ఆ సమయంలో త్రివిక్రమ్ అజ్ఞాతవాసి బిజీలో ఉన్నారు.

ఇప్పుడు ఎన్టీఆర్ సినిమాపైనే దృష్టిపెట్టారు త్రివిక్రమ్. అజ్ఞాతవాసి పరాజయం తర్వాత ఈ సినిమాపై నీలినీడలు కమ్ముకున్నాయి. అనేక వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. సినిమా ఉంటుందా లేదా అనే సందిగ్దత నెలకొంది. అయితే కేవలం ఒక ఫ్లాప్‌తో దర్శకుడి ప్రతిభను తక్కువ చేయలేరు. సినీరంగంలో జయాపజయాలు అతి సహజం. ఈ విషయం ఎన్టీఆర్‌కు తెలియంది కాదు.

ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమా షూటింగ్ మార్చి మూడవ వారంలో మొదలవుతుందని తెలిసింది. ఇందులో ఆర్మీ ఆఫీసర్ పాత్రలో ఎన్టీఆర్ కనిపిస్తారని అంటు న్నారు. సినిమాకు నేపథ్యం కూ డా ఆర్మీ కావడం విశేషం. ఆర్మీ పాత్ర కోసం ఎన్టీఆర్ ఇప్పటికే కొంత పరిశీలన చేసి జాగ్రత్తలు తీసుకున్నారని, కొత్త లుక్‌తో కనిపిస్తారని యూనిట్ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రంలో నటించే ఇతర తారాగణం వివరాలు వెల్లడి కాలేదు. హీ రోయిన్‌గా పూజా హెగ్డే నటిస్తుందని తెలిసింది.

హారిక హాసిని పతాకంపై రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ స్వరరచన చేస్తున్నారు.

